ప్ర స్తా వ ము

నేటికి సరిగా తొంబది యెనిమిదేండ్ల నాటి మాట. కొంగ్రొత్తగా దేశ ములో మునుముకొని వచ్చి ప్రాచ్యసంస్కారమును బహూపంచలు గావించుచు ఆంగ్లసంస్కృతి స్వైరనిహారము సేయు ఆ రోజులలో ఆంగ్లభాషకు అంగభాషలుగా దేశ్యభాషలు ఒదిగిన ఆ దుర్దశలో అక్కటాను బట్టి చిన్నయ సూరి, భాషకుఁ బ్రాతిపదికగా లక్ష్య లక్షణములుగా నీతిచంద్రికా - బాలవ్యాకరణాదికములను రచించి తెలుఁగునకు దీప్తి తెచ్చెను. తెలుఁగువాఙ్మయములోఁ బ్రాథమికశిక్షలో నీ రెండింటి ప్రాభవ మద్వితీయమై వెలయుచున్నది. తెలుఁగునకు నీ లక్షణము చాలని వెలుఁగు నిచ్చు దీపమువంటిదని కొంద ఱంచురు గాని, యిదియే సార్వకాలికము సర్వతోముఖమైన సాధనమని గ్రంథకర్తయు నెంచి యుండఁడు. దిక్సూచిగా నిట్టి సూత్రములు వెడలినచో అక్కటానుబట్టి యావల వార్తికములు వెలయ వచ్చుననియే యాతని సంకల్పము.

జైమిని గారతమువంటివి యేనో ఒండు రెండు తక్క- వచనరచన చని మాడవలెనన్న తెలుఁగులో అందుపాటులో గ్రంథములు లేవనుట అక్షరాల సత్యము. చంపూభూపతున నున్న భారతాదికములలో ఉపలబ్ధమైన గద్యభాగము మనోజ్ఞమే యయ్యు-దాని ప్రత్యేకవిశిష్టత ప్రస్ఫుటము కాకుండుటను గద్యకావ్యముల కటువు తీఱనేలేదు. పైఁగా- ఈ కటువునకుఁ గారణము వచనకావ్యము వ్రాసిన యతఁడు కవి కాఁడను భావము ఎల్ల యెడల నాఁటి యుండుటయుఁ గావచ్చు. అది మదిలోఁ గుదురుగా నెదలుటఁజేసియే వైద్యగ్రంథములు నిఘంటువులే గాదు- గణితశాస్త్రాదికము సైతము తెలుఁగులోఁ బద్యములలోనే నడచినది. ఈ త్రోవ ముమ్మొదట సంస్కరించిన విద్వత్కవి వైయాకరణశిరోభూషణము పరవస్తు చిన్నయ సూరియే యనవచ్చును. ఆతఁడు – ఆ నాఁడు, ఆంగ్లవిద్యాలయములలో

అప్రధానముగా నున్న ఆంధ్రనామకు— ఆ యలంతి కాలములోనే చాలినంత పరిజ్ఞానము సంతరించుటకయి యీ రచనము వెలువరించి తరువాతి వచన కావ్యములకు సముచితస్థానమును గల్పించి యిచ్చెను.

ఇంచుమించు ఒక శతాబ్దముగా తెలుగులో నీతిచంద్రిక పాఠ్య గ్రంథముగా నిర్ణీతమై ప్రచురప్రచారములో నున్నది. సుమతిశతకము వంటి 'అపౌరుషేయ' గ్రంథమునుబలె నీతిచంద్రికను — ఎంద రెందఱో ఎన్నెన్నో ముద్రణములు వేయించుచు వచ్చిరి. ఏకో రూపమున నిందలి భాగములను లాగివారు ఎరవు తెచ్చుకొనుటయో-అనుకరణము సూపుటయో కానవచ్చును. కాని యీ యుద్యమము మూలమునే మూలమునకు ఎన్నో అందదుకులు దొరలి స్వరూపవ్యత్యయముతో సారస్యవిచ్ఛిత్తితో హృదయ వ్యథ కావించుటయుఁ గద్దు. తూచి తూచి యర్థవంతములైన పదములతో సొబగైన శైలిలో రసవంతమైన ధోరణిలో బాలశిక్షగా— ప్రౌఢకావ్య ముగా నిర్మించి యున్న యీ నీతిచంద్రిక, ఆలన పాలన లేని యేలుబడిలో వలె ఏనేనో వికారములు వొంది మఱొక యవతారమే యెత్తినది. అయ్యది గమనించి 'గిడుగు'వంటి యుద్దండపండితులు ఒక రిర్వ్యు ఆ మాట లోకమునకు వినిపించి అర్హమగు సంస్కారమే కావించిరి గాని ఆ ప్రయత్నము సైత మింకను ఫలోదర్కము కాకుండుట తెలుగువారి దౌర్భాగ్యము.

తెలుగులో కమ్మదనము కలదను మాట నాకుఁ దెలిసిననాఁటి నుండియు, చిన్నయసూరి సూత్రమే శిలాక్షరముగా భావింపను — ఆతని వచనమే అచలమైన సాహిత్యముగా మన్నింపను అభ్యాస మైనది. గ్రంథ రచనలోఁగాని అధ్యాపకవృత్తిలోఁగాని ఆ త్రోవయే దిక్సూచిగాఁ జేసికొని ఆవశ్యకమైన సంస్కారముతో మెలఁకువ పూని మెలఁగుటయే నాకు అభిమతము. ఒజ్జగా నున్న నా యీ యిరువదియూఁడేండ్ల జీవికలో ఏనో రూపమున ఈ గ్రంథము పిల్లలకు పాఠము చెప్పని సంవత్సరమే లేదు.

894.827301
CHI

నివేహో సందేహాములు పొడమినను నోటిమాటలుగా సరిపెట్టుకొనుచు గ్రంథ కర్త హృదయము లవలేశమేనెఱుంగక వీరీతిగ గాలక్షేపము చేసిన యేండ్లే పెక్కులు గలవు. ఇటీవల— ఒక మిత్రునివద్ద, ఎవ్వరో టిప్పణముగా నీతిచంద్రికకు వ్రాసికొన్న వ్యాఖ్యానము చూచితిని. ఆయన పేరు ముచ్చటించి కృతజ్ఞత చూపవలసిన యక్కఱ యున్నను— ఆద్యంతములలో ఆ గ్రంథము శిథిలమై ఆ భాగ్యము నాకు దక్కినది గాదు. ఈ నా ప్రచురణమునకు అదియే ప్రాతిపదిక. అందును గొన్ని దోసములు దొరలిన మాట వాస్తవమేగాని ఆ రచనమాత్రము నా కెంతో సాయపడ్డది. కాగా దానినే అవలంబముగాఁ జేసికొని నా యనుభవమును బురస్కరించుకొని నేటి విద్యార్థిబృందము మానసిక పరిస్థితి కనువగునటులు — ఈ రీతిగ వెలయించితిని.

చంద్రికలో దీపిక అక్కఱ లేదుగాని దీపము లేక నగరములోఁ దిరుగుట నవనాగరకులకు రుచింపదు గావున నీతిచంద్రికలో 'కరదీపికా' వాఖ్య కొంతవఱకైన ఉపకరించితేఱునని నాయభిలాష. ఇదియు సమగ్రమైన దని నేను జెప్పవలసినది కాదుగాని, ఏదో ఒక యడుగు ఒకరు ముందు వైచిరేని అది యనువో కావో చెప్పను జూపను నడుపను మఱికొందఱు ముందునకు వత్తురు. అప్పటికిఁగాని నిగ్గు తేలి, వలసిన మేలు ఒదవనేరదు.

పదచ్ఛేదము చేసి ప్రతిపదార్థము చెప్పుచు ప్రబంధములు బోధించు ధోరణిలోనే ఈ వాఖ్య నడచినది. భారతాది కతిపయగ్రంథప్రయోగములే ప్రామాణికములుగా నెంచి వ్రాఁతప్రతుల వైవిధ్యము మూలమున బహు ప్రయాసములు పడిపడి అరఁటిపందు ఒలిచి పెట్టినట్టులు వెలుఁగులోఁ— ఇంత వ్యాకరణభిక్ష పెట్టియున్న చిన్నయసూరి వ్యాసంగము సమగ్ర దృష్టితోఁ బరికించి ధారావాహియగు దేశ్యభాషనడకను లెస్సగ నాకలింతకుఁ దెచ్చుకొని కాలమున కనువగు త్రోవలో విమర్శనము చేయవలసిన

యక్కటి తెలుగులో నింకను దీయలేదు. అదికూడ నే 'రాష్ట్రీసమస్య'కో ముడిపెట్టి అందాక నౌదాసీన్యము వహించుటయే మన కభ్యస్తమైన విద్య యేమో! కానిచో నిట్టి పట్టులఁ బనిపూని నడుము కట్టుకో వలసిన 'ఆంధ్ర–చెన్నపగర విశ్వకళాపరిషత్తులు' ఏమి చేయుచున్నవో మన మెఱుంగమా!!

సరే! ఏకో ఈ తీరుగ– ఈ గ్రంథమును వెలయించుటలో నా పరిశ్రమకు 'గిడుగు'వారి కృషియే కారణము కావుటను ఆయన నాకు ప్రథమారాధ్యుఁడుగా నెంతును. ప్రాచీనటీక కంటికిఁ జూపి నా కృషికిఁ జేయూఁత నొసంగిన నా మిత్రులు శ్రీయుతులు కారెమపూడి రమాకాంత కవిగారి మేలు మఱువలేను. సూరి జీవితచరిత్ర గుర్తించుటలో అగ్గలముగా సాయపడిన ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలను స్మరించుచు తద్వ్యవస్థాపకుల సంకల్పమును దద్దయు నభినందింతును. కేవలము పాఠ్యగ్రంథములు ప్రకటించుటతోనే పరవళ్లు త్రొక్కుచు బొజ్జలు నింపుకొనక ప్రాచీన వాఙ్మయప్రకటనమునకు సయితము ముందడుగు వేయఁబూనిన 'కవిరాజ' కంపెనీవారి ఔదార్యమును అభినుతింతును. ఇందు మదీయాజ్ఞతవలన దొరలిన దోసంగులను అనుభవజ్ఞులగు సరసులు చూపింతురేని ఆవలి ముద్రణము నందైన అభినందనపూర్వకముగా అందుకొందుననని మనవి.

అమృతలూరు
విక్రృతిఫాల్గునము
౧౯౫౧–ఏప్రియల్

కొత్త సత్యనారాయణ చౌదరి

అభినందనము - ఆశాసనము

ఇటీవల విషయమేకాని చిత్రవిచిత్రరచనలతో గైసేసి రసవత్తరము లైన ప్రబంధ్యనేకాకారములలో, ఆంధ్రసరస్వతి నవతరింపఁజేసిన మన ప్రాచీనకవులు పద్యమువలె గద్యము ధారణయోగ్యము కాదని యెంచియో, వచనరచనకుఁ గవిత్వసిద్ధి లేదని భ్రాంతివడియో, గద్యపద్యాత్మకమగు చంపూగ్రంథము, ఉభయతారక మగునని సంతుష్టిఁ జెందియో ముచ్చటకేని ప్రత్యేకించి, ఒక్క వచనగ్రంథమునయిన వెలయింపఁజేయరయిరి.

భారతాదికృతులలో నెడనెడ వచనరచన లున్నను నవి పూర్వాపర సందర్భసంధాయకములుగనో విషయసూచికలుగనో వేరొక్కనఁదగినవేగాని ప్రత్యేకవచనరచనలుగాఁ బరిగణింపఁదగినవిమాత్రము కావుజాలవు.

కవుల యభిరుచియో కాలప్రభావమో యేదయిననేమిగాని దక్షిణాంధ్రయుగమునకుఁ జెందిన యొక రిద్దఱు కవులు మైసూరిభారతాదివచన గ్రంథము లొండు రెండు వెలయించి తెనుఁగున వచనగ్రంథములు లేనే లేవని పెదవి విఱుచు పరిశోధకులకు, ఏకొ రవంత సంతుష్టి నొసంగి వచన రచనకు దారి తీసినను, పట్టి చూచినచో వారి గ్రంథములు మూలములకు దాస్యము సేయు దండాన్వయము లనఁదగినవేగాని తెనుఁగఁదనము సంతరించుకొన్న స్వతంత్రరచనములుగా నిలువఁదగినవి కావు. కాలము గడచిన కొలఁది భాషాప్రణయులకు స్వతంత్రవచనరచనాకుతూహల మంకురించినది. అది శుభోదర్కము.

ఇట్టియెడఁ బ్రసన్నమగు శైలితో, తెనుఁగుఁదీయఁదన మొట్టిపడు వాక్యసరణితో నట్టి వచనరచనలు వెలయించినవారిలో మొట్టమొదటఁ బేరొక్కనఁదగినవాఁడు వచనవాఙ్మయగంగావతరణమునకు భగీరథుఁడనఁదగినవాఁడు శ్రీమాన్ పరవస్తు చిన్నయసూరి.

ఈతఁ డించుమించుగా సంస్కృతాంధ్రసారస్వతసముద్రమును నంతను జుళికించిన మహాపండితుఁడు. ఆయా వాఙ్మయములందలి లక్ష్యలక్షణ ములన్నిటిని నామూలచూడము పరిశోధించి, యందలి భాగము నాకల్యముగ నాకలించుకొని, కైనఁగులో నాబాలవృద్ధము చదివి నేర్వఁదగిన లక్ష్య లక్షణగ్రంథములు లేని లోపము కనిపట్టి, ప్రెసిడెన్సికళాశాలయందుఁ బ్రధానాంధ్రాచార్యుఁడుగా బాలుర చిత్తవృత్తులను బర్యాలోచించి, రాజధానీముఖ్యపత్తనమునఁ బ్రబంధమపండితుఁడుగా విద్యాధికుల యభిరుచులను వివేచించి, లక్ష్యముగా వచనములో నీతిచంద్రికను లక్షణముగా సూత్రములలో బాలవ్యాకరణమును రచియించి, అక్షరరూపమయిన యాంధ్రతామద్ర వైచినాఁడు. ఆ రెంటికి రెండును నాంధ్రసరస్వతికి నమూల్యాభరణములు. జగ మండునంతఁక జరామరణములు లేని జీవరత్నములు.

నూరి ప్రసంగములు తగిలిన యిట్టిపట్టులందు, ఆతని ప్రతిభావైశద్యము- ఆపాండిత్యసద్వ్యాప్తి- ముఖత- ఆరచనాసుకుమారత- ఆయుక్తిగంభీరత- ఆయుపపాదనకౌశలము- ఆవిషయసంగ్రహణనైపుణ్యము- ఆదూరదర్శిత - ఆగడుసుపోకలు- ఆప్రామాణికత- ఆవిషయవివేచనప్రవీణత, మున్నగు నెన్నో విశేషములక్రో నాతని స్వరూపస్వభావములం గూర్చి ముచ్చటింపఁ గుతూహలము పొడముచుండును. కాని దాని కిది యదను గాదు. అకాండతాండవమునకు, అందము తక్కువ.—అదియుఁగాక యట్టి విశేషములు మా సత్యనారాయణ సంగ్రహముగా నిటఁ బ్రస్తావించియుండెఁ గదా యనియుఁ గొంత సంతృప్తి.

ఒక్క వెరసిమాట:—ఆంధ్రవ్యాకృతులలో బాలవ్యాకరణమునకును, వచనకృతులలో నీతిచంద్రికకును సాటిగా నిలువఁదగిన గ్రంథము నభూతో న భవిష్యతి.—ఆ కూర్పు మఱియొకరి కబ్బునది గాదు.—ఆంధ్రభాషాపరిచితు లెవ్వరేని నాఁటినుండి నేఁటిదాఁక బయిజంటలో నొకటినో రెంటినో సమగ్రముగనో యసమగ్రముగనో, అంతో యింతో చని చూడనివారుండరు- వాని నిలువ కదియే తార్కాణ.

పయి రెండిటిని, చిన్నయసూరి తానే తొలుకొల్త వాణీదర్పణమునఁ బ్రతిబింబింపఁజేసి లోకమున కండిచ్చినాఁడు. ఆతని చేతిలో నవి యొకటి రెండు ముద్రణము లందిననికూడ.

అందు బాలవ్యాకరణ మొకద్దఱు పండితుల విపులవ్యాఖ్యలతోఁ బాలవఱకు నిర్దుష్టముగా నేఁటిదాఁక నిలిచినదిగాని నీతిచంద్రిక మాత్రము ముద్రణాంతరము లంఁటలోఁ బాలవఱకు రూపాంతరము దాల్చినది. ముద్రాపకుల యశ్రద్ధయు సంస్కర్తల యలసతయుఁ గారణములుగ సూరి కభిప్రేతములయిన పాఠము లెన్నియో యిటీవలి ముద్రణములలోఁ దాఱుమాఱయినవి:—వానిని బాఠకుల పఠనపాఠనాదులలోఁ బలుపీఠములుగాఁ దమకుఁ దోఁచినరీతిని సవరించుచు సమర్థించుచు సరిపెట్టుకొనుచుండిరేగాని, అసలు మూలపాఠ మేమయియుండునో యను జిజ్ఞాసను జెందరైరి- ఏకొలఁది మందికో యట్టి పరిశీలనదృష్టి యున్నను మూలగ్రంథసాహాయ్యము లేనిచో మొదటి పాఠమును గుర్తించుట సుకరమును గానేరదు.

సూరి యీ వచనరచనమునందు 'బాలుర కోలిం బొదలును భాషా జ్ఞానము' అను సంకల్పనియతి ననుసరించి సోపానక్రమమున శైలిని మార్చు కొనుచుఁ బదములు తూఁచితూఁచి యుపయోగింప చూపు గలవాఁడు. ఆతఁడు వాడిన పదములకు వైయర్థ్యముగాని వాక్యములలో ననన్వితత్వము గాని పొరయనేరవు.

ఊరూర వెలసిన యిటీవలి ముద్రణములలో నీతిచంద్రికయందు వ్యర్థపదములను నన్వయక్లేశములును పెక్కులు ప్రవేశించినవి. అవి మూల పాఠములనుబట్టి సవరింపఁబడి, అనురూపమగు టీకతో, ఈ వచనగ్రంథ మావిష్కరింపఁబడినచో సూరి పరిశ్రమ కృతార్థ మగుటయేగాక బాలుర కెంతయు మేలుసేఁత యగునని యూహించుచుండుదును.

ఇట్టియెడ శ్రీ-చిరంజీవి, కొత్త సత్యనారాయణ చౌదరి చిరకాలము పరిశ్రమించి సూరిగారి తొలి మలి ముద్రణములను, మఱి వేర్వేఱు ప్రతులను,

ఒక టీకను సంపాదించి తట్టీకకు వలయు ప్రస్తితో నిర్దుష్టముగా సంస్కరించి ముఖబంధముగా గ్రంథకర్త జీవితచరితమును ప్రస్తావించి నీతిచంద్రిక నందమైన ముద్రణములో నావిష్కరింపఁజేయుటచే నేఁటి కా లోపము చాల వఱకుఁ దీఱిన దనవచ్చును. నీతిచంద్రికను బఠించువారి కీ టిప్పణము చేయూఁత నొసంగఁగలదని నా నమ్మకము.

టీక సర్వసమగ్ర మ కాకున్నను, ఉన్నంతలో నిర్దుష్టము—ప్రతి పదార్థవివరణపద్ధతిలో నుండుటచే బాలుర కుపకరించుటకు సందియములేదు. టీకాకారుని పేరు తెలియరాకున్నను వ్రాయఁబడిన ప్రక్కనుబట్టి నిదాన ముగ నాలోచింపఁగా నియ్యది చిన్నయసూరి శిష్యప్రశిష్యపరంపరాయాతమూ యనిపించు చున్నది. ఇట్టి టీకను సంపాదించి దానికి వలయు వలపుబలుపు లను సముకూర్చి యీ రూపమునఁ బ్రకటించిన సత్యనారాయణ చౌదరి పూనిక అభిజ్ఞుల మెప్పు నందఁగలదు.

మా సత్యనారాయణ సంస్కృతాంధ్రములందుఁ జక్కని పరిశ్రమ మొనర్చి, ఉభయభాషాప్రవీణుఁడై, ఉపాధ్యాయవృత్తి నవలంబించి, తాత్కాలికాధ్యాపనమాత్రమునఁ దనివి సనక, పలుతేఅంగుల రచనలందుఁ బలుకుబడి గడించి చదివిన చదువునకుఁ జేపట్టిన వృత్తికిని వన్నెయువాసియుఁ జేకూర్చుచు మాదృశులకుఁ గలిగించు సంతృప్తి నెంతో యభినందింతును:—ఈతని సారస్వతసేవాసక్తికి నుత్తరోత్తరవికాసము నభిలషింతును:—"సమానామున్నత్తమశ్లోకోఽస్తు." అని, ఆశాసింతును.

విశ్వకళాపరిషత్తు,
వాల్తేరు
15—4—51

దువ్వూరి వేంకటరమణశాస్త్రి

గురుపాదుల 'అభినందనమునకు – ఆశాసనమునకు'
యావజ్జీవము కృతజ్ఞుఁడను. —సత్యనారాయణ చౌదరి

'చిన్నయసూరి యశోమండనము'

పదునేడవ శతాబ్దిలో పరవస్తు వేంకట రంగ రామానుజా చార్య లనువారు ఉత్తరదేశమునుండి పరవస్తు పీఠము వారితో పాటు చెన్నపురి చేరిరి. ఆయన చాత్తాదవైష్ణవ వంశ్యుఁడు. వేంకటరంగయ్య యని వ్యవహారనామము. ఆయన యిల్లాలు శ్రీనివాసాంబ. అప్పటికి వారి సంతాన మొక్క కొమారితయే. తిరువల్లిక్కేణి రామానుజకూటము వీధిలో వారి నివాసము. అచ్చట వేంకటరంగయ్య అనేకులకు మంత్రములను మంత్రార్థములను బోధించుచు పంచసంస్కార ములను గావించుచుఁ గాలక్షేపము సేయఁదొడఁగెను. ఆయన ప్రవచనములను ప్రతివాదిభయంకరము శ్రీనివాసాచార్యులు విని మిక్కిలి సంతసించి ఆ ప్రతిభకు పరిజ్ఞానమునకు రిచ్చనఁజి మెచ్చుకొని, రామానుజులవారి జన్మవాసమైన శ్రీ పెరుం బూదూరు పట్టణమునకు ఆ కుటుంబమును దీసికొని పోయి వారికిఁ గావలయు వసతులు చక్కఁగా నేర్పఱిచెను.

అయ్యెడ వేంకటరంగయ్య కోవెలలో ద్రవిడవేదపారా యణాధ్యాపకపదవిలో నియమితుఁడయ్యె. అనేకులు వైశ్యులు అబ్రాహ్మణులు దవ్వులనుండియు చెన్నపురినుండియు వచ్చుచు ఆయన సన్నిధిలో మంత్రములను మంత్రార్థములను పంచ సంస్కారములను బడయుచుండిరి. సంస్కృత ప్రాకృత ద్రావి డాంధ్రములలో వేంకటరంగయ్య విశేషపాండిత్యము గడించి

ధర్మశాస్త్రనిష్ణాతుఁడై విద్వదవతంసమై శ్రీ పెరుంబూదూరి యగ్రహారమందలి విద్యాశాలలో ఆచార్యకము వహించి కాలము గడపుచుండెను. ఆయన గృహ మిదిగోనని యిప్పటికిని అప్పట్టణమునఁ బదిమంది చెప్పుకొనుచుందురు.

ఉన్న ఆ యొక్కపుత్ర కొమార్తయు వితంతు వగుటచే సంతానము విషయమై ఆ దంపతుల చింతకు అంతులేదు. ఎన్నో నోములు నోచిరి; వ్రతములు చేసిరి; ఫలితము లేదు. తుదికి వారి యాప్తమిత్రులు శ్రీనివాసాచార్యులు ఒక సుముహూర్తమున పుత్రకామేష్టివంటి యొక హోమము జరిపించిరి. ఋతుస్నాతయైన శ్రీనివాసాంబ శ్రీసూక్తముతో పురుషసూక్తముతో హోమములో ఆహుతులను వేల్చి పాయసము సిద్ధపఱిచి పరిశుద్ధమై జలపూర్ణమైన తామ్రకుంభమువీఁన చిఱుచెంబు తీర్చి అందు నీరు నిండించి మామిడిరెమ్మలు దర్భకూర్చములు నారికేళములు పదిలపఱిచి ఆ కుంభమునకు ఊర్ధ్వపుండ్రములను జూఁది ఆరతి యొసంగి తన ముఖారవిందము అందు ప్రతిబింబించునట్లులు చూచెను. ఆవల యాగపాయసమును శాస్త్రీయముగ – ఆ దంపతు లారగించిరి.

తత్పుణ్య విశేషమునఁజేసి శ్రీనివాసాంబ గర్భము దాల్చి దశమాసంబులు గడపి ప్రభవనామసంవత్సరమున రేవతీ చతుర్థపాదములో (A. C. 1806) మగశిశువును ప్రసవించెను. కాలక్రమమున తల్లిదండ్రు లా శిశువునకు జాతకర్మము లోనగునవి అచ్చట ముచ్చటగాఁ దీర్చుకొనిరి. ఆతనికే 'చిన్నయ్య'

యని పేరు పెట్టిరి. కానక కన్న సంతానము కావున అల్లారు ముల్లముగా గారాలకూచిగా ఆ బిడ్డను తల్లి దండ్రులు లాడ రించుచు ఆనందములో ముంచి పోయిరి. ఆతని కుడికంటిలో కనీనిక కొంచెము స్థలము మాటి యుండెనట. పూర్ణకుంభము నల్లనిచాయ ప్రతిబింబించి యున్నదనుట కియ్యది చిహ్నమని శ్రీనివాసాచార్యులు మున్నగు పెద్దలు పదేపదే ముచ్చటించెడి వారట.

గారాబముతోపాటు పిల్లవాడెదుగుచుండెనే గాని చదువుసంధ్యల ధోరణిమాత్రము మందునకైనఁ గానరాదయ్యె. పదునాఱేండ్ల ప్రాయము వచ్చునందాఁక చిన్నయ్యకు చదువులో చొఱవయే లేదు. తల్లివెంట నంటి లాఁతియిండ్లకు పండుగలకు పబ్బములకు పేరంటములకై పోవును; పాటలు పాడును; ఆటలాడుచుఁ గాలము గడపును.

ఒకనాఁడు వేంకట రంగయ్యమిత్త్రులొకరు కంచి రామానుజాచార్యులు – ఆ యింటికి వచ్చి ఏవేవియో మంచి సెబ్బఱలు ముచ్చటించుకొనుచుండఁగా చుక్క తెగి పడ్డట్టు పీఠిలోనుండి లోనికి చిన్నయ్య ఒక్క దూఁకున వచ్చిపడెను. ఆ యుదుటున కేవగించుకొని, ఎవ్వఁడీతఁడని ఆ మిత్రుఁడు ప్రశ్నించెను. విద్యాగంధము లేక జనుపాంథుఁడుఁబోలె మొఱటుగాఁ గానవచ్చు ఆతఁడు తన బిడ్డయే యని జంకుచుఁ గొంకుచు ఆ తండ్రి పలికి బాలునిఁ జేరఁజీరి ఆచార్యుల కభివందనంబు చేయించెను. ఆయనయు వాని వైఖరికి నగచి ఆశీర్వదించి, బాబూ! మీ తండ్రిగారు పెద్దలైయున్నారు. వీరివద్ద మీ బాలు

కొంతకాలము చదువులు చదివిరి. వేము సయితము పేరి సాహచర్యమున ఎన్నెన్నో విశేషాంశములు గ్రహించుచుందుము. అట్టి వారి కడుపునఁ బెడఁబుట్టితివా నీవు! ఇన్నేండ్లుగాఁ జదువుసంధ్యల జోలికే పోవక గాడిదపిల్లలాఁ ద్రిమ్మరుచుంటివే! నాలుగు ముక్కలు డొక్క కంటసిది నిన్నెవ్వరు గారవింతురయ్యా! సభాపూజ్యులైన మీ తండ్రిగారికి ఈ యపప్రతిష్ఠ తెచ్చిన నీ జన్మ మెందులకయ్యా! "పనివాని కడుపునఁ దినువాఁడు పుట్టు" నందు రింతేగాఁబోలు చీఛీ! యని పదింబదిగఁ జీవాల్లు పెట్టి నిగ్గదీసెను. చిన్నయ్య సిగ్గుతోఁ దల వాంచి లోనుండి కంప మెత్తుకొనివచ్చి కొంతవడికి నిశ్చేష్టుని జేయఁగా నిలువెల్లఁ జెమర్పఁగా - కాలుసేతులు తడఁబడఁగా కన్నీరు మున్నీరుగా నేడ్చుచు డగ్గుత్తికతో - ఇఁక దప్పక చదువుకొందుమని పలికెను. శలాకలవంటి ఆచార్యుల మందలింపులు చిన్నయ్య మనస్సులోఁ దూటి చిద్విలాసముగాఁ బనిచేసెను.

ఆ నాఁడె - అక్షరములు నేర్చుకోవలెనని చిన్నయ్య ముచ్చటపడి తండ్రిని బలవంతపెట్టెను. శ్రీనివాసాచార్యుల వద్దకుఁ దండ్రియు నుత్తరము వ్రాసి తనయున కిచ్చి పంపెను. ఉత్తరమును బిల్లవానిని ఆచార్యులు చూచి పెదవి విఱిచి, ఓహో! నీకుఁ జదువు కావలెనా? నేనా మాట నమ్మలేనని యాసడించెను. స్వామీ! తప్పక చదువుకొందును; మీమాట గట్టిగా విందునని ఆతఁడు వినీతుఁడయి చేతులుమోడ్చెను. సరే యని ఆచార్య లప్పుడే యిసుకలో 'ఓ న మా లు' వ్రాసి దిద్దుకొమ్మని హెచ్చరించెను. ఒకతూరి దిద్దెనో లేదో ఆతఁడప్పుడే

ఆ యక్షరములను స్వయముగ వ్రాసి చూపెను. ఆచార్యులు దానికి ముచ్చటపడి అచ్చులు దిద్దిపెట్టెను. భోజనమునకుఁ బోవునంతలో వానిని సైతము వ్రాసి చూపెను. ఆచార్యులు నివ్వెఱపడి ఆతఁడు మహామేధావియు – ఏకసంథాగ్రాహియుఁ గాఁగలఁడని విశ్వసించి నానాఁడు అత్యంతము ప్రేమము జాలు వాఱ గుణింతము గణితము లోనగునవి చక్కఁగా బోధించెను.

మేధావియగు చిన్నయ్య, బాలరామాయణము – అమరము – శబ్దములు – ఆంధ్రనామసంగ్రహము త్వరలోనే నేర్చుకొనెను. పిల్లవానికిఁ జదువు చక్కఁగా అంటుచున్న దని ఆచార్యులు వేంకటరంగయ్యకు ఆదరముగాఁ దెలియఁజేసెను గాని ఆ తండ్రికి సందేహము తీఱక ఒకనాఁడు తనయునిఁ బిలిచి ఒడిలోఁ గూరుచుండఁబెట్టుకొని అవియు నివియుఁ బ్రశ్నింపఁగా-చక్కఁగా శ్లోకములు పద్యములు వినిపించెను. తండ్రి యూనం దించి, బాబూ! పుస్తకములు లేవు గదా! పద్యము లెట్లు ఒప్పగించితికోయి యని యడిగెను. తోడి బాలురవద్ద అడిగి తీసికొని వచ్చి రాత్రులలో గుడిలో దీపము వెలుఁగునఁ జదువుకొందు ననియుఁ బగలు వారి పుస్తకములు వారికే యిత్తుననియు నాతఁడు చెప్పెను. ఆతని యభినివేశమునకుఁ దండ్రి విస్మయం పడి నాఁటినుండి వానికిఁ గావలయు పుస్తకములు తెప్పించి పేపటికమునలోఁ దా మున్నను దనయునకు మాత్రము లోపము రానీయక విద్యావ్యాసంగములో – ఉత్సాహప్రోత్సాహములు కావించెను. కొలఁది యేండ్లలోనే చిన్నయ్య ఆచార్యుల సన్ని

ధిలో నున్న విద్యను బూర్తి చేసికొని తక్కిన యున్న తవిద్యను దండ్రియొద్దనే శ్రద్ధగా నేర్చెను.

'ఈస్టిండియా కంపెనీ' పరిపాలనములో భారతీయుల సంప్రదాయము లెఱుంగని ఆంగ్లపుత్రులే న్యాయాధిపతులుగా నిర్ణయింపఁబడుచుండిరి. పరిపాలితులగు భారతీయులకు పరిపాలకుల ఆదర్శములే శరణ్యములుగా నేర్పఁజొచ్చిరి. కాని న్యాయసభలలో న్యాయనిర్ణయము సేయవలయునన్న విజాతికి దుర్లభగాహముగాఁ దోఁచెడిది. దానికయి రాజధానీనగరములలో తత్రత్యులగు పండితులనే ప్రభుత్వము సాయముగాఁ గైకొని న్యాయ నిర్ణయముజోలికిఁ బోవసాగెను.

ఆ స్థితిలో - చెన్నపురమున ఉన్నతన్యాయసభలో (Supreme High court) వేంకటరంగయ్యను సహాయకారిగా ప్రభుత్వము నిర్ణయించెను. దానికి ముఖ్యమగు కారణము చెన్నపురి పౌరులలో - ఆ నాఁడు పేరు మ్రోగిన శ్రీ గాజుల లక్ష్మీనరసింహముశెట్టి. ఆయన ప్రోద్బలము మూలమునే ఈ యుద్యోగము కోసమై వేంకటరంగయ్యకుటుంబము చెన్నపురికిఁ జేరెను. నాఁటినుండియు చిన్నయ్య తండ్రివద్దనే అజవము - తెలుఁగు - ప్రాకృతము - వ్యాకరణము కూలంకషముగా నేర్చెను. కంచి రామానుజాచార్యుల సన్నిధిని తర్కాలంకారమీమాంసలు తూర్ణముగా నభ్యసించెను. లక్ష్మీనరసింహముశెట్టిని ఆశ్రయించి యున్న రామశాస్త్రులవలన వేదమును వేదార్థమును లెస్సగా గ్రహించెను.

A0040104B130

ఆ శాస్త్రి వర్యుఁడు చిన్నయ్య శేముషీ వైభవమునకు విద్యా వినయప్రాభవమునకుఁ గడుంగడు మెచ్చుకొని అనుంగు శిష్యునిగా నాదరించి హయగ్రీవ మంత్రముపదేశించెను. తన్మంత్రసిద్ధిచే చిన్నయ్య సర్వతోముఖ పాండిత్యము కుదిరి సరస్వతీమూర్తియై అత్యంతము రాణింపఁ జొచ్చెను. విద్వదవ తంసమైన యా తనయుని ప్రఖ్యాతికి వేంకటరంగయ్య అంత రంగములో తద్దయు నుప్పొంగుచు జన్మము ధన్య మయ్యె నని భావించెను. ఈ తీరుగ, న్యాయ వైశేషిక మీమాంసా ధర్మ శాస్త్రములలో అందె వేసిన చేయియై సంస్కృతాంధ్ర ద్రావిడభాషలలో సంపూర్ణపాండితి నేకరించి విద్యావయో వృద్ధుఁడై వేంకటరంగయ్య చెన్నపట్టణములో అధికారులయు ననధికారులయు మెప్పును మిక్కిలిగాఁ బడసి నూటపదవయేఁట 1836 వ సంవత్సరమున కాలధర్మ మందెను.

తండ్రిని మించిన పండితుఁడై తెలుఁగున విశేషించి కృషి చేసిన చిన్నయ్యను చెన్నపట్టణమున గౌరవింపని పండితుఁడే లేఁడు. తర్క-వ్యాకరణ వ్యాసంగములో చిన్నయ్యకు నెచ్చెలి సహపాఠియగు వేదము వేంకటరమణశాస్త్రిగారికి చిన్నయ్య యన్న మిక్కిలి యభిమానము. ఆయన మన మెఱింగిన వేంకటరాయశాస్త్రిగారికి జనకులు.

ఆంధ్రవిశ్వగుణాదర్శకర్త పంచాంగము తేవప్పెరు మాళ్ళయ్య చిన్నయ్యవద్దనే చదివి యంతవాఁడయ్యెను. దేవ రాజసుధి యను నామాంతరము గల తంజనగరము తేవప్పెరు

మాళ్ళయ్య చిన్నయ్యకు ప్రశిష్యుఁడు. అనఁగా – పంచాంగము పెరుమాళ్ళయ్యసన్నిధిని తంజ నగరము పెరుమాళ్ళయ్య కావ్యనాటకాదులు సంస్కృతాంధ్ర వ్యాకరణములు పఠించెను. చిన్నతనములో దేవరాజసుధికి 'చిన్నయ్య' యని సైతము వ్యావహారికనామము కలదఁట. ఇఁక 'బహుజనపల్లి' వారు చిన్నయ్యకు శిష్యరత్నమే గదా!

గీర్వాణాంధ్ర ద్రావిడములందలి పాండిత్యముతోపాటు ఆంగ్లభాషలో సైతము కొంత ప్రవేశ ముండుటఁజేసి చిన్నయ్య వద్ద అప్పటి ఫాదరీలు – ఆంగ్లేయోద్యోగులు – బ్రౌను మున్నగు విద్యాధికులు పెక్కుఱు పాఠములు చదువుచుండెడివారు. గ్రంథరచనోద్యమములో చిన్నయ్యకు ముమ్మొదట చేయూఁత నిచ్చినది గాజుల లక్ష్మీనృసింహము శెట్టి. ఆతని యెచ్చరికనలననే 'ఆంధ్రశబ్దశాసనము – ఆంధ్రనిఘంటువు' చిన్నయ్య చేతిలో వెడలినవి.

చిన్నయ్య పలుకులనలె చేతి వ్రాలును శరీరాకృతియు అందమును గ్రుమ్మరించుచుండు నని చెప్పుకొందురు. వానికిఁ దగిన దుస్తులతో ఆంతర రూపమువోలె బాహ్యరూపము సైత మాకర్షకముగా నుండెడిదఁట. కంఠధ్వని యత్యంత శ్రావ్యమై శ్లాఘ్యమై యుండెడిదఁట.

ఆ రోజులలో – ఆంగ్లేయభాషా ప్రాభవము మూలమున దేశ్యభాషలు సన్నగిలిపోవుచున్నవని రాజకీయవేత్తలు కొందఱు గుర్తించి ఆందోళన మొనర్పసాగిరి. అద్దాన – ఆంగ్లమునకు

అంగభాషగా దేశ్యభాషలు విద్యాశాలలలో వెలయఁ జొచ్చెను. నేఁడు రాజధానీకళాశాల (Presidency College) యని పేరు మోసిన విద్యాసంస్థ, ఆ నాఁడొక యున్నతపాఠశాల (High School) గా పిలువఁబడుచుండెడిది. వాఁటి విద్యార్థులకు – (Profficient Degree) అనునది యొక యుత్తమకక్ష్య. ఆ పాఠములు బోధింపను అప్పు డిద్దరు పండితులు (Headmaster and Assistant master) కావలసి వచ్చిరి. ఆ పదవికిఁ బెక్కురు పండితులు అభ్యర్థులుగా నిలిచిరి. అం దొకరు పురాణము హయగ్రీవశాస్త్రులు. వీరే ముమ్మొదట ఆంధ్రభాగవతమును ముద్రింపించినవారు. విశ్వ విద్యాలయ కార్యదర్శి ఏ. జే. అర్బత్తునట్టు దొర, మఱి కొందఱు ఉద్దండులగు పండితులను చెన్నపురికి రావించి వారి యాధ్వర్యమున 'పోటీపరీక్ష' పెట్టించెను. ఆ పరీక్షలో చిన్నయ్య మొదటివాఁడుగ హయగ్రీవశాస్త్రులు రెండవ వాఁడుగ జయ మందిరి. ఒకరు ప్రధానాంధ్రోపాధ్యాయులు; రెండవవారు సహాయోపాధ్యాయులుగ నిర్ణీతులైరి.

ప్రాయికముగా దేశములో పాండిత్యమునాట యటుంచి అక్కరమున్నఁ జక్కఁగా రాని కొందఱు వ్యక్తులు 'శాస్త్రి' యనియు, 'పండిత' యనియు బిరుదములు తగిలించుకొనుట పరిపాటి. పండితమండలికే తలమానికమైన చిన్నయ్యకు– ఇంత పాండిత్య మున్నను బిరుదము లేకుండుటకు విశ్వవిద్యా లయకార్యదర్శి సైఁపలేక వెంటనే పెక్కురు పండితులను చెన్న పగరములో సమావేశపఱచి చిన్నయ్య బిరుదమును గూర్చి

ప్రస్తావించెను. అందఱు నేకగ్రీవముగ 'సూరి'యని నిర్ణయించిరి. 'చిన్నయ సూరి'యని బంగారు కడియము సీమలోనే చెక్కించి దొరతనమువారి యాజమాన్యమున చెన్నపురికిఁ దెప్పించి విశ్వ విద్యాలయాధికారులు పండితగోష్ఠిలో చిన్నయ్యకు బహూకరించిరి. పెక్కుఁడు విద్వాంసులు చిన్నయ్యను సూరివర్యుఁడని వేనోళ్ళఁ గొండాడుచు ముచ్చటించిరి. నాఁటినుండి చిన్నయ్య 'చిన్నయ సూరి' ఆయెను.

కాని యీతని ప్రఖ్యాతివిషయమున - ఈసు పూనిన వారును లేకపోలేదు. ఉన్నతన్యాయాధిపతులైన (హైకోర్టుజడ్జి) కుమారస్వామి శాస్త్రి గారి పితామహుల పేరు రంగనాథ శాస్త్రులు. ఆయన ఆ నాఁడు స్మాల్‌కాజ్‌కోర్టులో న్యాయాధికారి. ఆయనకు సంస్కృతసాహిత్యమందే గాక సర్వశాస్త్రము లందును బదునేను భాషలందును సమగ్రపాండిత్యము కద్దు. వారి యిల్లు హయగ్రీవశాస్త్రుల యిల్లు ఒకే వీధిలో నుండుటఁ జేసి యుభయులకు నేస్తము కుదిరెను. హయగ్రీవశాస్త్రులకు ఆయన యన్న దొడ్డ గౌరవము. ఆయనకు-ఈతఁడన్న మిక్కిలి యభిమానము. ఈ యనుబంధము మూలమున రంగనాథ శాస్త్రులు తన పలుకుబడిని వినియోగించి హయగ్రీవశాస్త్రి లను ప్రధానాంధ్రోపాధ్యాయులనుగాఁ జేయను సంకల్పించిరి. ఆ మాట- మాటల ధోరణిలో ఈ పండితునకు ఆ న్యాయాధిపతి విన్నపించెను. దానికి హయగ్రీవశాస్త్రులు బొత్తిగా సమ్మతింపక, తనకంటెను బెక్కుమందికంటెను చిన్నయసూరియే దొడ్డ పండితుఁడనియు నాతనికే యీ పదవి యన్నివిధాల

అర్హతమ మనియు మీ సంకల్పమునకు గృతజ్ఞుడ ననియు నా కా పదవి ఆతని క్రోల నూహింపను సహింపననియు విప్పి చెప్పి, ఆతని పాండితీప్రకర్షను గుర్తింపను సమావేశ మొండు చేయింపఁగోరెను. దాని కొక 'ఆదివారము' నిర్ణయించుకొనిరి. హయగ్రీవశాస్త్రులు సూరిని వెంటఁ బెట్టుకొని రంగనాథశాస్త్రుల యింటికిఁ బోయెను. అది మధ్యాహ్నము మూఁడు గంటలవేళ. కుశలప్రశ్నములు ముగిసినవి; మాటయు మంతియు జరిగినది. రంగనాథశాస్త్రుల కోరికపై అలంకార శాస్త్రగ్రంథములో చిన్నయసూరి ఉపన్యాసము చేయసాగెను. ఆ యుపన్యాసధోరణిలో అందఱు తలమున్కలై అపూర్వాం శము లెన్నింటినో గ్రహింపఁదొడంగిరి. ఎంత వేళ ఆయెనో ఎవ్వరికిని దెలియదాయె. పనికత్తె వచ్చి దీపము వెలిగించి పోయె. ఉపన్యాసము – అవిచ్ఛిన్నముగ సాగుచునే యున్నది. వినువారికి విసుగుమాట – లేనిమాట యుటుంచి తనివి తీఱిక యందఱు తల లెత్తి చెవులు నిక్కించి అదే ధోరణిలో మునిఁగి పోయిరి. భోజనసమయము సైతము దాఁటిపోయె నని సూప కాకుఁడు నివేదింపఁగా రంగనాథశాస్త్రులు గుర్తించి సభామధ్య ములో లేచి, అంతదనుకఁ దన కున్న యభిప్రాయ మంతయుఁ దప్పనియు సూరి వర్యుల విలువ నేఁడు అక్షరాల అర్థ మయ్యె ననియు నేటినుండి తాముకూడ హయగ్రీవులతో పాటు మా యింటికి వచ్చి మమ్ములను ఆనందింపఁ జేయవలసిన దనియుఁ గోరుచు – అనోన్యోపన్యాసముగా అభినందించుచు సమా వేశము ముగించిరి.

చిన్నయసూరి కేవలము మహాపండితుఁడే గాదు; మహా వక్తకూడ. వ్యాకర్తయే కాదు; కావ్యకర్తయు. భాషాభిజ్ఞుఁడే కాదు; సంగీతశాస్త్రాభిజ్ఞుఁడును. సర్వశాస్త్రగ్రంథము తో పాటు రాశీభూతమైన వివిధవాఙ్మయ మీతని భాండాగారమున నిండి యుండెడిదట.

నన్నయ్య చెప్పినదే చిన్నయ్యకు వేదము. అద్దానఁ బట్టియే ఆంధ్రవాఙ్మయమున నన్నయచిన్నయలకు పద్యగద్యము లలో ఆద్యస్థానము నొసంగిరి. ఆతఁడు చింతామణి; ఈతఁడు బాలవ్యాకరణము. ఆతఁడు ఆంధ్రభారతము; ఈతఁడు నీతి చంద్రిక. పద్యకవితకు బాట వేసినవాఁడు నన్నయ్య; గద్య కవితకు దారి చూపినవాఁడు చిన్నయ్య. కాకతాళీయమో కాలకర్మ వశమో భారతము మూఁడు పర్వముల కావల కవి బ్రహ్మ తోఁచెను. మిత్రభేదమున కావల గద్యకవిబ్రహ్మ కావలసివచ్చెను. సోమయాజి-నన్నయభట్టునుగూర్చి

'ఆదిఁ దొడంగి మూఁడు కృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యా దయితుం డొనర్చె మహితాత్మఁడు నన్నయభట్టు దక్షతిన్'

ఇట్లని కొండాడఁగా 'కందుకూరి'పంతులు చిన్నయ్యసూరినిగూర్చి

'చిన్నయసూరి ధీయు లెదఁ జేరిచి సారెకు నాదరింపఁగా
మున్ను రచించి మించె సగమున్ వచనంబుగ నీతిచంద్రికన్'

అని యభివర్ణించెను.

అప్పుడప్పుడు చెన్నపురములో-ఈతని భాషావిషయ కోపన్యాసములు పెక్కు-మంది పండితులు వినుచు సంతుష్టు లయ్యెడివారు. ప్రాచ్యవిజ్ఞానము గల భారతీయోద్యోగులు

పెక్కురు— ఈతనికి మిత్రులు. స్వసంఘసమావేశ మేర్పఱచి విశిష్టాద్వైతమతమును బోధించుచు సంఘోద్ధరణకు సైతము పాటుపడెను. దురవగాహములగు శాస్త్రములందును వ్యాసంగ మొనర్చి సాహిత్యచక్రవర్తియై శమదమాది గుణవిరాజితుఁడై నిగర్వచూడామణియై కవియై ఉద్యోగియై ఖ్యాతి గాంచిన చిన్నయసూరివంటి వ్యక్తులు అర్వాచీనులలోఁ గానరారు. భాషాభ్యుదయము కావించుటలో బద్ధదీక్షు వూని ఎన్నో గ్రంథములను రచించెను. 'వాణీదర్పణ' మను పేర ముద్రాయంత్రము నొకదానిని నెలకొల్పెను. అందే నీతిచంద్రికను మొదటికూర్పుగా ౧౮౫౭ న యేఁట— ముద్రింపించెను. ఈతని గ్రంథములలో విశిష్య— పేరొక్కనఁదగ్గది, తెలుఁగువారి దౌర్భాగ్యమువలన లోకముకంటఁ బడనిది— 'అకారాద్యాంధ్ర నిఘంటువు'. ముత్యములఁ బోలు తన చేతివ్రాలత్తో ఎన్నో పదముల నెత్తి వ్రాసి, పూర్వమహాకవి ప్రయోగముల మూల మునఁ జక్కఁగా అర్థనిర్ణయము చేసి రెండు సంపుటములు మాత్రమే సింపి విశేషభాగ మింకను శేషభాగమందే నిలిచి యుండ రాచపుండు పొడమి కాలధర్మ మందెను. అదే యదనున సూరికి ఆప్తశిష్యులగు బహుజనపల్లి సీతారామాచార్యులు సూరిగారి కోడలి నడిగి నిఘంటుసామగ్రి సర్వము పుచ్చుకొని పోయి అక్కఱ పడినంతవట్టు సంగ్రహించి వ్రాసికొని యామె కయ్యది యిచ్చివేసెనఁట. అదియే 'శబ్దరత్నాకరమునకుఁ' ప్రాతిపదిక. రెండింటఁ బెక్కుచోట్లఁ బోలికలు చాలినన్ని కలవు. పైగా 'శబ్దరత్నాకరమును' చదలువాడ

సీతారామశాస్త్రిగారే సంధానించియుండ, బహుజనపల్లివారు కొంతకొంత మార్పు కూర్పులు కావించి దేశభాషాగ్రంథకరణ సభవారికి ౫౦౦ రూప్యముల కమ్మివేసి రని పరంపరాయాత మగు పండిత ప్రతీతి. ఆ సభవారు ధనవంతులు కావుటను శబ్ద శత్నాకర మప్పుడే ముద్రణకు నోచుకొన్నది.

ఇంతకు చిన్నయసూరి పరిశ్రమ ఫలితమునకు మనము నోచుకొనమైతిమి. అది సంపూర్ణముగ ముగిసినచో బండ్లు మోడ దోలవలసిన సంపుటమే యయ్యెడిది. ఇటీవల మాన వల్లి రామకృష్ణకవిగారికి ఆ వ్రాతసంపుట మెట్లో చేతికి జిక్కిన దట. ఆయనవద్ద కందుకూరివారు విలిచికొని సూర్యరా యాంధ్రనిఘంటుకార్యాలయమునకు జేర్చిరట. అయ్యెడ నయ్యది కోవెలలో విగ్రహమువోలె సురక్షితముగా నున్నదని వినికిడి. ఆధునాతనమై వెలసిన సూర్యరాయాంధ్ర నిఘంటునకు సయితము సూరి నిఘంటువే మూలశీల మనుట జగ మెఱిగిన మాట.

ఇక – చిన్నయసూరి సుప్రసిద్ధమైన రెండవ గ్రంథము 'బాలవ్యాకరణము'. ఆంధ్రశబ్దచింతామణి మున్నగు ఆంధ్ర లక్షణగ్రంథముల సంప్రదాయములో చిన్నయసూరి సైతము తెలుఁగు వ్యాకరణమును సంస్కృతభాషలో సంతరించెను. తాను స్వయము – అధ్యాపకుఁడు గావుటను తెలుఁగు వ్యాక రణము తెలుఁగులో నుండుటయే మేలని తోఁచి తాను వ్రాసిన సంస్కృతభాగమునకుఁ గొంతినట్టు – అనువాదముగా బాల వ్యాకరణము సిద్ధపఱిచెను. ఇది తెలుఁగునకుఁ బాణినీయము.

పంక్తభాషలోఁ బాణినీయము ముందు సర్వవ్యాకరణము లడఁగినట్లు - తెఱఁగు వ్యాకృతు లన్నియు చిన్నయ్యముందుఁ జిన్నవై చిన్నవోయె. అల్పాక్షరములలో ననంతమైన యర్థము నిమిడ్చి అవ్యాప్త్యతివ్యాప్తులు లేని సూత్రనిర్మాణము సూరికిఁ జక్కఁగాఁ జిక్కిన మిక్కిలి భాగ్యము. నన్నయ్య చింతామణికి శేషగ్రంథము 'అథర్వణ కారికలు'; చిన్నయ్య బాలవ్యాకరణ మునకు శేషగ్రంథము 'ప్రౌఢ వ్యాకరణము'; కాని. బహుజన పల్లివారు - సూరి వ్రాసిన 'బాలవ్యాకరణ శేషము' లోని యంశములనే పెక్కింటిని జేతఁబట్టి 'ప్రౌఢవ్యాకరణము' ప్రకటించిరి. తెలుఁగుల దుర్గతివలన 'బాలవ్యాకరణశేషము' మాత్ర మచ్చులో నేఁడు మనకంటి యెదుటికి వచ్చియుండ లేదు.

చిన్నయ్య కీర్తిమూర్తికి దివ్వెయై వెలసిన 'బాలవ్యాకరణము'న కిటీవల పెక్కు వ్యాఖ్యానములు వెలువడినవి. వానిలో నా యెఱింగినంతవఱకు మొదటిది 'గుప్తార్థప్రకాశిక'. దానిని వ్రాసినది కల్లూరి వేంకటరామశాస్త్రిగారు.

టీక యంతయు ముగిసిన పిదప, చిన్నయసూరి బాల వ్యాకరణమును స్వతంత్రముగ రచింపనే లేదనియు, శిష్టు కృష్ణ మూర్తి కవిగారి హరికారికలనే ఆంధ్రీకరించి రనియు - ఈ వ్యాకరణము నీ రీతిగ స్వతంత్రముగ వ్రాయుటకు - అబ్రాహ్మ ణుఁడగు సూరికి తాహతు లేదనియు, పర, వస్తు. చిత్ + నయ- సూరి యనియు, ఒక విచిత్రధోరణిలో పాక్షికబుద్ధితో మహా ద్రోహమగు వాదము నొకదానిని లేవనెత్తెను. 'వృద్ధాస్తే న

విచారణీయ చరితా' అన్నట్లు, అనరాదు గాని ఈతడు ఈ పాక్షికబుద్ధియే ప్రకోపించి 'కల్లూరివారి యల్లరి' యని పెక్కు రచే ఈసడింపులు పడి పడి, మది తొలగిన ముదిమిలో పక్షవాతమే చొచ్చి నోటిమాటకే నోచుకొనక జీవచ్ఛవమై మంచమువిూద పడియుండి పెక్కిండ్లు అలమటించి దుర్భరమైన మరణవేదన మనుభవించెను.

'హరికారికలు' సృష్టించిన 'శిష్టు'వారు సూరికి సమకాలికులు; కాళహస్తిజమిూందారుని ఆస్థానకవీశ్వరులు; విద్వత్కవులు. ఈయన వ్రాసిన గ్రంథములు చాలఁ గలవనియు దిగ్దంతినంటి పండితుఁడనియు దేశములో వాడుక కలదుగాని, ఈయన కర్మమేమో ఒక్క గ్రంథమైనను స్థిరవాఙ్మయములోఁ జేరినది కానరాదు. ఈతని ప్రకృతి మిక్కిలి వక్రమని ప్రసిద్ధి కలదు. మోసములో అందెవేసిన చేయి. పరుల కీర్తికి భంగము తెచ్చుటలో, ధనమును గూడఁబెట్టుటలో ఎంతటి సాహసమైన అవలీలగాఁ జేయఁగల వలంతి యని ఈతని చరిత్రము చెప్పుచున్నది. మూడగల్లులో నీతఁడు చరమదశలో నుండియు ధనాశఁజేసి ఒక ధూర్తుఁడగు రాజకుమారుని కోరిక తీర్చుటకయి అశ్వశాస్త్రమని పేరు వెట్టి నారదుఁడొక రాజునకుఁ జెప్పిన నల్లగా నాలుగువందల శ్లోకము లొక్క రాత్రిలో అల్లి తాటాకులలో వ్రాసి మసిపూసి పేరోలగమున సభాసదులను మోసపుచ్చిన ఘటికుఁడు. (కవిజీవితములు 455 పుట)

ఈతనికి సూరికి చెన్నపురిలో సిద్ధాంతకౌముదిలోని సూత్రవిచారము కొంత నడచి మాత్సర్యము కలిగినదఁట.

అబ్రాహ్మణుఁ డిత పండితుఁ డయ్యెనే యనియుఁ బెఁగాఁ
దాను బరాజితుఁడ నైతి ననియు శిష్టు శాస్త్రి లోలోనఁ
గుమిలి కూలారి తన ప్రజ్ఞాపాటవము వినియోగించి సూరి
గ్రంథము దొంగిలించి సంస్కృతీకరించి దానిని సంస్థానాధిపతికి
అంకితమిచ్చెను. ప్రాయికముగా మనము సంస్కృతమేమూలము,
తెలుఁగు అనువాదము అన్న సంప్రదాయములో నుందుము.
కాని యీ 'హరికారికలు' సైతము చాలఁ గాలము మాటుమణుఁగి
నష్టవాజ్మయములోనే రూపురేకలు తీర్చుకొన్నవి. కరప గ్రామ
ములో శిష్టువారి దౌహిత్రులగు కొట్ర శ్యామలకామశాస్త్రిగారి
యొద్ద హరికారికల ప్రతి యొకటి కలదఁట. ఆ ప్రతిని గ్రంథకర్త
యల్లుఁడు శిష్యుఁడు కామశాస్త్రిగారి తండ్రియు నగు లక్ష్మీ
నారాయణశాస్త్రులు స్వయముగ వ్రాసికొనిరఁట. టీకాకర్త
యగు కల్లూరి వారు తమ వాదమున కనువగునట్లు పెక్కు సవ
రణలు కావించి 'హరికారిక'లనుచు 'ప్రకాశిక'లోఁ బ్రకటించిరి.
ఈ రెండింటిని గమనించి, ఈ వాదము సాంగోపాంగముగఁ
బరిశీలించి ప్రత్యక్షరము ఆకళింతకుఁ దెచ్చుకొని అస్మద్గురు
వర్యులు – ఆంధ్రవిశ్వకళాపరిషదాంధ్రోపాధ్యాయులు బ్రహ్మశ్రీ
దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు పయిపయి పుక్కిటి పురాణ
ములనుబట్టి గాక బాలవ్యాకరణమే మొదటి దనియు, హరికారి
కలు దాని కనువాదరూపములే యనియు నిర్ణయించు నాధా
రములను బెక్కిటిని ఇట్టిట కదల్పరానివానిని ఆ రెండు గ్రంథము
లండే కనిపెట్టి వాని నెల్ల విశదముగా వివరించి నిగ్గు తేల్చి
లోకమున కెన్నఁడో చూపిరి. అందలి సారము చవి చూపఁ

దలంచియు, చ్వాతచర్వణ మసునని యు గ్రంథము పెసఁగునని భయపడియు మానివైచిత్రిని. (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక ౧౫౫ సం. ౫-౬ సంచిక)

దువ్వూరివారి 'పౌర్వాపర్య విమర్శనము' వలన బాల వ్యాకరణమె ప్రాథమిక మని నిర్ధరింపఁబడినది. విద్వదవతంసమని ఒక శతాబ్దినుండియు దేశములో పండితపరంపరాయాతమగు ప్రసిద్ధి యుండుటఁబట్టియు, ఈతఁడు తలపెట్టిన నిఘంటువు మున్నగు పొడ్డగ్రంథములను బట్టియు బాలవ్యాకరణమును చిన్నయసూరి గ్రాయుటలో అనుమానమే లేదనియు, అశ్వ శాస్త్రగాథను బట్టియు గోదావరీమండలములోఁ గొందఱు వినిపించు కథలనుబట్టియు జీవితచరిత్రమును బట్టియు 'శిష్టు'వారు ఇట్టి కృత్రిమగ్రంథములను సృష్టించుటలో సమర్థులే యగుటఁ బట్టియు హారికారికలకు బాలవ్యాకరణమే మూలమని ఘంటా పథముగఁ దేలిపోయినది.

తమ తండ్రి వేంకటరమణశాస్త్రిగారు చిన్నయసూరికి సహపాఠు లగుటఁజేసియు ఆతని ప్రఖ్యాతి ఆమూల మెఱింగిన పండితుఁ డగుటఁబట్టియు – బాలవ్యాకరణమును చిన్నయసూరి గ్రాయఁగా దానిని 'శిష్టు'వారు సంస్కృతీకరించినారని తనతో ప్రస్తావవశమున ముచ్చటించి యున్నట్లు వేదము వేంకటరాయ శాస్త్రిగారు తమ మిత్రుల గోష్ఠిలో అన్నట్లు మా గురుపరంపరలో వినియుంటిని. ఇట్టి పట్టులఁ దాము స్వాయముగ విన్న యంశమును వేదమువారైన గ్రంథస్థము చేసి యున్నచో లోకమున కెంత యుపకార మయ్యేఁడది? వారి. కా గ్రోవ

రుచింపఁగోటు ! కాని యిటీవల ముద్రితమైన 'వేంకటరాయ శాస్త్రిలవారి జీవిత' గ్రంథములో, ఈ వేంకటరాయ శాస్త్రిల వారే అన్నట్లుగా, వీరి మనుమలు ఈ మాట లుదాహరించిరి:-

"నాయనగారు (వేంకటరమణశాస్త్రిగారు) శిష్టు కృష్ణమూర్తిగారికి గుంటూరు కాకినాడలలో పరిచితులు. కృష్ణ మూర్తిగారికి చిన్నయసూరిగారితో కాళహస్తి, వేంకటగిరి సంస్థానములలో ఘర్షణ. కృష్ణమూర్తిగారు బాలవ్యాకరణము హరికారిక లనుపేర సంస్కృతమున అనువదించుట. వారి యసత్యవాదము. అట్లు చేయఁగూడదని మా నాయనగారు కృష్ణమూర్తిగారిని హెచ్చరించుట."

(వేదము వేంకటరాయశాస్త్రిలవారి జీవితము. 9 పుట)

అది యటుండె. సూరికి సమకాలికులై ఆప్తశిష్యులై శబ్దరత్నాకరాదికములు వ్రాసి పేరు పడసిన బహుజనపల్లి సీతా రామాచార్యులు సైతము శబ్దరత్నాకరము పీఠికలో 'సంస్కృ తాంధ్రములందు విశేషపాండిత్యంబు గలిగి యాసేతుహిమా చలము చాలఁ బ్రసిద్ధి వహించియుండిన పరవస్తు చిన్నయసూరి గారు...' ఇత్యాదిగ ప్రశంసించియు, తాను చిన్నయసూరి శిష్యుఁడ నని సూచింపనైన సూచింపలేదు.

ఒక చోట - ఆచార్య లిట్లనిరి:- "పరవస్తు చిన్నయ సూరిగారి కాంధ్రమునందును దదుపయుక్త సంస్కృతప్రాకృత ములయందును దలస్పర్శి యగు పరిజ్ఞానము కలదని వారు చేసిన లక్ష్యలక్షణగ్రంథములే నిరూపించుచున్నవి. మేము

వారిత్రోఁ జిరకాలము సావాసము చేసి యుంట వారి పాండిత్యము మా కనుభవసిద్ధము.”

ఇట్టి మహాపండితుఁడు బాలవ్యాకరణము మాట యెత్తి గియు నెత్తకపోవుట కేమి హేతువో! అయ్యో! అదేమి యాశ? సూరి నిఘంటువును గైంకర్య మొనర్చి కృతజ్ఞతయైనఁ జూపక అయిమవేల రూప్యముల కమ్ముకొని గురువులకు పంగ నామాలు పెట్టిన ఆచార్యులవారు – శాస్త్రులవారి యీ నృత్తాంతము మాట యెత్తుకొందురా? లేదా – ఆయన జీవించినంత దనుక – ఈ ‘శిష్టు’ వారి కృత్రిమసృష్టి దేశములో లేశమైన పొక్కి యుండలేదో!

మొత్తము సూరివిగా పేర్కొనఁదగ్గ మహాగ్రంథములు ముద్రితములు – అముద్రితములు చాలఁగాఁ గలవు.

ము ద్రి త ము లు

౧. చింతామణి వృత్తి 1840
౨. పద్యాంధ్ర వ్యాకరణము 1840
3. సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణము 1844
౪. పచ్చయప్ప నృపయశోమండనము 1845
౫. ఆదిపర్వవచనము 1847
౬. శబ్దలక్షణ సంగ్రహము 1853
౭. నీతిచంద్రిక 1853
౮. నీతి సంగ్రహము 1855
౯. బాలవ్యాకరణము 1855
౧౦. విభక్తి బోధిని 1859

అముద్రితములు

౧. ఇంగ్లీషు లా చట్టముల భాషాంతరీకరణము

౨. చాటుపద్యములు

౩. రాణిగారి మకుటాభిషేకమునకు రచించిన పద్యములు

౪. సంస్కృత బాలబోధ

౫. అక్షర గుచ్ఛము

౬. అకారాది నిఘంటువు

౭. విశ్వనిఘంటువు

౮. ఆంధ్ర ధాతుమాల (ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికటితము)

౯. ఆంధ్ర శబ్దశాసనము

౧౦. బాలవ్యాకరణ శేషము

౧౧. ఆంధ్ర కౌముది (వచనము)

౧౨. ఆంధ్ర కాదంబరి (వచనము)

౧౩. యాదవాభ్యుదయము

౧౪. సుజనరంజని—ఇత్యాదులు.

ఇందు సుజనరంజని అన్నది మాసపత్రిక యఁట. పట్ట పరీక్షార్థులకఁ బండితులకుఁ గలిగెడి భాషాసందేహములకుఁ జక్కని సమాధానము లీ పత్రికలోఁ బ్రకటించెడివారఁట. "ఇది నఱలోఁ జిన్నయసూరి ముద్రింపించుచు వచ్చిన సుజనరంజని మను పత్రికయందు పై నుదాహరించిన మూఁడు గ్రంథములును భట్టుమూర్తి రచించెనని వ్రాసియున్నది." (అముద్రిత గ్రంథ చింతామణి - 1886 ఫిబ్రవరి)

ఆంధ్రకాదంబరి, యాదవాభ్యుదయము ముస్నగు కావ్యములు చిన్నయ్య చేతిలో నెట్లు వడి తిఱిగి పొలుపు గుబాళించినవో మూచూచు భాగ్యము సైతము మనకు నేడు లేదు గదా! ఇతని సంస్కృతాంధ్ర కవితా రీతికి మచ్చుగా నిచ్చినవి రెండే రెండు ముక్క-లు:—

"గగనంబట్లు రసప్రపూర్ణ విలసత్కందంబుల న్మీ చి య
భ్రగసాలంబుగతిన్ సితచ్ఛదములన్ భాసిల్లి మేరుక్రియన్
జగదామోద సువర్ణభాస్వరముగా జానొంది పచ్చావనీ
శగుణంబుల్ గణుతింప కోశమిది యిచ్చ న్మెచ్చు గావించెడిన్.

గుణస్య బాధికాం వృద్ధిం కృతవాన్ పాణినిః పురా।
అబాధితగుణాం వృద్ధి మకరోత్పచ్చపప్రభు॥

పరిషత్ప్రాంతమున కే రాక ద్రవిడదేశములోనే పుట్టి, అందే యడంగిన రచనలు-ఎన్నో సూరివి యున్నవని పెద్దలందురు.

ఎన్నో గ్రంథములను అచ్చునకుఁదెచ్చి ఎంతో సొమ్మును దమ పరిషత్తులో వ్యయపెట్టిన 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' వారైన - ఈ 'రచనల' నన్నింటిని తెలుఁగువారికి ముద్రింపించి యీయరాదా! ఒకప్పుడు సూరి వాఙ్మయ మన్న పంచ ప్రాణములు తాకట్టు వెట్టు పండితవతంసులు పరిషద్రాజ మాన్యమున వెలసిన మాట నిజమేగాని నేఁ డా ధోరణియే ఆ సంస్థలో దూరమైనట్లు తోఁచుచున్నది. సూరి జీవితమును గూర్చి కొన్ని యంశములు గుఱుతించుటకయి తపాలా బిళ్ళలు పెటి ఉత్తరము లెన్నో సడపినను, పరిషత్తు కార్యాలయము వారికి — అది మా పని గాదన్నట్లు స్ఫురించినది.

చిన్నయసూరికి మూవురు పుత్త్రులు పుట్టిరి. కాని వా రెల్లరు పురుషసంతానము లేకయే కాలధర్మ మందిరి. రెండవ కుమారునకు శ్రీమాన్ రేకము రామానుజసూరి కొమార్త నిచ్చి పెండ్లి చేసిరి. ఆమె కొక కూఁతును కలిగెను. ఆమె మగఁడు 'రెవిన్యూ - ఇన్‌స్పెక్టరు' ఉద్యోగము సేయుచు చనిపోయెను. ఆ దంపతుల కొక పిల్లవాఁడు కలిగెనఁట.

ఇట్లుండ వ, సంవత్సరము తుదిలో వీఁపున రాచకురుపు పుట్టి ఇంకొ వ, యేఁట - దుందుభి సంవత్సరములో ఏఁబది యైదవ యీడున చిన్నయసూరి పరమపదించెను. రోగిగా నున్న తరుణములో వియ్యంకుని రామానుజసూరిని బిలిచి తాను బ్రారంభించిన 'ఆంధ్రనిఘంటువును' పూరింపనలయునని కోరెను. రామానుజసూరి, గవర్నమెంట్ నార్మల్ స్కూలులో ప్రధానాంధ్రోపాధ్యాయుఁడుగాఁ బని చేయుచుండెను. ఆతని పిమ్మట - ఆ పదవికి బహుజనపల్లివారు నియమితులైరి. సూరి ప్రారంభించిన నిఘంటువును నిర్వహించుటలో రామానుజ సూరియు దక్కుఁడే; కాని, దానిని గంటఁ జూచుట కేనియు వానికి క్షణకాలము తీఱిక చిక్కఁడిది కాదఁట. సంస్కృతాంధ్ర ద్రావిడములతో పాటు - ఆంగ్లములోఁగూడ - పండితుఁడు కావు టను చెన్న రాజధానికి వచ్చెడి ఆంగ్లేయోద్యోగీయులకు(Junior civilians) దేశ్యభాషలు నేర్పుటకై ప్రభుత్వమువారే ఆతనిని నియమించిరి. చిన్నయసూరి పిమ్మట - తత్పాఠశాలా పండిత పదవిలో నుండియు దొరలకుఁ జదువు చెప్పుచు దిన మంతయుఁ దీఱిక లేక యట్లే కాలము గడపెను. ఈ కారణమువలన రామా

నుజసూరియు సూరినిఘంటువుజోలికి పోనేరక తన పెద్దకుమారుని మనవాళ్ళయ్యను— ఈ పనికయి పురమాయించి ౧౯౭౮ వ సం. అక్టోబరు —౨౮ వ తేదిని కాలధర్మ మందెను. మనవాళ్ళయ్య ఒకప్పుడు కాకినాడలో సబ్‌జడ్జిగా పనిచేసెను. ఈతఁడును — ఉభయభాషాపాండిత్యము అగ్గలముగాఁ గలవాఁడయ్యు రాజకీయోద్యోగముమూలమున ఎసలిక చిక్కక ఈనిఘంటువుమాట యెత్తుకోలేదు. కొన్నాళ్ళ కావల పాప మీ మనవాళ్ళయ్య హైదరాబాదు మూసానదీ ప్రవాహములోమరణించెనట!

ఇంతకుఁ దేఁగువారి దౌర్భాగ్య మీ తీరుగ విఘ్న పరంపరలు గూర్చి ఈ మహానిఘంటువును జూచు మహాభాగ్యమును వ్యనకు అందనీయకపోయెను.

రామానుజసూరి రెండవ బిడ్డయు మనవాళ్ళయ్యకుఁ దమ్ముండు నగు భాష్యకారులయ్యను చిన్నయసూరి జీవిత చరిత్రము తెలుపుఁడని ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు అర్థించిరి. ఆతఁడును నోటిమాట లేని అవసానదశలో చిన్నయసూరి మీఁది గౌరవమును బట్టియు 'పరిషత్తు'వారి మాట తీసివేయ లేకయు—ఎట్లో శ్రమపడి ౧౯—౧౦ జనవరి —౩౩ వ తేదిని సూరి చరిత్రము కొంత వ్రాయించి పంపెను. అదియే — ఈ జీవిత చరిత్రమునకు మూలము. అప్పుడే నీతిచంద్రిక తొలిముద్రణము సైతము పరిషత్కార్యాలయమునకు భాష్యకారులయ్య పంపెను. ఆ ప్రతియు సురక్షితముగా పరిషత్కార్యాలయములోనున్నదని వినికిడి. ఈ సాయము చేసిన కొన్నాళ్ళకే భాష్యకారులయ్య ౭౮ వ యేఁట దివంగతుఁడాయెను.

ఈ తీరుగ దక్షిణాపథములో అత్యంతము పేరు వొందిన ఈ విద్యానంశము ఈ రీతిగ అంతరించినను భాషాప్రపంచములో ఆచంద్ర తారార్కముగ సజీవమై వెలయఁగలదు. జగదేక పండితుఁడు చిన్నయసూరి స్వయము చేతితో వ్రాసినగ్రంథము లింకను ముద్రితములు కాలేదనుట తెలుఁగువారికిఁ దలవంపులు నింపును. ఆతఁడు కూర్చిన ప్రత్యక్షరము ఆణిముత్యమై ఆంధ్ర సరస్వతికి అమూల్యాభరణమై యుండు ననుట పొగడ్త గాదు. అట్టి భాగ్యము దాఁచుకోవలసిన యక్కఱ ఆంధ్రుల కెంతేనిఁ గలదు. విశ్వవిద్యాలయములవంటి మహావిద్యాపీఠము లేమి సేయుచున్నవో – ఆ బ్రహ్మకే యెఱుక. తంజావూరి గ్రంథాలయములోని తెఱఁగు గ్రంథములకుఁ బట్టిన దుర్గతియే చిన్నయ సూరి గ్రంథములకు సైతము పట్టిన దనుట సహింపరాని పరాభవము. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో అప్పుడప్పుడు చిన్నయ సూరి వాఙ్మయము చవి చూచిన్నిగాని ఆ భాగ్యము గ్రంథ రూపముగా వచ్చినందాఁక ఆ కజ్జము తీఱనే తీఱదు. ప్రాచీనాంధ్రభాషకు జీవగఱ్ఱ యైన ఈ వాఙ్మయములో – అవకాశమును బట్టి ఓపిక కూడినంతలోఁ గొంత కొంతయైన అచ్చునకుఁ దేవలెననియు, మా 'భాషాపోషక గ్రంథమండలి'కి ఆ మహాభాగ్యము దక్కుటలో సంపన్నులగు సరసులు సాయపడవలెనని యు నర్థించుచు – 'కాలోహ్యయం నిరవధిర్విపులా చ పృథ్వీ' యని విశ్వసించి – ఇప్పటికి దీనిని విరమించుచున్నాఁడను.

—సత్యనారాయణ చౌదరి

సవరింపు

పుట	పంక్తి	అసాధువు	సాధువు
3	౬	దేవరకే =	దేవరకే
౧౨	౧౧	అక్కడకి	అక్కడికి
౨౬	3	రోకటి	రోకటి
౪౨	౫	మోదుల	మోదులు
౫౧	౧3	వ్యుత్పత్యర్థము	వ్యుత్పత్త్యర్థము
౫౫	౧౪	—	౧3 స; ౫౫ శ్లో. మిత్ర లాభమను - మిత్రలాభార్థీనాః - నిక్పష్ట ఇత్యర్థః. 'హీనే' ఇత్యనోః కర్మ ప్రవచనీయ సంజ్ఞా. తస్యోగే ద్వితీయా.
౫౬	౪	బడియెను	బడియెడును
౫౮	౨౪	త్రావు	తావు
౬౨	౧3	దాటుచు	దాటుచుఁ
౭౨	౧౧	నాడు	నాఁడు
౮3	౧౯	పాయసము, పయోధి	(పాయసము, పయోధి)
,,	౨౪	కా	కారు
౮౭	౨౦	మొఱుగుట్టి	మొఱుగునట్టి
౯౬	౨౧	యాకాము	యాకారము
౧౦౪	౭	లన్నియు	లన్నియుఁ
౧౧౭	౧౪	జక్కగా	జక్కఁగా
౧౧౮	౨	ఈకొండ	యీకొండ
,,	3	ఈఖలుని	యీఖలుని
౧౨౧	౧౦	పిచికివేనా	పిచికివే నా - నాన్ = అనఁగా; పిచికిదానవా యని యనఁగా.

(ఇట వ్యాఖ్య రెండు పంక్తులును దొలఁగింపవలెను)

పుట	పంక్తి	అసాధువు	సాధువు
౧౭౫	౯	దుఱుంగ	దుఱంగ
౧౭౧	౧౭	మద్యథ్యమ	మధ్యమ
౧౭౬	౫	తోడఁ	తోడ
౧౮౨	౧౦	వ్యర్థము	వ్యర్థము
౧౮౮	౭	పెల్లింద	పెల్లిదం
,,	౮	బాపంజాలక	బాఁపంజాలక
,,	౧౯	ఆపం	ఆఁపం
౧౮౯	౧౭	యథార్థము	యథార్థము
౧౯౦	౧౨	దురోభ్ధనము	దురోభ్ధనము
౧౯౨	౨౦	అన్యథా	అన్యథా
౧౬౦	౫	నాథుండు	నాథుండు
౧౬౨	౧౫	దీక్షములు	దీక్ష్ణములు
౧౬౩	౩	గలఁడు	గలండు
౧౭౨	౭	దై	దైవ
౧౯౩	౨౪	వీరిన్	ఏరిన్
౧౯౭	౧౧	—	అజస్తుందంబు (వ్యు)అజస్య తుంద మివ అస్య - సుట్ నిపాతః; అజ = బ్రహ్మ, తుంద=బొజ్జ, బ్రహ్మ బొజ్జవోలె విశాలమైనదనిసంజ్ఞ.
౨౦౪	౨౧	వెంక	లెంక
౨౦౫	౫	'హంకారంబు	హంకారంబు

సంకేతములు

ప్ర — ప్రకృతి

వి — వికృతి

వై — వైకృతము

ప్రే — ప్రేరణార్థకము

వ్య — వ్యతిరేకపదము

రూ — రూపాంతరము

తద్ధి — తద్ధితాంతరూపము

కృ — కృదంతము

నానా — నానార్థములు

బా.వ్యా — బాలవ్యాకరణము

సం — సంస్కృతము

తె — తెలుఁగు

శ్రీ హయగ్రీవాయ నమః

నీతిచంద్రిక

— మంగళము —

ఉ. శ్రీయను మించు మించొలయ♦సేనకచాతకలోకమోద సం
ధాయకుఁడై యుదారకరు♦ణారసవృష్టి దురాపతాపముల్
వాయఁగఁజేయుచుఁ సకల♦వాంఛితసస్యము లుల్లసిల్లఁగాఁ
జేయుచు వేంకటాద్రినివ♦సించుఘనుండిడుఁగాత భద్రముల్.

ఉ. శ్రీ = లక్ష్మీదేవి, అనుమించు మించు—అను=అనెడి, మించు=ప్రకాశించెడి, మించు=మెఱుపు, ఒలయన్ = వ్యాపింపఁగా, మెఱువఁగా ననుట, సేవక...సంధాయకుఁడు-సేవక=కొలుచువారనెడు. అనఁగా భక్తులనెడి, చాతక=వానకోయిలలయొక్క, లోక=సమూహము నకు, మోద=ప్రీతిని, సంధాయకుఁడు = కూర్చువాఁడు, ఐ = అయి. ఉదార...వృష్టిన్-ఉదార=అధికమగు, కరుణారస=కృపారసమను నీటి యొక్క, వృష్టిన్=వానచేత, దురాపతాపముల్-దురాప=పొంద శక్యము కాని - సహింపఁగూడని యనుట, తాపముల్=ఆధ్యాత్మ కాధిభౌతికాధి దైవికములను పేరుగల తాపత్రయమను సెగలను, పాయఁగఁజేయుచున్= పాపుచు - పోఁగొట్టుచు ననుట, సకల...సస్యములు—సకల=సమస్తజనుల యొక్క, వాంఛిత = కోరిక లనెడి, సస్యములు = పైరులను, ఉల్లసిల్లఁగాఁ జేయుచున్=ప్రకాశింపించుచు-పండించుచు ననుట, వేంకటాద్రిన్=పాప నాశకమైన తిరుమలయందు, నివసించు ఘనుండు-నివసించు=నిలుకడగా వాసముచేయునట్టి; ఘనుండు = పురుషోత్తముఁడనెడు మేఘుఁడు భద్ర ములు=శుభములను, ఇడుఁగాతన్=ఇచ్చుఁగాక.

క. కరుణ తెఱంగున హరియెద
నిరవుకొని యఘాళి నరయ ♦ నీక యతనిచే
నిరతము సంశ్రితజనులం
బరిరక్షింపించు తల్లి ♦ భజియింతు మదిక. —౨

శ్రీ వేంకటేశ్వరుఁడు నీలమేఘమువంటి చాయ గలవాఁడనియు లక్ష్మీదేవి మెఱుపుఁదీఁగవంటిమేను గలదనియు లక్ష్మీదేవి వేంకటేశ్వరుని వక్షఃస్థలమునందుండి ప్రకాశించుట వర్షించునపుడు మేఘమధ్యమందుండి మెఱుపు మెఱుచు నట్లున్నదనియు నెఱుంగునది. మించు-అనెడి విశేషణము సామాన్యమైన మెఱుపువలె నట్టె కనఁబడి మఱఁగిపోక యీ మెఱుపు నిలిచి మెఱుచుచున్నదను నర్థమును దెలియఁజేయుచున్నది. మెఱుపుతోఁగూడి వర్షించుటను జెప్పుటచేత నధికవర్షము తోఁచుచున్నది. వర్షాధిక్యమునకు మెఱుపు హేతువైనట్లు కరుణారస వర్షాతిశయమునకు లక్ష్మీదేవి హేతువని తెలియునది. దురాపమను విశేషణముచేత సామాన్య వృష్టి సామాన్యతాపమును బోఁగొట్టుచున్నది - ఈవృష్టియో సంసార రూపమైన దుర్భర సంతాపమును సయితము పోఁగొట్టునని తోఁచుచున్నది. సకల శబ్దప్రయోగము సామాన్యమేఘము కొన్నిచోట్లఁ గురిసి కొందఱి పయిరు పండించునట్లుగాక- ఈ మేఘము కృపారసవృష్టి నెల్లచోట్లఁ గురిసి యెల్లవారి వాంఛిత సస్యములు ఫలింపఁజేయునటెడి యర్థమును జూపుచున్నది. నివసించు క్రియయందుండు 'ని' అను నుపసర్గము 'కలాపేబ్కాటనాయకః' అను వాక్యమును దలఁపించుచున్నది. తాపముల్ +పాయఁగ= తాపముల్ వాయఁగ—గసడదవాదేశ సంధి.

ఱ. క. కరుణ తెఱంగునన్:— ఇరవుకొను = వసించు, అఘాళి= పాపముల వరుస, నిరతము = పట్టుగా ననుట, పరిరక్షింపించు= కాపించు, తల్లి=జనని, ఎద (ప్ర) హృదయము. మది (ప్ర) మతి.

శ్రీ వేంకటేశ్వరుఁడు ప్రజలకెల్లఁ దండ్రి కనుక లక్ష్మీదేవి తల్లియని భావము. లక్ష్మీదేవి శ్రీ వేంకటేశ్వరుని వక్షస్థ్సలమందు వసించి వాని కృపాతిశయమువలె భక్తులయందుఁగల జ్ఞానజనితదోషములఁ బరా

చ. వనజభవాండభాండము ల♦వారిగ నెవ్వని తుందకందరం
బున నొకమేలనింటరముఁ♦బొందకపొందుగఁబొల్చు నమ్మహా
త్మునిని నిజభోగశయ్యనిడి ♦ పొత్తుల కందువునట్లు లాలనం
బొనరుచు న య్యనంతు మహి♦మోన్నతు సన్నుతియింతు
నిచ్చలుక. 3

మర్మింపనీక భర్తచే వారిని బరిపాలింపించుచున్నదని తాత్పర్యము. దేవరకే= ప్రజలయెడఁ జాలఁగృప గలిగియుండఁగా దేవిగారును వారికే సాహాయ్యము చేయుట ప్రజల విషయమై తండ్రికంటెఁ దల్లికిఁ గల ప్రేమాధిక్యమునకు దృష్టాంతముగా నున్నయది.

3 చ. వనజభవాండభాండములు:—వనము=ఉదకము, అందుఁ బుట్టినది వనజము-తామర, అందుఁ బుట్టినవాఁడు-వనజభవుఁడు-బ్రహ్మ, తదీయాండములు వనజభవాండములు = కుండలవంటి బ్రహ్మాండములు. ఆవారిగన్=అపరిమితముగా, ఎవ్వని తుందకందరంబునన్-ఎవ్వని=ఏమహాత్మునియొక్క,తుందకందరంబునన్=గుహవంటి కడుపునందు,ఒకమేలన్=ఒక్క పార్శ్వమున, ఇంటరము=ఇఱుకటము, పొందక=చెందక, పొందుగన్= పొంకముగా, పొల్చున్=ఒప్పునో, అమ్మహాత్మునిన్= మహానుభావుఁడైన యావిష్ణుదేవుని, నిజభోగశయ్యన్-నిజ=తనయొక్క, భోగ=శరీరమనెడు సుఖార్థమైన, శయ్యన్=పఱుపునందు, ఇడి=ఉనిచి, పొత్తుల కందువు నట్లు—పొత్తుల=సన్నని మెత్తని ప్రాఁతవస్త్రములందున్న, కందువునట్లు= పసిబిడ్డను వలె, లాలనం బొనరుచు = బుజ్జగించునట్టి, అయ్యనంతున్ = ఆయాదిశేషుని, మహిమోన్నతున్—మహిమ = గొప్పతనముచేత, ఉన్నతున్ = అధికుఁడైనవాని, నిచ్చలున్ = ఎల్లప్పుడు, సన్నుతియింతున్ = చక్కఁగా స్తుతింతును.

సమస్త ప్రపంచమును దన కడుపులో నొకమూల నిముడ్చుకొని యున్న విశ్వరూపుఁడైన శ్రీమన్నారాయణునిఁ దన యొడియం దిడికొని పసిబిడ్డను వలె లాలించు నాదిశేషుని నుతించుచున్నాననుట. శ్రీమన్నారాయణుఁడు శేషశాయి యగుట ప్రసిద్ధము.

— ఆదికవిస్తుతి —

క. ఘనుఁ నన్నయభట్టును ది
కఁ్రన నేరాఁ్రపెగడఁ బొగడి ♦ యలికంబున యం
జ్ఞుని డాఁచినట్టి సర్వ
జ్ఞుని నాచనసోమనాథు ♦ స్తుతి యొనరింతున్. ౨

— ప్రతిజ్ఞాదికము —

తే. ఒనరఁగాఁ బంచతంత్ర హి ♦ తోపదేశ
ములను బరికించి వానిలో ♦ వలయు నంశ
ములను గొని కొంత యభినవం ♦ బుగను గూర్చి
కృతి యొనర్చెద నీతిచం ♦ ద్రిక యనంగ. ౩

క. తుదముట్టఁగ నీ కబ్బము
పదిలముగాఁ జదివిసట్టి ♦ బాలుర కోలిం

---

౨. క. ఘనునన్నయ:—సర్వజ్ఞునిన్ = సమస్తముఁదెలిసినవాని- ఇది నాచన సోమనాథునికి విశేషణము. ఈ విశేషణముచేత నితఁడు సర్వజ్ఞనామకుఁడైన యీశ్వరునివంటివాఁడని తోఁచుచున్నది. కనుక శివునకు నుమటఁగల కన్నీతని కెక్కుడ ననఁగా దాఁచినట్టు చెప్పఁబడినది. అలికము = నుదురు - లలాటము.

తెలుఁగు సారస్వతమునఁ గవిత్రయముఁవారికి నన్నింట నుద్ది యగువాఁడు నాచన సోమన యనుట ప్రసిద్ధము.

౩. తే. ఒనరఁగాఁ:—అభినవంబుగన్ = కొంగ్రొత్తగ.

౪. క. తుదముట్టఁగన్:— కబ్బము = కావ్యము, వైకృతము పదిలము (ప్ర) భద్రము. కొద=కొదవ.

బొదలును భాషాజ్ఞానము
కుదురుం గొద లేక నీతి ♦ కుశలత్వంబుఁ. ౬

తే. విద్య యెసఁగును వినయంబు ♦ వినయమునను
బడయుఁ బాత్రతఁ బాత్రత ♦ వలన ధనము
ధనము వలనను ధర్మంబు ♦ దాని వలన
నైహికాముష్మిక సుఖంబు ♦ లందు నరుఁడు. ౭

ఆ. జరయు మృతియు లేని ♦ జనుఁ డట్లు ప్రాజ్ఞుండు
ధనము విద్యఁ గూర్పఁ ♦ దలఁపవలయు
ధర్మ మాచరింపఁ ♦ దగు మృత్యుచేఁ దల
వట్టి యీడ్వఁబడిన ♦ వాఁడుఁ బోలె. ౮

ఆ. నీతి లేని వాని ♦ నిందింత్రు లోకులు
లేదు సేగి లాఁతి ♦ లేకయున్నఁ
గాన మానవుండు ♦ పూనిక నయవిద్య
గడన సేయ మొదలఁ ♦ గడఁగనలయు. ౯

---

౭. గీ. విద్యఁ:— పాత్రత=యోగ్యత, ఐహికము = ఇహలోక సుఖము, ఆముష్మికము=పరలోక సుఖము.

౮. ఆ. జరయు:—ప్రాజ్ఞుండు=పండితుఁడు, సమర్థుఁడు.

౯. ఆ. నీతి:—నిందింత్రు=దూఱుదురు, సేగి=కీడు, లాఁతి=ఇతరము, లేకయున్నన్-నీతి లేకున్నను, దానికంటె వేఱుకీడు లేదని భావము. పూనిక=అభినివేశము. పూనుధాతుకృదంతము, నయవిద్య=నీతి. గడన సేయు=సంపాదించు, కడఁగుట=యత్నించుట.

క. నవభాజనమున లగ్నం
బవు సంస్కారంబు వొలియ ♦ దటుగావున మా
ణవులకుఁ గథాచ్ఛలంబునఁ
జవి యుట్టఁగ నీతివచన ♦ సరణిఁ దెలిపెదన్. ౧౦

---

౧౦. క. నవభాజనమునన్:—నవ=క్రొత్తయగు, భాజనమునన్=మట్టిపాత్రమునందు, లగ్నంబు=అంటినది, అవుసంస్కారంబు-అవు=అగునట్టి, సూ. అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు. బాల. వ్యా. ఆ. ౭౭. సంస్కారంబు = చిత్రము, వొలియదు=నశింపదు, అటుగావునన్=అట్లు గనుక, మాణవులకున్ = బాలురకు, కథాచ్ఛలంబునన్-కథా=కతలనెడి, ఛలంబునన్=నెపముచేత, చవి=రుచి, ఉట్టఁగన్=కలుగఁగా, నీతివచన సరణిన్ = నయోక్తిమార్గమును, తెలిపెదన్ = ఎఱింగించెదను.

పచ్చికుండ లోనగు వానిమీఁద వ్రాసిన చిత్రము చెడకుండునట్లు బాలురకు బాల్యమునఁ జెప్పిన విద్య మనసునఁ జక్కఁగాఁ దగిలియుండును గనుక వేడుక కథలు చెప్పు నెపమున బాలురకు నీతులఁ దెలిపెదననుట.

కథాప్రారంభము

గంగాతీరమందు సకలసంపదలు గలిగి * పాటలిపుత్ర మను పట్టణము గలదు. ఆపట్టణము సుదర్శనుఁడను రాజు పాలించుచుండును. అతఁడొకనాఁడు వినోదార్థము విద్వాంసులతో సల్లాపములు జరుపుచుండఁగా నొక బ్రాహ్మణుఁడు.—

క. "పరువంబు కలిమి దొరతన
మరయమి యనునట్టి పీని ♦ యం దొకఁడొకఁడే
పొరయించు ననర్థము నాఁ
బరఁగినచో నాల్గుఁ జెప్ప ♦ వలయునె చెపుమా."

వినోదార్థము=ప్రొద్దుపోకకొఱకు. సల్లాపము=ముచ్చట.

క. పరువంబు:—పరువము=యౌవనము. కలిమి=సంపద. కలుగు ధాతువు కృదంతము, అరయమి=అవివేకము - అరయు ధాతువు. ఒకఁడొకఁడే=ఒకటొకటే, అనర్థమున్=కీడును. పొరయించున్=పొందించును. మనుష్యున కనుపద మధ్యాహార్యము. నాల్గును=పరువము లోనగు నాలుగును, పరఁగినచో=ఉన్నయెడ, చెపుమా—ఇది యొకానొక విద్వాంసుఁడు లోకము నుద్దేశించి చెప్పినమాటగా గ్రహింపవలయును.

---

* పాటలీపుత్ర మని దీర్ఘమధ్యముం గలదు.

క. "పలుసందియములఁ దొలఁచును
వెలయించు నగోచరార్థ విజ్ఞానము లో
కుల కక్షి శాస్త్ర మయ్యది
యలనడ దెవ్వనికి వాఁడె యంధుఁడు జగతిక్."

అని ప్రస్తావవశముగాఁ జదివెను. ఆ పద్యములు రాజు విని చదువు లేక మూర్ఖులయి సదా క్రీడాపరాయణులయి తిరుగుచున్న తన కొడుకులను దలఁచుకొని యిట్లని చింతించె. "తల్లిదండ్రులు చెప్పినట్లు విని చదువుకొని లోకులచేత మంచివాఁడనిపించుకొన్నవాఁడు బిడ్డఁడు గాని తక్కిన

క. పలుసందియములు:—సందియములన్ = సందేహములను, వై. తొలఁచు = తొలఁగించు, కడుగు-క్రియ. అగోచర=దృష్టివిషయములు గాని, అర్థ=పదార్థములయొక్క, విజ్ఞానము=వివేకమును, లోకులకున్ =మనుష్యులకు, వెలయించున్ =ప్రకాశింపఁజేయును, శాస్త్రము = శాసనగ్రంథము. అనఁగా శాస్త్రజ్ఞానము, అక్షి = కన్ను, శాస్త్రము లోకులకు అక్షియని యన్వయము. దీనికి ముందు - కనుక నను పదము నధ్యాహారము చేసికొన వలయును. శాస్త్రము = శాస్త్రమే యని యర్థము. ప్రయోజనము కలచో నవధారణార్థక శబ్దమును సర్వత్ర చేర్చుకొనవచ్చునని శాస్త్రసంప్రదాయము. శాస్త్రమే పూర్వవాక్యములకుఁ గర్తృపదము. అలవడదు = కలుగదు.

ఈ పద్యములు హితోపదేశమునందలి శ్లోకముల ననుసరించి యీ గ్రంథకర్తచేఁ దెనిఁగింపఁబడినవి.

ప్రస్తావము=సందర్భము. మూర్ఖుఁడు=మూఢుఁడు. క్రీడాపరాయణులు=ఆటలాడుటయం దాసక్తి కలవారు. తల్లిదండ్రులు-ద్వంద్వమున గసడదవాదేశము.

వాఁడు బిడ్డఁడా? మూర్ఖుఁడు కలకాలము తల్లిదండ్రులకు దుఃఖము పుట్టించుచున్నాఁడు. అట్టివాఁడు చచ్చెనా తల్లిదండ్రులకు దుఃఖము నాఁటితోనే తీఱుచున్నది. కులమునకు యశము తెచ్చినవాఁడు పుత్త్రుఁడు గాని తల్లికడుపు చెఱుపఁ బుట్టినవాఁడు పుత్త్రుఁడు గాఁడు. గుణవంతులలోఁ బ్రథమ గణ్యుఁడు గాని కొడుకును గన్న తల్లికంటె వేఱు గొడ్రాలు గలదా? గుణవంతుఁ డయిన పుత్త్రుఁ డొకఁడు చాలును. మూర్ఖులు నూఱుగురవలన ఫల మేమి? ఒక రత్నముతో గులకరాలు గంపెఁడయినను సరిగావు. విద్వాంసులయి గుణవంతులయిన పుత్త్రులను జూచి సంతోషించుట యను సంపద మహాపుణ్యులకుఁగాని యెల్లవారికి లభింపదు." అని కొంత చింతించి యుంకించి తల పంకించి "యూరక యీ చింతయేల? నాపుత్రులు చదువ మనిరా? పరామరిక మాలి తగిన విద్యా

బిడ్డఁడు(రూ)బిడ్డ. కలకాలము=తా నుండునంత కాలము. ఎల్లకాల మనుట. చచ్చెనా = మృతిఁబొందెనేని. చేదర్థము. కడుపు చెఱుపఁ బుట్టినవాఁడు-మర్జనుని మోచుటవలనఁ గడుపు అపరిశుద్ధ మగుచున్నదని భావము. ప్రథమగణ్యుఁడు = మొదట నెంచఁదగువాఁడు - అనఁగా ముఖ్యుఁడు. గొడ్డు + ఆలు — రుగాగమము-గొడ్డురాలు (రూ) గొడ్రాలు. రాయి (ఏక) రాలు (బహు) గంప + ఎఁడు=గంపెఁడు — పరిమాణార్థక మగు ఎఁడు ప్రత్యయము. మహాపుణ్యులకుఁగాని=మహాపుణ్యులకు లభించునుగాని అని యర్థము. ఇత్యాదిస్థలములందు కాని శబ్దము యొక్క కూడిక వలనఁ గ్రియ లోపించునని యెఱుఁగవలయును. ఉంకించు = (మనస్సున) యత్నించు. కొడుకులకు విద్యాభ్యాసము చేయించుట కనుట. పంకించు= ఊఁచు, (వై) పరామరిక = విచారణ.

భ్యాసము చేయింపనయితిని. బిడ్డలకు విద్యాభ్యాసము చేయిం పమి తల్లిదండ్రుల దోషము. తల్లిదండ్రులచేత శిక్షితుఁడయి బాలుఁడు విద్వాంసుఁడగునుగాని పుట్టఁగానే విద్వాంసుఁడు కాఁడు. పురుషకారముచేతఁ గార్యములు సిద్ధించును. రిత్తకోరి కల చేత సిద్ధింపవు. నిద్రించు సింహము నోరను మృగములు తమంత నచ్చి చొరవు. కాఁబట్టి యిప్పుడు నా పుత్త్రులకు విద్యాభ్యాసముకయి వలయు ప్రయత్నము చేసెద"నని చింతించి యచ్చటి విద్వాంసులతో నిట్లనియె. "నాపుత్త్రులు విద్యా భ్యాసము లేక క్రీడాసక్తులయి తిరుగుచున్నవారు. ఎన్నరయి నను వీరిని నీతిశాస్త్రము చదివించి మంచిమార్గమునకుఁ ద్రిప్పఁ జాలినవారు కలరా?" యనిన విష్ణుశర్మ యను బ్రాహ్మణుఁ డిట్లనియె. "రాజోత్తమా! యిది యెంతపాటిపని? మహావంశ జాతు లయిన దేవర పుత్త్రులను నీతివేదులను జేయుట దుష్క రము గాదు. కొంగను మాటలాడించుట దుష్కరముగాని చిలుకను బలికించుట దుష్కరము గాదు. సద్వంశమందు గుణ హీనుఁడు పుట్టఁడు. పద్మరాగముల గనిలో గాజు పుట్టునా? ఎట్టి రత్నమయినను సానపెట్టక ప్రకాశింపనట్టు బాలుఁడెట్టివాఁ

దోషము = తప్పు, దోసము (వై). పురుషకారము = పురుషప్రయత్నము. రిత్త=వ్యర్థము (ప్ర) రిక్త. కోరిక=కోరికి-కోరుధాతుకృదంతము. తమంతన్=తమకుఁదామే. ఆసక్తులు=ఆసక్తిగలవారు త్రిప్పన్=తిరుగు ధాతు,ప్రేరణము. ఎంతపాటి=ఏమాత్రపు. మహావంశజాతులు=గొప్పవంశమునందుఁ బుట్టినవారు. దేవర=ప్రభువులవారియొక్క—మీయొక్కయనుట. దుష్కరము = చేయఁగూడనిది (వ్య) సుకరము. పద్మరాగము = కెంపు. గని = రత్నములు పుట్టుచోటు (ప్ర) ఖని. గాజు=గాజుపూస (ప్ర) కాచ.

డయిన గురుజనశిక్ష లేక ప్రకాశింపఁడు. కాఁబట్టి నేనాఱు మాసములలో దేవర పుత్రులను నీతికోవిదులను జేసి మీకు సమర్పించెదను." అనిన రాజు సంతోషించి యిట్లనియె. "పూవులతోఁ గూడిన నారకు వాసన గలిగినట్లు సజ్జనులతోఁ జే సావాసించు మూర్ఖునకు మంచి గుణము గలుగుట సాజము. అంతే కాదు.'సాధుసాంగత్యము సర్వశ్రేయములకు మూలము'. అని సాదరముగా వచియించి యాతనికిఁ బసదన మిచ్చి తన కొడుకులను రప్పించి చూపి "విద్యాగంధము లేక జనుపాంధులనలె నున్నారు. వీరిని గన్నులెట్లపి రక్షించుట మీభార" మని చెప్పి యొప్పగించెను. అనంతర మా బ్రాహ్మణుఁడు వారల నొక రమణీయ సౌధమునకుఁ దొడుకొనిపోయి కూర్చుండఁబెట్టి కొని యిట్లనియె. మీకు వినోదార్థ మొకకథ చెప్పెద. అది మిత్రలాభము, మిత్రభేదము, విగ్రహము, సంధియు ననినాలు గంశములచేత నొప్పుచుండును; వినుండు.

నీతికోవిదులను=నీతియందుఁ బండితులను. సాన (ప్ర) శాణ. సావాసించు= సహవాసముచేయు. సాజము—సహజము (వై) సంగతి-సాంగత్యము= స్నేహము. సంగతులేమని నేఁటి వ్యవహారము. శ్రేయము = మేలు. సాదరముగా = ఆదరముతోఁ గూడినదిగా. పసదనము=బహుమానము. విద్యాగంధము = కొంచెము విద్యయైన నని యర్థము. జనుపాంధుఁడు= పుట్టుగ్రుడ్డి, జనుపా-అంధః - తృతీయాతత్పురుషము. కన్నులెట్లపి = కన్ను లెఱుఁగఁజేసి, జ్ఞానము పుట్టించి యని యర్థము. సౌధము=మేడ, సుధ-మూలపదము. సుధ (నానా) సున్నము, అమృతము. తొడుకొని = తోడు కొని, పెక్కుముద్రణములలో 'తోడుకొని' అని మార్చిరి-అది ప్రమాదము. మిత్రలాభము = స్నేహితుల కల్మి. భేదము = వేఱుపాటు. విగ్రహము = కలహము. సంధి = చేరిక, కూడిక.

మిత్రలాభము

"ధనసాధనసంపత్తి లేనివారయ్యు బుద్ధిమంతులు పరస్పర మైత్రి సంపాదించుకొని కాక కూర్మ మృగ మూషికములవలె స్వకార్యములు సాధించుకొందురు." అనిన రాజపుత్త్రులు వినియే కార్యములు కాక కూర్మ మృగ మూషికములు సాధించెనఁ? మాకు సవిస్తరముగా వినుపింపుఁ" డనిన విష్ణుశర్మ యిట్లని చెప్పఁదొడంగె.

గోదావరీతీరమందు గొప్ప బూరుగువృక్షము గలదు. అందు నానాదిక్కులనుండి వచ్చి పక్షులు రాత్రి నసించుచుండును. ఒకనాఁడు వేకువ లఘుపతనకమను వాయసము మేలుకొని రెండవ యమునివలె సంచరించుచున్న కిరాతునిఁ జూచి "వఱువాత లేచి వీని మొగము చూచితిని. నేఁడేమి కీడు రాఁగలదో తెలియదు. వీఁడు వచ్చినచోట నిలువఁదగదు.

ధనసాధన సంపత్తి = ధనముయొక్కయు సాధనముయొక్కయు సంపద. పరస్పర=ఒకరొకరి యొక్క. మైత్రి=స్నేహము. తద్ధితాంతము. కూర్మము=తాఁబేలు. మృగము=జింక. మూషికము=ఎలుక. సవిస్తరముగాన్ =శబ్దవిస్తారముతోఁ గూడుకొన్నట్టుగా. విరివిగా ననుట. తొడంగెన్ = యత్నించెను. రాత్రి-కాలవాచకముగాన ప్రథమ. సూ. కాలాధ్వములకుం ప్రాయికంబుగాఁ ప్రథమ యగు. బా. వ్యా. కార. అఁ. వేకువ= ఉదయకాలము. లఘుపతనకము=ఎగిరి శీఘ్రముగా వాలునది యని వ్యుత్పత్త్యర్థము. వాయసము = కాకి. వఱువాతన్ =వేకువకాలమున. వఱువాయి శబ్దము. మొగము (ప్ర) ముఖము.

జాగు చేయక యీచోటు విడిచిపోవలె"నని యత్నము చేయు చుండఁగా వాఁడా వృక్షమునకు సమీపమందు నూకలు చల్లి వల పన్ని పోయి చేరువపొదలో దాఁగి పొంచి చూచుచుండెను. అనంతరము చిత్రగ్రీవుఁడను కపోతరాజు నింగిని సంచరించుచు నేలమీఁది నూకలు చూచి తనతోడి కపోతములతో నిటనియె. ఈ నిర్జనవనమందు నూకలు రా నిమిత్తమేమి? మన మీనూకల కాశపడరాదు. తొలియొక తెరువరి కంకణమున కాశపడి పులి చేతఁ దగులుకొని మృతిఁ బొందెను. మీ కాకథ చెప్పెద వినుండి.

ఒక ముసలిపులి స్నానము చేసి దర్భలు చేతఁ బట్టుకొని కొలనిగట్టుననుండి యోయి తెరువరి! యీ పయిఁడికంకణము వచ్చి పుచ్చుకొమ్మని పిలిచి చెప్పెను. ఒక పాంథుఁ డామాట విని యిది నాభాగ్యముచేతనే వచ్చుచున్నది యేల సందేహపడవలె నని చింతించి యేదీ? కంకణము చూపుమని యడిగెను. పులి చేయి చాఁచి యిదిగో హేమకంకణము చూడుమని చూపెను.

పన్ని=పఱచి. చేరువ=సమీపమయిన - చేరుధాతువు, కృ. పొంచు=ఒడ్డు వేయు. కపోతము=పావురాయి. చిత్రగ్రీవుఁడు=నానావర్ణములు గల కంఠము గలవాఁడు-అని పేరు. నింగి=ఆకాశము. తనతోడి కపోతములు-సమాసమందు-ఇత్వము. నిర్జనము=జనసంచారములేనిదని యర్థము. తెరువరి=దారి నడచువాఁడు-తద్ధితాంతము. సూ. అనివర్ణకంబు మతుబర్థంబున జాలాదుల కగు. బా. వ్యా. తద్ధి. ౧౭. కొలని=గుంటయొక్క, కొలనుశబ్దము. పయిఁడి=పసిఁడి-బంగారము. పయిఁడి (రూ) పైఁడి. పాంథుఁడు=దారి నడచువాఁడు. చాఁచి=చాఁగు ధాతువు ప్రేరణము. హేమము=బంగారు.

నీవు క్రూరజంతువవు. కాఁబట్టి యేలాగున నిన్ను నమ్మనచ్చునని పాంథుఁడు పలికెను. ఆ మాట విని పులి యిట్లనియె. ఓరీ పాంథ! విను. మునుపు యౌవనమందు మిక్కిలి దుష్టుఁడనయి యుంటిని. అనేకములను గోవులను మనుష్యులను వధించి మితిలేని పాపము సంపాదించి భార్యాపుత్రులను బోఁగొట్టుకొని యేకాకినయి నిలిచితిని. అనంతర మొక పుణ్యాత్ముఁడు నాయందు దయచేసి యిఁకమీఁదట గోవులను మనుష్యులను వధింపకు. సత్కార్యములు చేయుమని చెప్పెను. అది మొదలుకొని పాపకృత్యములు విడిచి మంచికార్యములు చేయుచున్న వాఁడను. వృద్ధుఁడను. బోసినోరివాఁడను. గోళ్లు పోయినవి. లేవ సత్తువ లేదు .నన్ను నీ వేలనమ్మెదవు? నీవు దరిద్రుఁడవు. కాఁబట్టి యిది నీకు దానము చేయవలెనని కోరితిని. సంశయపడక యీ కొలనిలో స్నానముచేసి నచ్చి పసిఁడికంకణము పుచ్చుకొమ్ము. అనఁగానే వాఁడు పేరాసచేత దాని మాటలకు లోపడి కొలనిలో స్నానము చేయఁబోయి మొలబంటి బురుదలో దిగఁబడెను. అప్పుడు పులి చూచి అయ్యయ్యో! పెనురొంపిలో దిగఁబడితివిగదా! నేనువచ్చి నిన్ను లేవనెత్తెదను. భయపడకు

ఏకాకిని = ఒంటరిని. వధింపకు-మధ్యమ పురుష ముపర్ణకమునకు లోపము. కృత్యము = పని. బోసినోరివాఁడను=బొక్కినోటివాఁడను-పండ్లు లేనివాఁడనుట. గోళ్లు-ప్రౌఢప్రయోగము (రూ)గోరులు,గోళులు. సత్తువ=బలము, (ప్ర) సత్త్వము.సంశయపడక —ముపర్ణమునకు లోపము. పేరాస_పేరు + ఆస=అత్యాశ. మొలబంటి=మొలకొలఁది; (కొలఁది = ప్రమాణము). దఘ్నార్థంబున బంటి కొలఁదులగు. దిగఁబడెను=కూలెను - శబ్దపల్లవము. రొంపి=ఆడుసు.

మని తిన్నతిన్నగా సమాపించి వానిని బట్టుకొనెను. ఈలాగున వాడు తగులుకొని క్రూరజంతువును నమ్మరాదు. నమ్మి యీ గతి తెచ్చుకొంటిని. మించినదానికి వగచి యేమి ప్రయోజనము? ఎవ్వరికైన విధి తప్పించుకోవశము గాదు. అసి చింతించుచు దానిచేత భక్షింపఁబడియె.

కాఁబట్టి సర్వవిధముల విచారింపనిపని చేయరాదు. చక్కఁగా విచారించి చేసినపనికి హాని యెప్పటికి రాదు. అని చెప్పఁగా విని యొక కపోతవృద్ధము నవ్వి యిట్లనియె. ఆ! యివి యేటినూటలు. ఒకయిక్కట్టు వచ్చినపుడు వృద్ధునిమాట వినవలసినది. వినుఁడు. స్థానాస్థానములు వివేకింపక సర్వత్ర యిట్టి విచారము పెట్టుకోరాదు. కొఱమాలిన శంకలు తెచ్చుకొని భోజనము మానుకోవచ్చునా? మానుకొని యేలాగున బ్రదుకవచ్చును? ఈర్ష్యాళువు, జుగుప్సావంతుఁడు, నిస్సంతోషి, క్రోధనుఁడు, నిత్యశంకితుఁడు, పరభాగ్యోపజీవియు ననువా

పగచి=చింతించి. విధి=దైవాజ్ఞ. విచారింపని=ఆరసిచూడని. కపోతవృద్ధము-విశేషణోత్తరపద కర్మధారయము. ఆ!=ఆనంగీకారార్థకము. ఇక్కట్టు=ఆపద. స్థానము=తగినచోటు. అస్థానము=తగనిచోటు. వివేకింపక=తెలియక. కొఱమాలిన=ప్రయోజనము లేని(మాలు=నశించు) శంక=సందేహము. ఈర్ష్యాళువు=పరులమేలు చూచి యోర్వలేనివాఁడు. జుగుప్సావంతుఁడు=రోఁతగలవాఁడు. నిస్సంతోషి=సంతోషము లేనివాఁడు. క్రోధనుఁడు=కోపముగలవాఁడు. నిత్యశంకితుఁడు=సదా సందేహించువాఁడు. పరభాగ్యోపజీవి=అన్యుల సంపదనే యనుసరించి బ్రదుకువాఁడు-ఒకయింటఁ గడుపుఁగూటికిఁ గాచుకొనియుండు వాఁడనుట. భాగ్య+ఉపజీవి-భాగ్యోపజీవి-గుణసంధి.

రాఁబుగురు దుఃఖభాగులని నీతికోవిదులు చెప్పుదురు. అనఁగా పని కపోతము లన్ని నేల వాలెను.

గొప్పశాస్త్రములు చదివి మిక్కిలి వినికి గలిగి పరుల సంశయములను వారింప నేర్పు గలవారు సహితము లోభము వల్ల వివేకము పోఁగొట్టుకొని క్లేశపడియెదరు. ఆహా! లోభ మెంత చెడుగుణము! అన్ని యిడుములకు లోభము కారణము.

అనంతరము పావురములన్ని వలలోఁ దగులుకొని కపోత వృద్ధిమును జూచి నీవు వృద్ధుఁడవు, తెలిసినవాఁడవని భ్రాంతిపడి నీమాటలను విని యీవిపత్తు తెచ్చుకొంటిమి. ఎవ్వఁడు బుద్ధిమం తుఁడో వాఁడు వృద్ధుఁడుగాని యేండ్లు మీఱినవాఁడా వృద్ధుఁడు? అని కపోతములు నిందింపఁగా విని చిత్రగ్రీవుఁ డిట్లనియె. ఇది యీతనిదోషము గాదు. ఆపదలు రాఁగలప్పుడు మంచిసహాతము చెడుగగుచున్నది. మనకాలము మంచిదికాదు. ఊరక యేల యీతని నిందించెదరు? ఈతఁడు తనకుఁ దోఁచినది చెప్పినాఁడు. అప్పుడు మనబుద్ధి యేమయ్యె? ఆపద నచ్చినప్పుడు తప్పించుకొను సాధనము విచారింపనలెఁగాని యీమాటలనల్ల

దుఃఖభాగులు=దుఃఖమును బొందువారు. వాలు(రూ)వ్రాలు. వినికి=వినుట. దీనికిఁ గర్మము శాస్త్రము. వారింపన్=తొలఁగింప. సహితము=కూడ. లోభము = అత్యాశ. వల్ల (రూ) వలన-చలిమలవల్ల-అని పెద్దన. క్లేశపడియెదరు=దుఃఖపడుచున్నారు. ఇడుము=ఆపద. గొప్పశాస్త్రములు ... కారణము—ఇది గ్రంథకర్తయొక్కవాక్యము. భ్రాంతిపడి=భ్రమించి, తప్పుగాఁ దలఁచి.

ఫలమేమి? విపత్కాలమందు విస్మయము కాపురుష లక్షణము. కాబట్టి యిప్పుడు ధైర్యము తెచ్చుకొని ప్రతికారము చింతింపుడు. ఇప్పటికి నా కొకటి తోచుచున్నది. మీరందఱు పరాకు లేక వినుండు. ఒక్కసారిగా మన మందఱము వల యెత్తుకొని యెగిరి పోవుదము. మన మల్పులము; మన కీ కార్యము సాధ్యమవునా యని విచారింపఁ బనిలేదు. సంక్షోభవించి యెంతటి కార్యమయిన సాధింపవచ్చును. గడ్డిపరకలు సహితము వెంటిగా నేర్పడి మదపుటేనుఁగును బంధించుచున్నవి. మీరు విచారింపుడు. దీనికంటె మంచిసాధనము మీబుద్ధికిఁ దగిలెనా యది చేయుడము. అనిన విని మీరుచెప్పినదే సరి; యింతకంటె మంచిసాధనము లేదని చెప్పి పావురము లన్ని విచిత్రముగా గగనమార్గమున కెగిరెను. అప్పు డావ్యాధుఁడు వెఱఁగుపడి యీపక్షులు గుంపుగూడి వల యెత్తుకొని పోవుచున్నవి. నేల వాలఁగానే పోయి పట్టుకొని యెదఁగాక యని చింతించి మెుగము మీఁదికెత్తుకొని తెప్పవ్రేయక చూచుచు నని పోవుదిక్కున కయి క్రిందనే పోవుచుండెను. ఈ వింత చూడవలె నని లఘు

విస్మయము = ఆశ్చర్యము-ప్రతిక్రియలేక యూరకుండుట ఆని యర్థము. కాపురుషుఁడు = కుత్సితపురుషుఁడు- అల్పుడు. ధైర్యము-ఇది తద్ధితాంతము. ప్రతికారము=మాఱుచేయుట - ఆనఁగాఁ గలిగినయపాయమును బోఁగొట్టుకొను నుపాయము (రూ) ప్రతీకారము. పరాకు = ఏమఱుపాటు. సంక్షోభవించి = గుంపుగూడి. పరక=పోఁచ. వెంటి=కసపు మొదలైనవాని పిరి, వెంట్లు- బహు. మదము + ఏనుఁగు = మదపుటేనుఁగు—పువర్ణము; టుగాగమము. గగన మార్గమునకుఁ = ఆకాశపుత్రోవకు-మీఁదికి ననుట. వ్యాధుఁడు=బోయవాఁడు. వెఱఁగుపడి = ఆశ్చర్యపడి.

పతనకము పావురములను నెంబడించి పోవుచుండెను. అనంతర మా పక్షులు చూపుమేర దూరము మీఁతిపోఁగానే వ్యాధుఁడు నిరాశ చేసికొని మరలిపోయెను. అది చూచి యిప్పుడు మనము చేయవలసినది యేమియని పక్షు లడిగెను. చిత్రగ్రీవుఁ డిట్లనియె. లోకమందు మాతాపితలు మిత్రుఁడను పేరు మువ్వురే హితులు. తక్కినవా రందఱు ప్రయోజనముఁ బట్టి హితు లగుచున్నారు. కాఁబట్టి యిప్పుడు నాకు మిత్రుఁడొకఁడున్నాఁడు. అతఁడు హిరణ్యకుఁడను మూషికరాజు. గండకీ తీరమందు విచిత్రవన మాతని వాసస్థానము. అతఁడు పండ్లు బలిమిచేత వలత్రాళ్లు తెగఁగొఱికి మన యాపదఁ బాపఁగలఁడు. అక్కడకి మనము పోవుదము. అని చెప్పఁగానే పావురము లన్ని చిత్రగ్రీవుఁడు చెప్పిన గుఱుతు పట్టుకొనిపోయి హిరణ్యకుని కలుఁగుదాపున వాలెను. అప్పుడు హిరణ్యకుఁడు కపోతములు వాలిన సద్దు విని భయపడి కలుఁగులో మెదలకుండెను. అనంతరము చిత్రగ్రీవుఁడు కలుఁగుదాపు చేరి యెలుఁగెత్తి యిట్లు

మాతాపితలు=తల్లిదండ్రులు - ఇది ద్వంద్వసమాసము (రూ) మాత్రపితలు. హితులు=హితముచేయువారు (హితము=అప్పటి కప్రియముగా నుండినను మీఁదటికి మేలు గలుగఁజేయునది. మిత్రుఁడు - (తద్ధి) మైత్రి. మువ్వురు (రూ) మూవురు, మూగురు, ముగ్గురు. హిరణ్యకుఁడు = బంగారువర్ణమైన తల గలవాఁడని వ్యుత్పత్త్యర్థము. గండకి=గంగయొక్క ఒకానొక యుప నది. విచిత్రవనము-ఒకానొకయడవి పేరు. పాపఁగలఁడు-పాయుధాతువు ప్రేరణము. కలుఁగు = కన్నము, (కలుగు-ప్రభవించు-లభించు) దాపు = సమీపము, దాయుధాతువు. కృ. సద్దు (ప్ర) శబ్దము. మెదలు=కొంచెము చలించు. ఎలుఁగెత్తి = గొప్ప యెలుఁగుతో ననుట. ఎలుఁగు (నా) కంఠధ్వని, భట్టూకము.

నియె. ఓ చెలికాఁడా! యేల మాతో మాటలాడవు? అనఁగానే హిరణ్యకుఁ డామాట సవ్వడిపట్టి శీఘ్రముగా లాఁగ వెలుపలికి వచ్చి యిట్లనియె.

ఆ[illegible]! యేమి నాభాగ్యము. నా ప్రియమిత్రుఁడు చిత్రగ్రీవుఁడు నాకు నేత్రోత్సవము చేయుచున్నాఁడు. అని పలుకుచు వలలోఁదగులుకొన్న పావురములనుజూచి వెఱఁగుపడి ఓ మిత్రమా! యిది యేమని యడిగెను. చిత్రగ్రీవుఁ డిట్లనియె. చెలికాఁడా! యిది మా పూర్వజన్మ కర్మమునకు ఫలము. చేసిన కర్మ మనుభవింపక తీఱునా? అనఁగానే హిరణ్యకుఁడు చిత్రగ్రీవుని బంధము ఛేదించుటకయి సమీపింపఁగాఁ జిత్రగ్రీవుఁ డిట్లనియె. చెలికాఁడా! చేయవలసినది యీలాగునఁ గాదు. ముందుగా నా యాశ్రితుల బంధము వదలింపుము. తరువాత నాకుఁ గానిమ్ము. అనిన హిరణ్యకుఁడు విని యిట్లనియె. నా దంతములు మిక్కిలి కోమలములు. అన్నిటి బంధములు కఱచి త్రెంపఁజాలను. పండ్లబలిమి కలిగినంత దాఁక నీ బంధము ఛేదించెదను. తరువాత శక్తి గలిగిన పక్షమునకు మిగిలినవారి కార్యము చూచుకొందము. అనిన

సవ్వడి = జాడ. లాఁగ = కన్ను. నేత్రోత్సవము = కన్నులపండువు నేత్ర + ఉత్సవము-గుణసంధి. ఛేదించుటకున్ = త్రుంచుటకు-కొఱకుట కనుట. లాగు = విధము (లాఁగు=దాటు) ఆశ్రితులు = ఆశ్రయించినవారు-కనిపెట్టుకొన్నవారు. నాకుఁ గానిమ్ము - ఇచ్చట బంధము వదలించుట కర్మము. కోమలము = మెత్తనిది. త్రెంచు = త్రెగు ధాతువు ప్రేరణము.

విని చిత్రగ్రీవుఁ డిట్లనియె. అలాగుననే కానిమ్ము. శక్తికి మీఱి యేమి చేయవచ్చును? ముందు యథాశక్తి వీరి నిర్బంధము మానుపుము. ఆవల నాపని యప్పటికయినయట్లు విచారించుకొందము. అనిన హిరణ్యకుఁ డిట్లనియె. తన్ను మాని పరుల రక్షింపవలె ననుట నీతిగాదు. "తన్ను మాలిన ధర్మము మొదలు చెడ్డ బేరము గలదా" యను లోకోక్తి విన్నావుగావా? తాను బ్రదికిగదా సమస్తపురుషార్థములు సంపాదించుకోవలె? తాను బోయిన తర్వాత దేనితో నయినఁ బనియేమి? అన విని చిత్రగ్రీవుఁ డిట్లనియె. చెలికాఁడా! నీవు చెప్పినది నీతి కాదనను. అయినను నావారి దుఃఖము చూచి సహింపఁజాలను. కాఁబట్టి యింత నొక్కి చెప్పితిని. ప్రాజ్ఞుండు ధనజీవితములయిన మానుకొని మంచివారికి వచ్చిన కీడు తొలఁగింపవలెనని నీతికోవిదులు చెప్పుదురు. అది యట్లుండనిమ్ము. నావంటివారు వీరు; వీరివంటివాఁడను నేను. ఇప్పటి కొదవని నా ప్రభుత్వము వలన వీరికి రాఁగల ఫలమేమి? చెలికాఁడా! హేయమై వినశ్వరమైన యీ కళేబరమం దాస్థ మాని నాకు యశము సంపా

యథాశక్తి=శక్తికొలఁది. నిర్బంధము = కట్టును. మానుపుము-మానుధాతువు ప్రేరణము. బేరము - ఇది వైకృతము. లోకోక్తి=సామెత; లోక + ఉక్తి. పురుషార్థములు=పురుషుని ప్రయోజనములు - ధర్మార్థకామమోక్షములు. పోయిన తర్వాతన్ = చనిపోయిన పిమ్మట, ప్రాజ్ఞుండు=చక్కఁగా దెలియువాఁడు; ఇది కృదంతము (వ్య) అజ్ఞుఁడు. జీవితము=బ్రదుకు. ధన జీవితములు-ద్వంద్వము. ఒదవని=అనుకూలింపని. హేయము=విడువఁదగినది (కృ) వినశ్వరము=బొత్తిగా నశించునది (కృ) కళేబరము=దేహము. (ఈ కళేబరమనఁగా శరీరమనుట) ఆస్థ=ప్రయత్నము, ఆస్థానము (అభిమానమనుట)

దింపుము. నా నలన జీతమూ బత్తెమూ యేదియు లేదు. అయి నను పేరు సర్వకాలము నన్ను విడువక కొల్చుచున్నారు. నేను పేరి ఋణ మెప్పుడు తీర్చుకోగలనో యెఱుగను. నా బ్రదుకు ముఖ్యముగా జూడకు. వీరి ప్రాణములు రక్షించితే జాలును. అనిత్యమై మలినమైన కాయముచేత నిత్యమై నిర్మలమైన యశము లభించెనా దానికంటె లాభము గలదా? శరీరమునకు గుణములకు మిక్కిలి యంతరము. శరీరము క్షణభంగురము. గుణములు కల్పాంతస్థాయులు. ఇట్టి శరీరము నపేక్షించి కీర్తి పోగొట్టు కొనవచ్చునా? అన విని హిరణ్యకుడు సంతోషపడి పులకితుడై యిట్లనియె. చెలికాడా! మేలు మేలు. నీ యాశ్రిత వాత్సల్యము కొనియాడ నే నేపాటి వాడను? ఈ గుణముచే త్రిలోకాధిపత్యమునకు దగియున్నాడవు. అని పలికి యన్నింటి

జీతము=నెలసంబళము (ప) వేతనము. బత్తెము=దినదిన మిచ్చు సంబళము (ప) భృతి. ఋణము=అప్పు-ఇట్టిచోటులయందు అప్పనగా దనవల్ల నేమి ప్రయోజనము లేక యొకరివలన బొందినమేలు-ప్రత్యుపకారము చేసి నచో నా ఋణము తీఱును. రక్షించితేన్=రక్షించితివేని. చాలును-దీనికి గర్భపదము రక్షించుట-అది యధ్యాహార్యము. అనిత్యము=నిత్యము కానిది (నిత్యము=శాశ్వతము) మలినము=ముటికిగలది. కాయము=శరీరము. నిర్మలము=ముటికిలేనిది-పరిశుద్ధమైనది. అంతరము=తారతమ్యము. క్షణభంగురము = క్షణకాలమునందు భంగము నొందునది-క్షణములోపల భంగము నొందునది యనుట. కల్పాంతస్థాయి = ప్రళయకాలము దాక నుండునది. పులకితుడు = రోమాంచము కలవాడు. మేలు మేలు=ఇది మెచ్చుకొనుట యందు వచ్చినది. ఆశ్రితవాత్సల్యము = ఆశ్రయించిన వాని యందలి యాదరణము. ఏపాటివాడను = ఎంతటివాడను. త్రిలోకాధిపత్యము = ముల్లోకముల దొరతనము.

బంధములు తెగఁగొట్టికి వాని నన్నిటిని సాదరముగా సంపూజించి "చిత్రగ్రీవా చెలికాఁడా! యెంతవారికిఁ గాని పూర్వకర్మ మనుభవింపక తీఱదు. వలఁ దగులుకోలునకు నొచ్చుకోకు. సమస్తము తెలిసినవాఁడవు. నీకు నా బోఁటులు చెప్పెడి పాటివారు గారు" అని యూఱడించి బలఁగంబుతోఁ జిత్రగ్రీవున కాతిథ్యము చేసి కాఁగిలించుకొని వీడుకొలిపెను. అనంతరము చిత్రగ్రీవుఁడు తన పరిజనములతో హిరణ్యకుని గుణములు కొనియాడుచు నిజేచ్ఛం జనియె. మిత్రలాభము కంటె మించిన లాభము లోకమం దేదియుఁ గానము. కాఁబట్టి బుద్ధిమంతుఁడు పెక్కండ్రు మిత్రులను సంపాదించుకోవలెను. ఒక్క మూషికముతోడి మైత్రి కపోతముల కెంత కార్యము చేసినది చూడుఁడు. అని చెప్పి మఱియు విష్ణుశర్మ యిట్లనియె. అనంతరము హిరణ్యకుఁడు తన లాఁగ చొచ్చెను. పిమ్మట లఘుపతనకము జరిగిన సర్వకార్యమునకు వింతపడి హిరణ్యకుని లాఁగదాపున వాలి యిట్లనియె. ఓహో హిరణ్యకా! కొని యాడఁదగిన వాఁడవు గదా! నేను నీతో సఖ్యము గోరి వచ్చి

బంధములు = కట్టుత్రాళ్ళను. సాదరముగాన్ = ఆదరముతోఁ గూడుకొన్నట్లు. పూర్వకర్మము = పూర్వజన్మమందలి పుణ్యపాపరూప కర్మము. నొచ్చుకోకు=నొచ్చుకొనకుము. నాబోఁటులు=నావంటివారు. ఊఱడించి= ఊరార్చి. బలఁగముతోన్ = పరిజనముతో. చిత్రగ్రీవునకును చిత్రగ్రీవుని బలఁగమునకును ఆతిథ్యము చేసి యని యర్థము. అతిథ్యము = అతిథి కిచ్చు పూజ. ఇది తద్ధితాంతము (అతిథి=యాత్రాశీలుఁడగుచు అశనార్థియై యింటికి వచ్చినవాఁడు) వీడుకొలిపెను=పోయిరమ్మని పంపెను. పరిజనము = తన చుట్టునున్న జనము. నిజేచ్ఛ=తన యిచ్చచొప్పున. నిజ + ఇచ్ఛ. గుణ. వింతపడి=ఆశ్చర్యపడి. సఖ్యము=స్నేహము. తద్ధితాంతము.

తిని. అనుగ్రహింపుము. నా కోరిక సఫలము చేయుము. అనిన విని హిరణ్యకుఁడు లాఁగ లోపలనుండి యిట్లనియె. ఎవ్వఁడవు నీవు? అన విని కాకి యిట్లనియె. నేను వాయసమను. నా పేరు లఘుపతనకము. అనఁగానే హిరణ్యకుఁడు నవ్వి సరి సరి; నీతోనా మైత్రి చేయనలె. ఏది యెవ్వరితోఁ దగునో వారితో బుద్ధిమంతుఁ డది చేయవలె. తగని కార్యము చేయరాదు. నేను భోజ్యమను నీవు భోక్తవు. మనకు మైత్రి యేలాగున సరిపడును? నీతో మైత్రి నాకు విపత్తునకే కారణము. పూర్వ మొక మృగము జంబుకమును నమ్మి దాని కపటవచనములకు లోపడి పాశములోఁ దగులుకొని వాయసముచేత రక్షింపఁబడియె. అనిన విని సవిస్తరముగా నా కది చెప్పుమని లఘుపతనక మడిగెను. హిరణ్యకుం డిట్లనియె.

మగధదేశమందు మందారవతి యను వనము గలదు. అందు బహుదినములనుండి మృగకాకములు రెండు మిక్కిలి సఖ్యముతో వాసము చేయుచుండును. ఆ మృగము లెస్సగా బలిసి వనములో విచ్చలవిడి సంచరించుచుండఁగా నొక నక్క చూచి యిట్లు చింతించె. ఆహా! యీ జింక యెంత

సఫలము =ఫలముతోఁగూడినది. లఘుపతనకము=ఎగిరి శీఘ్రముగావాలు నదియని వ్యుత్పత్త్యర్థము. సరిసరి=బొత్తిగా సరికాదనుట - ఇక్కడ వ్యతిరేక లక్షణము. వలె (లా) వలయు. భోజ్యమను = భుజింపఁదగినవాఁడను. భోక్తవు=భుజించువాఁడవు. మృగము(నానా)జింక, చతుష్పాదజంతువు. జంబుకము=నక్క. పాశము=వలతాడు. మందారవతి = మందారములు గలది అని వ్యుత్పత్త్యర్థము. (మందారము=కల్పవృక్షము) వాసము=ఉనికి, విచ్చలవిడి=యథేచ్ఛము.

పోతరించి యున్నది. ఏలాగున దీని మాంసము నాకు లభించును? మంచిది. దీనికి నమ్మకము పుట్టించెదనని యాలోచించి తిన్నగా సమీపము చేరి యిట్లనియె. మిత్రుడా! కుశలమా? అనగానే విని యెవ్వడవు నీవని మృగ మడిగెను. నేను నక్కను. నాపేరు సుబుద్ధి. నా బంధువు లందఱు ననొంటిజేసి పోయిరి. ఈయడవి లో మృతకల్పుడనయి యున్నవాడను. మఱి యెవ్వరితోడ గాదు. దైవముతోడ జెప్పుచున్నాను వినుము. నిన్నుజూడగానే నాబంధువు లందఱు వచ్చినట్లు తోచినది. సజ్జనదర్శనము సమస్త దోషములు పోగొట్టును; సర్వశుభము లిచ్చునని పెద్దలు చెప్పుదురు. దాని కిదే తార్కాణము. నేను నీతోడ సావాసము చేయవలెనని మిక్కిలి కోరుచున్నాడను. నా కోరిక నెఱవేర్పుము. అన విని మంచి దాలాగుననే కానిమ్మని మృగము నక్కను వెంటబెట్టుకొని పోయి సాయంకాలము తన వాసస్థానము చేరెను. అక్కడ మందారవృక్షముమీది కాకి తన మిత్రమయిన మృగమును జూచి యెన్నడీతడు దసి యడిగెను. ఈతడు సుబుద్ధి యను జంబుకోత్తముడు. నా చెలిమి గోరి వచ్చినవాడని జింక చెప్పెను. ఆ మాటలు వాయసము విని యిట్లనియె. క్రొత్తగా వచ్చినవానిని నమ్మ

పోతరించి=క్రొవ్వి. లభించును=దొరకును. మంచిది - ఇట్టిచోట్ల నిది కార్యము సరిపఱచుకొను యత్నమును దెలుపున. నమ్మకము=నమ్మిక. సుబుద్ధి=మంచిబుద్ధి కలది యని వ్యుత్పత్తి. మృతకల్పుండను=కొంచెము తక్కువగా జచ్చినవానితో సముడను. దైవముతోన్ = దైవసమానుడవగు నీతోనని యర్థము. తార్కాణము=దృష్టాంతము (రూ) తార్కాణ. సావాసము=స్నేహము (వై.). చెలిమి=ఇది తద్ధితాంతము.

వచ్చునా? ఇప్పుడు నీవు చేసిన పని వంచిది కాదు. కులశీలములు తెలియక యెవ్వరికిఁగాని తా విచ్చుట తగదు. పూర్వము మార్జారమునకు జరద్గవ మను గృధ్రము తా విచ్చి మృతిఁబొందెను. అది సవిస్తరముగా వినుఁడు.

భాగీరథీతీరమందు గొప్ప జువ్వినృక్షము గలదు. దాని తొఱ్ఱిలో జరద్గవ మను చీకు ముసలిగద్ద వాసము చేయుచుండెను. ఆ వృక్షముమీఁద వసించు పక్షులు దానికి జీవనముకయి తాము తెచ్చుకొన్న యెరలోఁ గొంచెము కొంచెము పంచియిచ్చుచుండును. అది దానిచేత జీవనము చేయుచుండెను. ఒకనాఁడు దీర్ఘకర్ణ మను పిల్లి పక్షిపిల్లలను భక్షించుటకై యా వృక్షానికడకు సద్దు చేయక వచ్చెను. దానిరాక చూచి పక్షిపిల్లలు భయపడి కూయసాగెను. ఆ కోలాహలమును జరద్గవము విని యెవ్వరో పరులు వచ్చుచున్నారని యెంచుకొని యెవరక్కడనని హెచ్చరించెను. అప్పుడు బిడాలము గద్దను జూచి భయపడి హా! చచ్చితిఁ గదా! కడుదాపునకు వచ్చితిని. సురిఁగిపో నయితిగాదు;

కులశీలములు=వంశమును స్వభావమును. మార్జారము (రూ) మార్జాలము=పిల్లి. జరద్గవము = జీర్ణమగుచున్న కన్నులు గలది (అనఁగా కన్నులు తెలియనిదని వ్యుత్పత్త్యర్థము) భాగీరథి = గంగ (భగీరథునిచే భూమికిఁదేఁబడినది గనుక దీని కీ పేరు గలిగెను) తొఱ్ఱి = వ్రాని తొఱ్ఱి. చీకు = గ్రుడ్డి. గద్ద (వ్ర) గృధ్రము. ఎర=ఆహారము. దీర్ఘకర్ణము=నిడుపు చెవులు గలదని వ్యుత్పత్త్యర్థము. కోలాహలము=కలకలధ్వని. హెచ్చరించెను=హెచ్చరిక చేసెను. బిడాలము=పిల్లి. హా=అయ్యో-ప్రతిపదోక్తో వ్యయము. సురుఁగు=వెనుకకుఁబాఱు, అదృశ్యమగు, చలించు. అయితి=అనుకూలము.

తప్పించుకొనుట కుపాయాంతరము లేదు; కార్యము మించినది; ఇప్పుడు వెనుకదీయరాదు; కానున్నది కాకమా నదు; తోటిలోఁ దల దూర్చి రోకటి పోటునకు వెఱవఁ దీఱునా ? మంచిది, యిప్పుడు మంచితనము చూపి దీనికి నమ్మిగ పుట్టఁజేసెదనని యాలోచించి యెట్టయెదుర నిలిచి యిట్లనియె. అయ్యా! నమస్కారము. అనఁగానే గృధ్రము విని యెవ్వఁడవు నీవని యడిగెను. నేను బిడాలమను, నన్ను దీర్ఘకర్ణమని చెప్పుదురు. అనవిని గృధ్ర మిట్లనియె. శీఘ్రము దూరముగాఁ బో; పోకుంటివా నీ ప్రాణములు నీవిగావు. చూడు నాదెబ్బ. అనఁగా బిడాల మిట్లనియె. ముందు నామాట వినుండు. నేను వధ్యుఁడనో కానో విచారింపుడు. తర్వాత మీకుఁ దోఁచినట్లు చేయుఁడు. గుణదోషములు విచారించి వీఁడు పూజ్యుఁడు వీఁడు వధ్యుఁడని నిర్ణయింపవలెఁ గాని జాతిమాత్రముచేత నిర్ణయింపఁ గూడునా? నావుడు నీవు వచ్చినపని యేమని గృధ్ర మడిగెను. పిల్లి యిట్లనియె. ఇక్కడ గంగలో నిత్యము స్నానము చేయుచు మాంసాశనము విడిచి బ్రహ్మచారినై

ఉపాయాంతరము = మఱియొక ఉపాయము, అన్యము - ఉపాయము, ఉపాయాంతర మని విగ్రహవాక్యము. కానున్నది = కాఁగలది. పోటు=పొడుపు-పొడుచుధాతువు. క్రి. నమ్మిగ=నమ్మకము. ఎట్టయెదురు=ఎదురు + ఎదురు=సరియెదురు—కడాదుల ద్విరుక్తటకారము. బా.వ్యా. సంధి రం. చూడునాదెబ్బ-జాతీయము. వధ్యుఁడు=చంపఁదగినవాఁడు- క్రి. గుణదోషములు=ఒప్పుదప్పులు. జాతిమాత్రముచేతన్ = జాతిచేతనే. మాంసాశనము = మాంసమును దినుట. బ్రహ్మచారి = వివాహము లేక వ్రతములు నడపువాఁడు.

చాంద్రాయణవ్రతము చేయుచున్నాఁడను. మిమ్ము ధర్మజ్ఞులని మంచివారని యిచ్చటి పశు లప్పుడప్పుడు ప్రశంసింపఁగా విని బహుదినములనుండి నాకు మీదర్శనము చేయవలెనని కోరిక కలదు. అది యిన్నాళ్లకు ఫలించినది. మీరు విద్యావయోవృద్ధులు. కాఁబట్టి మీవలన ధర్మములు వినవలెనని సయితము మనసు గలదు. ధర్మజ్ఞులయిన మీరే యిల్లు త్రొక్కి కొనివచ్చిన వానిని వధింపను యత్నము చేసితిని. గృహస్థ ధర్మమా యది! శత్రువునకయినను గృహమునకు వచ్చిన వాని కాతిథ్యము చేయవలసినది. ధనము లేని పక్షమునకు మంచిమాటలతోనైన సత్కరింపవలెను. ఊస్సురని యింటికి వచ్చిన యతిథి పోరాదు. అది మిక్కిలి పాపమునకు మూలము. అనఁగా విని గద్ద యిట్లనియె. పిల్లులకు మాంసమందు రుచి మిక్కుటము. ఇక్కడ నా పక్షిపిల్లలున్నవి. అందుచేత నేనట్లు చెప్పితిని. అనఁగానే

చాంద్రాయణవ్రతము=భుజింపఁదగిన ముప్పది రెండుకబళములలోఁ జంద్రుని యొక్క క్షయవృద్ధుల ననుసరించి కృష్ణపక్షమందు నొక్కొక్క కడిగాఁ గ్రమమునఁ దగ్గించుచు శుక్లపక్షమునందు నొక్కొక్క కడిగా నెక్కించుచు భుజించి యాచరించెడి యొకానొక వ్రతము. ధర్మజ్ఞులు= ధర్మమును దెలిసినవారు-ఇది ఉపపదసమాసము. ప్రశంసింపఁగాన్=కొని యాడఁగా. ఇన్ని + నాళ్ళు=ఇన్నాళ్లు,ఇన్ని నాళ్ళు. విద్యావయోవృద్ధులు= విద్యచేతను, వయస్సుచేతను పెద్దలు (మీరలు పెద్దలు వంటిది) బాల.వ్యా. కార. 33. సూ. ఇల్లు త్రొక్కుకొని వచ్చినవానిన్ = ఇంటికి వచ్చినవాని ననుట-ఇది జాతీయము. గృహస్థుఁడు=ఇల్లు పట్టియుండువాఁడు. సత్కరించు=సమ్మానించు. ఊస్సురని=ఇంటికి వచ్చిన యతిథి యుస్సురని పోరాదని యన్వయము. ఊస్సురు=ఇది శ్రమవేళయందుఁ గలుగు ననుకరణధ్వని. మిక్కుటము = అధికము. ఇక్కడనా=ఇచోట్ననన్నమో.

పిల్లి రెండు చెవులు మూసికొని కృష్ణ! కృష్ణ! యని యిట్లనియె. ఎంత పాపముచేసి యీపిల్లి జన్మ మెత్తెనో యిది చాలక యీపాపము సహితము కట్టుకోవలెనా? ఎంతమాట వినవలసి వచ్చెను. ధర్మశాస్త్రములు విని నిష్కాముఁడనై యిప్పుడు చాంద్రాయణవ్రతము చేయుచున్నాఁడను. నే నిట్టిపాపము చేయుదునా? పరస్పరవిరుద్ధము లయిన ధర్మశాస్త్రములు సహిత "అహింసా పరమో ధర్మ" యనుచో నైకమత్యము గలిగియున్నవి. ఏ హింసగాని చేయక సర్వభూతములయందు దయాళువులయి వర్తించువారికి స్వర్గము కరస్థము. భూతదయ గలవాఁడె సర్వధర్మములు చేసినవాఁడు. అది లేనివాఁడు చేసియుఁ జేయనివాఁడె. కడపటఁ దాను జేసిన ధర్మము తనకు సహాయమయి వచ్చును గాని తక్కినది యేదియు లోకములోనిది తోడ రాఁబోదు. తెలియక చెడినకాలము పోనిమ్ము. తెలిసి యింకఁ జెడుదునా? అడవిలో స్వచ్ఛందముగా మొలచిన యేశాకముతోనయిన క్షుధఁదీర్చుకొని ప్రొద్దుఁబుచ్చి

కృష్ణకృష్ణ=ఇది పాపపరిహార్థము చెప్పఁబడునది. కట్టుకోవలెనా=సంపాదిం చుకొనవలెనా? నిష్కాముఁడను=కోరికలు లేనివాఁడను. పరస్పరవిరుద్ధము లు=ఒకటికొకటి విరోధముగలవి-అనఁగా ధర్మశాస్త్రములయందుఁ గొన్ని చోట్ల నిషేధింపఁబడిన యాచారములే మఱికొన్నిచోట్లఁ గొన్ని హేతు వులఁబట్టి విధింపఁబడుచున్న వనుట. "అహింసా పరమో ధర్మః"— అహింసా = హింసింపమి, పరమః=శ్రేష్ఠమయిన, ధర్మః=ధర్మము. ఐక మత్యము = ఒరిమ. సర్వభూతములు=సమస్తప్రాణులు. దయాళువు = కరుణగలవాఁడు. దయాళువులు (రూ) దయాళువు. కరస్థము=అఱచేత నుండునది-ఇది ఉపపదసమాసము. అడవి (వ్ర) అటవి స్వచ్ఛందముగాన్= తనంతట; శాకము=కూర; క్షుధ=ఆఁకలి (రూ) క్షుత్తు. ప్రొద్దు (వ్ర)ప్రబ్ధ.

వచ్చును. ఈ పాడుపొట్టకయి యింతపాపము చేయుట కెవ్వఁడు పాలుపడును? ఆహా! యెంత మూటాడితిరి? అనఁగా గ్రద్ద విని కోపము చేయకు. క్రొత్తగా రాఁగానే వచ్చినవారి స్వభావ మేలాగునఁ దెలిసికోవచ్చును? అప్పుడు తెలియక చెప్పినమాట తప్పుగాఁ బట్టఁబోకు. పోయిన మాట పోనిమ్ము. నీవు యథేచ్ఛముగా రావచ్చును బోవచ్చును మాకడ నిలువవచ్చును. నీకొక యడ్డంకి లేదని చెప్పెను. అనంతరము మార్జారము జరద్గవముతో మిక్కిలి సఖ్యము గలిగి యా తొట్టిలోనే వాసము చేయుచుండెను. ఇట్లు కొన్ని దినములు కడచినతర్వాత మార్జారము ప్రతిదినము నడికిరేయి చప్పుడు చేయక వృక్షమెక్కి పక్షిపిల్లలను గొంతుకొఱికితెచ్చి తొట్టిలోఁ బెట్టుకొని తినసాగెను. అక్కడిపక్షులు తమ పిల్లలను గానక మిక్కిలి దుఃఖించి యక్కడక్కడ వెదక నారంభించెను. అది యెఱిఁగి పిల్లి తొట్టి వెడలి పాఱిపోయెను. ఆ పక్షులు వెదకుచు వచ్చి తొట్టిలోఁ దమపిల్లల యెముకలు చూచి యీ గద్దయె మన పిల్లలను భక్షించిన దని నిశ్చయించి దానిని గోళ్ళతో ముక్కి చంచుపుటములతోఁ బొడిచి చంపెను.

కాఁబట్టి క్రొత్తగా వచ్చినవానిని నమ్మరాదని చెప్పితిని. అనఁగా విని నక్క కాకిని మిక్కిలి కోపించి చూచి యిట్లనియె. ప్రథమదర్శనదినమందు మృగమునకు నీవు సహితము క్రొత్త

పాడు = శూన్యము-ఎంత నిండించినను దోడనే పాడుపడు నని యర్థము. పాలుపడును=లోపడును. ఎంత మాట=ఎంతటిమాట. పట్టఁబోకుము=పట్టకుము. యథేచ్ఛముగా=ఇచ్చవచ్చినట్లుగా. కడన్=వద్ద. అడ్డంకి=అభ్యంతరము. నడికిరేయి=అర్ధరాత్రము. ముక్కు=బకుకు, గీయు. చంచువు=పక్షిముకు్క.

వాఁడవె? అది యెట్లు నీతో మృగమునకు స్నేహము రాఁగా రాఁగా నర్థిల్లుచున్నది? నీకు మాఱు లేదు గనుక నీతులని నోరికి వచ్చినవి వదరుచున్నావు. విద్వాంసుఁడు లేనిచోట స్వల్ప బుద్ధియు సమ్మానింపఁబడుచున్నాఁడు. మ్రానులేని దేశమం దామదపుఁజెట్టు మహావృక్షము కాదా? వీఁడు తనవాఁడని వీఁడు పరుఁడని యెన్నిక లఘుబుద్ధులకు; మహాత్ములకు లోకమే కుటుంబము. ఈ మృగము నాకు బంధువయినట్లు నీవు కావా? ప్రపంచ మున్నంతకాలము బ్రదుకఁబోము. ఎప్పుడో కాలుఁడు మ్రింగఁ గాచియున్నాఁడు. ఉన్నకాల మందఱికి మంచివాఁడనిపించుకొని పోవలెఁగాని యిట్టి విషమబుద్ధిచేత ఫలమేమి? అనఁగా విని మృగ మిట్లనియె. ఈ వాదులాట యేల? మన మందఱ మొకచోట మంచిమాటలతో సుఖముగాఁ గాల క్షేపము చేయుదము. వీనికి వీఁడు మిత్రము, వీనికి వీఁడు శత్రువని నియమము గలదా? వ్యవహారముచేతనే మిత్రులుగాని శత్రులుగాని కలుగుచున్నారు. నా విని కాకి యూలాగే కాని మ్మని పలికెను. అనంతరము మృగకాకజంబుకములు కడు నేస్తము గలిగి తద్వనమందు వాసము చేయుచుండెను. ఇట్లు

అదియెట్లు = ఇక్కడ అది యను దాని కర్థము లేదు - ఇది భాషనడక. వదరు = ఉపయోగము లేని మాటలాడు. లఘుబుద్ధి=స్వల్పబుద్ధిగలవాఁడు. మహాత్ములకు లోకమే కుటుంబము = మహాత్ములు లోకమునందుండు జనుల నందఱిని దమవారినిగాఁ జూతురుగాని భేద మెంచరని యర్థము. కాలుఁడు = యముఁడు. మ్రింగన్ = చంపనని యర్థము. విషమము = సమముగానిది-భేదముగలది యనుట. వాదులాట = వాదించుట. క్షేపము= పుచ్చుట. మిత్రము=స్నేహితుఁడు (రూ) మిత్రుఁడు. నేస్తము=స్నేహము.

కొంతకాలము జరిగినవెనుక నొక్క-నాఁడు నక్క- జింకతో నిట్లనియె. చెలికాఁడా! యీ నసమం దొక చోట నిండుపయిరు గల పొలము నేఁడు చూచితిని. నీవు నావెంబడి రా. నేను నీ కాపొలము చూపుచున్నాను. అని చెప్పి మృగమును వెంటఁ బెట్టుకొని పోయి క్షేత్రము చూపెను. తరువాతఁ బ్రతిదిన మక్క-డికి మృగము పోయి పయిరు మేయసాగెను. ఒకనాఁ డది క్షేత్రస్వామి చూచి యీ మృగము పయిరు మేయ వఱిగినది. దీనిని జీవముతో విడువరాదని యాలోచించి పొలములో గూఢముగా వల పన్ని యింటికిఁ బోయెను. ఎప్పటివాఁడుక చొప్పున మఱునాఁడు మృగము వచ్చి పొలములో మేయ దిగి వలలోఁ దగులుకొని యిట్లు చింతించె. అయ్యో వలలోఁ దగులు కొంటినిగదా? యేమి చేయుదును? ఈకాలపాశమువలన నన్ను విడిపించు దిక్కెవ్వరున్నారు? ఇప్పుడు నా ప్రియమిత్రుఁడు జంబు కోత్తముఁడు వచ్చెనా యీ విపత్తు మానుపఁగలఁడు. అని చింతించుచుండఁగా నక్క వచ్చి చూచి లోపల సంతోషపడి యిన్నాళ్ళకు నా యత్నము ఫలమునకు వచ్చినది. పొలము కాఁపు దీనిని నేఁడు చంపక మానఁడు. దీనియొక్క రక్తమాం

చెలికాఁడు-ఇక్క-డ స్వార్థమున కాప్రత్యయము. క్షేత్రము = పొలము. స్వామి = ఒడయఁడు-అధిపతి. క్షేత్రస్వామి=షష్ఠీతత్పురుషసమాసము. పయిరు (రూ) పైరు. మరిగినది = వాడుకపడ్డది. గూఢముగా = తెలియకుండునట్లుగా. కాలపాశము = యముని పాశమువంటిదని యర్థము. పొలముకాఁపు = పొలమున కొడయఁడు-క్షేత్రస్వామి. దీనియొక్క-యొక్క చేర్చి వ్రాయు రచనలో సొగసు లేదందురు. యొక్క విరహిత ప్రయోగమే ప్రాచీనరచనలోఁ గానుపించును.

సములతోఁ గొనలసిన్న యెముకలు దొరకఁగలవు. నాకు నేఁడుగా పండుగు. అని యెంచుకొనుచు దాపునకుఁ బోయెను. మృగము నక్క-ను జూచి యింక భయము లేదని యెంచుకొని యిట్లనియె. చెలికాఁడా! శీఘ్రముగా వచ్చి నలఁగొఱకి నన్నుఁ గాపాడుము. అనఁగానే నక్క- కదియఁబోయి నల చూచి చెలికాఁడా! యీవల నులినరములతోఁ జేయఁబడినది. నేఁడు భట్టారకవారము. నరములు పండ్లతోఁ నే నెట్లు తాఁకుదును? మిత్రుఁడా! మనములో వేఱుగాఁ దలఁపఁబోకు. మఱి యేపని గాని చెప్పితివా యిప్పుడు తలతోఁ జేయుచున్నానని పలికెను. అంతట సాయంకాలము కావచ్చెను. కాకి తన మిత్రము హరిణము తావు చేరమికి మిక్కి-లి చింతించి యిక్క-డక్క-డ వెదకుచు వచ్చి యాపొలము కడకు వచ్చి చూచి చెలికాఁడా! యిది యేమని యడిగెను. మిత్రునిమాట వినని దానికి ఫలమిది. చేటుఁగాలము దాపించినవాఁడు హితులమాట యేల వినునని మృగము పలికెను. అన విని కాక మా నక్క- యెక్క-డ నని యడిగెను. నా మాంసము' తినవలెనని యిక్క-డనే యెక్క-డనో కాచుకొని యున్నదని మృగము చెప్పెను. నావిని కాకి యిట్లనియె. నేను మునుపే చెప్పితిని. నామాట వినకపోయితివి. పరులకు నేను గీడు చేయఁబోను. వారు నాకొక కీడు చేయఁబో

పండుగు(రూ)పండువు, పండుగ. కదియన్ = చేర. నులి = సన్నము (నులిపురుగు-ఇత్యాది) భట్టారకవారము=భానువారము. మనములోన్ = మనస్సులో. తలతోఁ జేయుట=శిరసా వహించి చేయుట. మిత్రము= మిత్ర మైన. దాపించు=సమీపించు చేయఁబోను = చేయను.

రని నమ్మరాదు. మంచివారికి సహితము దుష్టులవలన భయము గలదు. పోగాలము దాపించినవారు దీపనిర్వాణగంధము నరుంధతిని మిత్రవాక్యమును మూర్ఖునరు కనరు వినరని పెద్దలు చెప్పుదురు. ప్రత్యక్షమం దిచ్చకము లాడి పరోక్ష మందుఁ గార్యహానిచేయు సంగాతకాఁడు పయోముఖ విష కుంభమువంటివాఁడు. అట్టివాని సాంగత్య మవశ్యము మానుకో వలెను. అనఁగా విని హరిణము నిట్టూర్పు విడిచి యిట్లనియె. సజ్జనసాంగత్యమునలన సర్వశ్రేయములువలె దుర్జనసాంగత్యము వలన సర్వానర్థములు ప్రాప్తించును. దానికి సంశయము లేదు. ఆజిత్తులమారినక్కయొక్క తేనెమాటలకు మోసపోయితిని. నాలిక తీపు లోను విషమని యెఱుఁగుదునా? అని చెప్పుచుం డఁగా దూరమందు వచ్చుచున్న పొలముకాఁపును జూచి కాకి యిట్లనియె. చెలికాఁడా! యిప్పుడు తగినవెరవు విచారింపక

దుష్టుల వలన-భయముకాపాటను వలన వర్ణకము. పోఁగాలము = పోవను గాలము(వినాశకాలము) దీపనిర్వాణగంధము = దీపమాతిన పొగవాసనను. అరుంధతిక్ = వసిష్ఠునిభార్యను (ఆరంజోతి). మూర్ఖునకు=వాసనచూచు. దీపనిర్వాణగంధమును మూర్ఖునరు, అరుంధతిని గనరు, మిత్రవాక్యమును వినరని క్రమాన్వయము. ప్రత్యక్షమందున్=ఎదుట(వ్య) పరోక్షమందున్. ఇచ్చకములు=ప్రియవచనములు. సంగాతకాఁడు = స్నేహితుఁడు. పయో ముఖ విషకుంభము = పాలు ముఖమునందుఁగల విషము నించిన కుండ. నిట్టూర్పు = నిడు + ఊర్పు=దీర్ఘశ్వాసము. ద్విరుక్తటకారము బా.వ్యా. సంధి ౧౯. సర్వ + అనర్థములు=అన్నియిక్కట్టులు. జిత్తులమారి=కపటో పాయముగలది-తచ్ఛిల్యంబున మారివర్ణకము. బా. వ్యా. తద్ధి. ౭౮. తేనె మాటలకున్=తేనెవంటిమాటలకు. లోను=హృదయమనుట. వెరవు=భయము (వెఱపు=భయము)

మసలరాదు. అదిగో బొలముకాపు బడియ చేతఁబట్టుకొని యమునివలె వచ్చుచున్నాఁడు. నాకొక యుపాయము తోఁచుచున్నది వినుఁ. ఊపిరి బిగియఁబట్టి కడుపు బూరటించి నాలుగు కాళ్ళు చాఁచుకొని బిట్టబిగిసికొని చచ్చినట్లు పడియుండుము. నేను నీపయి నెక్కి ముక్కుతో నీకన్నులు పొడుచుచున్నట్లు కూర్చుండియుండెద. నేను సమయము చూచి కూసెదను. కూయఁగానే లేచి పాఱిపొమ్మని చెప్పెను. పిదప మృగము కాకి చెప్పినట్లు పడియుండెను. తదనంతరము పొలముకాపు దాపునకు వచ్చి చూచి మృగము చచ్చినదని యెంచుకొని వలనదలింపఁగానే కాకి కూసెను. అది విని మృగము శీఘ్రముగా లేచి పరుగెత్తెను. ఆహా! యిది యెంత మాయలమారి మృగము. నన్ను మోసపుచ్చినదిగదా? యని యెంచుకొని పొలము కాపు తనచేతి బడియను విసిరివేసెను. దైవికముగా దాని తాఁకు నడి నక్క చచ్చెను. చూడుఁ. నక్క యేమి తలంచుకొని యుండెను? తుద కేమాయెను? పరులకు హానిచేయఁగోరు వారు తామే చెడిపోదురు.

అనిన విని హిరణ్యకునితో లఘుపతనక మిట్లనియె. ఏల యీమాటలు? నీతో మిత్రభావము కోరివచ్చినాఁడను. నన్ను

మసలరాదు=జాగుచేయఁగూడదు. అదిగో-ఇదిగో—ఇవి ప్రతీతములు. బడియ=దండము. బూరటించి=ఉబ్బించి. చాఁచుకొని=చాఁగు ధాతు ప్రేరణము. బిట్టబిగిసికొని=మిక్కిలిబిగిసికొని. బిగియు+బిగియు=బిట్టబిగియు—అందఱకు ప్రభృతులలోఁజేర్చఁదగును. మాయలమారి=టక్కులమారి. దైవికముగా=దైవాధీనముగా. తాఁకు=దెబ్బ.

వేఱుగాఁ దలంపకు. నిన్ను నేను భక్షించినమాత్రాన నా కడుపు నిండునా ? నామనవి వినుము. చిత్రగ్రీవునివలె ననున్ను సహాత మను గ్రహింపుము. నీ సౌజన్యమే యింతగా నాచేత నిన్ను వేఁడు కొలుపుచున్నది. నీకు దయసచ్చి నంతదాఁక నిన్ను విడిచి కదలను. నీవంటి సజ్జనుని సాంగత్యము చేసి సౌఖ్యము పొందని వాని జన్మ మేల ?

అన విని హిరణ్యకుఁ డిట్లనియె. నీవు చపలుఁడవు. చపలునితో మైత్రి సర్వథా చేయరాదు. ఇంతేకాదు. మాకు నీవు శత్రుపక్షమువాఁడవు. ఎంతమంచివానితోఁ గాని దాయతో సాంగత్యము చేయరాదు. కాఁబట్టి నీతో నాకు నేస్తము సరి పడదు. అశక్యము శక్యము గాఁబోదు. శక్య మశక్యము గాఁబోదు. జలముమీఁద బండ్లు నేలమీఁద నావలు నడచునా? ఏల యందని గ్రహానిపండ్ల కక్కు చాఁచెదవు ? నీపని చూడు. మిక్కిలి ప్రొద్దెక్కినది. కడుపుపని విచారించుకో. పోపో. నీవిని లఘుపతనక మిట్లనియె. నా స్వభావము తెలియక యేల యింత

వేఱు=అన్యము (వేరు=వృక్షమూలము) మాత్రానన్ (రూ) మాత్రమునన్. అనుగ్రహింపుము=ప్రేమతోఁ జేరఁదీయుము. సౌజన్యము=మంచితనము-తద్ధితాంతము. వేఁడుకొలుపుచున్నది=వేఁడుకొనఁ జేయుచున్నది. వేఁడుకొను సకుఁ బ్రేరణము. చపలుఁడవు=చపలమనస్సు గలవాఁడవు. సర్వథా=అన్ని విధములచేత-ఇది సంస్కృతావ్యయము. సర్వత్ర, సదా, సర్వదా ఇత్యాద్యవ్యయములను దెనుఁగునఁ బ్రయోగింపవచ్చును. దాయతోన్=శత్రువుతో. అశక్యము = తరముకానిది. కాఁబోదు = కాదు. నావ = ఓడ. ఆఁచుట = నిక్కుటయని యర్థము. నీపనిచూడు = ఆనఁగా నింక ఆమాట లాడకుమని భావము. విచారించుకో = విచారించుకొనుము.

దూరము వెగటుమాట లాడెదవు? కడపటిది విను. చిత్ర
గ్రీవుఁడు లోకోత్తరుఁడ వయిన నీతో సౌహార్ద సౌఖ్య
మనుభవించుట చూచితిని. నీతో సంగాతము చేయవలెనని
మనసుపడితిని. నా ప్రార్థన విని నాకోరిక నెఱవేర్చితివా సరి,
లేదా యింతే నాభాగ్య మనుకొని యిక్కడనే ప్రాయోప
వేశముచేసి ప్రాణములు విడిచెదను. ఇది నా నిశ్చయము.
మృద్ఘటమువలె దుర్జనుని సులభముగా భేదింపవచ్చును గాని
సంధింపఁగూడదు. హేమఘటమందువలె సుజనునియం దీలక్ష
ణము విపరీతమై యుండును. ద్రవత్వమువలన సర్వలోహము
లును నిమిత్తమువలన మృగ పక్షులును, భయలోభములనలన
మూర్ఖులును, దర్శనమువలన సజ్జనులును గలిసికొందురు.
మఱియు శుచిత్వము, త్యాగము, శౌర్యము, సుఖదుఃఖ
ములయందు సామాన్యము, దాక్షిణ్యము, స్నేహము,

వెగటుమాటలు=విరసపుమాటలు. లోకోత్తరుఁడు=లోకాతీతుఁడు-మిక్కిలి గొప్పవాఁడనుట. సౌహార్దము=స్నేహము. ఇది తద్ధితాంతము (సుహృత్తు=స్నేహితుఁడు) సంగాతము = స్నేహము. మనసుపడు = కోరు. సరి = యుక్తము. ప్రాయము = మరణపర్యంతము భోజనములేని యొక వ్రతము. ఉపవేశము=కూర్చుండుట—ఆ వ్రతముతో నుండుటయనుట. మృద్ఘటము=మట్టికుండ. సంధింపన్ = చేర్వ. హేమము=బంగారు. విపరీతము=ముందువెనుకైనది—అనఁగా హేమఘటమువలె సుజనుని సులభముగా సంధింపవచ్చునుగాని భేదింపఁగూడదని యర్థము. ద్రవత్వము=ద్రవభావము. (ద్రవము=తడి) లోహములు=బంగారు, వెండి, ఇత్తడి, కంచు, ఇనుము లోనగునవి-ఇవి కఁగినపు డొకటికొనొకటి కలసికొనునని యర్థము. నిమిత్తము=హేతువు. లోభము=అత్యాశ. మూర్ఖుఁడు=మూఢుఁడు. శుచిత్వము=నిర్మలత్వము. సామాన్యము=సమత్వము. దాక్షిణ్యము=మొగమోటము.

సత్యవర్తనమును సుహృద్గుణములని చెప్పుదురు. ఈ గుణము లన్నియు నీయందుఁగానఁబడుచున్నవి. ఇతరుని నీవంటివానిని వినికని యెఱుఁగను. నీబోఁటివానితోఁ సఖ్యము సంపాదించు కొంట కంటె మేలొకటి లేదు. నా కోరిక యీడేరిచితివా మేలయ్యెను. లేదా యింతే నా యదృష్టమని యెంచుకొనియెదను. అనిన హిరణ్యకుఁడు లాఁగ వెడలివచ్చి యిట్లనియె. లఘుపతనకా! నీ వచనామృతముచేత మిక్కిలి తృప్తిఁబొందితిని. ప్రీతిపూర్వక మయిన సజ్జనసల్లాపమువలె గంధసారమును, హిమాంబు పూరమును, వారిజాతవారమును శ్రమము పోఁగొట్టఁజాలవు. దుర్జనుఁడు తలఁచునది యొకటి చెప్పునది యొకటి చేయునది యొకటి. సజ్జనుఁడు తలఁచునది చెప్పునది చేయునది యొకటియై యుండును. నీయందు దోషము లేశమయినను స్వభావముచేతఁ గానఁబడదయ్యె. నీవలన మిక్కిలి సంతోషించితిని. నీ యభిమతమే కానిమ్ము. అని పలికి హిరణ్యకుఁడు యథోచిత సత్కారములుచేసి వాయసమును సంతోషపఱిచి వీడుకొలిపి తన వివరము ప్రవేశించెను. నాఁటఁగోలె మూషిక వాయసములు

సత్యవర్తనము=సత్యమైన నడవడిక. వినికనియెఱుఁగను = వినియెఱుఁగను, కనియెఱుఁగను- అని యన్వయము. సంపాదించుకొంట=సంపాదించుకొనుట.ఈడేరిచితివా = నెఱవేర్చితివేని. వచనామృతము–అవధారణా పూర్వపదసమాసము. ప్రీతిపూర్వకము=ప్రీతిముందు గలది. గంధసారము= మంచిగంధము. హిమాంబువు=పన్నీరు. పూరము = ప్రవాహము. వారిజాతము=తామర, నీటఁ బుట్టిన దని వ్యుత్పత్తి. వారము = సమూహము. అభిమతము = కోరిక. సత్కారము=సమ్మానము. వివరము = కలుఁగు. వివరణమను నర్థములో వివరము వాడకుండుట మేలు. నాఁటఁగోలెన్ = నాఁడు మొదలు.

కుశల ప్రశ్నములచేత, నన్యోన్యాహారదానములచేత, విస్రంభా
లాపములచేతఁ గాలక్షేపము చేయుచుండెను. ఒక్క-నాఁడు
వాయసము మూషికమునుజూచి చెలికాఁడా! యిక్క-డ నా
కాహారము కష్టతరలభ్యముగా నున్నది. కాఁబట్టి యీాననము
విడిచి యెక్క-డికేనిఁ దగినయెడకుఁ బోవలెనని యత్నపడియున్న
వాఁడను. అనిన విని హిరణ్యకుఁ డిట్లనియె. దంతములు,
కేశములు, నఖములు, నరులును స్థానభ్రంశమును బొందికేని
రాణింపరు. కాఁబట్టి మతిమంతుఁ డీయర్థము తెలిసికొని
స్థానము మానవలె ననుబుద్ధి మానుకోనలెను. అనిన విని కాకి
యిట్లనియె. చెలికాఁడా! నీవు చెప్పిన వచనము దుర్బల
విషయము. గజములు, సింహాములు, సత్పురుషులును స్థానము
విడిచి విచ్చలవిడి సంచరింతురు. కాకములు, మృగములు,
కాపురుషులును స్థానము మానఁజాలక వినాశముఁ బొందుదురు.
అన విని హిరణ్యకుఁ డిట్లనియెను. చెలికాఁడా! ఇక్క-డ మాను
కొని యెక్క-డికిఁ బోనలెనని నీయత్నము? అనిన వాయస
మిట్లనియె. ముందు చోటు చూచి పాదము మోపికదా
వెనుకటిపాద మెత్తవలెను? అట్లు స్థానాంతరము విచా

కుశలప్రశ్నములచేతన్ = క్షేమ సమాచారముల నడుగుటలచేత. అన్యోన్యా
హారదానములచేతన్ = ఒకటొకటిగ ఎరలనిచ్చుటచేత. విస్రంభాలాపముల
చేతన్ = నమ్మకపు మాటలచేత. కష్టతరలభ్యము = మిక్కి-శ్రమచేతఁ బొందఁ
దగినది. స్థానభ్రంశము = ఉండుచోటునుండి వదలుట. రాణింపరు = ప్రకా
శింపరు. • అర్థము = విషయము, ప్రయోజనము, శబ్దార్థము. దుర్బల
విషయము = బలహీనవిషయము. విచ్చలవిడిక్ = యథేచ్ఛముగా. కాపురు
షులు = అల్పులు. మోపి = ఉంచి యని యర్థము.

రించుకోక పూర్వస్థానము మానరాదు. కాఁబట్టి ముందు గంతవ్యస్థానము నిరూపించుకొనక ప్రయత్నపడినవాఁడనుగాను విను. దండకారణ్యమందుఁ గర్పూరగౌర మను సరోవరము గలదు. అందు నా ప్రియమిత్రుఁడు మంథరుఁడను కూర్మ రాజున్నాఁడు. అతఁడు సహజధార్మికుఁడు. పరులకు నలసి నన్ని ధర్మములు చెప్పనచ్చునుగాని తాను నడుచుకోలు దుష్కరముగాదా? ఆ తామేటిమేటి మీనాద్యాహార దానములచేత నన్ను భరింపఁజాలినవాఁడు. నావిని హిరణ్యకుఁ డిట్లనియె: నీవు పోయిన తర్వాత నాకిక్కడఁ బనియేమి? సమ్మానము, జీవనము, బాంధవులు, విద్యాగమమును లేని దేశము మానవలెనని పెద్దలు చెప్పుదురు. కాఁబట్టి నీతో నన్నుఁ దొడుకొనిపొమ్మ్ము నచ్చెదను. అనఁగా విని లఘుపతన కము సంతోషపడి వల్లెయని పయనమై మూషికముత్తో

గంతవ్యస్థానము = పోఁదగినచోటు. నిరూపించు = ఏర్పఱచు. దండకా రణ్యము = దండకయను నడవి. కర్పూరగౌరము = కర్పూరమువలెఁ దెల్ల నైనది యని వ్యుత్పత్త్యర్థము. సరోవరము = శ్రేష్ఠమైన కొలను. మంథరుఁడు = మెల్లఁగా నడచువాఁడని వ్యుత్పత్తి. సహజధార్మికుఁడు = స్వభావముచేఁ గలి గిన ధర్మగుణము గలవాఁడు. నడుచుకోలు = నడుచుకొనుట. దుష్కరము = చేయఁగూడనిది. (వ్య)సుకరము. తామేటిమేటి = తాఁబేటిరాజు. మీనా ద్యాహారముల చేతన్ = మత్స్యములు మొనగు నాహారముల చేత. సమ్మానము = మన్నన. విద్యాగమము = విద్యాలాభము. తొడుకొని = పిలుచుకొని. వల్లె = అట్లేకానిమ్మ - అంగీకారార్థకమైన యవ్యయము (వల్లే యనియుం గలదు).

సరసాలాపములు కావించుచుఁ గతిపయదినంబుల కాకొలను చేరఁబోఁగా మంథరుఁడు దూరమునంచుండి చూచి యెదురు వచ్చి కొనిపోయి లఘుపతనక హిరణ్యకులకు యథోచితముగా నాతిథ్యము చేసెను.

తర్వాత లఘుపతనకుఁడు మంథరునిఁ జూచి నిట్లనియె. చెలికాఁడా! యీమూషికరాజును నీవు మిక్కిలి సమ్మానింపుము. ఇతఁడు పుణ్యకర్మలలోపల ధురీణుఁడు; గుణరత్నాకరుఁడు; హిరణ్యకుఁ డనువాఁడు. ఈతని గుణములు శేషుఁడు సహితము వర్ణింపఁజాలఁడు. నే నేపాటివాఁడను. అని పలికి మొదటినుండి హిరణ్యకుని వృత్తాంతము సర్వము వినుపించెను. అంతట మంథరుఁడు హిరణ్యకుని మిక్కిలి సమ్మానించి యిట్లనియె. హిరణ్యకా! నీవు నిర్జనవనమందు వాసము చేయుటకు నిమిత్తమేమి? చెప్పు మని యడిగెను. హిరణ్యకుం డిట్లనియె. చంపకవతి యను పట్టణము గలదు. అందు సన్నాస్యసులు పెక్కండ్రు వాసము చేయుచుండుదురు. అందుఁ జూడాకర్ణుం డను

సరసాలాపములు = రసయుక్తములైన మాటలు. కతిపయదినంబులకున్ = కొన్నాళ్ళకు. యథోచితముగాన్ = తగినట్టుగా ననుట. పుణ్యకర్మల లోపలన్ = పుణ్యాత్మలలోపల. ధురీణుఁడు = భారవాహి-నిర్వాహకుఁడని యర్థము. గుణరత్నాకరుఁడు = అనఁగా గుణరత్న రత్నాకరుఁడు-గుణము లనెడు రత్నములకు సముద్రుఁడని యర్థము—ఇక్కడ రెండుమాఱులు చెప్పఁబడ వలసిన రత్న శబ్ద మొకసారి చెప్పఁబడియున్నది కనుక నిది శిష్టరూపక మనఁబడును. శేషుఁడు=వేయినోళ్లు గల యాదిశేషుఁడు. చంపకవతి = సంపెంగచెట్లు గలది అని వ్యుత్పత్తి. చూడాకర్ణుఁడు=సిగను జెవి యందుఁగలవాఁడసి వ్యుత్పత్తి. సిగను జెవియందుఁ జుట్టుకొన్నవాఁడనుట.

పరివ్రాజకుఁడు గలఁడు. అతఁడు తాను భోజనముచేసి మిగిలిన సంటకము భిక్షాపాత్రలోఁ బెట్టి చిలుకకొయ్యమీఁద నుంచి నిద్రపోవును. నేను సద్దుచేయక దానిమీఁది కెగిరి ప్రతిదిన మా సంటకము భక్షించి పోవుచుండుదును. ఒకనాఁడు చూడా కర్ణుఁడు తనస్నేహితునితో వీణాకర్ణుఁడనుసన్న్యాసితో మాటలా డుచుండి మాటిమాటికి మీఁదివంక చూచి తన గిలుక కట్టతో నేలమీఁదఁ గొట్టి నన్ను వెఱపించుచువచ్చెను. అప్పుడు వీణా కర్ణుఁడు చూడాకర్ణుఁడా! యేమది మీఁదు చూచి నేల కట్టతోఁ దట్టుచున్నాఁడనని యడుగఁగాఁ జూడాకర్ణుఁ డిట్లనియె. ఒక యెలుక ప్రతిదినము చిలుకకొయ్యమీఁది కెగిరి పాత్రమం దున్న యన్నము భక్షించిపోవుచున్నది. నాకు దీని యుపద్రవము పెద్దదిగానున్నది యని చెప్పెను. ఆ మాటలు వీణాకర్ణుఁడు విని యెక్కఁడి యెలుక యెక్కఁడి చిలుకకొయ్య? యింత యల్ప జంతువున కింతపొడవున కెగుడు బలమెక్కఁడి నుండి వచ్చెను? దీని కేమయినను నిమిత్తము లేక మానదు. పూర్వము నే నొక విప్రునియింటికి భిక్షార్థము పోయి యుంటిని. అప్పు డా బ్రాహ్మ ణుఁడు తన భార్యను జూచి జ్యేష్ఠమావాస్య బ్రాహ్మణులకు

పరివ్రాజకుఁడు=సన్న్యాసి. పాత్రము (రూ) పాత్ర. చిలుకకొయ్య=చిలుక వంటి యాకారము కలిగి వస్త్రములు మొదలయినవి యుంచుటకుఁగాను గోడలందుఁ గొట్టిన కొయ్య. వీణాకర్ణుఁడు = వీణ కర్ణమునందుఁ గలవాఁ డని వ్యుత్పత్తి-వీణ చెవిసోఁక నుంచుకొని యున్నవాఁడనుట. గిలుకకట్ట= గిలగిలమని క్రమోగెడి యినుప తగళ్లుగ్రుచ్చిన యుంగరము తలయందుఁ గల కట్ట. వెఱపించుచున్ = వెఱచు ధాతు ప్రేరణము. భిక్షార్థము = భిక్ష కోసము.

భోజనము పెట్టనలెను. ఏ నేమి భోజ్యపదార్థములు కూర్చిన దాన నని యడిగిన బ్రాహ్మణి యిట్లనియె. పురుషులు పదార్థము లను నేకరించి యింటికిఁ దెచ్చిరేని వానిని స్త్రీలు వలసిన పను లకు వాడుకొందురుగాని మీరు తెని పదార్థము లెక్కడనుండి వచ్చును? అనిన విని యాతఁడు కోపించి భార్యను జూచి యిట్లనియె. ఉన్నంతలో జరుపుకొనలెను గాని విస్తరించి పదార్థసంగ్రహము చేయవలెనని పేరాసపడరాదు. అనిన బ్రాహ్మణి యిట్లనియె. ఆలాగునసే కానిండు. ఱేపటికార్యము కలిగినంతటితోనె జరిపెదను. అని చెప్పి యా యమ్మ నూవులు కడిగి దంచి యెండఁబోసెను. అంతట నొక కోడి వచ్చి యా తిలలు కాళ్లతోఁ జీరి చల్లులాడెను. అది బ్రాహ్మణుఁడు చూచి యీ నువ్వు లంటు వడ్డవి. బ్రాహ్మణ భోజనమునకుఁ బనికిరావు. కాఁబట్టి యివి కొనిపోయి మార్చుకొని రమ్మని చెప్పెను. తదనంతర మా బ్రాహ్మణి మఱునాఁడు నేను భిక్షార్థము పోయియున్న యింటి లోఁగిటికి వచ్చి యీ నువ్వుఁబప్పు పుచ్చుకొని నూవులిచ్చెదరా యని యా యింటివారి నడిగెను. ఆ యింటిపాఱుత యా మాట విని మిక్కిలి సంతోషపడి చేటలో నూవులు పోసికొని వచ్చి మాటలాడుచుండఁగా నామె భర్త వచ్చి యేమి బేర

భోజ్యపదార్థము=భుజింపఁదగిన వస్తువు. బ్రాహ్మణి=బ్రాహ్మణస్త్రీ. వలసిన = కావలసిన. సంగ్రహము=కూర్చుట. పేరాస-పేరు+ఆస= అత్యాశ. చీరి=గీజి. అంటువడ్డవి=అపరిశుద్ధమైనవి. లోఁగిటికిన్=ముంగిటికి-లోఁగిశబ్దము (ఔపవిభక్తికము) నువ్వుఁబప్పు=పొట్టొలిచిన నూవులు. పాఱుత=బ్రాహ్మణి-మతుబర్థకమగు తవర్ణకము (తద్ధితము)

మాడుచున్నానని యడిగెను. చేరుడు నూవ్వు లిచ్చి దంచిన నూవులు పుచ్చుకొంచున్నానని యామె చెప్పెను. ఆ మాటలు బ్రాహ్మణుఁడు విని యోసివెట్టి! చేరుడు నూవులకు దంచిన నూవు లెవ్వరయిన నిత్తురా? ఈమె యీలాగునఁ దెచ్చి యిచ్చుట కేమయిన నిమిత్తముండును. కాఁబట్టి నీ వానూవులు పుచ్చుకోకుమని చెప్పెను. ఆలాగుననే యీ మూషికమున కింత బలిమియు నిక్కడి సదావాసమును నిమిత్తము లేక సంభవింపవు.

అని పీణాకర్ణుఁడు చెప్పఁగా విని చూడాకర్ణుఁడు తడవులఁ బట్టి యీ యెలుక యిక్కడ నొక లాఁగ (త్రావు చేసికొని విడువక వాసముచేయుచున్నది. ఇట్లు వసించుటకు నిమిత్తము తెలిసినది కాదు. (త్రవ్వి చూచెదఁగాక యని చెప్పి యొక గుద్దలితో నేను నసించు వివరము (త్రవ్వి చిరకాలోపార్జిత మయిన నా ధనము సర్వము (గహించెను. తరువాత సత్త్వో త్సాహములు లేక నానాఁ డాహారము సహితము సంపాదించు కొనఁజాలక దిగులుపడి కృశించి మెల్లమెల్లగా సంచరించు చుండఁగాఁ జూచి చూడాకర్ణుఁ డిట్లనియె. ధనము గలవాఁడే బలవంతుఁడు. ధనము గలవాఁడే పండితుఁడు; ధనము సర్వ(శే యములకు నిదానము. ధనము లేనివాని జీవనమేల? ఈ మూషి

చేరుడు=పొట్టుతీయనిది. బలిమి=బలయుక్తము కృదంతము. తడవులఁబట్టి= బహుదినములనుండి. (త్రావు=(త్రావు-చోటు. గుద్దలి = (త్రవ్వెడు యొక యాయుధము. చిరకాలోపార్జితము = బహుదినములనుండి సంపాదింపఁ బడినది. సత్త్వము=బలిమి. ఉత్సాహము = (ప్రయత్నము. నిదానము = మొదటికారణము.

కము తన ధనము కోలుపోయికదా తొంటి జవసత్త్వము లుడిగి స్వజాతిసామ్యమును బొందెను! అర్థపరిహీనునకు నిరంతరము ఖేదము సంభవించును. నిరంతరఖేదమునలన బుద్ధిహీనత్వము ప్రాప్తించును. బుద్ధిహీనతనలన సమస్తకార్యములు నిదాఘనదీ పూరములట్లు వినాశము నొందును. ధనవంతునకే పౌరుషమును, మేధాసంపత్తియు, బంధుమిత్రులును గలుగుదురు. పుత్రమిత్ర విరహితుని గృహమును, మూర్ఖుని చిత్తమును శూన్యములు.

కోలుపోయి=కొల్లపోయి. తొంటి = తొల్లిటి. జవసత్త్వములు=వేగమును బలమును. స్వజాతిసామ్యమును = తనజాతితో సరిపోలుటను. అర్థపరిహీనునకున్=ధనముచేతఁదక్కువైనవానికి—ధనముపోఁగొట్టుకొన్నవానికనుట. ఇది తృతీయా తత్పురుషసమాసము. నిరంతరము = అధికము. ఖేదము=శోకము. బుద్ధిహీనత్వము = బుద్ధిచేత హీనుఁడగుట. నిదాఘ ...అట్లు=ఎండకాఁలమునందలి యేటి వెల్లువలవలె. పౌరుషము = మగతనము. మేధాసంపత్తియు= ధారణాశక్తి గల బుద్ధియొక్క సంపదయు. ధనవంతునకుఁ బౌరుషమును మేధాసంపత్తియు లేకున్నను ఉండునట్లు చెప్పుట రనియు, బంధువులును మిత్రులును గాకుండియు బంధులమనియు మిత్రులమనియు వచ్చి చేకుదు రనియుఁ దాత్పర్యము. అమహద్వాచకమైన పౌరుషము మేధాసంపత్తి అను శబ్దములును కలుగుదురు- అను క్రియకుఁ గర్తగానుండినను గడపటికర్త బంధుమిత్రులని మహద్వాచకముగా సున్నందున నారూపము సిద్ధించినది. మీఁదఁజెప్పిన రెండు కర్తలును వేఱుగా నన్వయించు నప్పుడు పౌరుషము కలుగును మేధాసంపత్తి కలుగును అని చెప్పవలెను. అందు మహద్వాచక కర్త లేక యమహద్వాచకములైన యా రెండు కర్తలే ఉండునపుడు పౌరుషమును మేధాసంపత్తియుఁ గలుగునని యేకాన్వయమందును చెప్పవలెను. పుత్రమిత్ర విరహితుని = సుతులచేతను స్నేహితులచేతను హీనుఁడైన వానియొక్క—ఈ పదమునందు రెండు సమాసము లున్నవి. మూర్ఖుని చిత్తము శూన్య మనఁగా- తెలివిలేనిదనుట.

దారిద్ర్యము సర్వశూన్యము. దారిద్ర్యము కంటె మరణము మేలు. మరణ మాపాతయాతనావహము. దారిద్ర్యము యావజ్జీవము తీవ్రవేదనాకరము. ఇంద్రియముల, నామమున, బుద్ధిని, వచోధోరణిని బురుషుఁడు తొంటివాఁడయ్యె ధనమును బోసిన క్షణమునసే లాఁతివాఁడగును. ఇది మహాచిత్రము. అని యాపరివ్రాజకుఁడు చెప్పఁగా విని మిక్కిలి ఖిన్నుఁడనయి యిట్లు చింతించితిని. ఇఁక నాకిక్కడ వసింపఁ దగదు. ఇప్పుడు నావృత్తాంతము పరులతోఁ జెప్పుకోలును యుక్తము గాదు. అర్థనాశము, మనస్తాపము, గృహమందలి దుశ్చరితము, వంచనము, పరాభవమును బ్రకాశింపఁజేయఁ దగదని పెద్దలు చెప్పుదురు; దైవానుకూల్యము లేక పౌరుషము చెడినప్పుడు మాన

దారిద్ర్యము=దరిద్రభావము- పేదతికము-తద్ధితాంతము. సర్వశూన్యము=అన్నిటిచేత శూన్యమైనది, దారిద్ర్యమున్న చోట ఏమియు నుండదని భావము. ఆపాతయాతనావహము=తేలికయైన బాధను గలుగఁజేయునది. యావజ్జీవము = జీవమున్నంతవఱకు - యావత్ + జీవము. తీవ్రవేదనాకరము= అత్యంతమైన బాధను కలుగఁజేయునది. ఇంద్రియములన్=కన్ను మొదలయినయింద్రియములచేతను. వచోధోరణిని=మాటయొక్క రీతిచేతను. తొంటివాఁడు=ముందటివాఁడు. లాఁతివాఁడు=అన్యుఁడు. కన్ను, ముక్కు మొదలయినవియును పేరును బుద్ధియును మాటచొప్పును మనుష్యున కెప్పుడు నొకతీరుగా నుండినను మనుష్యుఁడు ధనమున్నప్పుడు ఒకవిధముగాను, ధనము పోయినప్పుడు ఒకవిధముగాను గనఁబడుచున్నాఁడని భావము. ఖిన్నుఁడు= ఖేదముపొందినవాఁడు (ఖేదము=శోకము) చెప్పుకోలును=చెప్పుకొనుటయును. దుశ్చరితము=చెడ్డనడత. వంచనము=వంచించుటను-తానొకరిని వంచించుట నని భావము. పరాభవమును=అవమానమును. దైవానుకూల్యము=దైవమునొక్క అనుకూలత. పౌరుషము=పురుష ప్రయత్నము.

వంతునికి వనవాసముకంటె సుఖము లేదు. కుసుమస్తబకమువలె మానవంతుఁడు సర్వజనుల మూర్ధముమీఁద నయిన నుండవలె. లేదా వనమందు సమసిపోవలె. ఇక్కడనే వాసము చేసికొని యాచనతో జీవించెదనంటినా దానికంటె గర్హ్యతము లేదు. ఒక్క ప్రుక్కడిని యాచించుకంటె నిప్పులోఁ బడి శరీరము తొఱఁగుట మేలు. అనృత మాడుటకంటె మౌనము మేలు. పరధనాపహరణముకంటెఁ దిరియుట మంచిది. వివేకహీనుఁడయిన ప్రభువును సేవించుట కంటె వనవాస ముత్తమము. యాచించుకొని బ్రతుకుట కంటె మరణము శ్రేయము. సేవావృత్తి మానమును వలె యాచనావృత్తి సమస్త గౌరవమును హరించును. ఒకరి యిల్లు కాచి వారి పెట్టునోఁతలకు దోసిలి యొగ్గి యునికియు మిక్కిలి నింద్యము. అని నానావిధముల విచారించియు లోభము త్రిప్పులకు లోనయి మరల

మానవంతునికిన్ = మానముగల పురుషునికి. కుసుమస్తబకమువలెన్ = పూగుత్తి వలె. మూర్ధము = తల. నమసి = నశించి. యాచనకోన్ = యాచించుటకో. గర్హ్యతము = నిందితము. ప్రుక్కడిని = అల్పుని. తొఱఁగుట = విడుచుట. అనృతము = అసత్యవచనము. పరధనాపహరణముకంటెన్ = అన్యుల ధనము యొక్క దోఁపుడుకంటె. తిరియుట = బిచ్చమెత్తుట. దీని కృదంతము తిరిపము. వనవాసము — సప్తమీతత్పురుషము. మానమును వలెన్ = మానమును హరించుటవలెనని యర్థము. ఈ వాక్యమును విరివిగాఁ జెప్పెడు పక్షమున సేవావృత్తి మానమును హరించుటవలెనని చెప్పవచ్చును. వృత్తి = వ్యాపారము. పెట్టువోఁతలు = పెట్టు + పోఁత - ద్వంద్వమున గసడదవాదేశము. పెట్టు = అన్నము మొదలయిన వాని నిడుట; పోఁత = జలము లోనగు వానిని బోయుట. ఒగ్గి = చాఁచి. త్రిప్పులకున్ = త్రిప్పటలకు. లోను = వశము.

నర్థసంగ్రహము చేయనలెనని తలఁచి యచ్చోటనే నిలిచితిని. లోభము మోహమునుబుట్టించును. మోహముదుఃఖమునుత్పాదించును. దుఃఖము జ్వలనమునలె స్వాశ్రయమునకు నాశము పుట్టించును. కాఁబట్టి లోభమునకు బుద్ధిమంతుఁడు లోపడఁడు. తరువాత నేనక్కడ వదలకుంట చూచి చూడాకర్ణుఁడు నన్నుఁ గట్టితో విసిరివేసెను. ఆ వ్రేటు దైవవశమువలనఁ దప్పిపోయినది. తగిలి యుండెనా యింతకు యమలోకములోఁ బాఁత కాఁపనయి యుండునా! అనంతర మిట్లు చింతించితి. ఆహా! ధనలోభము సర్వాపదలకు మూలము గదా. తద్వర్జనముకంటె లోకమందు సుఖ మేదియు లేదు. ఆశ దిగనాడినవాఁడే సత్పురుషుఁడు. వాఁడే సర్వశాస్త్రములు చదివినవాఁడు. వాఁడే సర్వధర్మము లాచరించినవాఁడు. ఉదరము కయి పరుల గోఁజక ప్రాప్తలాభమునకు సంతోషించువాఁడొక్కఁడు లోకమందు ధన్యుఁడు. వాఁడే సుఖి. తత్తత్కర్మానురూపముగా దేహికి

అర్థసంగ్రహము = ధనము కూడఁబెట్టుట. మోహము = అజ్ఞానము. ఉత్పాదించును = పుట్టించును. జ్వలనము వలెన్ = నిప్పువలె. స్వాశ్రయమునకున్ = తన యునికి పట్టునకు. తరువాతన్ = చూడాకర్ణుఁడు చెప్పిన పిమ్మట ననియర్థము. తరువాయి శబ్దము సప్తమ్యేక వచనాంతము. ఉంట = ఉండుటను. వ్రేసితి = కొట్టెను. వ్రేటు = దెబ్బ. వ్రేయు ధాతువు (కృ). తగిలియుండెనా (రూ) తగిలియుండెనేని. ప్రాఁతకాఁపు = ప్రాఁతఁబడిన కాఁపు - బహుదినములుగా వాసము చేయువాఁడనుట. తద్వర్జనము కంటెన్ = ఆధనలోభము యొక్క విడుపుకంటె. దిగవాడు = విడుచు. గోఁజు = దైన్యముతో యాచించు. ప్రాప్తలాభము = కలిగినలాభము. ధన్యుఁడు = పుణ్యవంతుఁడు. తత్తత్కర్మానురూపముగాన్ = వానివాని కర్మమునకుఁ దగినట్టుగా. (తత్ + తత్ + కర్మ + అనురూపము) దేహికిన్ = మనుష్యునకు

దుఃఖములట్లు సుఖములు కోరకయె ప్రాప్తించుచున్నవి. అందులకయి ప్రయాసపాటు నిరర్థకము. ఈ ప్రాపు తాత ముత్తాతలు సంపాదించిన కాణాచి గాదు. భూమండలములో నిక్కడ ప్రాపు దొరకదా? ఇక్కడ నుండనేల? ఈ చెడగరపు బోడ కట్టమోడులవడి ప్రాణములు కోలుపోనేల? ఇంక నెక్కడ నయిన నొక్క విజన ప్రదేశము చేరి కాలము పుచ్చుట మంచిది. శిలాంతరాళ మందలి కప్పను భరించు దయామయుడయిన యీశ్వరుడు నన్నుగాపాడ కుండునా? అని చింతించి మనసు గట్టిపఱుచుకొని యచ్చోటు విడిచి యా నిర్జనవనము చేరితిని. వనములోగాయగసురులు భక్షించి పడియనీయ ప్రాగి యొక చెట్టునీడలో నసించి కాలము పుచ్చుట మంచిది గాని ధనహీనుడయి నలుగురిలో నుండరాదు. అనంతరము నా పుణ్యము వలన నాకో మిత్రుడు లభించెను. నా మహా భాగ్యము .వలననే యిప్పుడు నీ యాశ్రయమను స్వర్గము దొరకినది. సత్సంగతి కంటె లోకమందు మేలేదియు లేదు.

దుఃఖములట్లు = దుఃఖములు కోరకయే ప్రాప్తించునట్లని యర్థము. ఇదియును విరివిగా ప్రాయవలసినప్పుడు మోదఁజెప్పినట్లు ప్రాయఁబడును. ప్రయాసపాటు = ప్రయాసము పడుట. కాణాచి=పెద్దలనాఁటిది. చెడ గరపుబోడ కట్టమోడులు = క్రూరుఁడైన సన్న్యాసి యొక్క దుడ్డుకట్టి దెబ్బలు. కోలుపోవు = పోఁగొట్టుకొను. విజనప్రదేశము=మనుష్యులు లేని చోటు. శిలాంతరాళమందలి=ప్రాతిలోపలనున్నట్టి. దయామయుడు=దయా స్వరూపుఁడు. కసుర = లేఁతకాయ.కసుర లోనగునవి నిరర్థకము లని కొందఱు చెప్పుదురు.అది సరికాదు. వృత్తియందు అంత్యవర్ణలోపమును లేఁతయనునర్థమునుగలుగును. కసుఁగంప-కసుగాయ.ఇత్యాది. పడియ=అడు సుగుంట. ఆశ్రయము=ప్రాపు. సత్సంగతికంటెన్=సజ్జనసాంగత్యముకంటె.

సంసార విష వృక్షమునకు రెండు ఫలము లమృతతుల్యములు; కావ్యామృత రసపాన మొకటి, సజ్జనసంగతి యొకటి. అనిన విని మంథరుఁ డిట్లనియె.

అర్థములు నిత్యములు గావు. యౌవనము ఝరీవేగ తుల్యము. జీవనము బుద్బుదప్రాయము. కాఁబట్టి బుద్ధిమం తుఁడు సత్వరముగా ధర్మము సమాచరింపవలెను. సమాచరింపని వాఁడు పశ్చాత్తాపముఁ బొంది శోకాగ్ని సంతప్తుఁడగును. నీ వతి సంచయము చేసితివి. దాని దోషమిది. తటాకోదరజలములకుఁ బరీవాహమునలె సమార్జితవిత్తములకుఁ ద్యాగమే రక్షణము. ధనము పాఁతఱిలో దాఁపటికము చేయుట దాని వినాశమునకు దారి చేయుటగాని వేఱు గాదు. వాయి కట్టి కడుపుకట్టి ధనము

సంసారవిషవృక్షమునకున్ = సంసారమనెడి ముష్టిచెట్టునకు. అమృతతుల్య ములు = అమృతముతో సమానములు. కావ్యామృతరసపానము = కావ్య మనెడి యమృతరసమునొక్క త్రాగుట. అర్థములు = విషయములు - ఇట సంపద లనుట. ఝరీవేగతుల్యము = సెలయేటి వెల్లువతో సమానము. బుద్బు దప్రాయము = నీటిబుగ్గవంటిది. సత్వరముగా = శీఘ్రముగా. సమాచరించు = చేయు. పశ్చాత్తాపము = యోచింపక యొక తప్పుపని చేసి వెనుక చింతించుట. శోకాగ్ని సంతప్తుఁడు = శోకమనెడి నిప్పుచేతఁ గాఁగినవాఁడు. అతిసంచ యము = మిక్కిలి కూడఁబెట్టుట. తటాకోదరజలములకున్ = చెఱువులోపల నున్న నీళ్ళకు. తటాక + ఉదర. పరీవాహము = చెఱువునీళ్ళధిక మైనప్పు డా నీళ్లు పోవుటకు ప్రాతిలోఁ గట్టిన మార్గము - కలుఁజు (రూ) పరివాహము. సమార్జితవిత్తములకున్ = కూడఁబెట్టిన ధనమునకు. పాఁతఱి = ధనము మొద లగునవి దాఁచిపెట్టుటకుఁ ద్రవ్విన పల్లము. దాఁపటికము = దాఁచుట - గోపనము. వాయి = నోరు. వాయికట్టి కడుపుకట్టి - ఇది లోకసాధారణోక్తి - అనఁగా నోటికి రుచియైన పదార్థములు తినక కడుపునిండ భుజింపక యని యర్థము.

గడించువాఁడు పసులకయి మోపు మోచువానియట్లు క్లేశము నకు మాత్రము పాత్రము. భోగత్యాగములకు వినియోగింపని ధనముంటవలన ఫలమేమి? పోకడవలన హాని యేమి? లోభి ధనికుఁడయ్యు భోగవిరహముచే దరిద్రునితో సమానుఁడే. అయినను లోభికి ధనార్జనరక్షణహానులయందు దుఃఖ మొక్కటి విశేషము. లోభి తనధనము పేదలకుఁ బెట్టఁడు. చుట్టములకు వినియోగింపఁడు. తానుం గుడువఁడు. కడపల నేలపాలో, దొంగలపాలో చేయుచున్నాఁడు. ప్రియవచనములతోడి దానము, గర్వసహితముగాని జ్ఞానము, క్షమాసహితమైన శౌర్యము, త్యాగయుక్తమయిన విత్త మనియెడు నాలుగు లోక మందు దుర్లభములు. బుద్ధిమంతునకు సర్వథా ధనార్జన మావశ్యక కార్యమేకాని యతిసంచయేచ్ఛ తగదు. తొల్లి యొక్క జంబుకము లోభముచేత మిక్కిలి వస్తువులు సంగ్రహింపఁగోరి వింటి దెబ్బవడి చచ్చెను. వినుము నీ కాకథ చెప్పెదను.

గడించు=సంపాదించు. మోపు=భారము. మోచు ధాతువు (క్ర్యా) క్లేశము=కష్టము. భోగము = సుఖానుభవము. వినియోగింపని = ఉపయోగింపని. పోకడ=నాశము. భోగవిరహముచేన్ = భోగముయొక్క యెడఁబాటు చేత-భోగము లేకపోవుటచేత నని యర్థము. ధనార్జన రక్షణహానులయం దున్ = ధనముయొక్క సంపాదనమునందును పాలనమునందును నాశనము నందును. గర్వసహితము=గర్వముతోఁ గూడుకొన్నది. క్షమాసహితము= ఓరిమితోఁ గూడుకొన్నది. త్యాగయుక్తము = ఈవితోఁ గూడుకొన్నది. అతిసంచయేచ్ఛ = మిక్కిలి కూడఁబెట్టుటయందలి యాశ.

కల్యాణకటకమను పట్టణమందు భైరవుఁడను వ్యాధుఁడు గలఁడు. వాఁ డొకనాఁడు వేఁటకయి సింగాణి తూపులు, వలయులు, చిక్కము లోనగు సాధనములు పూని వింధ్యాటవికిఁ బోయెను. అక్కడ వాఁ డొక వది కావించుకొని మచ్చి వెట్టి పొంచియుండి యొక పోతరించిన మృగము నేసి చంపి యెత్తి యజకడఁ జెట్టుకొని వచ్చుచుండఁగా నడగొండవలె నొకపంది కానఁబడెను. అంతట నా మృగయుఁడు నా భాగ్యము వలన మాంసాంతరము సయితము దొరకినదని సంతోషించి యా మృగమును నేల దించి విల్లెక్కు వెట్టి బాణము సంధించి సూకరము నేసెను. ఏటు వడిన యాక్షణమె యా వరాహము క్రోధచోదితమయి శరవేగమున ఘుర్ఘురించుచుఁ బాఱినచ్చి కొమ్మున వానిఁ గొట్టెను. వాఁడు మొదలు నఱికిన తరువునలె

కల్యాణకటకము = మంగళకరమైన రాష్ట్రి మని వ్యుత్పత్యర్థము. భైరవుఁడు = భయంకరుఁడని యర్థము. సింగాణి = విల్లు (వై) తూపు = బాణము. ఊరి=ఊచ్చు. చిక్కము = ఉట్టివలె త్రాళ్ళతో నల్లిన సంచి. వింధ్యాటవికిఁ = వింధ్యపర్వత సమీపమున నుండెడి యడవికి. వది = వేఁట కాఁడు పొంచియుండుటకుఁ ద్రవ్వికొన్న పల్లము. మచ్చి = మృగాదులఁ బట్టుటకయి యుంచెడి యాహారము. ఏసి = బాణము ప్రయోగించి. అజకడన్ = మూఁపుపై. నడగొండవలెన్ = నడచునట్టి కొండవలె. మృగయుఁడు = వేఁటకాఁడు. మాంసాంతరము = మటియొక మాంసము. సూకరమున్ = పందిని. ఏటు = బాణపుదెబ్బ - ఏయుధాతు కృదంతము. వరాహము = పంది. క్రోధచోదితము = కోపముచేతఁ ప్రేరేఁపింపఁబడినది. శరవేగమునన్ = బాణముయొక్క వేగమువంటి వేగమున. ఘుర్ఘురించుచున్ = ఘుర్ఘురధ్వని సేయుచు. కొమ్మునన్ = కోఱపంటితో. మొదలు = చెట్టునడుగు. తరువు = వృక్షము.

నేలఁగూలి తోలుచుఁ బ్రాణములు విడిచెను. పందియు మృతిఁ బొందెను. అక్కడ నొక్క సర్పము కిరాతవరాహముల ప్రొక్కుడులఁ బడి మడిసెను. అందొక నక్క దీర్ఘరావ మను నది యాహారార్థము వనములోఁ గ్రుమ్మరుచు నక్కడికి వచ్చి చచ్చి పడియున్న సర్పకిరాతవరాహములను జూచి నాకు భోజనము పుష్కలముగా దొరకినదని సంతోషించి యిట్లు చింతించె. నాకు మూఁడు నెలల గ్రాసమునకు వీని మాంసము చాలును. ఒక్క మాసము కిరాతుని మాంసముతోఁ గడపనచ్చును. మృగసూకరముల మాంసముతో రెండు మాసములు జరుప వచ్చును. ఒక దినమున కీ పాము చాలును. తొలిమాఁకలి యిప్పటి కీ వింటి నారిసరముతోఁ దీర్చుకొనియెదఁగాక యని చింతించి చేరువకుఁ బోయి గొనయము పంట నొక్క కొఱికఁ గానే బెట్టు వదలి గనయము పెట్టు తొమ్మ్రిం దాఁకెను. ఆ పెట్టుతోనే యా నక్క నేలఁగూలి తోలుచు విలవిలఁ దన్నుకొనుచుఁ జచ్చెను. చూడు లోభము నక్క నే దశకుఁ దెచ్చినది.

తోలుచున్ = నొప్పిచేతఁ గూయుచు-విలపించుచు. దీర్ఘరావము = దీర్ఘమైన ధ్వని గలదని వ్యుత్పత్త్యర్థము. ఊళ పెట్టునది యనుట. ఆహారార్థము = ఎరకొఱకు. క్రుమ్మరుచున్ = సంచరించుచు. పుష్కలముగాన్ = సమృద్ధముగా. గ్రాసమునకున్ = ఆహారమునకు చేరువకున్ = సమీపమునకు. చేరు ధాతు-కృ. గొనయము = నారి. అల్లెత్రాడు. నొక్క = అదిమి. బెట్టు = బిగి. గనయము పెట్టు = వింటికొప్పయొక్క దెబ్బ. విలవిలన్ = ఇది యనుకరణ శబ్దము. దశకున్ = అవస్థకు

కాఁబట్టి యతిసంచయే చ్ఛ తగదని చెప్పితిని. ఒరుల కిచ్చి తాను భుజించినదే తనసొత్తు. పరుల కీక తాను గుడువక కూడఁబెట్టిన ద్రవ్యము చచ్చినతటి వెంట రాఁబోదు. అని చెప్పి కూర్మము మటియు నిట్లనియె. మిగిలిపోయినది యిప్పుడు త్రవ్వుకోనేల? పోనిమ్ము. బుద్ధిమంతులు రానిదాని కెదురు చూడరు. పోయినదానికి నగవరు. విపత్తు వచ్చినప్పుడు వితాకు నడరు. కాఁబట్టి మిత్రుఁడా! సదా నీ వుత్సాహముతో నుండుము. శాస్త్రములు చదివియు మూర్ఖులయి యున్నారు. పురుషుఁ డెవ్వఁడు క్రియావంతుఁడు వాఁడు విద్వాంసుఁడు. రోగుల కౌషధము పేరు చెప్పిన మాత్రమున రోగశాంతి గాఁబోదు. వివేకహీనునికి శాస్త్రజ్ఞానము గ్రుడ్డివానికి స్వహస్త దీపమునలె నిష్ఫలము. చూడుము. విపత్తు వచ్చినప్పుడు నాకు ఖేదము లేదు. సంపద వచ్చినప్పుడు మోదము లేదు. దేహా కాపత్సంపదలు పర్యాయమున రాకడ సహజము. అర్థములు

సొత్తు = సొమ్ము (వై) మిగిలిపోయినది = కడచిపోయిన దానిని. త్రవ్వుకోన్ = పెల్లగించుకొన-ప్రస్తావమునకుఁ దెచ్చికొనని యర్థము. వితాకువడరు=నిశ్చేష్టతఁ బొందరు. ఉత్సాహముకోన్ = ఉడుగని ప్రయత్నముతో. క్రియావంతుఁడు=క్రియ గలవాఁడు-ఏదే నొక పనిచేయువాఁడనుట. వివేక...నిష్ఫలము=గ్రుడ్డివానికిఁ దనచేత దీపమున్నను దనకది యెట్లు ప్రయోజనకరము కాదో అట్లు వివేకము లేనివానికి శాస్త్రములయందెంత జ్ఞానము కలిగియున్నను ప్రయోజనకరము కాదని యర్థము. మోదము = సంతోషము. పర్యాయమునన్ = తడవచే- అనఁగా నొకప్పు డాపదయు నొకప్పుడు సంపదయు నని యర్థము. రాకడ=వచ్చుట. సహజము=స్వభావము.

నిత్యములు గావనియెడు నెఱుక గలవాఁడు తన్నాశమునకు వగవఁడు. అర్థము లేకున్న ధీరునకు లోకమందు మాన్యత కొఱఁతవడదు. పుష్కలముగా ధనము గలిగియున్నను క్షుద్రునకు గారవము రాఁబోదు. సింహమునకుఁ గలిగిన నైసర్గిక తేజము శ్వానమునకు నూఱుబంగారు సొమ్ములుపెట్టిన రాదు. నీవు బుద్ధిమంతుఁడవు. నీ గారవమున కిప్పుడు హానియేమి? ఏలాగునైనఁ బుట్టించినవాఁ డాహారము కల్పింపకపోఁడు. చూడు జంతువు గర్భము నుండి నేల జాఱఁగానే తల్లి పొమ్ము చేఁపుచున్నది. కాఁబట్టి జీవనార్థము మిక్కిలి యాయాసంపాటు సయితము వ్యర్థము. నీవు సకలధర్మములు తెలిసినవాఁడవు. నీకు విస్తరించి చెప్పఁ బనిలేదు. నీకు లఘుపతనకుఁ డొకఁడు నే నొకఁడను గాము. మనలను మూవురను దైవ మొక్కచోటఁ జేర్చెను. దొరకినంతటితోఁ గాలము గడుపుకొని సుఖముగా జీవింతము. అనిన హిరణ్యకుఁడు మిక్కిలి సంతోషించి యిట్లనియె.

తన్నాశమునకున్ = ఆర్థనాశమునకు - తత్ + నాశము. ధీరునకున్ = పండితునకు. మాన్యత = మన్నన. గారవము = గొప్పతనము (ప్ర) గౌరవము. నైసర్గిక తేజము = స్వభావముచేఁ గలిగిన పరాక్రమము. శ్వానము = కుక్క. కల్పింపఁగా = కలుగఁజేయఁగా. జంతువు = ప్రాణి. చేఁపుచున్నది = ద్రవించుచున్నది. ఆయాసంపాటు = ఆయాసపడుట — సువర్ణకమునకు పూర్ణబిందువు - బా. వ్యా. సం. ర౬. నీకు...కాము = నీవు నన్ను వేఱుగా నెంచక లఘుపతనకుని వలె నెంచు మని యర్థము.

మంథరా! నీ వచనామృతము వర్షించి నా దురంత తాపము నివారించితివి. నేను ధన్యుఁడ నయితిని. "మిత్రలాభ మను లాభ సంపద"యను వచనము నేఁడు నాకు లక్ష్యసమన్విత మయ్యెను.

ఎవ్వఁడు హంసములను, శుకములను, మయూరములను శుక్లహరితచిత్రములఁ గావించె నా యీశ్వరుఁ డాయయి జంతు వులకుఁ దత్తదనురూప మయిన వృత్తిని గల్పించువాఁడు. మూఁఢు లీయర్థ మెఱుఁగక వృత్తికయి పడరానిపాట్లు పడి కాలము వ్యర్థముగాఁ బోఁగొట్టు చున్నారు. విత్తము గడనయం దొక దుఃఖము, కాఁపుదలయం దొక దుఃఖము, వినాశమం దొక దుఃఖము పుట్టించుచున్నది. ఇట్లు దుఃఖైకమూలమయిన విత్తమేల? కాల్పనా? ధర్మార్థము ధనము గోరుకంటె

దురంతతాపము=అంతములేని మనస్తాపము. 'మిత్రలాభ మనలాభి సమ్పదః' ఇది భారవియను నొక సంస్కృతకావ్యమందలి నీతిశ్లోకమందొక పాదము. లాభసంపదః = ఇతరలాభసంపదలు. మిత్రలాభమను = స్నేహితలాభమున కంటెఁ దక్కువైనవి. సంపదః అనుదానికి అనుకరణమందు విసర్గలోపము. బా. వ్యా సంధి. ౫౦. లక్ష్యసమన్వితము = లక్ష్యముతోఁ గూడుకొన్నది- దృష్టాంతముతోఁ గూడుకొన్నదనుట. శుకములను = చిలుకలను. మయూ రములను=నెమిళ్ళను. శుక్లహరితచిత్రములన్ = తెల్లనైనవానిఁగాను, పచ్చ నైనవానిఁగాను నానావర్ణములు కలిగినవానిఁగాను. ఈ మూఁటిని క్రమ ముగా నన్వయించుకొనవలయును. ఆయయి జంతువులకున్=ఆయా జంతు వులకు. తత్తదనురూపము=ఆయా జంతువునకుఁ దగినది - తత్ + తత్ + అనురూపము. పడరాని=పాటుపడ శక్యముగాని. గడనయందున్=సంపా దించుటయందు. కాఁపుదలయందున్=రక్షణమునందు. దుఃఖైకమూలము= బాధ కొకటికే కారణము. దుఃఖ + ఏక = దుఃఖైక.

నిస్పృహత్వము మంచిది. "అడుసు త్రొక్కనేల, కాలుగడుగనేల". ఆకాశమునందుఁ బక్షులచేత, భూమియందు వ్యాళములచేత, జలములయందు మీనులచేత మాంసము భక్షింపఁబడినట్లు సర్వత్ర విత్తవంతుఁడు భక్షింపఁబడియెను. కాఁబట్టి ధనతృష్ణ మానికోలు వివేకకార్యము. తృష్ణ యొకటి మానెనా యీవల దరిద్రుఁ డెవఁడు? ధనికుఁ డెవఁడు? దాని కెవ్వఁ డెడమిచ్చును? వాని మూర్ధమే దాస్యమునకు సింహాసనము. నీ సన్నికర్షప్రభావముచేత నా యజ్ఞానము సర్వము నివర్తించినది. కృతార్థుఁడ నయితిని. నిరంతరముగా నీతోడి సంగతికంటె నాకు లాభమొకటి లేదు. నీతోడి ప్రణయమున కొక్క-కొంతయు రాఁబోదు. ప్రణయము లామరణాంతములు, కోపములు తత్క్షణభంగురములు, త్యాగములు నిశ్శంకములు నగుట మహాత్ములకు సహజము. అని పలికిన మంథరుఁ డా పలుకులు విని మిగుల సంతోషించి హిరణ్యక లఘుపతనకులుం దానును యథేచ్ఛ విహారాదులఁ గాలక్షేపము చేయుచు సుఖముగా నుండెను.

నిస్పృహత్వము=ఆశలేనితనము. వ్యాళములచేత=బెబ్బులచేత-వ్యాళము (నానా) పాము పులి తులువ యేనుఁగు క్రూరమైనది. మీనచేత=మత్స్యములచేత-మీనుశబ్దము. సర్వత్ర = అంతటను. విత్తవంతుఁడు=ధనవంతుఁడు. తృష్ణ = ఆశ. మానికోలు = మానుకొనుట. దాస్యమునకు=డొడిగమునకు-వాని మూర్ధమే దాస్యమునకు సింహాసనము - ఎవఁడు ధనాపేక్ష కలవాఁడగునో వాఁడెటువంటి యూడిగ మేనియుఁ జేయవలయునని భావము. సన్నికర్ష=సమీపము. ప్రణయము=స్నేహము. ఆమరణాంతములు=మరణాంతమువఱకుఁ గలవి. క్షణభంగురములు = క్షణకాలములో నశించునవి. నిశ్శంకములు=సందేహము లేనివి - లోభాదులచేత ననుట. యథేచ్ఛవిహారాదులచ = ఇచ్చవచ్చినట్లు తిరుగుట లోనగు వానిచేత

తరువాత నొకనాఁడు మంథరాదులు మూవురు సల్లాప ములు సలుపుచుఁ బ్రొద్దు పుచ్చుచుండఁగా నొక మృగము మృగయునిచేఁ దఱుమఁబడి బెదరి మహావేగముతో నక్కడికిఁ బాఱివచ్చెను. అది చూచి భయపడి కూర్మము జలములోఁ బ్రవేశించెను. మూషికము లాఁగఁ జొచ్చెను. వాయస మెగిరి వృక్షాగ్ర మెక్కెను. అనంతరము ప్రధానివిభాఁదనుఁడి కాకము నిక్కి నలుదిక్కులు చూచి చూపు మేరదూరములో భయ హేతువేదియు లేమి నిశ్చయించుకొని మంథర హిరణ్యకులను బిలిచి మీకు వెఱవకుఁడు. చుట్టుపట్టు మిక్కిలి దూరము చూచితిని. భయమునకు నిమిత్త మేదియు నాకంటఁ బడలేదు. అని చెప్పఁగానే కచ్ఛపమూషికములు జలబిలములు వెడలి వచ్చెను. లఘుపతనకమును వాని చేరువ వ్రాలెను. అంత మంథరుఁడు భయపడి వడవడ వడంకుచున్న జింకను జూచి నీ వెవ్వఁడవు? నీ వేల పాఱి వచ్చితి వని యడిగిన మృగము పక్కలెగయ రోఁజుచు నిట్లనియె. నాపేరు చిత్రాంగుఁడు. నన్ను వేఁటకాఁడొకఁడు తఱుముకొని వచ్చెను. వానికి భయపడి పాఱివచ్చితిని. వాఁడు నాపరుగు పట్టఁజాలక వెనుకఁ జిక్కినాఁడు. మీకు నేను శరణాగతుఁడను. సర్వదానములు సర్వవ్రతములు సర్వ

నాలుగు + దిక్కులు - నలుదిక్కులు - నలు ఆదేశము. మేర = హద్దు. లేమిన్ = లేకుండుటను. పట్టు = స్థానము. నాకంటఁ బడలేదు - నాకుఁ దోఁప లేదనుట. జలబిలములు = కచ్ఛపము జలమును, మూషికము బిలము నని ప్రమాన్వయము. వడవడ - ఇది యనుకరణశబ్దము. రోఁజుచున్ = నిట్టూర్పు విడుచుచు. చిత్రాంగుఁడు = నానావర్ణములు గల దేహము గలవాఁడని వ్యుత్పత్త్యర్థము. నా పరుగు = నా పరువును. శరణాగతుఁడను = శరణు చొచ్చినవాఁడను.

యాగములు శరణాగతరక్షణముతో సమి గావు. శరణాగతు నుపేక్షించుకంటె దురితము లేదని ధర్మజ్ఞులు చెప్పుదురు. మీకు సకలధర్మవేత్తలని బుద్ధిమంతులు చెప్పంగా విని యున్న వాఁడను. మనసు కలఁతపడి యుండుటవలన నిది చెప్పఁదగిన మాట యిది చెప్పఁగూడనిమాట యని యెఱుఁగక యేమో చెప్పినాఁడను. మీకు ధర్మములు చెప్పెడుపాటివాఁడను గాను. నా వాగ్దోషము క్షమియించి నన్ను రక్షింపుఁడు. మీతో మైత్రి సంపాదించుకొని యిక్కడ నసించి కాలము గడపవలె ననినాకోరిక. మా బంధువులను మాదేశమును విడిచి వచ్చితిని. మీ మఱుఁగు చొచ్చితిని. మీఁద నన్నుఁ బాల ముంచెదరో నీట ముంచెదరో మీ భారము. అనిన విని మంథరుఁ డిట్లనియె. చిత్రంగా! నీవు బుద్ధిమంతుఁడవు. సాధువవు. నీతోడిసఖ్య మవశ్యము మా కపేక్షణీయము. దీని కింత దూరము చెప్పఁబనిలేదు. ఈ తావు నీ యిల్లుగా నెంచుకొని మాతోఁ గూడి యథేచ్ఛముగా వర్తించుచు సుఖముగా నుండుము. అని చెప్పఁగా మృగము మిగుల సంతోషించి యా వనమందు లేఁబచ్చిక జొంపములు మేయుచు మడుగులోని నీరు త్రావుచుఁ జేరువ మాఱిని నీడలోఁ బండుకొనుచు నిట్లు చిరకాలము సుఖముగా వసించెను.

ఉపేక్షించు=అనాదరించు. దురితము = పాపము. ధర్మవేత్తలు=ధర్మము నెఱిఁగినవారు-మధ్యమపురుషము. (మీరు ధర్మజ్ఞులవంటిది) వాగ్దోషము= మాటతప్పును. పాల ముంచెదరో నీట ముంచెదరో-అనఁగా కాపాడెదరో కాపాడక మానెదరో యని యర్థము. అపేక్షణీయము = కోరఁదగినది. లేఁబచ్చిక-లేత + పచ్చిక—ప్రాఁతాదిసంధి. బా. వ్యా. సం. 3౬. జొంపములు = (లేఁతపచ్చికయొక్క) గుంపులను. త్రావు=చోటు.

అంతట నొకనాఁడు మృగము నేఁతకుఁ బోయి తొల్లిటి వలె వేళకు నచ్చి క్రావు చేరమికి మిక్కిలి చింతపడి మంథరుఁడు లఘుపతనక హిరణ్యకులతో నిట్లనియె. మన చెలికాఁడు చిత్రాంగుఁ డింత మసలుటకు నిమిత్తమేమి? ఎన్నఁడుగాని యింత దడవు రాక నిలిచినవాఁడు కాఁడు. అక్కడక్కడ నేఁతకుఁ బోయిన శకుంతసంతానములు కొఱఁకులు మాని యిరవులకు రాఁదొడఁగె. వ్రేలు తమ తమ పసుల కదుపులను క్రోలుకొని పల్లియలకుఁ బోవుచున్నవారు. సూర్యుఁడు ప్రతీచీముఖము నందు సిందూరతిలకము నందము వహించుచున్నవాఁడు. తరణి కిరణవారము చల్లారఁ జల్లార నా కారాటము పెల్లు మాఱుచున్నది. కొంతదూరము పోయి వెదకి వచ్చెద నంటినా నాకు గమనవేగము లేదు. మిమ్మిఁ బంచితినా మీఁదిమిక్కిలి మీరు మరలివచ్చి నాకంటఁ బడుసందాఁక నా చిత్తము తత్తఱపడు

మసలుటకున్ = జాగుచేయుటకు. ఏ + నాఁడు-ఎన్నఁడు. శకుంత సంతానములు=పక్షుల గుంపులు. కొఱఁకులు=మేఁతలచోట్లు. కొఱుకు శబ్దము, ఱొపవిభక్తి కాంతము. ఇరవులకున్ = నివాసములకు. వ్రేలు = గొల్లవాండ్రు-ఏకవచనము-వ్రేఁడు. పసులు (వ్రా) పశువులు. కదుపులను = గుందలను. క్రోలు (గూ) తోలు. పల్లియలకున్ = పల్లెలకు (వై) ప్రతీచీముఖమునందున్ = పడమటి దిక్కు నెదు ర్మో యొక్క ముఖమునందు. సిందూరము=చెందిరము - రాగద్రవ్యము. సిందూరతిలకము నందమున్ = కుంకుము బొట్టు తీరును. తరణి కిరణవారము = సూర్యకిరణముల సమూహము. ఆరాటము = సంతాపము (గూ) ఆరటము. పెల్లు = అత్యంతము. పనుచు (గూ) పంచు పంపు = ఆజ్ఞాపించు మీఁది మిక్కిలి = కదుమిక్కిలిగా-దీనికిఁ దత్తఱపడుచుండు ఆను దానికో నన్వయము. తత్తఱపడు = కలఁతపడు.

చుండును. నే నేమి చేయుదుననిక న్నీరు నించి దిక్కులు చూచు చూరకుండ లఘుపతనకుఁ డిట్లనియె. నాకు నెల్లపక్షుల కంటె జవాతిశయము గలదు. బహుయోజనము లయినను క్షణమాత్రములోఁ గ్రుమ్మరి మరలి రానోపుదు. దానిఁబట్టియే కదా లఘుపతనకుఁడని యన్వర్థసంజ్ఞఁ బడసి యున్నాఁడను. నీవు కొందలపడకుము. నేనిక్కడ నున్నట్లే యెంచుకొనుము. ఇదిగో నిమిషమాత్రాన వెదకివచ్చి చిత్రాంగుని వృత్తాంతము చెప్పెదనని పలికి యాక్షణమె యెగిరిపోయి యా యరణ్యము నానా ప్రదేశములు వెదకి యొక్కచో నుపులలోఁ జిక్కువడి యున్న చిత్రాంగునిఁ జూచి కన్నుల నీరు పెట్టుకొని చేరఁబోయి చెలికాఁడా! నీవు పసుల సొమ్మున కాశపడవు. పసులను బాధింపఁబోవు. అడవిలోని గడ్డి మేసి పడియనీరు త్రాగి యొక చెట్టునీడలోఁ బడియుండి ప్రొద్దు బుత్తువు. నీవొక్క కీడుఁజేత యెఱుఁగవు. నీవంటి సాధువునకా యిట్టి యాపద రావలె! ఇంతదూరము చింతింపనేల? ఎంతవారికిఁ గాని దైవ మలం ఘ్యము. ప్రాప్తించిన వ్యసనమునకుఁ బ్రతికారము విచారింప వలెఁగాని యీచ్చనడి యుండఁదగదు. కాఁబట్టి యిప్పుడు కర్త వ్యము నీకుఁ దోఁచినది శీఘ్రముగాఁ జెప్పుము. మంథరహారిణ్యా

నించి = నిండుధాతువు ప్రేరణార్థకము. చూచుచూరక - చూచు చుక్ + ఊరక అని ఛేదము. జవాతిశయము = వేగాతిశయము. యోజ నము = ఆమడదూరము. అన్వర్థము = పొసఁగిన యర్థము గలది. కొందల పడకుము = విచారపడకుము. కీడుఁజేత = దుష్టకార్యము. అలం ఘ్యము=దాఁటరానిది. వ్యసనము=ఆపద. ప్రతికారము=మాఱుచేత(రూ) ప్రతీకారము. ఈచ్చవడు=నిశ్చేష్టతఁ బొందు. కర్తవ్యము=చేయఁదగినది.

కులు నామార్గము చూచుచుండుదురు, పోవలెను. అనిన చిత్రాంగుడు విని వేటకాడు రాకముందు హెచ్చరికపడి సదుపాయము చేసితిరా నన్ను దప్పింపవచ్చును. లేదా నా యూహ నేటితో మానుండు. ఇప్పుడు పోయి వేగిరము హిరణ్యకుని దోడుకొనిరమ్మ్ము. అతడు వచ్చినా నాకట్లు తెగగొట్టికి నన్ను రక్షింప జాలును. అని చెప్పగానే లఘుపతనకుడు మనోవేగముతో నెగిరిపోయి యీ వృత్తాంతము మంథరహిరణ్యకులతో జెప్పి హిరణ్యకునివంక చూచి మనము కడుశీఘ్రముగా బోవలెను. నీవు నా వేగము ననుసరించి రాజాలవు. ఇంతలో నేమి కీడు మూడునో తెలియము. నా వీపెక్కుము. నిమిషములో గొనిపోయి విడిచెద ననిచెప్పి యెడంబరించి హిరణ్యకుని దనవీపుమీద నెక్కించుకొని తొంగువను తొక్కల మోతతో బాణమువలె బోయి చిత్రాంగునిదాపున వ్రాలెను. అంతట హిరణ్యకుడు చిత్రాంగుని బంధములు త్రెగగొట్టికి చెలికాడా! నీవు బుద్ధిమంతుడవీ యురులలో నెట్లు చిక్కితివని యడిగెను. లఘుపతనకుడది విని యిట్లనియె. మన మిక్కడ నిలువరాదు. ముందు ముచ్చట లాడుకోవచ్చును. లేలెండని

సదుపాయము = మంచియుపాయము. నాయూహ నేటితో మానుండు = అనగా నేను వలలో దగులుకొన్నానుగాన వేటకాడు నన్ను బట్టుకొను నని భావము. మనోవేగముతోన్ = మనస్సునొక్క వేగమువంటి వేగముతో-మిక్కిలి వేగముతో ననుట. హిరణ్యకునివంక = హిరణ్యకునిదిక్కు. మూడునో = కలుగునో. ఒడంబరించి = సమ్మతిపఱచి. తొంగు-తొక్కల ధ్వన్యనుకరణము. ముందు = ఇకమీదు-వెనుకననుట. లేలెండు-లెండు + లెండు.

పలికి పయనము చేసి తాను వారికి మీఁద దాపుగా గగనమార్గ మందు వచ్చుచుండెను. అప్పుడు చిత్రాంగుఁడు హిరణ్యాకున కిట్లనియె. ఎట్టి బుద్ధిమంతునకుఁగాని యెట్టి బుద్ధిహీనునకుఁగాని దుఃఖమో సుఖమో యే కాలమం దేది యనుభవింపవలెనో యది యనుభవింపక తీరదు. ప్రాణులకు సుఖదుఃఖములు సహజములు. నా పూర్వకర్మ మెట్టిదో పలుమాఱట్టి యాపదలకే పాలయితిని.

ఆఱునెలల ప్రాయమప్పుడు నేను మాజాతి మృగములతోఁ గూడి సంచరించుచుండఁగా నొకనాఁడు వేటకాఁడు వచ్చి యురులు పన్ని మంచిపచ్చికఁ దెచ్చి మచ్చువెట్టి కొంత దూరానఁ బొదమాటునం గూర్చుండి చూచుచుండెను. అంతట నేను బాల్యచాపలముచేతఁ బదువు విడిచి ముందు పేరెము వాఱుచుఁ జివుకు చివుక్కు-నఁ జవుకళించి దాఁటుచు జని మచ్చుఁ జూచి మేయఁబోయి యురులలోఁ దగులుకొని భయపడి కూఁత బెట్టితిని. అంతట మా పదువు మృగములన్ని తలలెత్తి చెవులు టిక్కు-ంచి నిక్కు-చూచి బెదరి చట్రాతిమ్రోఁడఁ గొట్టిన కుండపెంచికలవలెఁ జెదరి నలువలఁకులకుఁ బాఱి

ప్రాయము = వయస్సు. దూరానన్ (రూ) దూరమునన్. చాపలము చేతన్ = (బాల్యముయొక్క-) చపలత్వముచేత. పదువు = సజాతి సమూహము. పేరెము వాఱుచున్ = దొడ్డు పరుగు పాఱుచు. చివుకు చివుక్కు-నన్ - ధ్వన్యనుకరణము. చవుకళించి = నాలుగు కాళ్ళతో నెగిరి. టిక్కు-ంచి = నిక్కు-ంచి. చట్రాతిమ్రోఁదన్ = విశాలమైన ఱాతిమ్రోఁద - చట్రాయి శబ్దము. చట్టు + రాయి. పెంచికల వలెన్ = పెంకులవలె. వలఁకులకున్ = దిక్కు-లకు - వలను శబ్దము.

పోయెను. అనంతరము వేటకాఁడు పొద మాటు విడిచి నా దాపునకు వచ్చెను. నేను మృగమను శిశువను. మా పదువుఁ బాసితిని. బంధములోఁ జిక్కు-కొంటిని. దాపున యమునినలె వేటకానిఁ జూచితిని. ఇఁక నేమి చెప్పనలె? నా ప్రాణము ముక్కా-లుమ్మ్రీవ్వీసము పోయినదను. పిమ్మట వాఁడు నా యొద్దఁ గూర్చుండి యొక దారము నా మెడకుఁ గట్టి పట్టుకొని నాకు నోవకుండ నుచి విడిపించెను. కొంతాయువున్నది కాబట్టి నన్నుఁ జంపఁ గడఁగినవాఁడు కాఁడు. తరువాత నన్ను వాఁడఱి కడఁ బెట్టుకొని పోయి యా దేశ మేలుచున్న రాజకొమారు నికి సూడిదగా నిచ్చెను. ఆ రాచకొమారుఁడు తమ సాహిణము నకు నెదురుఁగొట్టములోఁ గట్టఁబంచి నా కాహార దానాది కృత్యములు తఱి తప్పక జరుపుట కచ్చటి సేనకులకుఁ గట్టడ చేసి నాయందు ముద్దుచేత నానాఁడు నన్ను విచారించు కొనుచుం డెను. అంత దినక్రమమున బెదరు విడిచి మనుష్యులతో మచ్చిక పడితిని. కాఁబట్టి కాచువాండ్రు నన్ను రాచకొమారుని యను మతిని గట్టు వదల్చి తిరుగవిడిచిరి. నేను మెడబంగారు జంగెలు

మాటు = మఱుఁగు. ముక్కాలు మ్మ్రీవ్వీసము పోయినదను = ప్రాణము లల్లాడ శేషముగా నున్నవని యనుకొమ్మని భావము. మూఁడు + కాలు + మూఁడు + వీసము = ముక్కాలు మ్మ్రీవ్వీసము. నొచ్చు (వ్య) నోవక. సూడిదగాన్ = కానుకగా. సాహిణమునకున్ = లాయము నకు. కొట్టము = పసులఁ గట్టుచోటు (ప్ర) కోష్ఠము. ముద్దు = ప్రేమము. నానాఁడు = నాఁడు + నాఁడు. బెదరు = భయము. మచ్చిక పడితిని = మరిగితిని. జంగెలు = చిఱుగంటలు.

గజ్జెలు మ్రోఁగఁగాఁ విచ్చలవిడిగా మనసు వచ్చినచోట్లఁ దిరిగి తోఁపులందు దొడ్లయందు లేఁబచ్చిక మేసి కొలఁకునీరు త్రాగి చల్లని ప్రొద్దు నీడఁ గొంతవడి నెమరు వెట్టుచుఁ బండుకొని యుండి సాయంకాలమునకుఁ గట్టుఁబట్టునకు వచ్చి చేరుచుండు దును. ఒక్కనాఁ డాపట్టణము వీథిని సంచరించుచుండఁగా బాలకులు గుంపుగూడి కోయని కూఁకలు వెట్టుచు నన్ను వెంబ డించి తఱిమిరి. నేను బెదరి చవుకళించి దాఁటుచుఁ బాఱి సమీపమందున్న ప్రమదవనము చొచ్చితిని. చొరఁగానే యక్కడి రాజాంతఃపుర కాంతలు నన్నుఁ బట్టుకొని పోయి యంతి పురములో రాచకొమారుని శయనగృహమునకు దాపుగా నొక కంబమునకుఁ గట్టి పెట్టిరి. నాఁటిరాత్రి గన్నులు మిఱు మిట్లు కొలుపు మెఱుములతో శ్రవణకుహరములు విదారించు

మ్రోఁగఁగాన్ = శబ్దింపఁగా. విచ్చలవిడిగాన్ = నిర్బంధము లేకుండు నట్లుగా. తోఁపు = పెట్టిన వనము (త్రోపు = నిరాకరణము) దొడ్ల యందున్=చుట్టు వెలుఁగు గల మేఁతమేయు చోటులందు-దొడ్డి శబ్దము. కొలఁకు = గుంట. కొలను శబ్దము. నెమరువెట్టుచున్ = నెమరు వేయుచు (నెమరు = పసువులు తిన్న కసువును మరల నోటికిఁ దెచ్చుకొని నమలుట) కట్టుఁబట్టు = కట్టివేయుచోటు. ప్రమదవనము = అంతఃపుర స్త్రీలు సంచరించుటకుఁ దగిన యుద్యానవనము (రూ) ప్రమదా వనము. రాజాంతఃపుర కాంతలు = రాజు యొక్క అంతఃపురము నందున్న స్త్రీలు. అంతిపురము (ప్ర) అంతఃపురము. శయన గృహమునకున్ = పడకటింటికి. కంబము (ప్ర) స్తంభము. మిఱుమిట్లు కొలుపు=మిక్కిలి చెదరునట్లు చేయు. మిట్లు+మిట్లు=మిఱుమిట్లు-అందదు కులువంటిది. శ్రవణకుహరములు = చెవులరంధ్రములు. విదారించు = బ్రద్దలు చేయు.

నుఱుములతోఁ గడనలతో ముంచి వంచినట్లు నిరంతరధారమై మిన్నుమన్నేక మయినట్లు కారు గమ్మి యొకవర్షము గురిసెను. అప్పు డా వర్షము చూచి మిక్కిలి కుతూహలపడి మనుష్య భాషతో నాలో నేను మీఁద వాన చినుకులు పడఁగా మెల్లని చల్లని గాలి పొలయఁగా మా పదువుతోఁ గూడి చవుకళించి దాఁటుచు దువాళించుచు సద్యోజాతమైన కదంబ ముకుళ జాతము మేయుచు విచ్చలవిడిగా సంచరించు భాగ్యము వెండియు నా కెన్నఁడు గలుగునో యనుకొంటిని. అప్పుడు రాచకొమారుఁ డాచమనము చేయను వసారలో వచ్చుచు నా మాటలు విని దిక్కులు చూచి వెంబడి వచ్చు లంపతావానిఁ జూచి యిక్కడ వింతవా రెవ్వరు లేరు. ఇప్పటి మాటలు నీవును వింటివిగదా? ఇది యేమి వింత? ఈ జింకపిల్ల యొక్కటియె యీ లోఁగిట నున్నది. ఇది యీలాగున మాటలాడి యుండునని తోఁచుచున్నది. నీకేమి తోఁచుచున్నదని వాఁడిట్లనియె. ఏలినవారికిఁ దోఁచినది తప్పదు. మన విన్న మాటలచేఁ దెలియఁబడిన కోరిక మానిసికిఁ బుట్టనేరదు. అనిన రాచ

నిరంతరధారము = దట్టమైన ధారలు గలది - ఇది వర్షమునకు విశేషణము మిన్ను = ఆకాశము-ఔపవిభక్తికాంతము కారు=నలుపు. కుతూహలపడి=తహతహపడి. పొలయఁగాఁ=వ్యాపింపఁగా. దువాళించుచు=దౌడు పాఱుచు. సద్యోజాతము=అప్పుడే పుట్టినది(సద్యః+జాతము)కదంబ ముకుళజాతము = కడిమిచెట్ల మొగ్గల సమూహము. వెండియుఁ=మరల. ఆచమనము చేయు = పుడిసిట నీరెత్తుకొని మంత్రము చెప్పి పుచ్చుకొను. వసారలోఁ=పంచాదియందు. లంపతావానిఁ=పరిచారకుని. వింతవారు=అన్యులు. మనము+విన్న-మనవిన్న-కర్మపదప్రథమకు షష్ఠి-'నా చూడని' వంటిది. మానిసికిఁ = మనుష్యునకు.

కొమారుఁడు విని యాచమించి పోయి శయనించి వఱువాత లేచి కొలువుఁ గూటమునకు వచ్చి కూర్చుండి జ్యోతిశ్శాస్త్ర పారంగతుని నొక్క బ్రాహ్మణుని రావించి జరిగిన వృత్తాంతము వినుపించెను. అతఁడది విని మృగము మానుషభాష భాషించుట మిక్కిలి యనిష్టసూచకము. దీనికి జపహోమాదులు చేయింపుఁడు. ఇప్పు డా మృగమును ముందుగా దూరపు టడవిలో విడువఁ బంపుఁడు. ఇట్టి మృగమును నిండిన యింటిలో నిమిషమయిన నిలుపరాదు. అన విని రాచకొమారుఁ డంతఃపురమందుండి నన్నుఁ దెప్పించి యీ మృగమును దూరపుటడవిలో విడిచి రండని సేవకుల కాజ్ఞాపించెను. వారు నట్లు చేసిరి. అవ్వల వనములో నక్కడక్కడఁ దిరుగుచుండఁగా వేఁటకాఁడు తఱుము కొని వచ్చెను. నేను భయపడి పాఱివచ్చి మీమఱుఁగు చొచ్చి యప్పటి ముప్పు తప్పించుకొంటిని. నేఁడిక్కడఁ దగులుకొని నీ యనుగ్రహము వలన బ్రబుకు గంటిని. ఇప్పటికిఁ గడతేరితి మనరాదు. మీఁద నేమి రానున్నదో యెఱుఁగుదుమా? నీ

ఆచమించి=ఆచమనము చేసి. మూత్ర విసర్జనము చేసినందున ఆచమన మని యెఱుంగునది. జ్యోతిశ్శాస్త్రపారంగతునిక = జ్యోతిశ్శాస్త్రము యొక్క గట్టును బొందినవానిని. జ్యోతిశ్శాస్త్రమును గడవెళ్ళఁ జక్కఁగా నెఱిఁగినవాని నగుట. మానుషభాషక = మనుష్యభాషణముతో. అనిష్టసూచకము=కీడును దెలుపునది. జప, హోమ+ఆదులు = జపము, హోమము మున్నగునవి. దూరపుటడవి=దూరము+అడవి-సమాసమునందు పుగాగమటుగాగమములు. నిండినయింటిలోన్ = పుత్రపౌత్రాది సంపదచేఁ బూర్ణమైన యింటిలో నగుట. ముప్పు=ఆపద.

వెంతటి బుద్ధిశాలివి? నీ వృత్తాంతము మంథర లఘుపతనకుల వలన విన్నవాఁడను. నీవు పడ్డ యిడుములు చెప్పితీరునా? వేయి మాటలేల విను. విధిత్రిప్పులకు లోపడని జంతు వొకటి లోకమందుండదు. అని చెప్పి మంథరుఁడు మనరాక వేచి యుండును. మనలఁ జూచునందాఁక నాతనికిఁ బ్రాణములు కుదుటఁబడవు. అని ముచ్చటలాడుచు వచ్చుచుండఁగా నింత లోపల నక్కడ మంథరుఁడు లఘుపతనక హిరణ్యకులు నోయిన దిక్కు చూచుచుఁ బోయినవా రేల యింత తడసిరి? పోయినపని నిరంతరాయముగా సాగెనేఁ దడవేల పట్టును? కటకటా! యెట్టి పాపపుమాట వినఁబడునోకదా! ఏమిచేయుదును? అని తల పోయు చక్కడ నిలువఁజాలక వెడలివచ్చువాఁడు మార్గమందు హిరణ్యకాదులను జూచి యయ్యాలారా! వచ్చితిరా! నా కడు పునఁ బాలు నోసితిరి. శీఘ్రముగాఁ బోయి స్థానము చేరుఁడి యని పలికి తానును వారివెంబడి వచ్చుచుండెను. అంత హిరణ్యకుఁడు మంథరునితో నిట్లనియె. నిమిష మెచ్చుతక్కువగా రాకమా నము. దీనిలో నేమి మునిఁగి పోవునది. ఇట్టి సాహసము చేయరాదు. ఏదిగాని యిక్కడ నొక్క యిక్కట్టు వచ్చెనా మేము తప్పించుకో నేర్తము. జలములయందువలె నీకు మెట్టలో

విధి=పూర్వజన్మకృత శుభాశుభకర్మము. వేచి=ఎదురుచూచి. కుదుటఁ బడవు=నెమ్మది పొందవనుట. నిరంతరాయముగా = నిర్విఘ్నముగా. సాగెనేన్=జరిగెనేని. ఎట్టి పాపపుమాట వినఁబడునోకదా - ఇక్కడ కదా అనుదానికి అర్థము లేదు, వాక్యాలంకారముగా వచ్చినది. తలపోయు చున్=చింతించుచు. కడుపునఁ బాలువోసితిరి - కడుపు చల్లఁజేసితి రనుట. చేరుఁడి=చేరుఁడు. దీనిలోన్ = నిమిషములో ననుట.

గమనవేగము లేదు. కాఁబట్టి యిప్పు డిక్కడికి నీ రాక శుభో దర్కముగా నాకుఁ దోఁపలేదు. అనిన మంథకుఁ డిట్లనియె. మీ రింతాలస్యము చేసితిరి. మీలోపల నొక్కరయిన ముందు వచ్చి జరిగిన వృత్తాంతము చెప్పనచ్చును గదా? అదియును లేకపోయెను. మీఁదుమిక్కిలిగాఁ బోయినవా రేమి కీడునకుఁ బాలయిరో యేమయిరో కదా యని మనసు మఱిమఱి తత్తరింపఁ దొడఁగెను. నీవు చెపుమా! ఎట్లు నిలువ మనసు వచ్చును? మిమ్మీఁ జూచిన వెనుకఁగా నాగుండె కుదిరినది. అని సల్లాపములు సలుపుచుండఁగా మృగయుఁ డురు లొడ్డిన చోటికి వచ్చి మృగ ముచ్చ త్రెంచుకొని యుఱికినదని యెఱిఁగి యాశ్చర్యపడి విల్లెక్కుపెట్టి చేతఁబట్టుకొని యడుగుల జాడ చూచుచు మృగము పోయినదారినే వచ్చుచుండఁగా లఘుపతనకుఁడు చూచి యోహో! మాటల పరాకున మీరు పెండ్లినడక నడచుచున్నవారు. వేఁటకాఁ డిదె వెంబడించి పొంచికొని వచ్చుచున్నవాఁడు. మాటల కెడ లేదు. సత్వరముగా నూడనిఁబొడుఁ డనిన విని హిరణ్యకుఁ డొక్కలాఁగ దూఁకెను. చిత్రాంగుఁడు పాఱిపోయెను. మంథకుఁడు నిసర్గమునకు

శుభోదర్కము=మీఁదట మేలు నిచ్చుట. శుభ+ఉదర్కము. పాలయిరో= లోపడిరో. ఏమయిరో కదా-ఇక్కడి కదా అను దానిని ముంచటివలె నెఱుఁగునది. మఱిమఱి = ఎంతయు. గుండె కుదిరినది = అనఁగా నెమ్మది కలిగినదనుట. మాటల పరాకునన్ = మాటలమీఁద మనసు చెల్లుటచేత. పెండ్లినడక నడచుచున్నవారు-మెల్లఁగా నడచుచున్నారనుట. పొంచికొని= పొంచు వేసికొని. ఎడ = అవకాశము. ఊడనిఁబొడుఁడు=పరుగెత్తుఁడు. నిసర్గమునకున్ = స్వభావమునకు-సుందగమనమున కనుట.

భయము తోడ్పడ నడనఁ గాళ్ళు రాక మెల్లగాఁ బోవుచుండెను. అంత మృగయుఁడు తన్నుఁ జూచి మృగము పాఱిపోకకు ఖేదపడి యచ్చోటఁ గచ్ఛపమును జూచి కొంత సంతోషించి డాయఁబోయి పట్టుకొని గనయమునఁగట్టుకొని మూఁపుమీఁదఁ బెట్టుకొని పోవుచుండెను. అప్పుడు చిత్రాంగాదులు మూవురును గూడుకొని మంథరునకు వచ్చిన వ్యసనమునకుఁ గన్నీరు విడుచుచుఁ గొంతదూరాన వేఁటకాని వెనుకనే పోవుచుండిరి. హిరణ్యకుఁడు చిత్రాంగలఘుపతనకులను జూచి ప్రాప్తించిన దుఃఖము నిస్తరించితిమి గదా! యని క్షణమునకు ముందు సంతోషపడితిమి. ఇంతలోనే యీ దుఃఖము ప్రాప్తించెను. ప్రాప్తించిన దుఃఖమునకు విషాద పడరాదు. వేఁటకాఁ డడవి దాఁటి పోకమునుపే మంథరుని విడిపింప ననువయిన యుపాయము వెదకవలెను. మించిపోయిన వెనుక మన కభిమతము సాధించుట దుష్కరము. అనిన విని చిత్రాంగ లఘుపతనకు లిట్లనిరి. మేను నిప్పులఁ బొరలిన క్లేశియుచున్నది. చిత్తము స్వాయత్తము కాదు. కర్తవ్య మిట్టిదని మాకుఁ దోఁచినది గాదు. నీవు బుద్ధిశాలివి. నీకుఁ దోఁపని

నడవన్=ఎప్పటి నడక నడచుటకును. కాళ్ళురాక=కాళ్లు స్వవశమై రాక యనుట. పాఱిపోకకున్ = పాఱిపోవుటకు. ఖేదపడి = శోకించి. కచ్ఛపము=తాఁబేలు. డాయన్=చేర (రూ) దాయన్. కన్నీరు విడచుచున్ = ఏడ్చుచు. నిస్తరించితిమి = దాఁటితిమి-పోఁగొట్టుకొంటి మనుట. విషాద పడు=ఏమియుఁ దోఁపక విచారపడు. అనువు=అనుకూలము. అభిమతము = కోరిక. ఎరియుచున్నది=మండుచున్నది. స్వాయత్తము=స్వవశము, స్వ + ఆయత్తము.

యుపాయము లేదు. చెలికానిని విపత్సముద్రముదరి చేర్చి శోక సముద్రము దరిఁ దరినలె మమ్మఁ జేయుము. నీవు దక్క మా కన్యము శరణము లేదు. కర్తవ్యమును మా కుపదేశింపుము. నీ పంపు శిరసా వహించి చేసెదము. అనిన హిరణ్యకుఁ డిట్లనియె. మనలోపల నొక్కరికి వచ్చిన మేలుగీళ్ళకు మన మందఱము పాలివారము. కాఁబట్టి యిప్పుడు ప్రాప్తించిన వ్యసనమునకుఁ బ్రతికారగవేషణము మీకుఁబోలె నాకు నావశ్యక మయి యుండఁగా మీరు సన్నింత వేఁడుకోనేల? ఏదో నాకుఁ దోఁచిన యుపాయము చెప్పెదను. మీరు మీబుద్ధిచేత విచారింపుఁడు. సర్వసమ్మత మయిన పక్ష మవలంబింతము. అని చెప్పి చిత్రాంగునిఁ జూచి నీవు వేఁటకాని కంటఁ బడకుండ ముందు పోయి వాఁడు వచ్చు మార్గములో నొక జలాశయము తీరమం దొదిగిలి నాలుగు కాళ్ళు చాఁచుకొని

విపత్సముద్రముదరి = ఆపద యనెడు సముద్రము యొక్క గట్టును. తరివలెన్ = ఓడవలె. (తరి = దాఁటించునది అని వ్యుత్పత్త్యర్థము) విపత్సముద్ర ... చేర్చుము — విపత్తును దొలఁగించి దానివలనఁ గలిగిన శోకమును బోఁగొట్టుమని యర్థము. శరణము = రక్షకుఁడు. పంపు = ఆజ్ఞను. శిరసావహించి = తలతోమోచి. మేలుగీళ్ళకున్ = శుభాశుభములకు, ద్వంద్వసమాసము. పాలివారము = భాగస్థులము - అనఁగా మనలో నొకనికి మేలువచ్చినను అందఱకును వచ్చినట్లు తలంతుమని యర్థము. ప్రతికారగవేషణము = మాఱుచేయుటయొక్క వెదకుట. అనఁగా వ్యసనమును బోఁగొట్టుకొను విధమును యోచించి యనుట. ఆవశ్యకము = అక్కఱ. అవలంబింతము = పట్టుదము - చేయుదమనుట. జలాశయము తీరమందున్ = నీటికొంకి యొక్క గట్టునందు. ఒదిఁగిలి = ఒత్తగిల్లి.

క్రూఁగన్ను వెట్టి మెడయెత్తి మోర సారించి చచ్చినట్లు మెదలక పండుకొని యుండుము. లఘుపతనకుఁడు నీమీఁదఁ గూర్చుండి కన్నులు పొడుచుకొని తినువానివలె నభినయించుచు నఱచుచు నుండువాఁడు. అంత వేఁటకాఁడు మృగము చచ్చిపడియున్నదని భావించి మంథరునితోడ విల్లు దించి నేలఁబెట్టి చేరునకు వచ్చును. నేను వానివెంటనే వచ్చి మంథరుని బంధము చిటుకనకుండఁ దెగఁగొఱికెదను. అంతట మంథరుఁడు జలాశయము ప్రవేశించువాఁడు నేను బొఱియ దూఱెదను. మీరు పాఱిపొండి. ఇది నాకుఁ దోఁచిన యుపాయము. అనిన విని చిత్రాంగ లఘుపతనకులు హిరణ్యకుని బుద్ధికి మిగుల సంతోషించి తదుక్త ప్రకారమునఁ గార్యము నిర్వర్తింప హిరణ్యకుఁడు దన పాలి కార్యము నెఱవేర్చి మనోరథసిద్ధిఁ బడసెను. అప్పుడు మృగయుఁడు మిగుల వగఁబొంది యల్లల్లఁ దన మనికిపట్టునకుఁ జనియె. హిరణ్యకాదులు తమ యిరవునకుఁ జని తొంటియట్లు సుఖముండిరి.

క్రూఁగన్ను వెట్టి = అర్ధనిమీలిత నేత్రము చేసి - కన్నులు సగము మూసికొనియనుట, క్రూఁగు + కన్ను - క్రూఁగన్ను - ప్రాతాది సంధి (క్రూఁగు = సోలు). మోర = మూతి. సారించి = చాఁచి. మెదలక = కొంచెమైనను చలింపక. అభినయించుచున్ = నటించుచు. భావించి = తలఁచి. చిటుకు = ధ్వన్యనుకరణము. బొఱియ = కలుఁగు. తదుక్తప్రకారమునన్ = ఆ హిరణ్యకునిచేతఁ జెప్పఁబడినవిధమున. నిర్వర్తింపన్ = నెఱవేర్పఁగా. తనపాలికార్యము - దారము కొఱుకుటను అనుట. మనోరథసిద్ధిన్ = కోరిక యొక్క నెఱవేరుటను. వగన్ = విచారమును. మనికిపట్టుకున్ = నివాసస్థానమునకు. తొంటియట్లు = తొల్లిటివలెనే. సుఖంబు = సౌఖ్యము. తృతీయావిభక్తియందుఁ బ్రథమ వచ్చినది. బా. వ్యా. కారక. 21.

మిత్రభేదము

అనంతరము రాజపుత్త్రులు విష్ణుశర్మతో నిట్లనిరి. స్వామీ! మీ యనుగ్రహమువలన మిత్రలాభము వింటిమి. ఇంక మిత్రభేదము వినఁగోరెదము. అనిన విష్ణుశర్మ యిట్లు చెప్పఁదొడఁగెను.

ఒక వనములో సింహ వృషభములు మిక్కిలి చెలిమి గలిగి యుండెను. ఒక మాయావియైన గోమాయువు వానికి విద్వేషము పుట్టించి సింహముచేత వృషభమును జంపించెను. ఆ కథ మీకు సవిస్తరముగా వినుపించెద సావధానముగా వినుండి.

అనంతరము = (అంతరము = అవకాశము. అది లేనిది అనంతరము) పిదప = మిత్రలాభము వినినపిమ్మట నని యర్థము. రాజపుత్రులు = సుదర్శనుండను రాజు కొడుకులు విష్ణుశర్మతోన్ - వచ్యర్థాముఖ్య కర్మముగాన నిట తోడ వర్ణకము వచ్చినది - ఒకానొకచో కువర్ణకమును వచ్చును. ఇట్లు - ఇదిముఖ్యకర్మము - దీని రూపాంతరములు, ఇటులు - ఇట్టులు, దీనివంటివి, అట్లు - ఎట్లు. స్వామి (వి) సామి. పూజార్థక మయినను సంబుద్ధియగుటచే నేకవచనము. మీ యనుగ్రహము - పూజార్థమున బహువచనము. మిత్రలాభము — స్నేహితుల ప్రాప్తిని గుఱించి చెప్పెడు భాగమని యర్థము; మిత్రభేదము - స్నేహితులకు వేఱుపాటు కలిగిన వృత్తాంతముఁ జెప్పుభాగమని యర్థము. వనములోన్ = వనమునందు - లోను శబ్దము సప్తమ్యేకవచనాంతము. చోటు శబ్దమువంటిది. చెలిమి = స్నేహము - తద్ధితాంతము. మాయావి = మాయగలది - టక్కరి - తద్ధితాంతము. గోమాయువు = నక్క (వ్యు) గోవులను బోవఁజేయునది (భక్షించునది). విద్వేషము = మిక్కిలి విరోధము. సవిస్తరముగా = విస్తరముతోఁ గూడినదిగా (విస్తరము = శబ్దసమూహము) ఆమూలాగ్రముగా నని భావము. దీనివంటిదే సావధానము (అవధానము = హెచ్చరిక)

దక్షిణాపథమంను రక్షావతి యను పట్టణము గలదు. అందు వర్ధమానుఁడను సార్థవాహుఁడు వాసము చేయుచుండును. అతఁడు తనకంటె సంపన్నులైన తన బంధువులను జూచి వారికంటె మిక్కిలిగా ధనము సంపాదింప వలెనని యెంచి యిట్లు చింతించెను.

అర్థము పురుషార్థములలోపల నుత్తమము. అర్థవంతున కసాధ్యము లోకమం దేదియుఁ గానము. కాఁబట్టి పురుషుఁడు న్యాయము దప్పక యే యుపాయముచేతనైనను ద్రవ్యము

దక్షిణాపథము=వింధ్యమునకు దక్షిణమునఁ గన్యాకుమారివఱకుఁ గల హిందూదేశభాగము. రక్షావతి=రక్షగలదియని సంజ్ఞ—చక్కని పరిపాలనముగలది యని భావము. వర్ధమానుఁడు—ఇది సంజ్ఞ-వృద్ధిఁబొందెడువాఁడని యర్థము. సార్థవాహుఁడు=బేహారి-బేరుల సమూహమును దేశాంతరమును బొందించువాఁడని వ్యుత్పత్త్యర్థము. సంపన్నుఁడు = సంపదఁగలవాఁడు-తద్ధితాంతము. వలెను—ఇది వలయునను క్రియకు నాదేశముగా వచ్చిన యవ్యయము—దీని కిట సంపాదింప ననునది కర్త. ఇట్లు మతియుఁ గొన్ని యెఱుంగునది. బా.వ్యా. క్రి. ౧౫౬. పురుషార్థములు = పురుష ప్రయోజనములు—ధర్మము, అర్థము. కామము, మోక్షము. ఇక్కడ ధర్మార్థకామములే యని యెఱుంగునది. అర్థవంతుఁడు-ఇది తద్ధితాంతము; గుణవంతుఁడు - ధనవంతుఁడు - రూపవంతుఁడు ఇత్యాదులును దీనివంటివని యెఱుంగునది. అ-ఆ వర్ణాంతశబ్దములకును, మీ, మూ వర్ణాంతశబ్దములకును పరమైన 'మత్' ప్రత్యయ 'మ'కారము 'వ' కారమగును. ఉదా-జ్ఞానవంతుఁడు-విద్యావంతుఁడు-లక్ష్మీవంతుఁడు - చమూవంతుఁడు. తక్కు-చోటుల మకార మట్లులే యుండును. ఉదా - మతిమంతుఁడు - శ్రీమంతుఁడు-ధీమంతుఁడు-ఇత్యాది. కాఁబట్టి-అగుటంబట్టి యని యర్థము. ఇది లాక్షణికావ్యయము. ఊరక -మఱి ఇత్యాదులు ప్రతిపదోక్తావ్యయములు.

సంపాదింపవలెను. ఇంత సంపాదించితి నింకేల యని తనియ రాదు. బుద్ధిమంతుఁడు జరామరణములు లేనివానివలె విద్యా ధనములు గడియింపవలెనని పెద్దలు చెప్పుదురు. ధనార్జనము నకు సాధనములు పెక్కులు గలవు. వానిలోపల వాణిజ్యము సర్వప్రకారములచే మేలయి కానఁబడుచున్నది. అని విచారించి పరదేశమునకు వలసిన తన దేశమందలి మేలుసరకులు సేకరించు కొని పెక్కు సరకులు బండ్లమీఁద గుఱ్ఱములమీఁద వేసడ ములమీఁద నెత్తించి కొన్నిటికి భారవాహులను నియమించి మంచి కంచర మొకటి సిద్ధము చేసికొని దానిని సంజీవక

ఇంకేల-ఇంకన్+ఏల,ఏలా(రా)ఏల-కళ-ఏలనన పదము తప్ప. ఏలయన-ఏలన సాధువులు. తనియన్ = తృప్తిపడ-ఇది రాదు అను క్రియకుఁ గర్త. బుద్ధిమంతుఁడు-ఇది యర్థవంతుఁడను శబ్దమువంటిది. అక్కడ వకారము నిక్కడ మకారమును భేదమని తెలియవలయును. జర = ముదిమి-ముసలి తనము. లేని—కలుగు ధాతు వ్యతిరేకార్థక విశేషణము. జరామరణములు లేనివానివలె-ఈ యర్థముగల పద్యము గ్రంథము మొదటఁ దెనిగింపఁబడి యున్నది. 'జయయు మృతియు లేని జనుఁడట్లు' ఇత్యాది. దీని మూలశ్లోకము 'అజరామరవత్ప్రాజ్ఞో విద్యా మర్థంచ సాధయేత్ । గృహీత ఇవకేశేషు మృత్యునా ధర్మ మాచరేత్' అని. గడియించు=సంపాదించు, (కృ) గడన-ఇది వైకృతము. ఆర్జనము=గడన-సంపాదనము. సాధనములు= ఉపకరణములు. పెక్కులు-దీనికి మహాదర్థకరూపము-పెక్కురు. వాణిజ్యము = వణిజునిపని. బేరము-తద్ధితాంతము. ప్రకారము=విధము. వలసిన= ఆవశ్యకమైన. సేకరించు = చేర్చు. వేసడము = వేసరము—కంచరగాడిద. ఎత్తించి=వేయించి. భారవాహులు = బరువు మోయువారు. కంచరము = గాడీ-ఇది వైకృతము-దీనికిఁ బ్రకృతి-చఱ్ఱురు-వైకృతమునందు వర్ణవ్యత్యయము పంకమువలె. సంజీవకము-ఇది సంజ్ఞ-బ్రదికించునది యని వ్యుత్పత్త్యర్థము. నందకము-ఇది సంజ్ఞ-సంతోషింపించునది యని వ్యుత్పత్తి.

నందకములను నట్టిలను బూన్చి యెక్కి సముచితపరివారముతో నుత్తరదేశమునకుఁ బయనమాయెను. ఇట్లు బయలు వెడలి కడుదూరము గడచి సుదర్శనను పర్వతము చేరువ కాంతార మందుఁ బోవుచుండఁగా సంజీవకము కంచరమును లాగఁ జాలక లాగుచు జాతి మోఁకాలు విఱుగ నేలఁబడియె. అంత నా వర్తకుఁడు కంచరము దిగి శీఘ్రముగా సంజీవకము మెడ కాఁడికట్టు వదలించి రెండవ యెద్దును విడునఁబంచి యిట్లు చింతించెను. ఈ పాటిది నా కంచరపు కెద్దులలో నొకటిగాని లేదు. ఇది మంచి నట్టి. ఇక్కడ నిలిచి తగిన చికిత్స చేయించి కొని పోదునంటినా యిది మహారణ్యమధ్యము. నిలువఁ జోటు గాదు. దీని కీ యడవిపాలు కావలసిన గతి యున్నది కాఁ బోలును! ఎట్టి పౌరుషముగాని దైవగతి విపరీతమైనప్పుడు పనికి రాదు. కీడో మేలో యే కాలమం దేది రావలెనో యది రాక

నట్టి=ఆట్టి-కొరివ్విన ఎద్దు. పూన్చి=పూనఁజేసి-పూను ధాతువు ద్వికర్మకము. సుదర్శను=పొందనే పొందఁగూడనిదని సంజ్ఞ. చేరువ = సమీపము (క్ష) కాంతారము=పేరడవి, చొర నశక్యమైన యడవి యని యర్థము; లాగు=ఈడ్చు, ఇది నామవాచకమైనచో విధ మర్థము. సార్థబిందుక నామమైనపుడు లంఘన మర్థము. మోఁకాలు=మోఁదు + కాలు, మోఁదుటకు అనువైన భాగము గల కాలని యర్థము. కాఁడి=నొగ చివర యడ్డముగాఁ గట్టఁబడి యెద్దుల మెడమీఁద నుంపఁబడు కొయ్య (కాఁడిమ్రానికిని బండికిని నడుమ నిడుపుగా నుంచెడు కొయ్యనొగ) కంచరపు టెద్దు-కంచరము + ఎద్దు-పుగా గమఁటుగాగమములు; చికిత్స=వైద్యకర్మము. గతి=విధి. పౌరుషము=పురుషప్రయత్నము, తద్ధితాంతము, దీనికి మఱియొక యర్థము నిలుచు; దైవ గతి = దైవనిర్ణయము. విపరీతము=విరుద్ధము-ప్రతికూలము.

మానదు. కాఁబట్టి యెొక యిమ్మొదప్పు వచ్చినప్పుడు వెనుఁబడ రాదు. వెనుఁ బడితిమిపో దానిచేత సాధ్యమేమి? అని చింతించి తన సరకుబండ్లు కావళ్ళు మొదలయినవి దారి సాగిపో నెలవిచ్చి తన కొంత పరివారమును గంచరమునకు బళకర ముంచి యక్క-డికి సమీప మందున్న ధర్మపురమను గ్రామమునకుఁ బోయి పోతరించి లావు గలిగిన యెొక యెద్దును విలిచి తెచ్చి కంచరము నకుఁ గట్టించుకొని సాగిపోయెను.

తరువాత నా కాటియందు సంజీవకము భాగ్యము మం చిది కాఁబట్టి క్రూరసత్వముల బారికిఁ దప్పి విఱిగిన మోఁకాలు చక్కఁబడి లేచి నడయాడసాగెను. "ఆయువు గట్టిగా నుండెనా మహామృత్యువువాతఁ జొచ్చియయిన మరలి రావచ్చును. కాలము సమీపించెనా కోటివేల్పులయిన మరణము మానుపఁ జాలరు." పిమ్మట నా వృషభము వనములో విచ్చలవిడిగాఁ

ఇమ్మొదప్ప = సంకటము, ఇక్కట్టు (ఇమ్మొ + తప్ప) వెనుఁబడుట= విసాదించుట, చింతించుట. కావళ్లు-కావడిశబ్దము (వై) (ప్రాక్సతము-కావడీ) బళకరము=కావలి. పోతరించి=క్రొవ్వి. లావు=బలిమి. విలుచు= కొను-వెలకుఁదీయు, (కృ) విలువ. కాడు (నానా) అడవి. శ్మశానము. కాఁడు = నాటు. సంజీవకము నడయాడ సాగెను అని యన్వయము. భాగ్యము-(దాని) అదృష్టము; సత్వము (నానా) జంతువు, బలము, సత్వ గుణము. బారి=బంధనము-లోఁకువ యని యర్థము(ప్ర)సారీ నడయాడు = నడచు. వాతన్-వాయి శబ్దము సప్తమ్యేకవచనము. సమీపించెనా=సమీపించెనేని. వేల్పు = దేవత-కృదంతము. మానుపన్=తొలఁగింప-మానుధాతు ప్రేరణము. ఆయువు...చాలరు-ఇది గ్రంథకర్త చెప్పిన నీతి. విచ్చలవిడి= స్వేచ్ఛ.

దిరుగుచు నానాఁడు మంచి పచ్చికమేఁత కడుపార దొరకఁబట్టి లెస్సగా బలిసి యొకనాఁడు పర్వతగుహలు మాఱు చెలఁగఁ గణిల్లని అంకె వేసెను.

ఆ కాననమందుఁ బింగళకమను సింహము గలదు. అది పుండరీకముల ఖండించుచు సలుగుల నలుగులంపడఁజేయుచుఁ గాసరముల మీసరము గాసించుచు బుక్కముల శిక్షించుచుఁ దక్కిన ముక్కిడి మృగముల లెక్కింపక యిచ్చకు వచ్చినట్లు విహరించుచు నాఁడు డప్పినడి పిపాసితమై యమునాకచ్ఛమునకుం బోయి ప్రలయసమయ పర్జన్య గర్జానుకారి యయిన సంజీవకము భీషణఘోషణము విని వెఱఁగుచే రాపడి నిలు

నానాఁడు-నాఁడు + నాడు=ప్రతిదినము. ఆరన్=నిండఁగా (ఆఱన్=ఉపశమింపన్-నశింపన్) మేఁత=ఆహారము, మేయుధాతు-క్య. ఒకనాఁడు=ఒక దినమునందు-కాలవాచకముగానదీ నికిఁ బ్రథము. వృత్తియందుఁ గొన్నియెడల నిదికేవలకాలవాచకంబగు-ఎల్లనాఁడు, కన్నియనాఁడు ఇత్యాదులు. (నాడు=దేశము) చెలఁగన్=ప్రోగఁగా, శబ్దంపఁగా. కణిల్లు-ధ్వన్యనుకరణము. అంకె=ఎద్దుకూఁతి. కాననము=అడవి(వి)కాన. పుండరీకము (నా నా) బెబ్బులి, తెల్లదామర, తెల్లగొడుగు. సలుగు=అడవిపంది. అలుగులంపడు-అలుగులము + పడు=బాధపడు. కాసరము=అడవిదున్న. మీసరము=మిక్కిలి-అధికము. గాసించు=బాధించు-నామధాతువు. బుక్కము=భల్లుకము-ఎలుగు. ముక్కిడి=అల్పము, క్షుద్రము. లెక్కించు=లెక్కపెట్టు-నామధాతువు. విహరించు=వేడుకగా సంచరించు-నట్టాడు. డప్పి=దప్పి-శ్రమము-డయ్యాధాతువువలనఁ గలిగినది. పిపాసితము=పానముచేయ నిచ్ఛ గలది. కచ్ఛము=జువుకు నేల దరి. దీని వికృతి కచ్చెము. పర్జన్య=మేఘము-మేఘాధి దేవతయు. గర్జ=ఉఱుము. అనుకారి=పోలునది. భీషణఘోషణము = భయంకరమైన ధ్వని. వెఱఁగు=విభ్రాంతి, ఆశ్చర్యము. రాపడి = స్తంభించి (రాయి + పడు) నిలుచుండు-శబ్దపల్లవధాతువు.

చుండెను. ఆ యరణ్యమందుఁ గరటకదమనకములను జంబుక ములు గలవు. కరటకుఁడు దమనకునితో ముచ్చటలాడుచుండి సంజీవకము రావము విని యదిరిపడి గుండెలు తటతటఁ గొట్టు కొనఁ గొంతవడికి సంబళించుకొని యావలనికిఁ గ్రేగంటిచూపు నిగిడించి చెవి నిక్కించి యాలించి యిట్లనియె. మఱి సద్దు గానము. నీవును వింటివిగదా? ఇది యేమి? ఇంతకాల మాయెను. ఈయరణ్యములో నున్నారము. ఇట్టి బెట్టిదపుఁగూఁత యెన్నఁడుగాని విన్నది లేదు. అనిన దమనకుం డిట్లనియె. ఔనౌను. ముందు విన్నది గాదు. ఈ శబ్దము మహాశ్చర్యము. అదిగోఁ జూడు మనరాజు పింగళకుఁడు యమునాకచ్ఛమునకుఁ బోవువాఁడు రాపడి నిలుచున్నాఁడు. ఆ ధ్వని విని కాఁబోలు. అని చిఱునవ్వు నవ్వి యంతవాఁ డట్లాయెను. మనమనఁగా నెంతవారము? అనినఁ గరటకుం డిట్లనియె. ఇట్టి బెట్టిదపుటులివు గావించిన జంతువు కొంచెపాటిగా నుండదు. ఎక్కడనుండి వచ్చి యా జంతు పీ వనము చేసెనది. ధ్వనిమాత్రము విన్నాము గాని యా జంతువును గానము. నిన్న మాపో నేఁడు తెపో యిక్కడి

ముచ్చట = ఒకరికొ నొకరు ప్రియమున మాటలాడుట-సల్లాపము. సంజీవ కము రావము-సాధ్యుగుషష్ఠీతత్పురుషము. రావము = రవము, ధ్వని. తటతట=ఇది యనుకరణశబ్దము. వడి = వేపు, కాలము. సంబళించుకొను= నిర్వహించుకొను. వలను=దిక్కు-ఔపవిభక్తికాంతము. క్రేఁగన్ను-క్రేవ+ కన్ను=కడగన్ను, కటాక్షము(క్రేవ=పార్శ్వము) నిగిడించి=నిగిడిచి-నిగిడ్చి-వ్యాపింపఁజేసి. ఆలించి=విని. మఱి=పిమ్మట. బెట్టిదము=భయంకరము. కాఁబోలున్ = ఏమో. ఉలివు = ధ్వని-ఉలియుధాతువు వలనఁబుట్టినది. మాపు=సాయంకాలము-రాత్రియను నర్థమును గలదు. తెపు=వేకువ.ప్రభాతము-దీనికి అపరదినమనియు నర్థము గలదు. (తెపు మాపు-అని వ్యవహారము)

కది వచ్చి చేరియుండును. ఇంక నేమి యిడుమపాటు రానున్నదో యెవ రెఱుఁగుదురు. అనిన దమునకుం డిట్లనియె. ఈ యరణ్యము మనకు మాన్యక్షేత్రమా? లాఁతిచోటికిఁ బోఁగూడదని నియమమా? మఱి యరణ్యము లేదా? అభిజన మెవ్వరికిఁ గాని దుస్త్యజమే. అట్లని చావున కొప్పుకోవచ్చునా? ఈ విచారమేల? ఇప్పుడు మనకు వలసదీయునంత యిడుమ యేమి వచ్చినది? ఈ వఱి కా జంతువు నల్లనిదో తెల్లనిదో యెఱుఁగము. అది క్షుద్రజంతువో మహాజంతువో ముందు తెలిసికొని పిమ్మటఁ గర్తవ్యము విచారింతము. పిట్ట కొంచెము కూఁత ఘన మన్నట్లు క్షుద్రజంతువునకు సయితము పెద్ద నోరుండవచ్చును. జంతు వంత బెట్టిదము గాదనుటకు నాకు సూచన కొంత గానఁబడుచున్నది. నీవును జూడుము. ఆ వంక జంతువులు కలగుండువడిన లక్షణ మేదియుఁ గానరాదుగదా. మంచిది యూలకింపుము. క్షోభ మే మాత్రము పుట్టిన నల బలము వినరాకుండునా? అనినఁ గరటకుం డిట్లనియె. అవు నది నిజమేకాని కడపట నది యిట్టి జంతువు కూఁత యని మాత్ర

ఇడుమపాటు=ఆపద. మాన్యము=పన్ను లేని భూమి-దీని వికృతి మన్నెము. లాఁతి=ఇతరము. నియమము=ఏర్పాటు(ని)నేమము అభిజనము=జన్మభూమి-కాణాచి. దుస్త్యజము=విడువఁ గూడనిది. అట్లని...వచ్చునా!=ఇందాఁక భీతిచింతచేసి యిఁక భీతికి హేతువు లేదని విచారింపఁబడుచున్నది. వలసదీయు=రాజోపద్రవాదులచే నూరు విడిచి పాఱిపోవు. క్షుద్రజంతువు=అల్ప జంతువు. కర్తవ్యము = చేయఁదగినది. పిట్ట కొంచెము కూఁత ఘనము-ఇది సామెత. నోరు—ఇక్కడ ధ్వని. సూచన=జాడ. వంక=పార్శ్వము. కలగుండు=కలఁతి, క్షోభము. అలబలము=కలకలధ్వని.

మాకళింతకు రాలేదు. అని చెప్పి కొంతదడ వూరకుండి చిఱు నవ్వు నవ్వి యిట్లనియె. ఇప్పటికి స్మరణకు వచ్చినది. మఱే యేమి గాదు విను. కొన్నాళ్ళకు మునుపు వర్తకఁ డొకఁడు దారిని బోవుచుండి తన బండి యీడువఁ జాలక యీడిగిలఁ బడిన యొక బక్కయెద్దును బ్రయాణత్వరఁబట్టి యీ యడవిలో విడిచి పోయినాఁడు. అది యీ కాటిలో గడ్డిపరకలు కొఱికి తేఱుకొని కొంత చియ్యఁబట్టి యక్కడక్కడ నట్రాడఁగాఁ జూచితిని. అప్పుడు మనము విన్నది దాని అంకె. దానికి సందేహము లేదు. ఊరక యీవఱకుఁ బనికిమాలిన పిఱికితనము తెచ్చుకొంటిమి. మనకంటె శూరుఁడు మన రాజు. నావుఁ దమనకుం డిట్లనియె. మనము పింగళకునకు మంత్రిపుత్రులమై యుండి యిప్పు డూపేక్షింపరాదు. డాయఁ బోయి యాతని భీతి మానింతము. ఈ నెపముచేత నాతని కొలువు సంపాదించుకొని యనుగ్రహము వడయవచ్చును. రాజానుగ్రహముఁ బొందినవానికి సర్వసంపదలు గలుగును. మన మాతని తొంటినిగ్రహము పాటింపరాదు. మనకుఁ

ఆకళింత=బోధము, అవగాహము. స్మరణకుఁ = తలఁపునకు. కొన్నాళ్ళు-కొన్ని + నాళ్లు. ఎన్నాళ్ళవంటిది. ఈడిగిలఁబడు=అశక్త్యాదులచే నడవక పీఁట వెట్టుకొనియుండు. చియ్య=కండ-మాంసము. నట్రాడు=విహరించు. ఊరక=కారణము లేక. మనకంటె శూరుఁడు మనరాజు—ఇక్కడ వ్యతిరేక లక్షణచే మనకంటెఁ బిఱికి మనరాజని యర్థము. ఒప్పరికించు=ఊహించు. డాయు=సమీపించు(రూ)దాయు. మానింతము=మానఁ జేయుదము. నెపము=వ్యాజము (రూ) నెవము (వ్ర) నిభము. తొంటి=తొల్లింటి - మును పటి-తొల్లి శబ్దము వలనఁ గలిగిన విశేషణము. నిగ్రహము = త్రోపాట, బెదరుమాట. పాటించు = ఆదరించు.

దదనుగ్రహ సంపాదనము ముఖ్యముగాని తక్కిన మో అకుఁదన మేల? అనినఁ గరటకుం డిట్లనియె. దమనకా! వినుము. ఈతని సంగతి నాకు సరిపడదు. మునుపు కొలువుండి పడ్డపాట్లు చాలును. ఈతఁ డెత్తువారి చేతిబిడ్డగాని యొక తెన్నునఁ బోవు వాఁడు గాఁడు. ఇట్టివాని కొలువు మిక్కిలి కష్టము. అది యుండనిమ్ము. ఉదరపోషణముకయి పరులకు శరీర మమ్మ్మి కొనుట మిక్కిలి హేయము. పరాయత్తవర్తనుఁడు మృత కల్పుఁడు. అయినను సేవకుఁడు స్వకృత్యములయందు స్వామి చేత మన్ననం బడసెనా సేవాదుఃఖము కొంత నిస్తరించును.

మోఅకుఁదనము=మూర్ఖము. సంగతి = సంబంధము. ఎత్తువారిచేతిబిడ్డ - ఇది యొక సామెత - ఎవరెత్తుకొన్నను బిడ్డ వారిచేతికి భేద మెంచక పోవునట్లు - ఎవరేమి చెప్పినను యుక్తాయుక్తములను విచారింపక దానిఁ జేయువాఁడని భావము. తెన్ను=మార్గము. ఉదరపోషణము=కడుపుకాఁపు దల-కడుపునించుకొనుటకై అనుట. శరీర మమ్మ్మికొనుట-పరాధీనమగుట యని యర్థము. హేయము=విడువఁదగినది. పరాయత్తవర్తనుఁడు=ఇతరుల కధీనమైన యునికి గలవాఁడు. మృతకల్పుఁడు = కొంచెము కొఱఁతగాఁ జచ్చినవానితో సమానుఁడు—ప్రాణవాయువులు మాత్ర ముండునుగాని తక్కిన విషయములందుఁ జచ్చినవాఁడని యర్థము. అయిననుఁ-అని చెప్పుట చేతఁ గ్రిందటఁ జెప్పఁబడిన విషయమునకు మీఁదఁ గొన్ని హేతువులవలన విరోధము చెప్పఁబడునని యెఱుంగునది. ఇట్లంతట నూహ్యము.ఇచట సేవ యుత్తమ మధ్యమాధమ భేదంబులచే మూఁడు విధములు గలదిగాఁ జెప్పఁ బడియున్నది. స్వకృత్యము=తనపని-తాను జేయవలసిన రాజకార్యమని యర్థము. స్వామి=ప్రభువు-ఒడయఁడు. మన్నన=సమ్మానము-వైకృతము. నిస్తరించును = కడచును. రాజసమ్మానము వడయుట యుత్తమసేవ.

ఉపేక్షితుఁ డయ్యెనా దానికంటె దుఃఖము లేదు. పరాభూతుఁ డయ్యెనేఁ జెప్పవలసినదేమి? సేవావృత్తిచే నచ్చు పాయసము కంటె స్వచ్ఛంద వృత్తిచే లభించు గంజి మేలు. కాఁబట్టి ప్రాప్త లాభముచేఁ దృప్తిపడి సుఖముండుదము. ఇప్పు డాతని భీతి మానుపవలసిన జోలి మనకేమి గలదు? జోలి నూరిన పని పయిఁ బెట్టుకొన్నవాఁడు మేకును బెఱికిన కోఁతివలెఁ దప్పక ముప్పుఁ జెందును. ఆ కథ చెప్పెదను వినుము.

మగధదేశమునం దరిదుర్గమను పట్టణము గలదు. అందు మహావిభవ సంపన్నుఁడయి శుభదత్తుఁడను వైశ్యుఁడు గలఁడు. అతఁడు సంతానము లేనివాఁడు. కాఁబట్టి తన ధన మారామ తటాకాదిప్రతిష్ఠల వెచ్చించుచు నా పట్టణములో నొక దేవ ళము జీర్ణమై యుండఁగాఁ జూచి కారువులను రావించి తగిన వేతనములు నియమించి దానిని గట్ట నియోగించెను. వారు

ఉపేక్షితుఁడు = ఒప్పరికింపఁబడిన వాఁడు. చక్కఁగాఁ గొలువు చేసియు రాజసమ్మానము నొందనివాఁడని భావము. ఉపేక్షితుఁడగుట మధ్యమసేవ. పరాభూతుఁడు = అవమానింపఁబడినవాఁడు. పరాభూతుఁడగుట యధమసేవ. చెప్పవలసినదేమి. ఉపేక్షితునకే మితిలేని దుఃఖము గలుగుననినఁ దిరస్కరింపఁబడినవాని దుఃఖ మింతయని చెప్పవలెనాయని యర్థము. స్వచ్ఛందము = స్వతంత్రము. పయస్సు = పాలు, నీరు, పాయసము, పయోధి ప్రాప్తము = పొందఁబడినది. దీనఁగలుగు విశేష్యము ప్రాప్తి. జోలి = సంబంధము. ముప్పు = ఆపద. దీనికి వార్ధకమనియునర్థము (ముప్పునఁ బ్రాయంపుటాలు) అరిదుర్గము = శత్రువులకుఁ జొరరానిదని యన్వర్థసంజ్ఞ. శుభదత్తుఁడు. శుభమైన యీవి గలవాఁడని సంజ్ఞ ఆరామము = ఉద్యానము. ఆటతోఁట. ప్రతిష్ఠ = స్థాపనము, నిఱుపు వెచ్చించు = వ్యయించు. వైకృతము. జీర్ణము. శిథిలము కావులు = వడ్రంగి లోనగు పనివారు — శిల్పులు. వేతనము = జీతము.

దానిని గట్టుచుండఁగా నొకనాఁడు చేనదూలము అంపముచేఁ గోయించుచు నది సుకరముగా ప్రేల్చుటకు సూత్రధారుఁ డక్కడక్కడ ప్రమానిమేకులు దిగఁగొట్టి మధ్యాహ్నభోజనార్థము కూలివాండ్రును దానును బోయెను. అప్పు డాపరిసర తరువులందుఁ దిరుగుచున్న కోఁతులు దేవాలయము దాపునకు వచ్చి ప్రాకారములు ప్రాఁకుచుఁ ప్రాంతమహీరుహముల మీఁదికిఁ గుప్పించి దాఁటుచు ప్రేలు గొమ్మలు కాళ్ళతోఁ బట్టి తలక్రిందుగా ప్రేలుచుఁ బెనుఁగొమ్మలు కరములతోఁ బట్టి యూఁచుచు విమానముల మీఁదను గూర్చుండి వికృతముగా బరులు వీఁపు గీఱుకొనుచు నిక్కుచు బొమలెత్తి యుఱుగొట్టి బెదరించుచుఁ బండ్లిగిలించుచు వెక్కిరించుచు నొకటినొకటి కుఱువుమీఁదఁ బండించుకొని మేనిపేల నేరి నోర ప్రేసికొనుచుఁ గిలకిలారావములు గావించుచు నొండొంటితోఁ బోరుచు ఫలములు భక్షించుచు మధువు లానుచు స్వాభావిక చపలభావ

సుకరము=సులభము(వ్య) దుష్కరము. ప్రీల్చు=చీలుచు.—ప్రీలుధాతువు. సూత్రధారుఁడు = దారము పట్టువాఁడు. పోయెను-దీనికిఁ గర్తలు కూలివాండ్రును సూత్రధారుఁడునుగా నుండినను తా శబ్దము చెప్పఁబడుటచే దానికివలెఁ గ్రియకు నేకవచనము గలిగెను. బాల. వ్యా. క్రి ౦౨౦ సూ. పరిసరము = సమీపము. ప్రాకారము = ప్రహరిగోడ. ప్రాఁకు = ఎక్కు. ప్రాంతము=సమీపము. మహీరుహము=భూమియందుఁ బుట్టినది-వృక్షము. కుప్పించి=ఊపిరిపట్టి—ఇది(వైకృతము) ఊఁచు=ఊఁగుధాతువు ప్రేరణము. విమానము=స్తూపము, మేడవంటిది. వికృతము=వికారము నొందినది. బరి=ప్రక్క-పార్శ్వము. ఉఱుగొట్టు=ఉఱ్ఱునను. కుఱువు=తొడ. పేను+లు పేలు-బహువచనములో నువర్ణ లోపము. బా. వ్యా. ఆచ్చిక. ౨౦. కిలకిలారావములు=కిలకిల యను ధ్వనులు. ఆను=ప్రాగు.

ముతో(దికుగుచుండెను. ఒక ముసలి మల్లు కాలచోదితమై చేన దూలము డాసి యెక్కి దాని నెటియలో(దన ముష్క-ము ప్రవేలం గూర్చుండి యందు బిగియ(గొట్టిన కొయ్యమేకు రెండు చేతులతో(జిక్క(బట్టి బలిమితో నూడ(బెటికి యా నెటియలో ప్రవేలు ముష్కము చదియుట(జేసి తోలుచు(గాలధర్మము నొందెను. కా(బట్టి జోలి మాలిన పనికి(బోరాదు.

మన మిప్పు డాతని భృత్యపదమందు లేము. అతనికి(గొత్త కొలువుకాం డ్రినేకు లున్నారు. స్వామి హితా హితమ్ముల విచారము వారిదిగాని మన కా యధికారము లేదు. పరాధికారము పయివేసికొన్నవా(డోండ్రవెట్టి మో(దువడిన గాడిదవలె వినాశము(బొందును. ఆ కథ చెప్పెదను సావ ధానముగా వినుము.

వారణాసియందు ధానకమల్లు(డను చాకివాఁడు గల(డు. ఒకనాఁడు వాఁడు మిగుల బట్టలు గుంజిన బడలికచేత

మల్లు=కోఁతి. కాలచోదితము=యముని చేత((బేరేఁపఁబడినది (ఆయువు ముగిసిన దనుట) నెటియ-చీలిక, (రూ) నెట్టీయ, నెట్టె. నెట్టె ముష్కము= అండకోశము. చిక్క(బట్టి—గట్టిగా(బట్టి యనుట. చదియు = నల(గు. తోలుచు = విలపించుచు. కాలధర్మము = చావు. భృత్యపదము = సేవక స్థానము - కొలువు. కొలువుడుకాఁడు = సేవకుఁడు-తద్ధితాంతము. పయివేసి కొను-తనకుఁదా నే యారోపించుకొను. ఓండ్ర=గాడిద యఱుపు. మో(దు= దెబ్బ - ఇది క్రియయు నగు. వారణాసి = వరణ అసి యను రెండు నదుల చేరువున నున్నట్టిది-కాశి, (రూ) వరాణసి, వారణాసి, వారాణసి; ఇందు తుదిరూపము సంస్కృత నిఘంటువులలో(గానరాదు. కావున నిది తద్భవము కావచ్చు. ధావకమల్లు(డు = చాకివారిలో శ్రేష్ఠుఁడని సంజ్ఞ. గుంజిన బడలిక-ఉదుకుట చే(గల్గు శ్రమము.

మయిమఱచి గుఱుపెట్టి నిద్రఁబోవుచుండెను. ఆ నడికిరేయి వాని యిల్లొక దొంగ చొచ్చెను. అప్పుడు వాని యింటివాకిటఁ గాలి బందముతో గాడిదె నిలుచుండెను. ఆ యింటి కావలి కుక్క దాపునఁ గూర్చుండి చూచుచుండెను. అవి యొండొంటితో 'లోనికి దొంగ చొచ్చినాఁడు చూచితివా?' 'చూచితిఁ జూచితి.' 'మఱి యేల మొఱుగవు?' 'నాపని విచారింప నీకేమి నిమిత్తము?' 'మన దొరయిల్లు దొడ్డనోఁగా నొప్పి కింపనచ్చునా?' "నీవే మొఱుఁగుదువు? రాత్రిందివము నిమిషమాత్రమయినఁ బ్రమాదపడక తలవాకిలి నదలక యిల్లు గాచుకొని యుండుదును. ఆవంతయయిన నానలని ప్రయోజన మొఱుఁగక యేలిక నాయందు సాకతము లేక యున్నాఁడు. కాఁబట్టి కూడు కమికెఁడయిన దొరకుట కబవయ్యె. పాఱుఱుఁగని దొరను సేవించుటకంటె మిన్నకుంట మేలు."

ఇట్లు ఖరశ్వానములు ప్రశ్నోత్తరములు జరుపుచుండఁగా గాడిదె మిక్కిలి కోపించుకొని "యోరి! దురాత్మ వినుము.

మయిమఱచి-జాగ్రదవస్థ మానియని యర్థము గుఱుపెట్టి=గుఱుకయిడి. నడికిరేయి=అర్ధరాత్రము. బందము=కట్టు-ఇది ద్వైకృతము. లోనికి...మేలు-ఇవి ఖరశ్వానముల ప్రశ్నోత్తరములు. దొడ్డనోవు=కొల్లపోవు. రాత్రిందివము=రేయిపగలు. ప్రమాదము=ఏమఱుపాటు. ఏలిక=ప్రభుఁడు - పాలకుఁడు. కృదంతము. సాకతము=అనుగ్రహము. కమికెఁడు (కమికిలి+ఎఁడు) కమికిలి=క్రిందుగా వంపఁబడిన వ్రేళ్లుగల చేయి - మూనార్థమున ఎఁడువర్ణకము లివర్ణలోపము. బా.వ్యా.తద్ధి అగి,అఁ. పాటు=శ్రమము. మిన్నక=ఊరక. ఖరము=గాడిద (దీనికి తీక్ష్ణమనియు నర్థము) శ్వానము=కుక్క. కోపించుకొని-ఆత్మనే పదార్థమగుటచే అర్థవిశేషము గమనించునది.

ఒక పోరామి వచ్చినప్పుడు స్వామి దోషములు దడవి యుపేక్షించి యుంట భృత్యునకు ధర్మము గాదు. అదియును గాక స్వామిరక్షణము విచారింపక సేవకుఁడు స్వార్థపరుఁడయి స్వకృత్యమునందుఁ బ్రవర్తింపఁడేనిఁ గృతఘ్నుఁడగును. నీవు పాపిష్ఠుఁడవు. దొసఁగు పొసఁగినప్పుడు స్వామికార్య ముపేక్షించితివి. ఇంతటితో నేదియు మునిఁగిపోదు. నీపని నాచేతఁ గాదా? చూడు మన యేలిక నిప్పుడు ప్రబోధించెదను." అనిచెప్పి గట్టిగా నోండ్రపెట్టెను. అంత నా మడివేలు నేలుకొని నిద్రాభంగ మాయెనని మహాకోపముతో లేచి యొక బడియతో గాడిదెను మోఁదెను. ఆయమం దా మోఁదు తాఁకుటఁజేసి యా గాడిదె ప్రాణములు విడిచెను. కాఁబట్టి పరాధికారము మనము పయిఁబెట్టుకోరాదు.

అక్కడక్కడఁ బసరముల డొక్కలు వెదకుట మన కార్యము. అది మాని యీ విచారమేల? భక్షితావశిష్టమయిన మాంసము కావలసినయంత యున్నది. రారా భక్షింతము.

పోరామి=అక్క-అ, ఆపద. తడవి=విచారించి. స్వార్థపరుఁడు=తన ప్రయోజనమండే యాసక్తిఁ గలవాఁడు. కృతఘ్నుఁడు=చేసినదానిఁ జెఱచువాఁడు-చేసినమేలు మఱచినవాఁడని యర్థము (వ్య) కృతజ్ఞుఁడు. దొసఁగు=ఆపద. పొసఁగు=కలుగు సంభవించు. మునిఁగిపోదు-చెడదని యర్థము. నీపని = నీమేఱుగు: ట్టిపని యని యర్థము. ప్రబోధించు=లేపు-మేలుకొలుపు. మడివేలు=చాకి (మయిలను మడిగా వేల్చువాఁడని వ్యుత్పత్త్యర్థము) ఆయము=కొద్దిపాటిదెబ్బనైనను సహింపఁజాలని కణఁతప్రక్క లోనగు మర్మస్థానము. పసరము=నాలుగు కాళ్ళ జంతువు. పశువు - ఇది వైకృతము. డొక్క = హస్తశాఖలకును బాదశాఖలకును నడిమి దేహము. భక్షితావశిష్టము-తినఁగా మిగిలిన దనుట. రమ్మ + రమ్మ రా రమ్మ, రారా.

అనిన దమనకుఁ డిట్లనియె. ఇప్పుడు త్వరయేల? మెల్లగాఁ బోయి భక్షింతము. ఎల్లజంతువుల కాహార నిద్రాభయములు సహజధర్మములు. కుక్షింభరిత్వముచే గారవము రాఁబోదు. మిత్రామిత్రుల కుపకారాపకారములు చేయ వేఁడి బుద్ధిమంతులు రాజాశ్రయము గోరుదురు. స్వోదరమాత్రము భరింప నేఁడు లేఁడు? ఏనాఁడు జీవింప ననేకులు జీవింతురు వాని మనుగడయే సఫలము. వాఁడొకఁడు జీవించువాఁడు. ఆమిష శూన్యమయి వసాగంధిలమైన శల్యము దొరకినమాత్రాన వేఁపి మిక్కిలి సంతోషపడునుగాని దానిచే దాని యంగద గొంతయైన నడంగదు. కేసరి యాసన్నమైన ముక్కడి మృగమును లెక్కింపక నిజఖరనఖర విదారితహస్తిమస్తమస్తిష్కమ కోరును. ఎల్లవారు సత్త్వానురూపమైన ఫలమే వాంఛింతురు. శునకము తన కోగిరము పెట్టువానికడఁ జేరి త్రోఁకాడించును. నేలఁబడి నోరు కడుపు చూపును. ఇన్ని పాట్లునడు కుక్క కొక్క ముద్ద వంటకము

సహజధర్మములు = కూడఁబుట్టిన భావములు. కుక్షింభరిత్వము = పొట్టపోసికొనువాని తనము. గారవము = గొప్పతనము, వై; ఆశ్రయము = ప్రాపు. ఏఁడు = (ఏ+వాఁడు) ఎవ్వఁడు-సంవత్సరమునియు నర్థము, ఏడు = సప్తసంఖ్య. మనుగడ = బ్రదుకు-జీవనము-మను ధాతు కృదంతము. ఆమిష శూన్యము = మాంసము లేనిది. వసాగంధిలము = ముఖగుడుఁ గ్రొవ్వుచే దుర్గంధమైనది. శల్యము = ఎముక. వేఁపి = కుక్క, వేఁగు ధాతుకృదంతము. అంగద = ఆఁకలి. కేసరి = సింగము (కేసరము = సింహాదుల మెడమీఁది వెండ్రుక-అది గలది) ఆసన్నము = సమీపించినది. నిజ...మస్తిష్కము = తన వాడియగు గోళ్లచేఁ జీల్పఁబడిన యేనుఁగుయొక్క తలయందు మెదడు నే. సత్త్వానురూపము = బలమునకుఁ దగినది. వాంఛింతురు = కోరుదురు. ఓగిరము = అన్నము. వంటకము = అన్ను-వండు ధాతు కృదంతము.

కంకెు మిక్కిలి పెట్టకు. ద్విరదము కరము ధీరముగా విలో
కించుచు సారె కాసారతీరోపలాలితమై మెల్లగాఁ గబళము
గొనియెడిని. హీనుఁ డెంత దీనభావముతోఁ వేడినను వాని
కెవ్వరును దనియఁబెట్టకు. గారవము గల వానికి వినయవచన
ములతోఁ గోరికకు మీఱి నిత్తుకు. అనవద్యమగు విద్యచే నవక్ర
మగు విక్రమముచే నిరపాయమైన యుపాయముచే నృపాలుర
మెచ్చు వడసిన వాని మనుగడయే మనుగడ. శునకము సయి
తము కమికెఁడన్నము దిని మనలేదా? గఱువతనము మానక తన
కలిమికొలఁదిని లాఁతులకు నేలొనరించువాని జీవన మొక్క
నాఁటిది యయినం జాలును. సోదరమాత్ర పూరకమగు
కరటము చిరకాలము మనిన ఫలమేమి? అలఁతి జలముచే
మెరపనేల వెల్లివొడిచినట్లు కొలఁది లాభముచే క్షుద్రునందు
హర్ష ము వొడమును. హితాహిత వివేకము లేక విహితకర్మ
ములు మాని సోదరమాత్రము పూరింపఁ గోరువాఁడు పశు

ద్విరదము=రెండుకొమ్ములుగలది, ఏనుఁగు. కరము = మిక్కిలి (సంస్కృత
మున-కప్పము-చేయి-కిరణము - తొండము) సారెకు=మాటిమాటికి. ఆధో
రణోపలాలితము=మావటివానిచే బుజ్జగింపఁబడినది. అనవద్యము=తక్కువ
కానిది. అవక్రము = వంకర గానిది. నిరపాయము=అపాయములేని ___ చెడ
నిది. నృపాలురు=జనులను పాలించువారు-రాజులు. మెచ్చు=శ్లాఘనము -
మెప్పు-అనియుఁ గలదు. గఱువతనము=గొప్పతనము - గురుత్వము - ఇది
వైకృతము. సోదరమాత్ర పూరకము = తన కడుపునుమాత్రము నిండించు
కొనునది. కరటము=కాకి, కాయని కూయు నది యని వ్యుత్పత్త్యర్థము.
అలఁతి = కొంచెము-స్వల్పము. మొరపనేల (మొరము + నేల) కంకర నేల.
వెల్లివొడుచు = ప్రవహించు. విహితకర్మము = విధింపఁబడినపని.

తుల్యుఁడు. అంతియ కాదు. భారవాహియయి తృణమాత్రాశనమయి కృష్యాదికర్మముల కత్యంతోపకారకమయి పవిత్ర జన్మమయిన వృషభము నరపశువుకంటె మేలుగాదె?

అనినఁ గరటకుఁ డిట్లనియె. దమనకా! మనము ప్రధానులము గాము. మన కీవిచారముతో నేమి ప్రయోజనము? అనిన దమనకుఁ డిట్లనియె.

ప్రధానుఁడు కావుట కెంతసేపు పట్టును? పురాకృత సుకృతమునలనఁ బ్రజ్ఞావంతుఁడౌను. ప్రాజ్ఞుఁడు రాజపూజితుఁడవును. రాజసమ్మాననచేతఁ బ్రజ్ఞ మిక్కిలి ప్రకాశించును. దానివలనఁ దంత్రావాపములు నడప సమర్థుఁడవును. ఆ సామర్థ్యముచేతఁ బ్రధానత్వముఁ బడయును. ఎట్టి ప్రజ్ఞావంతుఁడు గాని పేటికాంతర్గతరత్నముం బోలె నినాలోకయోగము లేక

భారవాహి = బరువును మోయునది. తృణమాత్రాశనము=కసవే ఆహారముగాఁ గలది. కృషి = పైరు పెట్టుట-కరిసెనము. కృషి+ఆది—యణాదేశ సంధి. నర...కాదె-బరువు మోయఁజాలక మిక్కిలి వెలగల యశనమును దిని పంట మొదలగు పనులకు నొదవక యపవిత్రజన్మఁ డైన మనుష్య కంటె నట్టిపశువు మేలని భావము. ప్రధానుఁడు = అమాత్యుఁడు - మంత్రి-దీనికి ముఖ్యుఁడనియు నర్థము; ప్రధాని-అనరాదు. కావుట = అగుట. పురాకృతము = పూర్వజన్మమునఁ జేయఁబడినది. సుకృతము=పుణ్యము (న్య)దుష్కృతము. ప్రాజ్ఞుఁడు = ప్రజ్ఞావంతుఁడు. బుద్ధిగలవాఁడు-తద్ధితాంతము. తంత్రము=తనరాజ్యము యొక్క చింత. ఆవాపము=పరరాజ్యముయొక్క చింత. పేటిక ...రత్నము = పెట్టెలో నున్న మణి. పేటిక (వి) పెట్టె. ఇనాలోకయోగము=సూర్యప్రకాశవ్యాప్తియని రత్నపరమైన యర్థము. ప్రభుదర్శనప్రాప్తి యని ప్రాజ్ఞపరమైన యర్థము. ఇనుఁడు = సూర్యుఁడు, రాజు (సహ+ఇన-సేన).

ప్రకాశింపఁడు. పురుషుఁడు సాధువర్తనుఁడయ్యేనేని సర్వలోక పూజ్యుఁడగును. కానిచో గర్హ్యుఁడగును. మానావమానములు ప్రవర్తనాయత్తములయి యుండును. గుణవంతుఁడని పేరువడుట దుర్లభము. లాఁతివిధము సులభము. మహాగ్రావమును గ్రావాగ్రము నెక్కించుటు బోలెఁ గ్రిందికిఁ ద్రోచుట దుష్కరము గాదు.

నావుడుఁ గరటకుఁ డిట్లనియె. రాజసేవవలని ప్రయోజనమెఱుఁగనివాఁడఁ గాను. తొల్లి యీతనివలనఁ బడ్డపాట్లు తలఁచుకొన్న మాత్రానఁ దల కంటగించుచున్నది. కాఁబట్టి యట్లు వచియించితిని. భృత్యుల గుణదోషములయందు వివేకము చాలని రాజును గొలుచుట దుష్కరము. నీవు వివేకివి. అన్యులచేతఁ జెప్పించుకొనవలసిన యర్థము నీ కొకటి లేదు. ఉచితమయినట్లు చేయుము. ఇప్పుడు నీవు చేయఁబూనిన కార్యమేమి? నావుడు దమనకుఁ డిట్లనియె.

మనరాజు పింగళకుఁడు జలపానార్థము కాళిందికిఁ బోయి యెద్దు ఱంకె విని భయపడి తీర్థానతరణము మాని వెఱఁగు వడి యున్నవాఁడు. పరహృదయము ప్రత్యక్షము గాదు. కాఁబట్టి

సాధువర్తనుఁడు=మంచి నడవడికఁ గలవాఁడు. గర్హ్యుఁడు=నిందింపఁదగినవాఁడు. ప్రవర్తనాయత్తము=నడవడికకు లోఁకువయినది. లాఁతివిధము=గుణహీనుఁడని పేరువడుట. గ్రావము=బొయి, కొండ. కంటగించు=విరోధించు-నొచ్చు. కాళింది = యమునానది-కళిందపర్వతమువలనఁ బుట్టినదని వ్యుత్పత్త్యర్థము-తద్ధితాంతము. తీర్థావతరణము = రేవులో దిగుట. వెఱఁగు పడి= నిశ్చేష్టతఁ బొంది.

V.R.N.A.L. LIBRARY V.R.N.A.L. D.P.R.I. ACC. NO.

యాతని చిత్తవృత్తి నీవెట్లు తెలిసికొంటి వనఁబోకు. ఈ యర్థ మాతని యాకారముచేతనే నాకవగత మయినది. ధీమంతు నకుఁ బరుల భావము సుగమమై యుండును. తురంగమాతం గాదులు సహేతము చెప్పిన యర్థము గ్రహించి వహనాది కార్యములఁ బవర్తిల్లుచున్నవి. పరేంగితావగాహి యయిన బుద్ధి యొక్కటియె పండితునకు విశేషము. అది లేనినాఁడు పండితునకుఁ బామరుని కంటె విశేషమేమి? అది యటుండ నిమ్ము. కర్తవ్యాంశము వినుము. నేనిప్పుడు రాజుపాలికిఁ బోయి తదాభవానురూపముగా ననుసరించి పలసిన మాటలాడి యీ కార్యము నీవు చేయుమని యాజ్ఞాపింపఁజేసికొని మనసున కెక్కఁ బవర్తించి యాతని మన్ననలు వడయెదను.

అనినఁ గరటకుఁ డిట్లనియె. రాజుల కొలువు గోరువారు మెలఁకువ గలిగి ప్రవర్తింపవలెను. వారి చిత్తవృత్తి యెట్టిగి మెలఁగుట కడిఁది. అది స్వచ్ఛందవృత్తివంటిది గాదు. నావుడు దమనకుఁ డిట్లనియె. ఉద్యోగికి దూరభూమియు విద్వాంసునకుఁ బరదేశమును బ్రియవాదికి శత్రువును లేనియట్లు బుద్ధిమంతున

అవగతము = తెలిసికొనఁబడినది. సుగమము=సుఖముగాఁ బొందఁదగినది (వ్య) దుర్గమము. తురంగము = వడిగాఁబోవునది. గుఱ్ఱము (రూ) తురగము, తురంగమము. మాతంగము=ఏనుఁగు (రూ) మతంగజము-మతంగుఁడను ఋషి వలనఁ బుట్టినదని వ్యుత్పత్తి. వహనము=మోయుట. పరేంగితావగాహి = ఇతరుల యభిప్రాయముఁ దెలిసికొనునది. పామరుఁడు=మూఢుఁడు. కర్తవ్యము=చేయఁదగినది. అంశము=విషయము-భాగమనియు నర్థము. మనసున కెక్క=మదికి సరిపోవ. మెలఁకువ=జాగరూకత. కడిఁది=దుర్లభము, అశక్యము. ఉద్యోగి=ప్రయత్నముగలవాఁడు. ప్రియవాది=ఇచ్చకమాడువాఁడు.

కసాధ్య మొకటి లేదు. సద్వ్యర్తనము గలిగి నిచ్చలు తమ్మ్రిం గొలుచువారిని రాజు లాదరింతురు. భృత్యుఁడు తేని కోప ప్రసాదముల యంగమచ్చము లెఱిఁగి మెలఁగెనేనిఁ దదను గ్రహమునకుఁ బాత్రుఁడవును. అనవుడుఁ గరటకుఁ డిట్లనియె. తొలుత రాజును జూచి నుడువఁ దొరఁకొను నర్థమేది ? నా విని దమనకుఁ డిట్లనియె. ఈ యర్థము వచియింపవలెనని నియమము గలదా ? ప్రతిభాశాలికిఁ బ్రభువునెదుర సమయోచితముగా వచియింపవలసినది బహువిధముగా నుండును. సేవకుఁ డడఁకువ దోఁపఁ గట్టెదురుపట్టు దలఁగి యేలిక మొగమునన చూపు నిలిపి యాతఁడు తన వలను చూచునెడఁ దత్కాలో చితముగఁ బౌర్వాపర్యము విచారించి తేనిభావ మూహించి తక్కఁగల రాజభృత్యులకు నవిరుద్ధముగ నేరిమి మీఱఁ బలుకవలసిన యర్థము పలుకవలయును.

అసాధ్యము=సాధింపఁదగనిది. నిచ్చలు = ఎల్లప్పుడు - నిత్యశబ్దభవము. ప్రసాదము=ప్రసన్నత. అంగమచ్చము=ఆనవాలు-గుఱుతు (అంగము + మచ్చము) దొరఁకొను=ప్రారంభించు. అర్థము=విషయము. ప్రతిభ=అప్పటప్పటికి వికాస మధికముగాఁ గలుగు బుద్ధి. అడఁకువ=నమ్రత్వము-అడఁగు ధాతు కృదంతము. కట్టెదురు-కడు + ఎదురు=మిక్కిలి యెదురు-ద్వారుక్త టకారము. బా. వ్యా సం. ౧౫. పట్టు=స్థానము. తలఁగి=తొలఁగి. వలను=దిక్కు (బ) వలఁకులు. పౌర్వాపర్యము=ముందువెనుకలు. అవి రుద్ధముగ = విరుద్ధముకాని విధముగ. నేరిమి=నేరుపు-సామర్థ్యము-కృదం తము; నేరమి=అజ్ఞానము, దోషము. నేరము=తప్పు, అపరాధము. నేరమి (ఏక) నేరములు. (బహు) 'నేరంచేశాడు' ఇత్యాది వ్యవహారముచేత 'నేరమి'ని నుఱచి 'నేరములు' అను బహువచనమునుండి 'నేరము' అను నేకవచనమును గల్పించి యుందురని కొంద ఱందురు.

అనినఁ గరటకుఁడు నీకుఁ గార్యసిద్ధిగావుత. అదె తేఁడును మరలి తన యిరవునకుఁ జనుచున్నవాఁడు. అతఁ డిరవు చేరునంతకు నీవుం బోయి దాకొనవచ్చుఁ బొమ్ము. నావుడు దమనకుఁడు పింగళకుని పాలికిం బోయి యడఁకునతోడ నొదుఁగువాటున నిలిచి భయభక్తులు పిరిగొనఁ దొట్రుపడుచు జోహారు వొనరింప మృగేంద్రుఁ డతని సాదరంబుగ పీఠిం చి కూర్చుండ నియమించి 'కుశలమా? బహుకాలమునకు నిన్నుఁ జూడఁ గలిగె' నావుడు దమనకుం డిట్లనియె.

దేవా! తావకంబగు నపాంగావలోకంబునకుఁ బాత్రం బైన యీ వనక్షేత్రంబున జంతుసంతానంబుల కావంతయేని గొఱంత కుశలంబునం గలుగదనం దాపకసేవకులగు మావంటి వారి కయ్యది యడుగం బనియేమి! అవసరం బగుడు సేనకుం డనాకారితుండయ్యి రావలయుఁగాదె? స్వామికిం దగి యెఱిఁగి భృత్యుండు హితాహితంబు లెఱిఁగింప వలయు. ఉపేక్ష కుండయినం బ్రియవాది యయినను స్వామి ద్రోహాయగు.

అదె=అదిగో. ఇరవు=స్థానము. దాకొను = సమీపించు. ఒదుగువాటు = ఒదిఁగియుండుట. పిరిగొను = పెనఁగొను తొట్రువడు = సంభ్రమించు. జోహారువు=నమస్కారము (రూ) జోహారు, జొహారువు, జొహారు. సాదరంబుగన్ = ఆదరముతోఁ గూడుకొనునట్లు. తావకంబు=నీది. అపాంగము= కడగన్ను. అవలోకము = చూపు. పాత్రము = విషయము. సంతానము (నానా)సమూహము, కులము, కల్పవృక్షము, సంతతి. ఆవంత=ఆవగింజంత. అయ్యది=అది-కుశలమని యర్థము. అనాకారితుఁడు=పిలువఁ బడనివాఁడు. స్వామిద్రోహి=ఒడయునికి ద్రోహము చేయువాఁడు.

స్వామిద్రోహికి సర్వశ్రేయంబులు చెడును. సదసద్వివేక సంపన్నుండయిన ప్రభువునకు మా బోంటి క్షుద్రులవలన నరయం దగిన యర్థం బొకటి కలదే యని విచారింపఁ బనిలేదు. చక్షుష్మంతునకే దీపంబుగాని యంధునకుం గొఱ యగునె? ఒక్కటి విన్నవించెద నవధరింపుఁడు. బహు దేశాటనంబును బహు శ్రుతులతోడ నిరంతర సాంగత్యంబును గావ్యశాస్త్ర విచారంబును రాజాస్థానంబుల బహుకాల సేవనంబును బుషున కెట్టివానికేని వివేకంబు పుట్టింప సమర్థంబులయి యుండు. ఈ నాలుగింట నొక్కఁడే నెవ్వానికి లేకుండు వాఁడు కూపస్థ మండుకంబు బోలెం దన ముక్కునకుం జక్కటి మీఁదిదె యాకాశంబు తన గొందియ లోకంబని యెంచి స్వజీవన మాత్రంబునకుం దుష్టి వొంది లోకవృత్తంబున మూఢుం డయి నశియించును. చిరకాలం బేలిన వారి పాదంబుల కొలువు సేయుచున్న మాబోంట్లు ప్రుక్కడులయ్యు విద్యా వివేక సంపన్నులగుట సన్నిధాన ప్రభావంబు చేతం గాదె?

శ్రేయము=మేలు. సదసద్వివేకము = మంచిది చెడ్డదియని తెలిసికొనెడి తెలివి. చక్షుష్మంతుఁడు=కన్నులు గలవాఁడు. కొఱ=ప్రయోజనము, కొఱత యనియు నర్థము. అవధరింపుఁడు=వినుఁడు. అటనము=సంచారము. బహు శ్రుతులు=అనేకశాస్త్రములు తెలిసినవాని యర్థము. ఆస్థానము =కొలువు కూటము. ఒక్కఁడేన్ = ఒక్కటియేని. కూపస్థము=నూతియందుండునది. మండుకము=కప్ప (గూ)నుండూకము. గొంది=ఇఱుకైన తావు. వృత్తము= నడవడి. మాబోంట్లు = మావంటివారు. ప్రుక్కడి=అల్పుఁడు. సన్నిధానము-తమ సన్నిహమని యర్థము. ప్రభావము=మాహాత్మ్యము.

స్వామికి క్షేమంబు గాంక్షించు భృత్యుండపాప్తానుయోగుం డయ్యుం దతి యెఱింగి వలయు నర్థంబు వచింపనలయును. అయినను స్వామి చిత్తంబునకు వేఱొండుగఁ దోఁచునేమో యని మనంబు తేఁకువంబొరసెడు. నా విని పింగళకుండు దమనకా! నీవు మాకు హితభృత్యుండవు. నీ వచనంబు మా కవశ్యగ్రాహ్యంబు. మేము నీకుఁ గ్రొత్తవారమే! ఏల జంకు వడియెదవు? నీ యిచ్చవచ్చిన చొప్పునం జెప్పనచ్చును. నావుడు దమనకుండు కరంబున నోరు మూసికొని యీ వచనంబు లాలించి బుద్ధి బుద్ధి యని దేవా! యింతకుఁ గొంత ముందు యమునా కచ్ఛంబునకుం బోయి యచ్చట మేచ్చ వడిన తెఱంగు దోఁపం గొంతసేపు చిత్రరూపంబు పగిదిం జూపట్టి మరలి యిరవున కరుదెంచితిరి. ఇందులకు నిమిత్తంబు గానక చిత్తం బుత్తలంబు నొందెడు. అయ్యది చెప్పనచ్చునని దేవర చిత్తంబునకుం దోఁచిన సేవకుండు వేచి యున్న వాఁడు. నా విని పింగళకుండు దమనకా! వినుఁ. మాకు నీవు

కాంక్షించు = కోరు. అనుయోగము=ప్రశ్నము. అప్రాప్తానుయోగుఁడు=ప్రశ్నింపఁబడనివాఁడు. తేఁకువ = భయము, ధైర్యము. పొరయు=పొందు. గ్రాహ్యము=గ్రహింపఁదగినది. నోరు మూసికొని-ఇందు వలన నప్రమత్వము తెలియఁబడుచున్నది. బుద్ధిబుద్ధి - అధికులు చెప్పినట్టి విషయము నొప్పు కొనుటయందుఁ బ్రయోగింపఁబడు వినయోక్తి (చిత్తము చిత్త మన్నట్లు) తిచ్చవడు=నిశ్చేష్టితమగు. చిత్రరూపము=చిత్తరువునందలి యాకా ము. చూపట్టు=కనఁబడు. ఉత్తలము=చింత. వేచు=ఎదురుచూచు, ప్రతీక్షించు (వేఁచు = వేఁగఁజేయు).

పరమాప్తుండవు. నీకు దాఁపురముచేయు నర్థము మాయం
దొక్కటియైనఁ గలుగదు. అఖిల సత్త్వశరణ్యంబయిన యీ
యరణ్యంబు మదధీనంబు. ఈ దేశంబున నా యీ దేశంబునం
గాక యీకయినం గదల వెఱచు. వింటివా నేఁ డొక్క విప
రీతంబు. పిపాసార్దితుండనయి యమునాతరంగిణి కరుగుచుండ
నుఱుము తెఱంగున మొరపం బొక్కటి కర్ణగోచరం బయ్యె.
ఆనినదంబు వినినచోటనే వితాకువడి నిలిచితిని. ఇసుమంత
యయిన నంతరంగంబున భయంబునం బొరయక యట్లు
ఘోరంబయిన యీరావంబు గానించిన జంతు వలంతిగ నుండ
దని చింతించెద. లోకంబున నుత్తముండగు శూరునకుం బర
ప్రకర్షంబు సహ్యంబగునే. అలఁతివాని నేనిం బగవాని నొప్పరి
కింపం జనదన లాఁతివానిఁ జెప్పనేల? ఎట్టివాని కేని బల
దర్పంబునఁ బగఱ నొప్పరికించునట్టివాని కశక్తి భీరుత్వంబులు
లోకు లారోపింతురు. వలదని వాకొనకుండ మూఁకుట నోళ్ళులు
గ్రమ్మవచ్చునె? ఇట్టి సడివడుకంచె నొడలు విడుచుట మేలు
గాదె? ఊరక దోరుకంచుఁ బోర నది శ్రేయోదాయకంబయి

దాఁపురము=దాఁచుట, దాఁపరము=దొంగిలించుట, దాపురము (రూ) దాప
రము=ప్రాప్తి. 'నవనిధుల దాపురంబును' అని కవి ప్రయోగము సత్త్వము=
జంతువు. శరణ్యము=స్థాన మని యర్థము. ఆదేశము=ఆజ్ఞ. అర్దితుఁడు=పీడి
తుఁడు. తరంగిణి-అలలుగలది-ఏఱు. మొరపము=ధ్వని, మొరయు ధాతు
(కృ) నినదము=ధ్వని (రూ) నినాదము. వితాకువడు=జెచ్చువడు. ప్రకర్షము=
ఆధిక్యము. సహ్యము=సహింపఁదగినది. దర్పము=గర్వము. భీరుత్వము=
పిటికితనము వాకొను=మాటాడు. మూఁకుడు=తట్టవంటి మంటిపాత్రము.
సడి=నింద. దోరుకంచె=దోరుటకంచె (దోరుట=చచ్చుట) పోరన్=
యుద్ధములో. అది=ఆ దోరుటయని యర్థము. దాయకము=ఇచ్చునది.

యుండు. దైవయోగంబున మాఱుతుండు దోరెనేనిం గడు మేలయ్యె. కావున నిప్పుడ దాయపయినొండెఁ బోవుదము. అరాతినిరాసంబ పరమార్థంబుగం గోరితిమేనిం దదుపాయాన్వేషణం బావశ్యకంబు. బలవంతుం బగతు నుపాయంబుచేతన సాధింపవలయును. కావున నిప్పటికిఁ దొలంగి చని కాలదేశోచితంబుగ వలయు నుపాయంబు సముపార్జించుకొని విపక్షు శిక్షింతమొండె. ఇందు నీ కెయ్యది పోలియున్నయది చెప్పుమనిన దమనకుండు కొంతవడి చింతించి తుదముట్టఁ గారణంబు దెలియక తమకింపరాదు. శబ్దమాత్రంబునకు నివ్వెఱఁ బొరయఁజనదు.

తొల్లి యొక జంబుకంబు వనమ్మునం గ్రుమ్మరుచు నెక్కడ నాహారంబు చేకూఱమిం గరం బుదరం బాఁకట నకనకంబడ డిల్లపడి వికలాంగంబులయి నేలం గూలిన శతాంగంబులును ఖండితశుండాదంతకాండంబులయి కెడసి కొండల

మారుతుండు=శత్రువు-తత్సమమైనయెడ నర్థము వాయువు(రూ) మార్తఁడు. ఒండెక్=ఱిటుకానిపక్షమున; కాని.ద్రుతాంతము. అరాతి=శత్రువు. నిరాసము = తిరస్కారము. పరమార్థము=అత్యంతముఖ్యము. అన్వేషణము = వెదకుట. విపక్షుఁడు=విరుద్ధపక్షము గలవాఁడు-శత్రువు. తపుకించు = త్వరపడు. నివ్వెఱ-నిండు + వెఱ-మిక్కిలి భీతి. క్రుమ్మరు = సంచరించు. ఏ + కడ-ఎక్కడ-త్రికసంధి. కరంబు + ఉదరంబు-అని ఛేదము. నకనకంబడు=క్రృశించు; వాడు. డిల్లపడు=(భయాదులచే) బలహీనమగు-డిల్లము + పడు. వికలము = వీడినది. శతాంగము = అనేకావయవములు గలది-తేరు. శుండ = తొండము. కాండము=సమూహము. ఖండిత.....కాండంబులు= ఖండింపఁబడిన దండములవంటి తొండముల సమూహము గలవి. కెడయు= పడు, చచ్చు.

పిండు నిడంబించు వేదండతండంబులును ముంగాళ్ళు విజిగి డొక్కలు పెరిగి మూఁఅుమెడలు వైచి తాఁఅుమూఁఅుగం బడి యున్న వారువంబులును నెఱమగంటిమి మెఱయ వాఁతెఱం గొఱుకుచుం జూపు జంకెనల పొంకంబు వదలని శిరంబులును వాలు దొరంగని కరంబులును గరంబు మెఱయ వీరశయనంబు నొందిన యోధనారంబు గలిగి ఘోరంబయి వివిక్తంబయిన యొక్క పొలికలనిం గని తఱియంజని యొక్క దారుణారావంబు విని గుండియ లవియ బెండువడి మూర్ఛిల్లి కొంతవడికిం దెప్పిఱిల్లి తెప్పలు విచ్చి యప్పాలంబు నలువలఁకులు విలోకించి గాలిం గదలు వ్రేలుగొమ్మల తాఁకున మ్రోఁగు దుందుభిం గని మనం బునం దలంబగు కొందలంబు మాని దాని డాయంబోయి

పిండు - సమూహము - వైకృతము. విడంబించు = పోలు - అనుకరించు. వేదండము = సామ వేదము జన్మస్థానముగాఁగలది - ఏనుఁగు తండము = సమూహము. ముందు + కాళ్ళు = ముంగాళ్ళు - ప్రాఁతాదిసంధి. పెరిగి = తెగి. పెరుఁగు = ఎదుగు. పెరుగు = తెగు 'పెరిగిన హారరత్నము' అని ప్రయోగము. మూఁఅు మెడ = వెనుకకుఁ దిరిగిన మెడ. తాఁఅుమూఁఅు = విపర్యయము. వారువము = గుఱ్ఱము. నెఱమగంటిమి = నిండుపౌరుషము. వాఁతెఱ = పెదవి (తెఱ = తెఱపి - అవకాశము - వాయి + తెఱ) జంకెన = బెదరించుట - భర్త్సనము. పొంకము = పొందిక. వాలు = ఖడ్గము - కత్తి - వైకృతము. కరంబు - స - చేయి, తె - మిక్కిలి. వీరశయనము = యుద్ధమునందుఁ జచ్చిపడుట. యోధ = యుద్ధము చేయువాఁడు - జోదు. వారము = సమూహము. వివిక్తము = విజనము - ఏకాంతము. పొలికలను = యుద్ధభూమి. తఱియు = సమీపించు దారుణము = భయంకరము. ఆరావము = రావము, ధ్వని. అవియు = భేదిల్లు. బెండువడు = బలహీనమగు. తెప్పిఱిలు = తేఱు. వలఁకులు = దిక్కులు. వలను శబ్దము. విలోకించి = చూచి. తాఁకునన్ = తాఁకుడుచేత - తాఁకుధాతు కృదంతము. మ్రోఁగు = శబ్దించు. దుందుభి = భేరి. దలము = దళము, దట్టము, అధికము. కొందలము = తల్లడము.

యద్దాని తోలు ప్రీలం గొఱికి చొరంబడి వెడలినచ్చి దీని కల రూపు తొలుతం దెలియం జాలనయితి. ఇప్పుడు గదా దీని చొప్పు నెఱింగితి. ఎద్దియేని సవిమర్శంబుగం బరికింపకకాని యున్న తెఱం గెఱుంగంబడదుగదా ! యని యెన్నుకొనుచుం దన చుట్టుఁబట్టునం జూపట్టు శవనివహంబు పాఱంజూచి యూహా యిట్టి యూహారంబు దొఱంగి సురుంగం జూచితింగా యని వగచుచు వలయునంత పలలంబు దిని తనయిచ్చం జనియె. కావున శబ్దమాత్రంబునకు నివ్వెఱఁ బొరయం జనదని వచించితి.

స్వామి ముదల యిచ్చినం జాలును. ఈ క్షణంబ యా చప్పు డుప్పతిల్లిన చాయకుం బోయి తత్కారణం బారసి నీ లెంక రాఁగలండు. అనినం బింగళకుం డాతని మొగం బట్టి చూచి కొంత చింతించి యదియ యిప్పటి కుచితంబని తోఁచు చున్నది. కరంబు పరికింపక యే కార్యంబునకేనిం దమకింప లగ్గ గాదు. ఎదిరి సమ్మోహంబున మాటలాడ సూటివడెనేని బలాబలంబుల కొలంది యెఱింగి తత్కాలోచితంబుగ నా పు త్తెంచిన మాటలుగ నాడవలసిన నీకుం బోలిన తెఱంగున నాడి యెదిరిని లోఁగొనవచ్చునేని నట్లు నడపుము. నీ వన్నిటం జతురుండవు. నీకుం జెప్పనలయునే? పోయి రమ్ము. నావుడు

చొరఁబడు=చొచ్చు-స్వార్థమునఁ బడు. కిలరూపు=యథార్థము. సవిమర్శనంబు=పరిశీలనతోఁ గూడికొన్నది. నివహము=సమూహము. సురుంగు=పాఱు. పలలము=మాంసము(రూ)పలము. ముదల=ఆజ్ఞ. ఉప్పతిలు=పుట్టు. లెంక=బంటు-భృత్యుఁడు. లగ్గ=మేలు (వ్య) ఎగ్గ. సూటి=యుక్తము. కొలంది=ప్రమాణము. పుత్తెంచు-పుచ్చు + తెంచు - చెప్పిపంపు అనుట. ఆడవలసినన్=చెప్పవలసినను. చతురుండు=నేర్పరి.

దమనకుండు గ్రక్కున వెడలి తొల్లి యాగ్రామాంత పీతెంచిన జాడన పోయి యా పొలంబు నలుకెలంకులు కలయంజూచి యడుగుల చొప్పువట్టి డాయంబోయి సంజీవకుం గాంచి యోయి వృషభేంద్రా! నేను మృగేంద్రుని భృత్యుండను. అతం డనుప నీపాలికి వచ్చితిని. అతండు దానుగ నీతోడ నాడుమాటలు నాకుం గఱపి పుత్తెంచినవాఁడు. వినుము. "ఈ యరణ్యంబు మదధీనంబు.దీనంగల సత్త్వంబులన్నియు నాశాసనంబు వహించి వర్తించుచున్నయవి. నీవును నా యాజ్ఞానువర్తివయి యుండు నది. ఇతియ కాదు. మదీయానుచరులం గూడి వర్తింప నీకుం బ్రియంబేని ననురూపం బగు రాచకార్యం బొసంగెద. నీ యిష్టం బెయ్యది యది యనుసరింపవచ్చు" నని యానతిచ్చె. ఇంతకు మునుపు నీవు నిశ్శంకంబుగ ఉంకియ వైచితివి గాఁబోలు! దాని విని యేలికకు నీపొలఁకువ విచారణీయంబయ్యె.నీవు భయంపడకుము. అమ్మహామహుఁడు కరుణాళుండు ధార్మికుండు గావున సజ్జనులకు గమ్యుం డయి యున్నవాఁడు. నీవు శంకింపక యేతెమ్మని

వీతెంచు-వీచు + తెంచు-వచ్చు అని యర్థము. అనుపన్=అంపన్-పంపఁగా. శాసనము=ఆజ్ఞ. అనువర్తి = అనుసరించి వర్తించువాఁడు. అనుచరుఁడు = తోడఁదిరుగువాఁడు. అనురూపము=తగినది. రాచకార్యము = దొరతనపుఁబని. పొలఁకువ=జాడ-చొప్పు. విచారణీయము=విచారింపఁదగినది. భయంపడకుము-ముపవర్ణకమునకుఁ బూర్ణబిందువు. మహామహుఁడు = మిగులఁదేజస్సు కలవాఁడు. కరుణాళుఁడు=దయయే స్వభావముగాఁ గలవాఁడు. గమ్యుఁడు=పొందఁదగినవాఁడు. ఏతెంచు-ఏఁగు + తెంచు-వచ్చు. అభ్యాగతిని 'తెంచు' అనుప్రయుక్తము. ఏఁగు = వెళ్ళు. ఏతెంచు = వచ్చు బా.వ్యా.క్రియా. ౧౧౦, ౧౧౧.

నుడివి యొడంబరించి ముందు మృగేంద్రునిపాలికిం జని స్వామీ! దేవరయాజ్ఞ చొప్పునం బోయి పరికించితి. మీ విన్న యారావంబు గావించినవాఁడు మీకనుగ్రాహ్యుండు గాని నిగ్రాహ్యుండు గాఁడు. తావకంబగు నవక్రవిక్రమంబు విని భయాక్రాంతుండయి యున్నవాఁడు. ప్రభంజనుండు మహా భూజంబుల భంజించుంగాని వినతంబులగు తృణవితానంబులు పెకలింపం గడంగునెట్లు? శక్తిసంపన్నుండు దన్ను మూఁకొనువానియందుఁ దన బలంబు వెలయించుఁ గాని ప్రుక్కడుల లెక్కింపఁడు. ఇట్టి గుణంబు లేలినవారికి సహజంబులయి యున్నయవి. అవసరంబగుడు వచియింపవలసెంగాని దేవరకు ముందర వాక్రువ్వనలయునే? ఆతఁడు సంజీవకుండను వృషభేంద్రుండు. బుద్ధిమంతుం డేలినవారి యోలగంబున వర్తింపఁ జాలినవాఁడు. అతని స్వామిపాదంబుల చెంతకుం గొనివచ్చెద. ముదలయే? యనం బింగళకుండు చిఱునగవుతోడ సంగీకార సూచకంబుగ మొగం బెగరవేయ మహాప్రసాదం బనుచు వినమితగాత్రుఁడై యొదుంగుచు వేళంబ చని సంజీవకున

నుడువు = చెప్పు. మృగేంద్రుఁడు = మెకములకు రాజు-సింహము. అనుగ్రాహ్యుఁడు = దయతోఁ జేరఁదీయఁ దగినవాఁడని యర్థము. నిగ్రాహ్యుఁడు = కోపముతోఁ దొలఁగఁద్రోయఁదగినవాఁడని యర్థము. ప్రభంజనుఁడు = వృక్షములు మొదలగువాని విఱుచువాఁడు - వాయువు. భూజము=భూమియందుఁ బుట్టునది-చెట్టు. భంజించు=విఱుచు. వినతంబు=మిగుల వంగినది. కడంగునెట్లు=ప్రయత్నించునాయేమి?-భారతశైలి. మూఁకొను=ఎదిరించు. ప్రతిఘటించు. వెలయించు = ప్రకటించు. వాక్రుచ్చు=చెప్పు. ఓలగము=కొలువు. సూచకము=తెలుపునదియని యర్థము. వినమితము=మిక్కిలి వంపఁబడినది. వేళంబు=శీఘ్రము (రూ) వైళము.

కెదురునోయి నీ భాగ్యంబుకతంబున మృగరా జొంటి నున్న వాఁడు. కానఁపించుకొని నిదియె సమయంబు. మసలక యే తెమ్మని వెంటం దోఁకొని వచ్చి తోని కట్టెదురు దొలంగించి కొంత చెంత నిలుప సంజీవకుండు భయవినయసంభ్రమంబులు ముప్పిరిగొన వినమ్రుండయి వందనం బాచరింప మృగేంద్రుఁడు సాదరంబుగం బ్రసాదమేదురంబగు క్రేఁగంటిచూ పతనిపయిం బొలయ నిన్ను మా దమనకుండు పెక్కుదెఱంగుల నుగ్గడింప విని సంతసించినారము. నీయట్టి ధీమంతుఁడు మా కొలువు నీయకొనుట మాకుం బరమ లాభంబని యెన్నుచున్నవారము. మంత్రిపదంబు నీకొసంగినారము. జాగరూకుండవయి మన్ని యోగంబులందు మాకు మాఱుగం గార్యంబులు నిర్వహించుచుఁ బరివారసంరక్షణాది కార్యంబులు కొఱంత వడకుండ జరుపునది. అని యానతిచ్చి యది దొరంకొని తానును మంత్రియు బద్ధసఖ్యంబున నుండి నానాఁటం దక్కఁగల పరివారంబునలన నిరాదరుండై యుండె.

కతము = కారణము. వై. మసలు = ఆలస్యము చేయు. తోఁకొను = తోడికొను. సంభ్రమము = తొట్రుపాటు. ముప్పిరిగొను=పెనఁగొను. భయము వినయము సంభ్రమము.ఇవి మూఁడుగనుక ముప్పిరియని ప్రయోగింపంబడియె. పిరి= మెలి. వినమ్రుఁడు=వంగినవాఁడు.ప్రసాదమేదురము=అనుగ్రహముచే బలిసినది. పొలయు = వ్యాపించు. ఉగ్గడింపక = పొగడు- వై. మంత్రిపదంబు = మంత్రియొక్క యుద్యోగమును. జాగరూకుఁడు = మెలఁకువ గలవాఁడు. మత్ +నియోగము-అనునాసికసంధి. నియోగము = ఆజ్ఞ. దొరంకొని= మొదలుకొని. బద్ధసఖ్యంబునన్ - వదలని స్నేహమున వనుట.

దానంజేసి దమనకుండు తన యిరవున కరుదెంచి చింతా క్రాంతుం డయి యుంటం గాంచి కరటకుండు తమ్ముఁడా! నెమ్మొగంబు విన్నంబోవ ఖిన్నుండవయి యున్నాఁడవు. కతంబేమి యని యడిగి యాతనిచేతం దత్కారణం బారసి కొండొక దడవు మిన్నకుండి మీఁతిన పని కూరక విచారపడ నేమి ఫలంబు? మనకేల యీ పెద్దతనంబులని మొదలనె పెక్కు విధంబులం జాటి చెప్పితిని. నీవు నేర్చిన నీతు లన్నియు బెల్లుగ వల్లించితివి గాని నా పలు కొకటియయినఁ జెవిఁ జొర నిచ్చితివె? తన్నుఁ గట్టుఁ ద్రాళ్లు దాఁ దెచ్చుకొన్నట్లు రాఁ గలహాని గానక తోనితోడ లేని పెద్దతికంబులు కొన్ని నోరి కసిదీఱ నా యెద్దనకుం గలుగం బలికి చెలికారంబు చేయించి తివి. ఇప్పు డనుభవింపక తీరునె? ఇది నీ నేరమింగాదె? నావుడు దమనకుండు నిట్టూర్పు నిగుడించి తల పంకించి యుంకించి మొగం బెగనెత్తి కరటకా! నీ వచనంబు సత్యంబు. దూరము విచారింపక చేసితిని. ఇంక నేమి చేయవచ్చు? దైవంబు ప్రతికూలంబయినం బురుషకారం బెల్ల వ్యర్థంబయి చను. కావున ననున్నారక దూఱకుము. ఇట్లు నే నొక్కఁడన కాను.

నెఱి+మొగము-నెమ్మొగము=అందమగు మోము. ప్రాఁతాదిసంధి. విన్నం బోవు=చిన్నఁబోవు. పెల్లుగ=మిక్కిలిగ. వల్లించు=ఒకదానినే పలుమఱు చెప్పు - ఆవర్తించు. కసి = దురద-ఆత్రమనుట. చెలికారము=చెలిమి, స్నేహము. ప్రతికూలము=విరుద్ధము. పురుషకారము=పురుషప్రయత్నము. దూఱు=నిందించు; తూఱు=ప్రవేశించు. వ్యవహారమున పరుషాదికము లగు పదములు కొన్ని సరళాదికములుగ నుచ్చరింతురు. గొబ్బరికాయ-గడచిన గోఱు-గడప-గానఁగుచెట్టు- దోవ-బునాది-జాగర్లమూడి-దూటి, ఇత్యాది.

ఆషాఢభూతి యను వానిచే నొక్క సన్న్యాసియు మేషయుద్ధం బుచే నొక్క జంబుకంబును ధనప్రాణంబులు గోలునోయిరి. ఆ కథ వాక్రుచ్చెద నాకర్ణింపుము.

దేవశర్మాభిధానుండగు పరివ్రాజకబ్రువుం డొక్కరుండు గలఁడు. అతండు లోభాకృష్ట చేతసుం డయ్యు వీతస్పృహుండుం బోలె జనంబులకు మనంబులు తనియ సశ్రాంతంబు వేదాం తార్థంబు లుపన్యసించుచుఁ దదాకర్ణనకుతూహలంబున మూఁగి లోకులు భక్తిం దెచ్చి యెదుర నిడిన విత్తంబు లనాదరసూచక మందహాస రోచిరుదంచిత సుందర వదనుం డగుచుం గాంచి తదనుగ్రహార్థంబుంబోలెఁ జూపుల నంగీకరించుచున్నట్లు నా నాఁటి సముపార్జించిన విత్త మొక్క బొంతం బదిలంబుగ

ఆషాఢభూతి-మోదుగుఁగొయ్యయే ధనముగాఁ గలవాఁడు అని సంజ్ఞగాఁ దోఁచుచున్నది. ఇతఁడు బ్రహ్మచారిగా నుండవచ్చును. మేషము=పొట్టేలు. ధనప్రాణంబులు-సన్న్యసి ధనంబును నక్క-ప్రాణంబులను బోఁగొట్టుకొని రని క్రమాన్వయము. పరివ్రాజకబ్రువుఁడు=కుత్సితసన్న్యాసి. బ్రువ-బంధు-ధూర్త-వటు మున్నగునవి నిందావాచకము లగునపుడు ఉత్తర పదములు గానే యుండును. ఉదా-పండితబ్రువుఁడు - బ్రహ్మబంధువు - మునిధూర్తుఁడు - చాణక్యవటువు. ఇత్యాది. లోభాకృష్టచేతసుఁడు=అత్యాశచేత నాకర్షింపఁబడిన మనస్సు కలవాఁడు. వీతస్పృహుఁడు=పొందఁబడని కోరిక గలవాఁడు. అశ్రాంతము=ఎల్లప్పుడు. తదాకర్ణనము=ఆ వేదాంతార్థముల వినుట. మూఁగు=మూఁకలు గట్టు-గుంపుగూడు. విత్తము=ధనము. అనాదరము=ఆదరము లేమి. మందహాసము=చిఱునగవు. రోచి=కాంతి. ఉదంచితము=మిక్కిలి యొప్పినది, రోచిః + ఉదంచితము. కాంచి-దీనికి విత్తంబులు కర్మము. తదనుగ్రహార్థంబు=ఆ విత్తములఁ దెచ్చినవారి ననుగ్రహించుకొఱకు. సముపార్జించు=చక్కఁగా సంపాదించు. బొంత=ప్రాఁత గుడ్డలఁ జేర్చి కుట్టిన గంత. పదిలము=సురక్షితము (ప్ర) భద్రము.

నునిచి కూర్పునోసి యది కప్పికొని క్రుమ్మరుచుండు. అతం డొక్క-నాఁడు జనులకుం గర్ణరసాయనంబుగ మోక్షధర్మంబు లుపన్యసించుచుండ నొక్క మాయావి యా మస్క-రిధనంబు తస్క-రింపం గోరి పెకు-దినంబులనుండి వేచియుండి లాఁతివెరవు దొరకమిం జేసి డాయంబోయి సర్వాంగాలింగిత భూతలంబుగం బ్రణామంబు గావించి లేచి ముకుళితకరుం డగుచు నాతనికి మఱు వడకుండ నొక్క-పక్క- కొదిగి నిలుచుండి యాతండు వాక్రుచ్చు ధర్మంబులు తదేకాగ్ర హృదయుండుంబోలె నాలకించుచు విలక్షుండుంబోలె దూరితతారశ్యవిస్తారితనయనుం డగుచుఁ జిరంతనాత్మీయ ధర్మసంశయనిరాకరణచణ ప్రస్తుత ప్రకరణార్థ శ్లాఘమానుండుం బోలెం బరివాహిత మస్తకుం డగుచు

కూర్పువోయు=కుట్టు. రసాయనము=ఫలరసములను జేర్చి చేసిన లేహ్యవిశే షము-అనఁగా మధురమైనదనుట. మోక్షధర్మంబులు=ముక్తికొఅకైన సత్కర్మములు. ఉపన్యసించు = వివరించి చెప్పు - వక్కాణించు మస్కరి = సన్న్యాసి-వేణుదండము గలవాఁడని వ్యుత్పత్త్యర్థము. సర్వాంగాలింగిత భూతలంబుగ=ఎల్ల యవయవములచేఁ గౌఁగిలింపఁబడ్డ నేల గలదగునట్లుగా-సాష్టాంగముగా ననుట-ఇచట అష్టాంగములు - కరయుగము పాదద్వయము ఉరము ఫాలము భుజయుగళమును. ముకుళితము = మోడ్పఁబడినది. మఱు వడు = మఱుఁగువడు. తదేకాగ్రహృదయుండు = ఆ ధర్మములయందుఁ జెల్లిన మనసు గలవాఁడు. విలక్షుండు=ఆశ్చర్యముతోఁ గూడుకొన్న వాఁడు. దూరిత తారశ్యవిస్తారితనయనుండు = దవ్వు గలదిగాఁ జేయఁబడిన చాంచ ల్యము గలవియై (చలింపని) విరివిగలవిగాఁ జేయఁబడిన (పాఱఁ దెఱవఁ బడిన) నేత్రములు గలవాఁడు. చిరంతన...శ్లాఘమానుండు=బహుదినములు గానుండు తనదైన ధర్మములయందలి సందేహములఁ బోఁగొట్ట సమర్థము లగు నప్పటి ఘట్టముల యర్థములఁ గొనియాడువాఁడు. పరివాహితము = ఊఁపఁబడినది.

శ్రవణాంతరాయా సహిష్ణుండుం బోలెం దత్రత్యజన సల్లాపం బులు భ్రుకుటితముఖుండయి సీత్కారపూర్వకంబుగ నుత్తిష్ఠకర సంజ్ఞచే వారించుచు నిర్భరానంద వినశుండుంబోలె సబాష్ప నిమీలితలోచనుం డగుచుఁ దదుపన్యాసావసానంబున నచ్చటి జనులం గాంచి స్వామిలు కడు బడలియున్నవారు. ఇక్కడి వారందఱు గొంతసే పెడ గలుగ నుండుఁడు. భిక్షానంతరంబు రండు. పొండు. అని యవ్వలి కనిపి యొక్క తాళవృంతంబు పుచ్చుకొని పక్క నిలువంబడి యల్లన వీచుచుండె. అంత నయోగి యాతని సాదరంబుగం జూచి యోయి నీవెవ్వండవు? మాకు భక్తి సేయుచున్నవాఁడవు. మావలన నీకు వలయు ప్రయోజనం బేమి? నావుడు స్వామీ! నే నాషాఢభూతి యను వాఁడఁ దమయందు గుప్తంబై యనన్యసాధ్యంబయిన యర్థంబు తమకు శుశ్రూష యొసరించి పడయం గోరినవాఁడ. నన్ను శిష్యుంగాఁ గొని నా యీప్సితార్థం బొసఁగి యనుగ్రహింపుఁడు.

శ్రవణ..... అసహిష్ణుఁడు=వినుటకుఁ గల్గు విఘ్నమును సహింపనివాఁడు. తత్రత్ర్య...సల్లాపంబులు=అచ్చటఁగల జనులయొక్క పరస్పర భాషణములను. భ్రుకుటితము=బొమముడిపాటుగలది. సీత్కారము=ఉస్సనుట=ఉత్తిప్తము. పైకెత్తఁబడినది. నిర్భర...వివశుఁడు=అధికమైన సంతోషముచేత మైమఱచినవాఁడు. సబాష్ప...లోచనుఁడు=కన్నీళ్ళతోఁ గూడినవై చక్కఁగా మూయఁబడ్డ కన్నులు గలవాఁడు. అవసానము=అంతము. ఇక్కడి వారందఱు-మీరు అను విశేష్య మధ్యాహార్యము. తాలవృంతము=తాటి తొడిమ వంటితొడిమ గలది-విసనకఱ్ఱ. గుప్తము=దాఁపఁబడినది. అనన్యసాధ్యము=తనకుఁ దప్ప నితరులకు సాధ్యముకానిదని యర్థము. అర్థము = వేదాంతార్థము-ధనమనియు శ్లేష. శుశ్రూష=సేవ. ఈప్సితార్థము=కోరఁబడ్డ ప్రయోజనము-కోరఁబడ్డ ధన మనియు భావము.

మఱి యొక్కం డేనొల్ల. యథార్థంబు విన్నవించితి. నావుడు నప్పారాశరి యట్ల కానిమ్మి నావుడు వాఁడు మహావినయ భయభక్తులు కరంబు మెఱయించుచు శుశ్రూషసేయుచు నాతని వెంబడి దేశాటనంబు సలుపుచుండె. ఒకనాఁ డా పారాశరి దారిం బోవుచుండ నా టకు్క-దారి సత్వరంబున నాతనిఁ జేరంజని యో స్వామీ ! నిన్న రాత్రి మనము నిద్రించిన యింటివారిది గడ్డిపరక నా గుడ్డ నంటి వచ్చినది. తృణమైనఁ బరుల సొమ్మి గొనంజనదు. ద్రుతగతిం బోయి యిది యీ యింటివారి కిచ్చి వచ్చెదనని వాక్రుచ్చి కొంతదవ్వు వెనుకకుం జని యీ పరకం దొరుగ విడిచి కొండొక దడవు దారి మసలి యరుదేరం గాంచి యీ కర్మంది వెఱఁగంది "యీతండు పీతస్పృహుం డవిగీత చరిత్రుండు విశ్వాసపాత్రుం "డని యెంచి చిరసంచితధనసంచ యంబు నించిన తన బొంత మోనం బ్రాలుమాలి వెంటవచ్చు

యథార్థము = తన యభిప్రాయము శ్లేషగాఁ దెలియఁజెప్పినాఁడు-కనుక యధార్థ మని ప్రయోగించినాఁడు. పారాశరి = సన్న్యాసి. దేశాటనము= దేశసంచారము. టకు్క-దారి = టక్కరి, వంచకుఁడు. సత్వరము=వేగ, శీఘ్రము-ద్రుతము. మనము నిద్రించిన యింటివారిది-ఏ యింట మనము నిద్రించితిమో ఆ యింటికిఁ జెందినవారి దనుట-ఇది వాక్యవైచిత్రి. వాడు తిన్న విస్తరి పాఱవైచి - ఇత్యాదులు గమనించునది. పరక = పోఁచ, తృణకాండము.ద్రుతగతిన్ =శీఘ్రగమనముతో. కొండొక=కొంత.కర్మంది= సన్న్యసి-కర్మందుఁడను ఋషి చెప్పిన సూత్రముల నధ్యయనము చేయువాఁడని వ్యుత్పత్త్యర్థము. అవిగీతము=అనిందితము. సంచితము=కూడఁబెట్టఁబడినది. నించిన=నిండించిన.

నా పచ్చెకానిం గాంచి "వార్ధకంబున హీనసత్త్వుండ నగుటం జేసి యింతమాత్రంబు కప్పుడు బొంత మోవం జాలకున్న వాఁడ. దీనిం బదిలమ్ముగం గొనిరమ్మా" యని చేతి కిచ్చిన వాఁడు సంతోషభరాక్రాంతస్వాంతుం డగుచు వినమ్రుండయి మహాప్రసాదంబని కొని పెచ్చు హెచ్చరికతోడ వహించి తెచ్చుచు వలసినచో నా భిక్షునకుం బఱపుగం జలికప్పుగ విని యోగించుచుం దొంటికంటె హెచ్చుగ నచ్చికఁ బుట్టించు వాలకంబుఁ బూని యూడెంబు సేయుచుండె. ఒకనాఁ డక్కావితాల్పు మార్గంబునం బోవుచు సమయజామదగ్న్యుండు కరసహస్రంబు ఖండింప రక్తప్రభాభాసమానుండును బ్రతాప హీనుండునయి కృతవీర్యసూనుండుం బోలె భానుండు చూపట్టుడు నచ్చోటికిం గుఱంగలి యగు జలాశయంబునకుం

పచ్చెకాఁడు = చూచుచుండ దొంగిలించువాఁడు - పశ్యతోహరుఁడు. వార్ధకము=ముదిమి-ముసలితనము-తద్ధితాంతము, (వార్ధక్యము-వృద్ధాప్యము అనరాదు) సంతోషభరము=సంతసముయొక్క యతిశయము. ఆక్రాంతము=ఆక్రమింపఁబడినది. స్వాంతము = మనస్సు. వినమ్రుఁడు=మిక్కిలి వంగిన వాఁడు. పెచ్చు=హెచ్చు-ఆధికము. హెచ్చరిక=అవధానము. భిక్షుఁడు=(యాచించువాఁడు) సన్న్యసి. పఱపు = పడక. నచ్చిక=నమ్మిక-విశ్వాసము. వాలకంబు=వేషము, మాయ. ఊడెము=ఊడిగము, పరిచర్య, సేవ. కావితాల్పు=కాషాయమును ధరించినవాఁడు. సమయ జామదగ్న్యుండు=కాల మనెడి పరశురాముఁడు (జమదగ్ని కొడుకు జామదగ్న్యుఁడు) తద్ధితాంతము. కరము=హస్తము, కిరణము. రక్తప్రభ = నెత్తుటియొక్క కాంతి-ఎఱ్ఱనికాంతి. భాసమానుండు = ప్రకాశించుచున్న వాఁడు. ప్రతాపము=వాఁడిమి, ఎండ. కృతవీర్యసూనుఁడు=కృతవీర్యుఁడను రాజుయొక్క కొడుకు-కార్తవీర్యుఁడు. భానుండు=సూర్యుఁడు. కుఱంగలి=సమీపము. జలాశయము=జలముండు చోటు - నీటి చెంక.

బోయి వార్చుచుండె నప్పుడు కట్టెదురం దత్తీరంబున మేషం బులు రెండు రోషంబు మీఱి నగంబులు ప్రతిఘోషంబు లీనం బెల్లు రేగి పెడిల్లన డీకొంచు దారుణంబుగం బవిదార ణంబు సలుపుచుండ వాని మధ్యంబున నల్లం దాఁకువడి మూర్ధం బులు నగులఁ గాతి వేసినదాని ఘేరవం బొక్కఁండు గాంచి పలలఖండం బని తలంచి సంతసించి డాయంబోయి యిది యుధ్యన్మేషమధ్యం బని గణింపక దాని భక్షించుచుండ నంతకు ముందు డీకొని పిఱిందికి జరిగిన యురణంబులు మరలం బఱి తెంచి డీకొనుడు నడుమఁ దగులువడి యీ వంచకంబు పంచ త్వంబు నొందె. ఆ సన్నాళ్ళసి యయ్యది విలోకించి యాహా! ఆమిషలోభంబు గోమాయువు నిట్టిదశకుం దెచ్చెఁగాదే? వీరి కేనిం గాని గుణంబు లోభంబుకంటె నొక్కఁండు గలదే? యని చింతించుచు మరలి తీరం బారోహించి యీదారి శిష్యుం గానక యెహహో యీషాఢభూతి! యెహహో యీషాఢభూతి! యని

వార్చు=ఆచమించు. నగంబు=(నడువనిది) కొండ, వృక్షమనియు నర్థము. ప్రతిఘోషము=మాఱుప్రోఁత. ఈనక్=ఈనునట్లు - కలుగునట్లు. రేఁగు = విజృంభించు. పెడిల్లన-అనుకరణధ్వని. ప్రవిదారణము = యుద్ధము. నల్లం= నెత్తురు, రక్తము. మూర్ధము=తల,శిరము. ఘేరవము-ఘేయను కూఁతగలది-నక్క. యుధ్యన్మేషమధ్యంబు-జగడ మాడుచున్న పొట్టేళ్ళనడిమి చోటు, యుధ్ ధాతువు ఆత్మనేపదమగుట 'యుధ్యమానము' కావలెను. 'యుధ్యత్' పదము చింత్యము. పిఱిందికిన్ = వెనుకకు-పిఱుఁదు శబ్దము. ఉరణము = పొట్టేలు. వంచకము=వంచించునది-నక్క. పంచత్వము=చావు, మరణము (పంచప్రాణములు పంచభూతములలోఁ గలియుట) ఆమిష లోభంబునన్= మాంసమునందలి యత్యాశచేత. ఏరికేనిన్=ఎవ్వరికేనియు. కానిగుణము = దుర్గుణము ఆరోహించి=ఎక్క.

యెలుంగెత్తి పిలిచి పిలిచి సంజప్రొద్దు వెలుంగుడకుఁ గరంబు మలుంగువెట్టుకొని కనుమేర దూరంబు చూపు సారించి పాఱం జూచుచు యాతాయాతజనంబులం జేరంబోయి వాని యంగ మచ్చము చెప్పి యిట్టివాని బొంత మోచికొని పోవువానిం జూచితిరా యని యడిగి యడిగి నలువలంకులకుఁ బాఱి పాఱి వెదకి వెదకి వేసరి కడకుం దన్నా దురాత్ముండు ప్రతారించెనని యెఱింగి శిరంబు పంకించి నిట్టూర్పు నిగుడించి మేషయుద్ధం బుచే జంబుకంబును నాషాఢభూతిచే నేనును స్వదోషంబు వలనన చెడితిమి. ఇఁక నేమి చేయవచ్చునని చింతించుచుం జనియె.

అని చెప్పినం గరటకుం జెట్టి ధీమంతున కే నొక్కొకక్ కాలంబునం బ్రమాదంబు వాటిల్లుట స్వాభావికంబు. దానికి వగవం బనిలేదు. నీవింకం జేయందలంచిన కార్యం బేమి యని యడిగిన దమకుం డిట్లనియె. వినాశోన్ముఖకార్యంబు నేలు వఱుచుటకు భావ్యార్థ సంగ్రహంబున కనర్థప్రతీకారంబునకు నర్హంబగు మంత్రంబే శ్రేయంబు. కావున నదియ యిపుడు కర్తవ్యంబు. అందుఁ బింగళక సంజీవకులకు భేదంబు పుట్టించు

సంజ=సంధ్య (వై). సారించు=వ్యాపింపఁజేయు. పాఱఁజూచు=చక్కఁగఁ జూచు. యాతాయాతజనంబులు = పోయెడు వచ్చెడు జనులు. అంగ మచ్చము=గుఱుతు-చిహ్నము (అంగము + మచ్చము) వేసరు = విసుగు. ప్రతారించు = మోసపుచ్చు. ప్రమాదము = ఏమఱుపాటు. వినాశ + ఉన్మ ఖము-వినాశోన్మఖము = చెడనున్న దనుట. భావ్యార్థము = కాఁగల ప్రయోజ నము - భావి + అర్థము-భావ్యర్థము-యణాదేశసంధి అనర్థప్రతీకారము = కీడునకు మాఱుసేఁత. మంత్రము = ఆలోచనము.

నుపాయంబు పరికించుట ముఖ్యంబు. దానంజేసి మనకెల్ల యర్థంబులు సిద్ధించు. మన మిప్పు డుపేక్షించినం బిదప బింగళకు డాయుట దుష్కరంబు. నావిని కరటకుం డది యెట్లు సాధ్యంబగు ననిన దమనకుం డిట్లనియె. ఉపాయంబుచే నేయది శక్యంబగు నాయది పరాక్రమశతంబుచేత నయిన శక్యంబు గాదు. కాకం బొక్కం డుపాయంబుచే దనకు విరోధి యగు సరీసృపంబును దోరించె. అక్కథ వక్కాణించెద నాకర్ణింపుము.

యమునాతీరమందలి వనములో మట్టి మ్రాకు మీద గూడు కావించుకొని వాయస మిథునము వాసము చేయు చుండెను. ఆ మట్టిక్రింది పుట్టలో సర్పము వాసము చేయుచుఁ గాకి పెట్టిన గ్రుడ్లు భక్షించి పోవుచుండును. దానికి వాయసము మిక్కిలి ఖేదపడి తన మిత్రమయిన నక్క పాలికిఁ బోయి త్రాఁచువలనఁ దనకు మాటి మాటికి వచ్చు నుపద్రవము చెప్పుకొని యంగలార్చెను. అప్పుడు నక్క యిట్లనియె. తొల్లి యొక కొలనిలోని మీనముల నెల్ల బనంతము చేసి భక్షించిన కొంగ నొక్క యెండ్రి యుపాయంబుచేతఁ జంపెను. అట్లు నీవును నీ శత్రువును గడముట్టింపుము. నీ కా కథ చెప్పెద వినుము.

ఎల్లయర్థంబులు = సర్వప్రయోజనములు. ఏయది = ఎయ్యది-ఎద్ది - ఎది. ఆయది-అయ్యది-అద్ది-అది. కాకంబు-కాకాయని కూయునది-కాకి. సరీసృపంబు = వంకరగాఁ బోవునది-పాము. దోరించు=చంపు-దోరుధాతువు ప్రేరణము. మిథునము = కవ-ఆఁడుకాకియు మగకాకియు నని యర్థము. త్రాఁచు=సర్పము, పాము. అంగలార్చు=దుఃఖించు. బవంతము = టక్కు, మోసము, కపటము. ఎండ్రి=కర్కటము. కడముట్టించు = చంపు

బదరికావనమందు సారోదంబను కాసారంబు గలదు. అక్కడి కొక్క ముసలి కొక్కెర వచ్చి నయనంబులు నిమీలించి యాహారంబు మాని దుష్కరం బయిన తపంబు చేయు దానివలె నొంటికాలిత్రో నిలువంబడి యుండెను. ఒక యెండ్రి యా తెఱఁగుఁ జూచి కరము వెఱఁగుపడి డాయఁబోయి యిట్లని యెె. "ఓయి బకోత్తమా! నీ వనయంబు క్రశిమంబు వహించు చున్నవాఁడవు. చేరువఁ బాఱాడు మీనంబులఁ జూడనయిన నొల్లవు. ఈ యునికి యేదియే నొక్క మహార్థం బర్థించి పూనిన యనశనవ్రతానుష్ఠానంబు గాఁబోలు. నీ విచిత్ర చరిత్రంబు మదీయశ్రోత్రపేయంబు గావింపుము." అనిన విని బకం బల్లన విట్లనియె. "ఓయి కర్కటకోత్తమా! నీవు మిక్కిలి బుద్ధిమంతుఁడవు. ఆకారంబుచేతన భావంబు భావింప సమర్థుండవు. నిస్సంగుల మయి మౌనముద్రాధారులమగు మాదృశులకు సహితము నీ వచనచారిమంబు సల్లాపంబునం దుల్లాసంబుపుట్టించెడు. పుట్టువుఁ దొట్టి నాకడుపుఁ జిచ్చునం బడి మసిసిన జంతువు లిన్నియు ని

పారోదంబు = మేలైన నీళ్లు గలదని సంజ్ఞ. కాసారము = సరస్సు, కొలను. కొక్కెర = బకము. నిమీలించి = మూసి. అనయంబు = అత్యంతము. క్రశిమంబు = కార్శ్యము, కృశత్వము - చిక్కుట. పాఱాడు = సంచరించు. అనశనము = ఆహారము లేనిది. శ్రేయము = పానము చేయఁదగినది. భావంబు = అభిప్రాయము. నిస్సంగులు = ఇతరులతో సంబంధము లేనివారు. మౌన ముద్ర = మాటలేనియునికి. మాదృశులు = మావంటివారు. చారిమము = నేర్పు. తొట్టు = ప్రారంభించు, మొదలుపెట్టు, హేమకుఁదొట్టి అని కని ప్రయోగము.

యెన్నికకు రావు. ఇట్లు మదీయ జాతికి స్వాభావికం బయిన భూతహింసాకర్మంబుచే శరీరభరణంబు గావించుచుండుదును. గంగోత్తరతారమందు మట్టివృక్షము కొమ్మమీఁద నేను గూర్చుండి యుండఁగా నా ప్రమానిక్రింద నొక యోగిపుంగవుండు తన శిష్యులకు నానాధర్మంబు లుపదేశించువాఁ డిట్లనియె. పురుషార్థం బర్థించువారి కవశ్యాచరణీయంబు లగు ధర్మంబులు వినుఁడు. సకలదోషంబులకు మూలంబయిన లోభంబు విసర్జింప వలయును. సర్వభూతంబులయందు సదయుండయి యుండవలయును. అలోభంబును భూతదయయును లేనివానికి సర్వ ధర్మంబు లనుష్ఠితంబులయ్యు నిరర్థకంబులగు. జీవనంబు క్షణ భంగురంబు గావున మోసపోక పురుషుండు కాలంబు పుచ్చక యుత్తమధర్మంబు లనుష్ఠింపవలయును. అని వక్కాణింప విన్న వాఁడను. ఎట్టి సుకృతవిశేషంబుననో నాఁటంగోలె నామహాను భావుండు నచియించిన ధర్మంబులు మనంబునం బట్టి స్వప్నావస్థ యందయిన మఱపునకు రావు. అదిగో నాఁడు మొదలుకొని పురుషార్థంబునంద బుద్ధి నిలిపితిని. హింసాకర్మంబునకు రోసితిని.

ఎన్నిక = గణన, లెక్క, ఎంచుట. భరణము = భరించుట - మోయుట. ఉత్తరతారము = ఉత్తరపుగట్టు. యోగిపుంగవుండు = యోగీశ్వరుఁడు - పుంగవశబ్దము శ్రేష్ఠవాచకము. పురుషార్థము — ఇక్కడ మోక్షమనియర్థము. ఆచరణీయము=చేయఁదగినది. అలోభము=లోభరాహిత్యము. అనుష్ఠితము= అనుష్ఠింపఁబడినది, చేయఁబడినది. పుచ్చక = వ్యర్థముగాఁ గడపక యనుట. నాఁటంగోలె = నాటఁబట్టి, నాఁటినుండి. పట్టు=తగులు, బంధము.

జలశైవాలాదులత్రోో దేహధారణంబు చేయుచు ముముక్షుత్వం
బుం బూని మునినృత్తి నున్నవాఁడను. నావుడు విని యచ్చో
వసియించు మీనంబులు మోదమానంబులయి యూహా యీ
మహామహుండు నీఱు గవిసిన నిప్పువలె నున్నవాఁడు. ఈతఁడు
బకమాత్రుండు గాఁడని పరికించి డాయంబోయి యిట్లనియె.
"ఓమహానుభావా ! నీ కృపానలోకంబు మాపయిం బొలయిం
పుము. అనావిలభావంబులతోో మీ సేవఁ గోరి వచ్చినవారము"
నావుడు నా బకంబు ప్రసాదభాసురంబగు దరహాసంబుగావించుచు
వాని ప్రార్థనంబు కటాక్షంబుల నంగీకరించి నాఁటంగోలె
వానితోో సఖ్యంబు గావించుచుండె. అంత నొక్కనాఁడు వఱు
వాత నాఖగంబు సౌఖశాయనికంబులయి డాయం జనుదెంచిన
మీనంబుల దీనవదనంబుతోో బాష్పనారిపూరితలోచనం బయి
నిట్టూర్పు నిగుడ విలోకించి తల పంకించి యుంకించి కాల
నియోగంబు మీఱి నేరికి శక్యంబు? నావిని మీనంబు లిట్లనియె.
"ఓ తపోధనా ! తడవులంబట్టి నిన్నెఱుంగుదుము. నీవు నిత్య

శైవాలము = పాఁచి (పూ) శైవలము. ముముక్షుత్వము = సంసారము విడువఁ గోరువాఁడగుట. మోదమానంబులు = సంతోషించుచున్నవి. నీఱు = నివుఱు-భస్మము (నీరు = ఉదకము). కృపావలోకంబు = దయతోో గూడిన చూపు. పొలయించు = వ్యాపింపఁజేయు – పొలయు ధాతువు. అనావిలము = అకలుషము – కలఁకఁబాఱనిది. దరహాసము = చిఱునవ్వు. వఱువాత = ప్రాతఃకాలమున - వఱువాయి శబ్దము. ఖగము = ఆకసమునఁ బోవునది. పక్షి–ఇక్కడ బకము. సౌఖశాయనికము = సుఖముగా నిద్రించితివా యని యడుగునది. బాష్పము=కన్నీరు. నాన్=నఁగా. తడవులం బట్టి = బహుకాలమునుండి యని యర్థము.

సంతుష్టుఁడు నా నెగడితివి. అట్టి నీకు నేఁడిట్టి ఖేదంబు రాఁగతం బేమి?" అనవుడు నా టక్కరి కొక్కెర యెలుంగు రాలుపడ నిట్లనియె. "కాలము చెల్లినవాఁడను గాఁబట్టి యింక నూర కుండరాదని విచారించి మముక్షుండనయి పుత్రాది బంధంబుచే విడిపించికొని మంటిని సుఖింపఁగంటి నని యుండఁగాఁ బ్రారబ్ధ కర్మవశంబున మీ తగులం బొక్కటి ప్రాప్తంబయ్యె. మీకొక యాపద వచ్చునన్న నుల్లంబు తల్లడిల్లుచున్నది." అనుచు జొట జొటఁ గన్నీరు విడుచుచు నిట్లనియె. "ఇంతకు ముందు కొందఱు జాలరులు వచ్చి యీ కొలనిజలంబు కొలంది పరికించి యింకఁ గొంతనీ రింకిన వత్తమని పోయిరి. ఆ మాట వినఁగానే నా గుండెలు బద్దలయ్యెను. అది మొదలుకొని విషణ్ణుండ నయి యున్నవాఁడను." నావుడు మీనంబులు విని భయంపడి యిట్లనియె. "ఎట్లయిన మమ్మొబోరివలనఁ దలఁగువెరవు పరికింప నీవొక్కరుండవు నలంతివి. ఖేదంబు వేర్మిని విషా

సంతుష్టుఁడు = సంతోషము నొందినవాఁడు-దీనికి విశేష్య రూపము సంతుష్టి. నెగడుట=వర్ధిల్లుట-ఒప్పుట. టక్కు + అరి = టక్కరి-జాలాదులకు అరివర్ణకము. రాలుపడు=కంపించు. కాలము చెల్లినవాఁడను = వృద్ధుఁడననుట. ముముక్షుండు = సంసారము విడువ నిచ్ఛించువాఁడు. మంటిని = బ్రదికితిని-మనుధాతువు. ప్రారబ్ధము = ముందు చేసినది. తగులము = బంధము, సాంగత్యము. జొటజొట = అనుకరణశబ్దము. జాలరి = మత్స్యములఁ బట్టెడి వాఁడు-కైవర్తుఁడు. జాల + అరి = జాలరి-దీని జలగడుగువాఁడను అర్థమని కొందరందురు. విషణ్ణుఁడు=విషాదము పొందినవాఁడు (విషాదము=ఏమియుఁ దోఁపని చింత). బారి = ఉపద్రవము. తలఁగు = తొలఁగించు, అంతర్భావిత ప్రేరణము. వలంతి = నేర్పరి. మేర్మ = అతిశయము.

దంబు నొందియున్న వాఁడవు. ఇంతియకాని లెస్స పరికించిన నీకుం దోఁపని యుపాయంబు లేదు. నీవ మాకు శరణాంబు." అనిన బకంబు కొంతవడి చింతించి యిట్లనియె. "ఇచ్చటికిఁ గొంత దవ్వున నిత్యాపం బను కొలను గలదు. అందులకు మిమ్మందఱ నొక్కనాఁటనె కొంపోవ శక్తుండఁ గాను గాని యోపినంతవఱ్ఱు నానాఁటం గొంపోయి విడిచెద." అని చెప్పి ప్రతిదినము వలసినన్నింటిని ముక్కునం గఱచుకొని పోయి యొక్క కొండ బండమీఁదం బెట్టుకొని భక్షించుచుం గొన్ని దినంబులలో నా కొలను నిర్మ్మనంబు గావించె. అంతఁ దొలి మిత్రం బయిన యెండ్రి బకముతో నిట్లనియె. "నా ప్రియ మిత్రుఁడా! యిక్కడ మీలను బారివలనఁ దలఁగి రక్షించితివి. అట్లు నన్నును రక్షింపుము." నావుడు బకంబు వల్లెయని యెండ్రిని జంచువుల నిఱికించుకొని మిక్కిలి పొడవున కెగసి తాను మీలఁ దిన్న కొండకొమ్మునకుఁ జక్కగా సాగి మింటఁ బోవుచుండెను. ఆ పోకడ చూచి యెండ్రి యిట్లు చింతించెను. "ఇప్పు డీ బకంబు ననున్నం గొనిపోక యీ కొండకొమ్మునకుఁ గాని వేఱొండు చోటికిఁ గాదు. ఈ కొండ శిఖరంబున జలంబు లేక్కడివి? ఈ గుంటిమీఁదఁ గాని దీని చుట్టుఁబట్లఁ గాని

నిత్యాపము=ఎల్లప్పుడు జలము గలదని సంజ్ఞ. కొంపోవు=కొనిపోవు. బండ=పెద్దగుండ్రాయి. నిర్మ్మనము = మత్స్యములు లేనిది. మీలు - వీక - మీను, వై. చంచువు = పక్షులముక్కు - త్రోటి. కొమ్మ=అగ్రము, శిఖరము, కొన. తాను మీలఁదిన్నకొండ కొమ్మ - వాక్యవైచిత్రి గుర్తించునది. పోకడ = పోక, పోవుట. గుంటి మీఁదఁ = కొండమీఁద, గుండు శబ్దము.

జలంబులు లేవని యాప్తులవలన వినియున్నవాఁడను. ఈ బకంబు కపటంబున మీనంబులం బట్టుకొనివచ్చి ఈ కొండకొమ్మునఁ బెట్టుకొని తినియెఁ గాఁబోలును. ఆహా! తెలియక ఈ ఖలుని పలుకులు విని మోసపోయితిని గదా! మాయికులయందు బుద్ధి మంతుండు మాయావియయి ప్రవర్తింపవలెఁ గాని ఋజువుగాఁ బ్రవర్తింపఁ గూడదు. కాఁబట్టి యేవిధముచేతనేని దీని వంచించి తప్పించుకొను నుపాయంబు కావింతుఁగాక యని యగచి కర్తవ్యం బాలోచించి లెస్సగా బుద్ధియందుఁ గుదుర్చుకొని యిట్లనియె. "ఓయి బకోత్తమా! నీవు నన్నుఁ గడుదవ్వు దుసికిలకుండఁ బట్టుకొని పోఁజాలవు. జాఱిపడితినా భూమిని సంచరించు జంతువులు నన్నుఁ బొలియించి భక్షించును. ఆవల నీ యభిమతంబు సిద్ధింపదు. ఇప్పు డొక యుపాయము చెప్పెద వినుము. నేను నీ కంఠంబు కవుఁగిలించి పట్టుకొని వచ్చెదను. గవ్యస్థానంబు నకుఁ బోకమునుపు నాపట్టు విడువను. ఇంత చెప్పనేల? నా రక్షణభారము నీది. చిత్తము వచ్చినట్లు చేయుము." అనిన విని

మాయికుఁడు = మాయావి. ఋజువుగా = తిన్నగా-సక్రమముగా. వగచు = యోజించు, చింతించు. దుసికిలు = జాఱు. అభిమతము = నిక్ష్యాపమునందు విడువవలెనను కోరిక యనియు భక్షింపవలెనను కాంక్ష యనియు భావము. గవ్యస్థానము = పోవఁదగిన చోటు - అనఁగా నిక్ష్యాపమున కనియర్థము - యమపురమున కని భావము. పోకమునుపు = పోవుటకుముందు. పట్టు = అవలంబ మని యర్థము-నిన్నుఁ జంపవలెనెడు భూనిక యనియు భావము. నా రక్షణము = నా పాలనమని యర్థము - నీవుచచ్చి నన్ను బ్రదికించుట యని భావము.

యా కొక్కెర సమ్మతించి యెంత్రిచేతఁ గంఠంబు గొంగిలింపించి కొని కొండమీఁదికిఁ బోయి కాళ్ళానఁ బోవునపుడు కుళీరంబు తన గిట్టలతో దాని కంఠంబు కఱుక్కునఁ ద్రెంచి నేలఁబడి ప్రాణంబు తప్పించుకొని తన యిచ్చం బోయెను. కాఁబట్టి నీవును సదుపాయము విచారించికొని నీ శత్రువును జంపుమని నక్క చెప్ప విని దానిచేత సెలవు తీసికొని కాకి తన యిరవునకు వచ్చి చేరెను.

యమున దాపున విలాసధామం బను పట్టణంబు గలదు. అందలి రాజాంగనలు క్రీడార్థంబు వనంబునకుం జని కుసుమాపచయం బొనరించి శ్రాంతి యడంగ జలంబు లాడంగోరి యొక్క పరసిం గాంచి యనూనంబగు దాని మానోజ్ఞకంబునకు మాన పంబుల నానందంబు నిట్టివొడువనం దత్తీరంబుఁ జేరి హారాది పరి

గొంగిలింపించుకొని=పట్టించుకొని యనుట. కుళీరము = భూమియందడఁగి యుండునది - కర్కటము, ఎండ్రి. గిట్ట = కర్కటముయొక్క కత్తెర వంటి కాలిగిట్ట. కఱుక్కున = అనుకరణ శబ్దము. విలాసధామము=శృంగారముల కునికిపట్టని సంజ్ఞ. కుసుమము = పువ్వు. అపచయము = చిదుముట, కోయుట. శ్రాంతి = బడలిక. జలంబులాడు = స్నానముసేయు; జలక్రీడ లాడు. 'నీళ్ళాడు - ఊదకాలాడు,' ఈపదములను వ్యవహారమున ప్రసవించు నని యర్థము. 'ఆ బుసి నీళ్ళాడు'-అని స్నానపరముగ ప్రాచీన కవిప్రయో గములు కలవుగాని వ్యవహారమును గమనించి మనే యిట్టివి వాడవలెను. పరసి=కొలను - సరస్సు. న+ఊనము- అనూనము=తక్కువ గానిది - మిక్కిలి యనుట. మానోజ్ఞకము = చక్కఁదనము, మనోజ్ఞము - మూలపదము. నిట్ట కొడువ = ప్రవహింప - అతిశయింపఁగా ననుట.

వ్యాకరంబు లూడ్చి యచ్చోట నుంచి చనుకట్టులు గట్టి యొండొ
రుల చెట్టలు వట్టుకొని సుందర మందగమనంబుల నొయ్యా
రంబు మీఱ నీరంబుల డిగి యల్లల నడుగు లిడుచు విసార
వార పరిస్ఫురణంబులం గాంచి యంతకంటెం దమ మించులు
మించుగ మెఱయించు తెఱంగున వెలి తళుకుం జూపుఁబు కళవ
ళింప నులుకుచుఁ గటిద్వయసంబుగ డిగి సలిలవిహారంబు సలుపు
చుండ నొక్క లతాంగి దోయంబులు దోయిలించి దోయిలించి
యొక్క తోయజాక్షి పయింజల్లి యది మాఱుకొని "యే దేది
నిలువక చల్లుమా చూత" మనుచు మీఱం జల్లిన ధారాసా
రంబునకుఁ దాళంజాలక కేలొడ్డి పెడమొగం బిడి పెఱకేలతి
ర్రొక్కుచు నమ్మమ్మ చాలుంజాలు నీజోలి కింకరాను మానుమ

పరిష్కారము = ఆభరణము, తొడవు. చనుకట్టులు = స్తనబంధములు. చెట్ట = చేయి, కరము, కీడు అనియు నర్థము. మందగమనంబులు = నెమ్మది నడకలు. ఒయ్యారము (రూ) ఓయారము, ఒయారము = సొగసు. విసార... పరిస్ఫురణంబులన్ = చేఁపల సమూహముల చలనములను. మించులు = కాంతులు. మించుగన్ = అధికముగా. వెలి = తెల్లని. కళవళించు = చలించు, క్షలించు. ఉలుకు = భయపడు. కటిద్వయసంబు = మొలబంటి. డిగి = దిగి- దకుఁ లోనగు వాని దాకు డకారంబు విభాషనగు బా. వ్యా. ప్రక్రీ. ౧౪. తోయంబు = (రక్షించునది) ఉదకము. దోయిలించు = దోసిళ్ళతో నెత్తు. తోయజ + అక్షి – కమలాక్షి; యువతి. మాఱుకొను = ప్రతిఘటించు, ఎదిరించు. ఆసారము = జడి – జడివానవలె జలధారలు పడుచున్నవని భావము. ఒడ్డి = అడ్డము పెట్టి యని యర్థము. పెడమొగము = పరాఙ్ముఖము. పెఱ (ప్ర) పర – తదృవము లందును అలఘుత్వము కలదు. అమ్మ + అమ్మ – ఆక్రోశితము. అమ్మయొక్క అమ్మ యని కాదు.

మన నయ్యాది యిస్సినో యింత పిఱికివేనా, నుఱికొక్క- తెఱువ
నెఱజాణవేని నానఁక మరలుము. చిఱుతుకదాని త్రోడనా
యింత బింకంబులు పొంకించెద వని పురికొలిపి తాను నదియు
మలంగక త్రోలంగక పట్టు వదలక నట్టు గదలక పరస్పర కరకమల
సమీరితవారిధారల లోఁగక తోఁగుచు నొండొరుల హెచ్చుచు
మెచ్చుచు నిదియేఁటి సుమాళంబె చాలుఁజాలు మీయాలంబు
చాలింపుఁడని తోడివారలు వారింప దరహాసాంకూరంబు లాన
నాంబుజంబుల నలంకరింప నార్ద్రాంశు కోత్తరీయాంతర్గత నిస్తుల

ఇస్సిరో – సంబోధనమున రో శబ్దము. ఇస్సిరో అనియుఁ గలదు. పిపికి = భీరువు - భయశీలుఁడు. పిపికివేనా – పిపికిని + వీ + ఆ = పిపికి వేయా, పిపికివా అని రూపము కావలెను. కాని వ్యవహారమును గమనించునది. తెఱువ = స్త్రీ – తెఱపి గల నోరు గల దని యర్థము – చిఱునవ్వు గలదని తాత్పర్యము. నెఱజాణ = మిక్కిలి నేర్పరి. చిఱుతుకది= చిన్నది, బాలిక. బింకము=గర్వోక్తి. పొంకించు=పొంకపఱుచు. (పొంకము= పొందిక) పురికొలుపు = ప్రేరేపించు. మలఁగు = తిరుగు. నట్టు=స్థానము. కర...ధారలఁ=తామరపూవంటి హస్తములచేఁ ద్రోయఁబడిన యుదకధార లచే.లోఁగక=వెనుకదీయక యనుట. తోఁగు=తడియు.సుమాళము=ఆవేశము. ఆలము = యుద్ధము-చల్లులాట యనుట-దీని కుపేక్షయు నర్థము. దరహాసము= చిఱునగవు. అంకూరము = మొలక (రూ) అంకురము. ఆననము = ముఖము- దీనిచేత మూర్తురని వ్యుత్పత్త్యర్థము. ఆర్ద్రాంశు... స్తబకంబులు = తడిసిన సన్ని పైఁటలో నున్న వర్తులమైన పూగుత్తులవంటి కుచములు - అంశుకశబ్దము సన్నవస్త్రమను నర్థము గల విశేష్యముగా నుండినను ఉత్తరీయమని మఱియొక విశేష్య ముండుటవలన నిక్కడ సన్నమైనదను నర్థము మాత్రము గల విశే షణపద మగుచున్నదని తెలియునది. అంశుకశబ్దమునకు, వస్త్రము - సన్న వస్త్రము - ఉత్తరీయము అని మూఁడర్థములు గలవు.

స్తనస్తబకంబు లుబ్బి నిబ్బరంబుగ నిక్కఁం గడు రోఁజుచు నిఁబు
వంబడ మఱి కొందఱు ముద్దియ లుద్దులయి యొండొరువుల
రవణంబులు పణంబుగఁ బన్నిదంబు సఱచి పారంబు నేర వేగంబు
మీఱి నీఁదుచుం బోన నేల యూరక కరంబు కలగుండుపఱచెద
రే యని లాఁతి చేడియ లాడ మనలం జేసినవారి కతనుక్షోభంబు
దుర్వారంబు గాదె? యని చదురు లాడుచుం బారంబు ముట్టుచు
ముట్టనివారిం గరంబులం జప్పటలు గొట్టి యోడితి రోడితిరని
గేలి సేయుచు స్తనగమన సామ్యాసహానత్వంబునంబోలె రథాంగ
చక్రాంగంబులం బొలుఁదోలుచు స్వోపప్లవకారణమార
ప్రహారణంబులను నీరసంబునంబోలె సారసంబులం దనుముచు

నిబ్బరము=నిర్భరము-అధికము, వై. రోఁజు=నిట్టూరుపుపుచ్చు; రోజు=దినము (అన్యదేశ్యము). నిలువఁబడు=నిలుచు-సార్థమునఁబడు. ముద్దియ(ప్ర)ముగ్ధ-స్త్రీ. ఉద్ది = జత (బహు) ఉద్దులు. రవణము = భూషణము. పణంబు = పన్నిదము, పందెము. ఫణంబు + పడగ (ఫణి). పారంబు = తీరము. కలగుండు= కలఁత, క్షోభము. చేడియ=యువతి. మనలం జేసినవారికి = మనలఁ గూడిన యుదకమున కని యర్థము - మనలంబొందిన పురుషుల కని భావము. అతను క్షోభంబు = అధికమగు కలఁత యని యర్థము-మన్మథోపద్రవమని భావము. చదురు = నేర్పు - చాతుర్యము. వై. స్తనగమనసామ్యాసహానత్వంబునం బోలెన్ = తమ కుచములకును నడలకును సరియగుటవలన నోర్వలేనితనము చేతవలె. రథాంగము = (రథముయొక్క అంగము) బండికన్ను-దీని పర్యాయములన్నియు జక్కవపిట్టకు నామము లగునుగాన చక్రవాకపక్షి. చక్రాంగము=చక్రమువలె వట్టువయైన అంగము కలది-హంస. స్వో...ప్రహరణంబులు = తమ యుపద్రవమునకు హేతువులైన మన్మథబాణములు - ప్రహరణము - దీనిఁ గొట్టుదురని వ్యుత్పత్త్యర్థము. ఈరసంబు=ఈర్ష్య-వైకృతము. సారసము = కొలఁకునఁబుట్టినది - త్రికాండ.

జలవిహారంబు సలుపుచుండ మున్నా తీరంబుచేరువ నునిచిన పరిష్కారంబులం దుదారప్రభారమణీయం బగు మణిసరం బా కాకంబు ముక్కునం గఱచికొని పఱచి యల్లంత నొక్క తరు శాఖం గూర్చుండం గనుంగొని "యిది యేమి విచిత్రంబె. రత్నసరంబు కరటంబు గొంపోయెం జూచితిరే" యని యొక్క సీమంతినీలలామంబు వాక్రువ్వ నంద ఱొక్కమొగి వదనారవిందంబు లెత్తి పారిప్లవేతరవిస్తారితచారులోచనలై యస్పంద మిళింద సుందర వికసిత కుసుమరాజి విరాజమాన మల్లికా వల్లికా మతల్లికా విభ్రమానుకారిణు లగుచు సూచీముఖాలంకృత

పరిష్కారము = ఆభరణము. ఉదారప్రభారమణీయము = అధిక కాంతి చేత సుందరమైనది. మణిసరంబు = రత్నహారము. కరటము-కాయని కాయు నది, కాకి. పఱచి=పరుగిడి. కొంపోవు - శబ్దపల్లవము. సీమంతినీలలామము= ఉత్తమస్త్రీయని యర్థము. (సీమంతిని=పాపట గలది= స్త్రీ) లలామాది విశేషణ శబ్దము లుత్తర పదములుగానే యుండును. దీని కనేకార్థములు గలవు. కొమ్మ - గుఱుకు - గుట్టము - పెక్కెము - తొడవు - తోఁక - ప్రభావము - బొట్టు - ముఖ్యము. పారిప్లవేతరము = చంచలమునకు వేఱైనది - చలింపని దనుట. విస్తారితము=విరివి గలదిగాఁ జేయఁబడినది-పాఱఁదెఱవఁబడిన దనుట. అస్పంద...అనుకారిణులు = కదలని తుమ్మెదలచేత నందమగు విరిసిన పూల వరుసలచేత మెఱయుచున్న మల్లెతీఁగల విన్నలయొక్క విలాసము ననుకరించుచున్నవారు - వీరి జేహములు తీఁగలతోడను, ముఖములు పువ్వులతోడను, చూపులు తుమ్మెదలతోడను సమానములని తాత్పర్యము. సూచీముఖము = తర్జనిమాత్రము మీఁదికిఁ జాఁపఁబడి ముడువఁబడిన తక్కిన్ని వ్రేళ్ళు గల హస్తము. ఇది అభినయ శాస్త్రమునందుఁ జెప్పఁబడిన హస్తములలో నొకటి. అలంకృతము = సవరింపఁబడినది.

నాసికాగ్ర లగుచు దూరీకృతనిమేషంబుగ దృష్టి సారించి కాంచుచు "నిక్కాకంబు పద్మరాగప్రభారించ్ఛోళిం గాంచి యామిషం బని భ్రమియించెఁ గాఁబోలు ననుచుఁ గాదు గాదు మెడం దగిలించుకొని కులుకులాడం బోయెడు" నని నవ్వుచు నీయందంబునకు హారం బొక్కటి తక్కువ యని మొగం బడ్డంబుగ సుందరంబుగం బంకించి చేయెత్తి జుట్టున నెటిక విఱుచుచుఁ జక్కని హారమమ్మ యిప్పలుగాకి కాకి యెక్కడనుండి వచ్చెనో యింక నెక్కడం బాఱవైచెడునో యెవ్వరికిం జేపడునో యనుచు నయినం గొంత లేదు. జలవనాది దుర్గమస్థానంబులం బడి యేరికిం జేరకపోవుట కంటెం గొంత మేలు గాదె? యనుచు నండజంబునకు మండనంబుతోడం బనియేమి? దీనికిం గతంబు పరికింపవలయు ననుచు నెద్దియేనియు నొక్క నిమిత్తంబు లేక తక్కదు. నిలుకడ

దూరీకృతనిమేషంబుగఁ = దవ్వుగాఁ జేయఁబడిన (పోఁగొట్టఁబడిన) ఱెప్ప పాటు గలది యగునట్లుగా. సారించు = వ్యాపింపఁజేయు. పద్మరాగము = తమ్మకెంపు. రించ్ఛోళి = సమూహము. ఆమిషము = మాంసము. భ్రమ = ఒకటిని మఱియొకటిగా భావించుట - భ్రాంతి. జుట్టున = చూపుడువేలు - తర్జని. నెటిక = వ్రేలికీలు (రూ) నెట్టిక. పలుగాకి = కుత్సితము. చేపడు = దొరకు, లభించు. అయినను - ఎవ్వరికేని చేపడిన ననుట. దుర్గము = పోవ శక్యము కానిది. ఏరికిఁ = ఎవ్వరికిని. అండజము = (ఇక్కడ) కాకి - (గుడ్డు వలనఁ బుట్టునది (వ్యు) మండనము = ఆభరణము - దీని చేత నలంకరింపఁ బడునని వ్యుత్పత్త్యర్థము. కతము = కారణము, వై. పరికింపఁ = ఇది వలయు నను క్రియకుఁ గర్త. (పరికించు = పరీక్షించు, వై)

మీఁదం దెలియునగు ననుచు నొండొరులు ముచ్చటలాడు
చుండఁ దత్పరిచారికలు కొంద ఱీవాతుసం బే చాయకుం
బోయెఱిగో యేమఱిక కనుగలిగి యుండుఁడని యచ్చటి వన
పాలకుల నియమించి సత్వగంబుగం బోయి యీ వృత్తాంతంబు
రాజపురుషులకు నివేదించి వారిచేఁ బ్రేరితులగు జనులం దోఁ
కొనివచ్చి కానుపించుడు నా కాకంబు మందగమనంబున జని
యాత్మావాసంబగు వటకుటంబు కొమ్మం జేరి నేరిమిమీఱం గ్రింది
వల్మీకంబునకుం జూటివడ విడువ నా సరంబు మీసరంబుగం
గెంపు మెఱుంగులు దుఱుంగలింపఁ దత్రత్యకాలవ్యాళవినాశపిశు

ఒండొరులు - ఇట్టి ప్రథమావిభక్త్యంత రూపములను పరస్పర మనెడి యర్థ
మున ప్రయోగింపరాదనియు, ఈ రూపములు ప్రాచీనగ్రంథములలోఁ గన
రావనియు - ఆధునికమగు 'ఆంధ్రభాషాను శాసనము' శాసించినది. కాని
ప్రాచీన ప్రయోగములు పెక్కులు గలవు.

ఉదా:— చెలఁగి పోరాడి రొండొరులు. భార. ఆర. 3.391.

మీర లొండొరులు. చేమకూర వేంకటకవి

తాఁకి పొడిచి రొండొరులఁ. భార. ఆది. 8,112.

కనుకలిగి = కనిపట్టియని యర్థము. నివేదించు = ఎఱుకచేయు. తోఁకొని=
తోడికొని. కానిపించు = కనఁబఱచు. ఆత్మావాసము=తన యునికిపట్టు.
కుటము = వృక్షము. నేరిమి = సామర్థ్యము - నేరుచు ధాతు కృదంతము.
వల్మీకము = పుట్ట. చూటి = లక్ష్యము. మీసరము = అతిశయము.
తుఱుంగలించు = ప్రకాశించు. తత్రత్యము = అక్కడనున్నది — అనఁగాఁ
బుట్టలో నున్నది యనుట. కాలవ్యాళము = కృష్ణసర్పము — నల్లత్రాఁచు.
వినాశపిశునము = చేటుఁ దెలుపునది.

నోల్కాపాతానుకారి యగుచుం గోమక్రంతం బడ రాజభటులు గాంచి గునపంబులు లోనగు సాధనంబులు దెప్పించి దానిం గ్రొప్పించిన నందలి దందశూకంబు విషానలంబు దరికొలు పుటకుం బోలె ఫూత్కారంబులు నిగుడించుచుం బరపాణి నిలంబులు గ్రోలుటకుంబోలె నాభీలంబుగ నాలుక లార్చుచు నిర్గమించి పయిం బడి కఱువం గమకించుడు వారలు చిక్కని పెక్కుబడియలం జదియ నడిచి దాని మడియించి యా నేవళంబుం గొంపోయిరి. అది దొరంకొని కరటంబు కరంబు సుఖంపడి యుండె. కాబట్టి యుపాయంబుచే సాధింపరాని కార్యంబులు లేవు.

బుద్ధిబలంబు గలవానికిం దక్కుబలంబు లేకుండినం గొఱఁత లేదు. ధీన క్తివిరహితునకుం దక్కుంగల బలిమి యెంత గలిగిన నసత్కల్పంబయి చను. తొల్లి యొక్క శశకంబు

ఉల్కాపాతానుకారి = ఇంగలము పడుటను సరిపోలునది. కోము = చివర — ఇక్కడ పట్టుచివర యని యర్థము. క్రంత = రంధ్రము — వైకృతము. గునపము = గడ్డపాఱ, ఖనిత్రము. క్రొప్పించు = త్రవ్వించు — క్రొచ్చు ధాతువు. దందశూకము = కుత్సితముగాఁ గఱచునది — సర్పము. దరిగొలుపు = రగులఁజేయు. ఫూత్కారము = పాఁపబుస. ప్రాణానిలంబులు = ప్రాణవాయువులు. క్రోలు = ఆహారము చేయు. ఆభీలము = భయంకరము. ఆర్చు = ఆడించు. నిర్గమించు = బయలువెడలు. గమకించు = యత్నించు. చిక్కని = స్థూలమైన. బడియ = దండము. చదియు = నలఁగు. అడుచు = కొట్టు (అడఁచు = అడఁగించు). నేవళము = సరము. దొరంకొని = మొదలుకొని. ధీ = బుద్ధి, మతి. అసత్కల్పము = ఉన్నదానితో సరిగానిది. శశకము = కుందేలు.

నేర్పునం జేసి యొక సింగంబుం ద్రుంగించె నక్కథ వక్కాణిం
చెద నవధానంబుతోడ వినుము.

ఒక్క యరణ్యంబున సత్త్వసారంబను కంఠీరవంబు
గలదు. అయ్యది యయ్యడవిం గల జంతుసంతానంబులం బొలి
యించి భక్షించుచుండు. అందుల కచ్చటి సత్త్వంబు లెల్లం
బెల్లు భీతిల్లి యొక్క చక్కటిం జేరి పెక్కు తెఱంగులం బరికించి
తమకుం బాటిల్లిన బారికిం బ్రతీకారంబు గానక తుదకుం గర్త
వ్యాంశం బొక్కండు విచారించి కలియం బలికికొని బెండగిలి
మృగనాథు పాలికిం జని మనంబుల ఘనంబుగ దరంబు గదుర
నాననంబుల దీనభావంబు నివ్వటిల్ల దవ్వు దవ్వుల నిలిచి యభి
వందనం బొనరించి "యో మృగస్వామి! మేము మీకొక్క
చిన్న విన్నపంబు గావింప వచ్చియున్నవారము. మామీఁదం
గరుణించి యవధరింపుఁడు. భవదీయప్రతాపానలంబునకు
లోకంబులోని వ్యాళజాలం బెల్లం దృణప్రాయంబు నా మాయట్టి
ముక్కడుల లెక్కింపనేల? కొంత దయ గలిగి తెగవుగాని

త్రుంగించు = చంపు - త్రుంగు ధాతువు. సత్త్వసారము = మృగశ్రేష్ఠమని
సంజ్ఞ. కంఠీరవము = సింహము. అయ్యది = ఆయది-అది. సంతానము =
సమూహము. పొలియించు = చంపు-పొలియు ధాతువు. సత్త్వము = జంతువు.
చక్కటి=స్థానము. పాటిల్లు=కలుగు. బారి = ఉపద్రవము. ప్రతీకారము =
మాఱుసేత. ఒక్కండు = ఒక్కటి. బెండగిలు = కదలు, ప్రయాణమగు;
వెల్లగిల్లు. దరము = భయము - వెఱపు (రదము=పల్లు) గదుర =కలఁగు. దీన
భావము = దైన్యము, చిన్నఁదనము. నివ్వటిల్ల = కలుగు. ప్రతాపానలము =
పరాక్రమమనెడు చిచ్చు (రూపకసమాసము) వ్యాళము = దుష్టగజము.
జాలము=సమూహము. తృణప్రాయము=చెత్తవంటిది. తెగవు=సాహసింపవు.

యెొక్క నిమిషంబులోన మమ్మంవఱి నిర్మూలింపఁజాలవె? అట్టి కరుణాళుండ వగుటంజేసి మా ప్రార్థనంబు పొలి వోవదని తలంచెదము. దేవరసన్నిధికి వంతుమయిం బ్రతిదినం బొక్కొక్క మృగంబుం దమ యాహారార్థంబు పనుపందలంచి యున్నవారము. ఇందులకు మేకొని మమ్మ్మ భయమ్మ్మునలనం బాచి రక్షింపవలయు." నావుడు సింగం బట్లు కానిండని యభ యం బొసంగి మృగంబుల వీడుకొలిపె. అంత నా మృగసంతా నంబు కొంత ప్రొంతఁ దలంగి ప్రత్యహంబు నఱువాత వంతు కొలంది నొక్కొక్క మృగంబును సింగంబు చెంగటికిం బనుచు చుండు. ఇవ్విధంబునం గొంతకాలంబు కడవ మృగంబు లెల్ల యథాసంకేతంబుగ నొక్క చెవులపోతుం బిలిపించి యెల్లి మృగవల్లభు పాలికిం బోవలయువంతు నీ పాలం బడియె. నావుడు శశంబు భృశంబు మూర్ఛిల్లి కొంతవడికిం దెలిసి చెదరిన హృద

నిర్మూలింప = వేరు లేక చేయు - చంపు. కరుణాళుండు=దయగలవాఁడు. తద్భిన్నాంతము. పొలివోవు=వ్యర్థమగు. మయి=నొప్పు (పూ) సై. మేకొను=సమ్మతించు. పాచి = తొలఁగించి. వంత = సంజ్ఞాపము - వంచు ధాతువు కృదంతము. మూలమున 'ప్రవంత' యని రేఫసంయుక్త పాఠము కలదు. అది చింత్యము. ప్రవంత = ఏఱు; పల్లము. వంత = సంజ్ఞాపము; బాధ; ఏడ్పు. ప్రత్యహము = ప్రతిదినము. ప్రతి + అహము - యణాదేశసంధి. చెంగటికి = సమీపమునకు - చెంగలిశబ్దము. యథాసంకేతముగ = ఏర్పాటు నతిక్రమింపక. చెవులపోతు = పెద్ద చెవులు గలది-కుందేలు. ఎల్లి=పోవు, గడుగు. భృశంబు = అత్యంతము. వడి = కాలము.

యంబు పదిలించికొని యెంతవారికేని విధివిధానం బప్రతివిధా
నంబు గాదే యని తలపోయుచు దట్టంబుగ వేఁడినిట్టూర్పులు
నిగుడ శిరఃకంపంబు గావించి యెడరు దొడరిన తఱి యెఱుక
బలిమి కొలఁది వెరవు పరికింపవలయుఁ గాని వెఱంగువాటు
తెఱంగు గాదు. ఎట్లయిన నా బుద్ధిబలంబునం జేసి కేసరిం
బ్రతారించి దోరింపం గడంగెద నటమీఁద దైవంబు పంచినగతి
యయ్యెడుంగాక యని యచ్చటి తన బలంగంబువలన సెలవు
గయికొని నడవం గాళ్ళు లాడక యల్లనల్లం బోవుచుఁ జేయంగల
యుపాయంబు రోసి మానసంబున కది సరిపఱిచికొని దారిం
గొంత మసలి యాహారంబు తఱికి దప్పించి డాయఁబోయి సవిన
యంబుగం బ్రణమిల్లుడు హార్యక్షంబు సటాజాలంబు నిక్క-
వెక్క-సంబగురోషంబున భీషణంబై యదరులు చెదరం జూడ్కులు
నిగుడించి "యహహా! యస్మదీయ క్షాంతికి ఫలంబు తోడన

విధివిధానము = దైవకృత్యము. అప్రతివిధానము = మాఱుఁజేఁత లేనిది. తల
పోయు=చింతించు. ఎడరు=ఆపద. తొడరు=ప్రాప్తించు. ఎఱుక=జ్ఞానము.
వెఱంగువాటు = నిశ్చేష్టత. తెఱంగు = యుక్తమనుట. కేసరి = కేసరములు
గలది, సింహము (కేసరము = నెడమోఁది జూలు). ప్రతారించు = మోస
పుచ్చు. దోరించు = చంపు-వోరుధాతువు. పంచు (హ్వా) పనుచు = ఆజ్ఞా
పించు; పుచ్చు; భాగించు. బలంగము = సజాతీయప్రాణిసమూహము.
రోయు = వెదకు—దీనికి ఏవగించుటయు నర్థము. మసలు = ఆలస్యము
చేయు. డాయు = సమీపించు (భ్వా) దాయు. హార్యక్షము = పచ్చని
కన్నులు కలది-సింహము. సట = జూలు. వెక్క-సము = అధికము. అదరులు=
మిడుఁగుఱులు-కోపముచేతఁ గన్నులు నిప్పులవలె నున్నవని భావము. క్షాంతి=
క్షమ, ఓర్పు.

కలిగె. కుట్టినం దేలంద్రు కుట్టకున్నం గుమ్మరపుపు వంద్రుగాదె? నాకుం దఱి దప్పించి యాహారంబు పనుచుట చూడ నా వేఁడిమి చవి యింకొక్కమరి చూడ వేఁడి కాఁబోలు. ఈ యడవి మృగంబు లింతలోనన యింత మత్తిల్లునే? నేఁడ యిప్పా లంబునం గల జంతుజాలంబు నెల్లం జమరి సమయించి యెరియు కడుపుఁజిచ్చున ద్రవేల్చెద"నని వాలంబు నేల తాడించి లేచుడు శశంబు "దేవా! తావకులగు సేవకులవలన లేశంబయిన దోషంబు లేదు. నేటి తెపు మా వారల శాసనంబు శిరంబునం బూని యేను సరభసగతిం జనుదేర దారి నొక్క హార్యక్షంబు రూక్షంబుగ వీక్షించి యోరీ! శశాధమా! యెట్టి సత్త్వంబేని మా కట్టెదుర దరవిరహితంబుగం జరింపం గానము. మాయుచే! నీ యుద్ధతిం జూడ మాకుం గరంబు వెఱం గయ్యెడు. మమ్మిం జీరికిం గొనక యొరసికొని పాఱు పోతరంబు నీకు రాఁగతం

కుట్టినం...కాదె—ఒకఁడు శక్తిమంతుఁడై యుండియుఁ దనశక్తి బయలు పఱి పక యుండెనేని జనులు వాని నశక్తునిఁగాఁ జెప్పుదురని భావము. వేఁడిమి = ప్రతాపము. ఇంకొక్కమరి = ఇంకొకసారి. చమరు = చఱచు. కడుపుఁజిచ్చు = జఠరాగ్ని. ద్రవేల్చు = ద్రవేలఁజేయు; కడుగు, కాని, యీ యర్థమిట సంగతము గాదు. వేల్చు అనుట సరి. వేల్చు = హోమాగ్నియందు నేయి మొదలగు వాని సమర్పించు. తాడించి = కొట్టి — ఇది కోపకార్యము. తెపు = ప్రాతఃకాలము. సరభసగతిన్ = వేగముతోఁగూడుకొన్న గమనముతో. రూక్షము = పరుషము. మాయుచే = బళిరా. ఉద్ధతి = ఉద్ధృతి, గర్వము. చీరికిఁ గొను = లక్ష్యపెట్టు. పోతరము = క్రొవ్వు.

బేమి? నిలు నిలు మెటకుం బాఱెద వని యధిక్షేపించి ప్రతిరో
ధింప నేనాతనిం గాంచి "మాకెల్లరకు వల్లభుండు సత్త్వసారా భి
భానుండగు సింహరాజు గలండు. అమ్మహామహు సన్నిధికిం
జనుచున్నవాఁడ. నన్ను మసలింపకుము. ఆతం డొకింత కోప
గించిన లోకం బాకులం బగు" నావృషభు నతండు మధ్యందిన
వివోత్తమానఖద్యోతమండలంబుంబోలె మండుచు నహహా!
యింత కాలంబున కిట్టి వింత వినంబడియె. ఇవ్వనంబునందలి
మృగసందోహంబునకు నే నొక్కఁడుండ దొరగాని నాకు దొర
దొర యొక్కఁడుండు గలఁడె? ఎవ్వండేని నెదిరిం దన్నఁ గానక
యుందని పదవికిం గంతుగొన నుంకించెనేని వాని మదీయ తేజో
నలంబున కింధనంబుం గావించెద. నీ విటకు ముందు ప్రభువని
పేర్కొనినవానిం గానుపింపుము. ఇప్పుడ కయ్యంబునకుం గడం
గెదం జూపవేని నిన్నుం బొలియించెద నని పలికి యట్లు కానిమ్మని
నన్నుం బలికించి నీపాలికిం బుత్తెంచె. దానంజేసి యింత మసల
వలసె. నా విని మృగనాథుం డప్రతిరోధక్రోధుండై యీ

నిలునిలుము = నిలువుము + నిలువుము-నిలు నిలుము. ముత్తు పరమగునప్పుడు నిలువులో కడగ్రాయి లోపము; హల్లు పరమగుటఁజేసి మధ్యస్థ్యమ మువర్ణక లోపము నగును. అధిక్షేపించు = ఆక్షేపించు. ప్రతిరోధించు = అడ్డగించు. మహామహుఁడు = అధిక తేజము గలవాఁడు. ఆకులము = కలఁతపడినది. మధ్యందినము = పట్టపగలు. వివోత్తమానము = చాలఁ బ్రకాశించుచున్నది. ఖద్యోతుఁడు = ఆకసమంచు వెలిగెడువాఁడు – సూర్యుఁడు. సందోహము = సమూహము. దొర = సమానుఁడు; రాజు. (నాకుదొర = నాకు సమానుఁడు) గంతుకొను = లఘించు – దాఁటు. ఉంకించు = ఉద్యమించు. తేజోనలంబు = ప్రతాపమనెడి యగ్ని. ఇంధనము = కట్టెపుల్ల. అప్రతిరోధము = అడ్డము లేనిది.

క్షణంబ యా దుష్టమృగంబుం గానుపింపుము. దండధరుని పీటికి మసలక పుత్తెంచెద. నాకు మార్గాభిజ్ఞానార్థంబు మును సనుము నావుడు శశకంబు వినయభయసంభ్రమంబులు పెనంగొన వల్లె యని కడువడిం జని యొక్క బావిం గానుపించి యో మృగకుల సార్వభౌమా ! నీ మాయ్తం డీ వాపికయం దున్నవాఁడు. తొంగి చూడు మన సింగంబు తొంగిచూచి యుదకంబునందలి తన ప్రతిబింబంబు మాఱు సింగం బని భావించి కోపాటోపంబు మీఱ వలంకులు మాఱు సెలంగ గర్జిల్లి గుభుల్లున దుమికి కాలధర్మంబు నొందె. కావున నెంత బలవంతుఁడైన బుద్ధి బలంబుచే గెలువవచ్చును.

పింగళకుం దొల్లి సేవించుచుండి కాటకపాటకంబు లను రెండు జంబుకంబులు కృతాపరాధంబు లగుటంజేసి నిష్కాసి తంబు లయ్యె. అయ్యని వెండియు జేసి యనుగ్రహంబు సంపా దింపం గోరి సంజీవకు ననుసరించుచున్నయవి. ఇదియు మదీయోద్యోగంబున కనుకూలం బయి కానంబడుచున్నయది సెల విమ్మ్రి పోయి వచ్చెద. నా విని కరటకుండు "వృక్షమూ

దండధరుఁడు = గుదెఁకాల్పు, యముఁడు. వీడు = పట్టణము (వీఁడు = ఇతఁడు) మార్గాభిజ్ఞానార్థము = దారి తెలియుటకయి. బావి = వాపిక - వైకృతము. మార్తుఁడు = శత్రువు. కోపాటోపము = కోపమువలని తొట్రు పాటు. గుభుల్లున - అనుకరణశబ్దము. కృతాపరాధములు = చేయఁబడిన తప్పుగలవి - తప్పుచేసినవి యనుట. నిష్కాసితములు = వెడలఁగొట్టఁ బడినవి. ఉద్యోగము = ప్రయత్నము.

లంబుం జేరిన పుణ్యమును మెలపున మూలచ్ఛేదంబు గాకుండ వెలార్చి మాయించుట నేర్పరితనంబు. నీ వెఱుంగని యర్థంబు గాదు. నీకుం గార్యంబు సిద్ధించుం గావుత మెడ సేయక పొమ్ము" నావుడు దమనకుండు పింగళకుని పాలికిం బోయి బ్రమొక్కి మొగంబు బ్రేలనయిచుకొని దీనభావంబు భావించికొని నిలుచుండం బింగళకుండు గాంచి "దమనకా! యేల యిట్లు తెలివి దప్పి యున్నవాఁడవు. మాకుం బరమాప్తుండవు, లోకంబునం దెవ్వండేని జీవింపం గోరువాఁడు నీకుం గీడు దలంపఁడు. నీ ఖేదంబునకు నిమిత్తంబు దెలియునంతకు మా చిత్తం బత్తఱం పడియెడు. కొంచక వాకుర్వ్వము" నావుడు దమనకుండు "స్వామీ! మతివిహీనుండ నయి మహాపరాధంబు గావించితిని. నా వలనం గరుణింపుఁడు. క్షమియింపుఁడు. భృత్యుండు స్వాపరాధంబు స్వామికి నివేదింపక మొఱంగం జనదు. మొఱం గినవాఁడు రెండు లోకంబులకుం గాక చెడు. అది యట్లుండ నిమ్ము. వెక్కండి మనుగడకు మూలంబగు పుణ్యపురుషున

ప్రవ్వ - దీని మొదటి రూపములు ప్రరుగు (రూ) పురువు, పుర్వ్వ, (పువ్వ= పువ్వము). మెలపు = మెలఁకువ — జాగరూకత. మూలము = నేరు. వెలార్చు = వెడలించు, బయలుపఱచు (వెలి +ఆరుచు). మాయించు = నశింపఁజేయు (మాయుధాతువు) కావుతన్ + ఎడ - అచ్చుపరమగునప్రదు 'తన్' లోని ద్రుతమునకు మకారము - కావుతమెడ. ఎడ - ఆలస్యమనుట. తెలివి = ప్రసన్నత్వము. లోకంబునన్ ... తలంపఁడు - నీకుఁ గీడు చేసిన వాఁడు నాచేఁ జచ్చునని భావము. ఉత్తలంపడు = కలఁగు (రూ) ఉత్తలము పడు; ఉత్తలపడు. కొంచు = కొంకు, సంకోచించు. మొఱంగు = వంచించు; పొంచు. (మొఱుఁగు = కుక్కకూఁత, కూయు) మనుగడ = బ్రదుకు, జీవనము.

కొక్క యెడరు వాటిల్లిన నది యొక్కటి శోచ్యంబు గాని మాదృశుండు క్షుద్రుం డొక్కరుండు పొలిసిన దానం గొఱంత లేదు. దాన లోకం బస్తమింపదు. సమక్షంబున భృత్యుల వర్తనంబు లెల్లం గీర్తనీయంబులై యుండుంగాని యందు దోషంబు లేశంబుం గానంబడదు. అటగుటం జేసి యధీశ్వరుండు స్వపరోక్షంబునం దత్తద్వర్తనంబులు చార ముఖంబునం బరికించి హితాహితుల నిర్ణయించి యనుగ్రహ నిగ్రహంబులు మెఱయించుచుం బ్రజావృక్షంబునకు మూలం బగు తన్ను రక్షించుకొనవలయు. స్వామీ! సేవకుం డేమో విన్నవించెడు నని యాలంబు చేయక యాలకింపుఁడు. సంజీవ కుని వర్తనంబు పరికింపం దొంటి తెఱంగు గాదు. అన్యాయంబు నుడువఁ గూడదు. మొదలు సంజీవకుని ప్రవర్తనం బనన్య దృశంబుగ నుండె. ఆతని చరిత్రంబునకు మే మంచఱము మిక్కిలి యాశ్చర్యంపడుచుందుము. ఈతండు తొల్లి యెల్లతఱి మిమ్ము నవ్యాజప్రేమంబునం గొలుచుచు మీ కార్యంబులందుఁ బ్రమా

ఎడరు = ఆపద. శోచ్యము = శోకింపఁదగినది. మాదృశుఁడు = నావంటి వాఁడు. క్షుద్రుఁడు = అల్పుఁడు. పొలిసిన = నశించినను. అస్తమింపదు = పాడుపడదు అనుట. సమక్షము = ఎదుట. కీర్తనీయము = స్తోత్రము చేయఁదగినది. పరోక్షము = వెనుక. (ప్రత్యక్షము = ఎదురు) వర్తనము = నడవడిక. చారముఖంబున = వేగులవారి వలన ననుట. ప్రజావృక్షము = జనమనెడు చెట్టు - జాత్యేకవచనము. ఆలంబు = ఉపేక్ష. మొదలు = తొలుత. అనన్యదృశము = మఱియొకటితో సరిపోలినది కానిది. అవ్యాజము = కపటము లేనిది.

దంబు లేక ప్రవర్తించుచుండు. కార్యంబుతఱి నీరువట్టని యాఁకలి యని నిద్రయని చూడఁడు. చక్కెర దిని చేఁదన వచ్చునే? తొంటి తెఱంగు విచారింప సంజీవకుండు లోకంబు లోనివాఁడె. ఏమి కాలదోషంబో యిప్పు డీతం డాతండు గాఁడని తోఁచెడు. ఈతఁడు తొల్లి మీ గుణంబులు వేనోళ్ళం గొని యాడుచుండు. అప్పు డాతని నిర్భరానందపారవశ్యంబునకుఁ గొలంది లేదు. కొంత కాలంబునకు వెనుక మాబోఁటు లెవ్వరైన మిమ్మిం బ్రశంసించుచో సత్యము సత్య మౌనో నని యంగీకారసూచక వచనంబులతోడనే చాలించుచు వచ్చె. అనంతరము దేవరప్రశంసనంబు వచ్చిన మందహాసంబుతో వినుచుండుంగాని యట్టిట్టని వచియింపఁ గానము. ఇటీవల నేమికతంబో యేలినవారి ప్రసంగంబులం దెచ్చికోలు వికాసంబె కాని నిక్కంపు మందహాసంబు లేశంబయినం గానంబడక యున్న యది. ఈతని యనుభావంబు వింతయయి కానంబడుచున్న యది. దీనికిం గతం బేమొకో యని మనంబున రోయు చుండుదు. నేఁడు మదీయాప్తులు కొందఱు మాటవెంబడి

నీరువట్టు = దప్పి - పిపాస, చక్కెర. (ప్ర) శర్కర. చక్కెర దిని చేఁదన వచ్చునే - మేలనుభవించి కీడనవచ్చునా యనుట. లోకంబులోనివాఁడె = లోకముతోపాటువాఁడని భావము. వైపరీత్యము లేనివాఁడనుట. వేనోళ్ళ = అనేకవిధము లనుట. (వేయి + నోళ్లు) నిర్భరము = అత్యంతము. పార వశ్యము = పరవశమగుట. ప్రశంసనంబు = కొనియాడుట. ప్రసంగము = ప్రస్తావము. తెచ్చికోలు = (స్వభావమున లేక) తెచ్చుకొనుట. అనుభావము = అభిప్రాయమును దెలియఁజేసెడి ముఖవికాసాదికము. ఆప్తులు = సన్మిత్రులు. మాటవెంబడి = ప్రస్తావవశమున (మాటలధోరణిలో).

స్వామిచే నిగృహీతు లగువారిత్రో సంజీవకుండు చెలికారంబు సేయుచున్నవాఁడు. కాటక పాటకులతోడ నిచ్చలు మంత్రంబు నిర్వర్తించుచున్నవాఁడని వినుపించిరి. దీనంజేసి యాతని భావంబు నిర్ణయించితి. స్వామిహితంబు కాంక్షించువాఁడు స్వప్నావస్థయందైన స్వామిద్రోహులత్రోడఁ సఖ్యంబునకుఁ బాలు వడునే?" అని నుడివి పక్కవెనుకలు కలయంజూచి కరంబున నోరు మూసికొని శ్రవణమూలంబు చేర మోర సారించి యల్లన నిట్లనియె. "ఇది దేవర సన్నిధి నున్న భృత్యుల కెల్లం దెల్లం బయి యుండవచ్చు. సంజీవకునివలని భీతింజేసి యిచ్చటివారు బయలు పొంగకున్నవారు కాఁబోలు. ఇంతయేల యొక్కనిం బిలిచి విచారించినం జిత్తంబునకు విశదం బయ్యెడు" నా విని పింగళకుం డద్భుతరోషవిషాదంబులు పెనంగొనం దన సేవకుని నొక్కనిఁ బిలిచి "యిచ్చటి కొలువుడుకాం డ్రేరేనిం గాటకపాటకులత్రోడ నేస్తంబు సేయుచున్నవారె!" నావుడు వాఁడు భయంపడి గుటకలు మింగ "వెఱవకుము, సత్యంబు వాక్రువ్వుము. దానం గొజంత లే"దని యీఁడు నలుక విని వాఁడిట్లనియె. "సంజీవకుండు

నిగృహీతులు = త్రోవఁబడినవారు. చెలికారము = సఖ్యము. నిచ్చలు = ఎల్లప్పుడు - బహువచనాంతము; నిచ్చ యనియుఁ గలదు (నిచ్చ రాఁ బోఁ. వసుచరిత్ర) నిర్వర్తించు = జరపు. కాంక్షించు = కోరు. నోరు మూసికొని - చేయి నోటికి నడ్డముగా నుంచికొని యనుట - ఇది ప్రభువు నొద్ద సేవకుఁడు చేయు నైచ్యము. శ్రవణమూలము = చెవి మొదలు. సారించి = చాఁచి. తెల్లము = స్పష్టము. బయలు పొంగకున్నవారు - బయలుపఱుపకున్నారనుట. ఏరేనిన్ = ఎవ్వరేనియు. నేస్తంబు = స్నేహము. గుటకలు మింగఁ = సంకోచింపఁగా ననుట.

వారి చేరికకు మేకొని యున్నట్లు కానంబడుచున్నది" నావుడు విని "మే మడిగిన యర్థం బిక్కడన మఱచిపొమ్మ్ము. బయల సుబ్బ నీకును పొద"మని వానిం బుచ్చి పింగళకుండు ఖిన్నుండయి క్రిందు చూచుచు మిన్నకుండం గాంచి వెండియు దమనకుం డిట్లనియె. "ఇప్పటి చొప్పు పరికింప మనతోడ నింక సంజీవ కుండు మనసునం గలిసి నడింపఁబోఁడు. అతని తెఱంగు కొంత యెఱింగినవార మగుటంజేసి మనకును దొంటి చందంబున డెందంబు పొంది యుండదు. అయిన నీతఁడు పెద్ద గాలంబు దేవర యాస్థానంబునం దుండి చిత్తంబున కెక్కం బ్రవర్తించిన వాఁడు. చిరకాలసేవి యగు భృత్యుండు తెలిసి తెలియములం జేసి యొక్క యపరాధం బొనరించిన క్షమియింపవలయుఁగాని పెఱలంబోలె వానిం ద్రోచి పుచ్చుట ధర్మంబు గాదు. కావున నీతం డింతడనుకం జేసిన దుష్కార్యం బావిష్కరించి యలుకు పుట్టించి క్షమియింప వేఁడుకొలిపి యిటమీఁద నిట్టి కార్యంబు బ

చేరిక = సాంగత్యము - చేరుధాతువు కృదంతము. మేకొను = సమ్మతించు. మేము - రాజు గానఁ బూజ్యార్థమునందు బహువచనము. సుబ్బు = ప్రకటిత మగు. ఇటీవల నితరులు ముద్రించు నీతిచంద్రిక భాగములు పెక్కింట 'బయల నుబ్బనీకుము' అనియే యంధపరంపరగఁ గానుపించుచున్నది. సూచిప్రయోగము సుబ్బగాని ఉబ్బుగాదు. సుబ్బ = బయలుపడు; ప్రకటితమగు ఊదా. 'ఆ చిత్రఫలకము సుబ్బెడునఁడు' ప్రభావతీ ప్రద్యుమ్నము. పొదము = పొమ్మ్ము - (హా) పొదము. చొప్పు = విధము. తొంటి - (హా) తొల్లింటి. పొందియుండదు - అనుకూలపడదు. ఎక్కక = సమ్మతి యగునట్లుగాననుట. సేవి = సేవకుఁడు; సేవించువాఁడు. పెఱలంబోలెఁ = ఇతరులను ద్రోచి పుచ్చుటవలెననుట. ఆవిష్కరించు = బయలుపఱచు. అలుకు = భయము. వేఁడుకొలుపు = వేఁడుకొనఁజేయు.

చేయకు మని నాతికఠినంబుగఁ బలికి యెప్పటిచొప్పున నాతని కొలు వీకొనుట సర్వవిధంబుల నుచితంబని త్రోఁచుచున్నయది." అనవుడు మృగపుంగవుం డాకర్ణించి మొగం బెగయించి దమన కుని మొగంబునం జూపులు వొలయ నించుక మనంబునం బరికించి 'రాజద్రోహుల నెల్ల విధంబుల దండించుట యుచితంబు. అయినను నా హృదయంబు వానినలన బహుకాలంబు స్నిగ్ధం బగుటంజేసి యొక్క తెగువకుం జొరదు. కావున వెలార్త మొండె. నీ చెప్పినచొప్పు గావింత మొండె' నావుడు నక్కల రాయం డిట్లనియె. "ఇది యిప్పటికిం దోఁచిన తెఱంగు. అయినను సాహసంపడి యొక్క కార్యంబు చేయంజనదు. "సహసా విదధీత న క్రియా"మని నీతికోవిదులు వక్కాణింతురు. ఇది మఱి యెవ్వనితోడనేని నొక్క ధీమంతునితో దేవర చిత్తంబునకు వచ్చినవానితో విచారింతము. అప్పటికి దేవర

నాతికఠినంబుగఁ = మిక్కిలి కఠినము గాకుండునట్లు (న + అతికఠినము) ఈకొను = ఇయ్యకొను-సమ్మతించు. పొలయు = వ్యాపించు. ఇంచుక = కొంతసేపనుట. స్నిగ్ధము = స్నేహము గలది. ఒక్కతెగువకుఁ = ఒకానొక సాహసమునకు-అనఁగాఁ జంప్రట కనుట. ఒండెఁ = వికల్పార్థక మయి ప్రశాంతమయిన యవ్యయము. రాయఁడు = రాజు. బహు - రాయలు (రాయఁడు-అసాధువు) సాహసంపడు = తెగించు. (సాహసము = సహసా కరణము-అవితర్కితముగాఁజేయుట-తెగువ) సహసా విదధీత న క్రియామ్-ఇది భారవి యను సంస్కృతకావ్యమునందుండెడి శ్లోకమున నొక పాదము. సహసా = అవితర్కితముగా-యోజింపక యనుట. క్రియామ్ = కర్మమును. వ విదధీత = చేయువలదు. ఏపనియుఁ ద్వరపడి చేయ గూడదని భావము. కోవిదుఁడు = అన్నియుఁ దెలిసినవాఁడు-పండితుఁడు. చిత్తమునకు వచ్చిన వాఁడు=మనసునకు సరిపడినవాఁడు-తలంపున యోగ్యుఁడని యెంచఁబడినవాఁ డనుట (నచ్చినవానితో-అన్నది అపపాఠము)

కుచితంబని తోఁచిన యర్థంబు మేకొందము. దూరంబు విచారించి చేసిన దానం గొఱంత లేదు. ఇంతలోనన మిగిలి చను కార్యం బేదియుఁ గానము" నావుడు మృగపతి "యిందలి వారందఱు నీ వెఱింగినవారు గాని లాఁతులు లేరు. వారివారి బుద్ధి కౌశలంబులు నీ వెఱుంగుదువు. నీ యిచ్చకు వచ్చినవానిం జెప్పుము" నా విని దమనకుండు కొండొకవడి తెప్పలిడక యుప్పరంబు చూచి మరల మృగరాజుం గాంచి " మదగ్రజుండు కరటకుండు ప్రజ్ఞావంతుండు. దేవరహితంబు గోరువాఁడు. అతండు చిత్తంబునకు వచ్చునే నిప్పుడ రప్పించెద"నని చెప్పి యెప్పించి యొక్క రాజభటునిం బుచ్చి రావింపఁ గరటకుండనయంబు వినయంబు మెఱయ వందనంబు గావించి మృగస్వామిచే ననుయుక్త స్వాగతుం డయి తదాదిష్టం బయిన యుచితాసనంబునం గూర్చుండ నతండు దమనకుం జూచి "యా వృత్తాంతంబు ససాకల్యంబుగ నీతనికి వినుపింపు"మనవుడు దమనకుండు కరటకుతోడ సంజీవకుని భూతభవంతివర్తనంబులును జేనికిం దనకు నందుల కయిన సల్లాపంబును వినుపించి యిం దవసానంబున మదుకార్థంబును జేసి వచనంబును వింటివి గదా? ఇందు నీకుం బోలినయది వాక్రువ్వుము. నావుడుం గరట

ఉప్పరము = మీఁదు-వై. అనయంబు = అత్యంతము. అనుయుక్తస్వాగతుండు = అడుగఁబడిన కుశలముఁ గలవాఁడు-కుశలమా యని పృచ్ఛింపఁబడినవాఁడనుట. (సు + ఆగతము = స్వాగతము - యణాదేశసంధి) తదాదిష్టము = ఆ పింగళకునిచేత నాదేశింపఁబడినది (ఆదేశము = ఆజ్ఞ) భూతము = జరగినది. భవంతి = జరగుచున్నది. అవసానంబునఁ = కడపట.

కుండు కొండొక మనంబునం బరికించి దమనకుం జూచి " జేసి యెఱుంగని యర్థం బొక్కఁండు లేదు. కార్యాకార్యంబులు నిర్ణయింప మన మెంతవారము? అయిన నమాత్యపదంబున నున్న వార మగుటంజేసి యవసరంబునం దోఁచిన యర్థంబు విన్నవింపక మిన్నకుండం జనదు. అంతరం బెఱింగి రాజద్రోహంబు గావించినవానిని సర్వవిధంబుల వెలార్పం జనదు. వెలార్చినవాఁడు పగఱం గూడి పగ సాధింపం గోరుఁగాని తన చేసిన దోషంబు పరికింపంబోఁడు. మన కప్పుడు గోరంబోవు పని గొడ్డంటం దీర్పవలసి వచ్చును. కాదని యెప్పటి చొప్పునం గలిపికొని వర్తింతుమేనిం బూర్వం బొక్కమారి యెడమ వొందింపఁ గడంగి పెఱ లెఱుంగుటవలన విఫలమనోరథుం డగువాఁడు వెండియుం జేయు నుద్యోగంబు ఫలానుమేయంబై యుండు. అట్టివానిం జేర్చుకంటెం గీడు వేఱొండు గలదె? అధీశుండు తనకు నపాయంబు రోయు భృత్యు నుపేక్షింపం

కొండొక = కొంత. పరికించి = యోజించి. జేసి...లేదు - తానొక యుపాయమును జెప్ప నుద్యుక్తుఁడుగా నుండియు మొదట నిట్టి మాటలు చెప్పుట లోకమర్యాదయగు నైచ్యానుసంధానమును దెలుపుచున్నది. అమాత్యపదము = మంత్రిస్థానము. అంతరము = అవకాశము - సందు. గోరంబోవుపని గొడ్డంటం దీర్పవలసి వచ్చును - సులభముగా ముగియు కార్యమును గష్టపడి ముగింపవలసియుండునని భావము. ఒక్కమారి = ఒకతూరి - ఒకతేప - ఒకసారి. విఫలమనోరథుండు = నిష్ఫలమైన కోరిక గలవాఁడు. ఫలానుమేయము = ప్రయోజనముచేత నూహింపఁదగినది - అనఁగాఁ గీడు పొందిన పిమ్మట నిది వీఁడు చేసెనని తెలిసికొనఁదగినదిగా నుండుననుట. అధీశుఁడు = ఱేఁడు. రోయు = వెదకు - దీనికి రోఁతపడుటయు నర్థము. భృత్యుఁడు = పనివాఁడు - భరింపఁదగినవాఁడని వ్యుత్పత్త్యర్థము.

జనదు' నాపుడుం బింగళకుండు "కరటకా ! నీవు వాక్రుచ్చిన యది సత్యంబు. అయినను జిరకాలసఖ్యంబునంజేసి వానిని గొండొక కీడునకుఁ జొప్పింప మనం బొప్పదు. నే నేమి చేయుదు ?" నాపుడుం గరటకుం డిట్లనియె. 'ఆరోగ్యంబు గోరువాఁడు చికిత్సకువలన నౌషధంబుంబోలె శ్రేయంబు కాంక్షించు నాయకుండు భృత్యునివలన హితం బవశ్యంబు గ్రహింపవలయు. దేవరకుం దెలియని యర్థం బొక్కఁండు లేదు. కొండొక దవ్వు పరికించినం గర్తవ్యంబు చిత్తంబునకుఁ దేట వడియెడు. నీతికోవిదుఁడగు భూవల్లభుం డుపధాశుద్ధుం గొలువున నీకొనవలయుఁగాని తక్కఁ దెఱుంగయినం బర్యవసానంబునఁ దప్పక ముప్పు వాటిల్లు. ముందు మందవిసర్పిణి యను చీర

వాక్రుచ్చు = చెప్పు. చిరకాల సఖ్యము = పెక్కునాళ్ల చెలిమి (సఖి భావము సఖ్యము) తద్ధితాంతము. కొండొక కీడునకు-కొంత కీడునకేని యని యర్థము. చొప్పించు = చొరఁజేయు, చొచ్చుధాతువు ప్రేరణము. ఆరోగ్యము = అరోగుని భావము. (అరోగుఁడు = రోగములేనివాఁడు) తద్ధితాంతము. చికిత్సకుఁడు = వైద్యుఁడు. ఔషధంబుంబోలె = మందును గ్రహించుటవలె నని యర్థము-ఔషధము చేఁదుగా నుండినను రోగము తీఱవలెనని రోగి దాని నెట్లు పుచ్చుకొనునో యట్లు మేలు పొందవలసినవాఁడు మిత్రుని వచన మప్రియముగా నుండినను అవశ్యము దానిఁ గైకొనవలయునని భావము. దవ్వు = దూరము - దీర్ఘముగాననుట. కర్తవ్యము = చేయఁదగినపని. నీతికోవిదుఁడు = నీతియందుఁ బండితుఁడు - చక్కఁగా నీతిఁ దెలిసినవాఁడనుట. వల్లభుండు + ఉపధా అని ఛేదము. ఉపధ - మంత్రి మొదలయినవారిని ధర్మార్థకాములచేఁ జేసెడు పరీక్ష. శుద్ధున్ = (అట్టి పరీక్షచేత) పరిశుద్ధుఁడైనవాని. ఈకొను = అంగీకరించు. పర్యవసానంబునన్ = కడపట. ముప్పు = ఆపద; ముసలితనము.

పోత్రు డిండిమం బను మత్కుణంబుతోఁ గొలఁది తెలియక సావాసంబున కీకొని హానిం జెందె. అక్కథ వినుపించెద వినుండు.

మందవిసర్పిణి యని యొక్క చీరపోతు గలదు. అది తడవులంబట్టి యొక్క నృపాలుని పల్యంకంబుఁ జేరి మెలంకువ మీఱి వసియించి జీవించుచుండు. అంత నొక్కనాఁడు డిండిమం బను మత్కుణంబు తత్పర్యంకంబున కరుదెంచిన మందవిసర్పిణి యెదురు సని కొనివచ్చి యాతిథ్యం బొనరించి కుశలం బడిగి "యిచ్చటికి వచ్చిన ప్రయోజనం బే"మని మందలింప మత్కుణం బిట్లనియె. " పరమమిత్రంబ వగు నినున్నొక యర్థం బర్థింప వచ్చితి. నీ యనుగ్రహంబు గలిగిన నా మనోరథంబు వ్యర్థంబు గాదు. " నావుడు మందవిసర్పిణి యిట్లనియె "నాకుం బ్రాణసమానుండవు. నీయభీప్సితంబు మదాయత్తం బొకండుగలిగిన దానికింత ప్రార్థింప

(మిత్రభేదము – పెఱసగము)

ఇటనుండి మిత్రభేదములో 'పెఱసగము' అని ప్రాచీన వ్యవహారము

మందవిసర్పిణి = తిన్నఁగా జరగునదని పేరు. చీరపోతు = చీరలయం దంటుకొని యుండెడు తెల్లని పేను-చీరపేను. మత్కుణము = నల్లి. కొలఁది-తారతమ్య మనుట. సావాసము = సహవాసశబ్దభవము. నృపాలుఁడు = నరు లను బాలించువాఁడు - రాజు. పల్యంకము = పర్యంకము - మంచము. మెలంకువ = జాగరూకవర్తనము. ఇది మెలఁగు ధాతువువలనఁ గలిగినది. ఆతిథ్యము = అతిథిసత్కారము, తద్ధితాంతము. మందలించు = అడుగు, చెప్పు, ఆజ్ఞాపించు, మనవిచేయు, హెచ్చరించు, తలఁచు (మందలింపు - వ్యవహారము) అర్థంబు = ప్రయోజనమును. అర్థించు = కోరు. అభీప్సితము = కోరిక. మదాయత్తంబు = నా యధీనము (మత్ + ఆయత్తము)

వలయునె? నీకీరాని యర్థం బొక్కండు నాకుం గలుగదు" నా విని డిండిమంబు సంతసించి యిట్లనియె. 'తడవులనుండి నానామానవసంతానశోణితంబు లాని యున్నవాఁడం గాని మానవనాథు మేని రుధిరం బే నాఁడేని నెఱుఁగ. శాల్యోద నంబును హైయంగవీనంబును మధురసూపంబును సారతర శాకంబులును రుచ్యంబు లగు భక్ష్యంబులును నానాఫలంబు లును రసాయనంబులును వివిధమాంసంబులును గోక్షీరంబులును మద్యంబులును నానావిధోపదంశంబులును బిచ్చిలదధియును శర్కరయుఁ బులకండంబును గంధోదకంబులును లోనగు మంచి పదార్థంబు లనుభవించుచు నెండకన్నెఱుంగని రాజుల మేని రక్తంబు కరంబు స్వాద్యంబయి యుండునని వింను. ఈ తలి

సంతసించు = సంతోషించు-వై. తడవు-ఇది తడయుధాతు కృదంతము. (తడయు = ఆలస్యము చేయు) నానా...శోణితంబులు = పెక్కుతెఱంగులు గల మనుష్యుల సమూహముయొక్క నెత్తురులు. ఆను = ప్రాగు. రుధిరము = నెత్తురు (తోలుచే) కప్పఁబడినదని వ్యుత్పత్త్యర్థము. శాల్యోదనము = వరియన్నము. (శాలి + ఓదనము - యణాదేశసంధి) హైయంగవీనము = నాఁడు చిలికి యెత్తిన ఆవువెన్నను గాఁచిన నెయ్యి. సూపము = తుండిన పప్పు. సారతరము = మిక్కిలి శ్రేష్ఠము. రుచ్యము = రుచి గలది. రసాయనము = జరావ్యాధులు పీడింపకుండ ఫలరసములను జేర్చి చేసిన లేహ్య విశేషము. ఉపదంశము = ఊరుఁగాయ. పిచ్చిలము = మీగడ కట్టినది. శర్కర = చక్కెర. పులకండము = కండచక్కెర - పటికబెల్లము. పులకండమని చెప్పఁబడునది. గంధోదకము = వట్టివేరు మొదలగు వాసనాద్రవ్యములను జేర్చిన మంచినీరు. ఎండకన్ను = ఎండజాడ - ఎండ్రకనుట్ట. స్వాద్యము = రుచి గలది. తలిమము = శయ్య, పడక - దీనిఁ గొందఱు శేష్యపదమని నిఘంటుప్రయోగంబును గావ్యములందును ప్రాసియున్నారు. ఇది లవ్వ. ఇది సంస్కృతపదము.

V.R. NARAYANA MEMORIAL LIBRARY V.R. COLLEGE, NELLORE Acc. No. Dept.

మంబునందు నా యునుకువ యీకొంటివేని నా కోరిక నెఱ
వేరును.' నావుడు మందవిసర్పిణి మోమోడి మాఱాడక
యుట్లనియె. 'వెర వెఱింగి వేగిరపడక మయి మఱచి కూరుకు
సమయంబు వేచి జేనిమేని మెల్లగం గఱచి నల్లఁ బీలిచికొని
మెలంకువతోడం దొలంగి చనవలయు' నావిని డిండిమంబు
'నీ చెప్పినయట్లు మెలంగెద' నని పలికి చీరచేనితో మిక్కిలి
మైత్రి యొనరించుచు నా శయ్య వసియించి తమి పెల్లింద
బాపంజాలక జేడు పడకం జేరి కూరికికూరుకక ముంద చేరం
బాటి కొఱుకుడుం బుడమిజ్రేఁ డులికిపడి లేచి సీత్కారంబు
గావించుచుం బాదసంవాహనంబు సేయు పరిచారకుం గాంచి
'యోరోరి! తేలు కుట్టినట్లు కరంబు నా శరీరం బెరిసెడు. సత్వ
రంబుగ దీవియ చేరం దెమ్మని పలికిన దివ్వియ దెచ్చునంతలో
మత్కుణంబు దూరంబుగ సుఱఁగినం బరిచారకుఁ శయనంబు

ఉనుకువ = ఉనికి - నివాసము. మోమోడు = దాక్షిణ్యపడు - దీనికృదం
తము - మోమోట (రూ) మొగమోడు. కూరుకు = నిద్రించునట్టి. నేచు =
ఎదురుచూచు, ప్రతీక్షించు. నల్ల = నెత్తురు. పీలుచు = ద్రవవస్తువును
రెండు పెదవుల కొనలతో లోపలి కీడ్చు. మెలంకువ = ఎచ్చరిక. మెలఁగు =
జాగరూకతతో వర్తించు. తమి = అనుభవింపని కోరిక యందలి యాశ.
పెల్లిదము (తమియొక్క) అతిశయము (పెల్లు + ఇదము) ఆపంజాలక =
నివారింప నోపక. కూరికికూరుకకముంద = నిద్ర చక్కఁగాఁ బట్టకమునుపే
అనుట. సీత్కారము = ఊస్సురనుట. సంవాహనము = పిసుకుట ఓరోరి.
ఓరి + ఓరి - ఓరోరి. (ఓ + రి - ఓరి) నీచపురుషామంత్రణమున రివర్ణము. ఈదా-
ఓరి దుష్టుఁడా. 'ఓరోరి తేలు కుట్టినట్లు -' అని యిట స్వతంత్ర ప్రయో
గము. దీనికి దీర్ఘమును గలదు. ఓరోరీ - ఇత్యాది. ఎరియు = మండు.
దీవియ = దీపశబ్దభవము (రూ) దివ్వియ, దివ్వె. సుఱఁగు = పాఱు, అదృశ్య
మగు, చలించు.

నలువలంకులు కలయం బరికించి యొక్క పక్క నెరసువలెం బానుపుం గటిచికొని యున్న చీరచేనిం జూచి 'యిదియె తేనిం గటిచె'నని వారు దానిం బొలియించిరి. కావున స్వరూపం బెఱుంగక పరునిం జేరిచిన వాని కవశ్యము హాని సంభవించును.

అనిన విని పింగళకుం డిట్లనియె. "నాదు విక్రమంబు జంతుసంతానంబులకు మృత్యుక్రాయంబని లోకవిశ్రుతంబు. సంజీవకుండు నాపయి నెత్తుట కాలాగ్నిపై నుఱుకుటగాదె? అయిన నిన్నడిగెద. సంజీవకుండు నాకు నే వెరవునం గీడు రోయఁగలండు" నా నిని కరటకుం డిట్లనియె. "క్షుద్రుం డయ్యుం జిరపరిచయంబుచే జ్ఞాతమర్మ్ముం డగువాఁ డెంతవాని నేనిం దటి వేచి సాధించుట సుకరంబై యుండును. ఏవారికేని నొకప్పుడు గాకుండిన నొకప్పుడు ప్రమాదంబు వాటిల్లకుండునే? నీతికోవిదుండు శత్రువుని క్షుద్రునే నొప్పరికింపం జనదు." నా విని పింగళకుండు కొంత చింతించి "మన మీ మంత్రంబు త్రోడన కార్యంబు నిశ్చయించి సంజీవకు నొక్క కీడునకు

నలువలంకులు = నాలుగుదిక్కులు. నెరసు = తృణలేశము - నలుసు. పొలియించిరి = చంపిరి - పొలియు ధాత్వ్రేరణము. స్వరూపము = స్వభావము. విక్రమము = పరాక్రమము. సంతానము = సమూహము. మృత్యుక్రాయము = తటుచుగా మృత్యువే యని యర్థము. లోకవిశ్రుతము = జనులచే జక్కఁగా వినఁబడినది - ప్రసిద్ధమనుట. ఎత్తుట = దండుఁగొని బయలు దేఱుట. చిరపరిచయము = పెక్కునాళ్ల వాడుక. జ్ఞాతమర్మ్ముఁడు = తెలియఁబడిన మర్మ్ము గలవాఁడు-తన మర్మ్ము తెలిసికొన్నవాఁడనుట. శత్రుఁడు = శత్రువు - కృశింపఁజేయువాఁడని వ్యుత్పత్త్యర్థము. ఒక్కకీడునకు = ఒకానొక కీడునకు.

లోపఁజెచితినేని లోకంబు మనల నిందించుం గాని లోగుట్టు తెలియంజాలదు. లోకాపవాదంబునకు భయంపడవలయును. ఇంతియ కాదు. ప్రకృతినర్గం బవిమృశ్యకారి యగు నేనియందు విరక్తిం బొందు. దానంజేసి సర్వశ్రేయంబులు చెడును. కావునం దుదకుఁ దోఁచిన యొక్క యర్థంబు వక్కాణించెద. దమనకుండు సంజీవకు పాలికిం బోయి వానితోడ నిట్లు వాక్రువ్వవలయు. నీవు రాజద్రోహులతోడం జెలికారంబు చేయుచుంట చేఁ జెఱంగినవాఁడు. కరంబు కుపితుండయి యున్నవాఁడు. అయిన నతండు దీనవత్సలుండు గావున నీవు నా బడిం జనుదెంచి నిజాపరాధంబు నివేదించి ప్రార్థించితివేనిం బ్రసన్నుం డగునని వచియింపుము. మనచే నయినంతదనుకం గలుపుకోలుఁదనంబునక కడంగుదము. "నీచాఃకలహా మిచ్ఛన్తి సన్ధిం మిచ్ఛన్తి సాధవ" యని ధర్మజ్ఞులు వచింతురు గాదె? ఊరక వేఱిమికయి యూఁడిగొంట కెంతసేపు వట్టు? మనము

లోగుట్టు = మర్మము. ప్రకృతివర్గము = మంత్రిమొదలగు వారి గుంపు. అవిమృశ్యకారి = (ఏపని నేని) విచారింపక చేయువాఁడు - విమృశ్యకారి కాని వాఁడు. అర్థంబు = విషయము. ద్రోహి = పగగలవాఁడు. కుపితుండు = కోపగించినవాఁడు. దీనవత్సలుఁడు = బీదలయందుఁ ప్రేమగలవాఁడు. బడిక = వెంట, వెంబడి (బడి నాగమములెల్ల నడపె. వసుచరిత్ర). నివేదించి = తెలిపి. ప్రసన్నుఁడు = కలఁక లేనివాఁడు. కలుపుకోలుఁదనము = అభేదము-ఇక్కడ స్వార్థమందు తన వర్ణకము. కడఁగు = యత్నించు-కృ-కడఁక. నీచాఃకలహాన్ = అల్పులు. కలహమ్ = జగడమును, ఇచ్ఛన్తి = కోరుచున్నారు. సాధవః = మంచివారో, సన్ధిమ్ = పొందును - ఇచ్ఛన్తి = కోరుచున్నారు. వేఱిమి = వేఱుపాటు, భేదము.

ఋజుమార్గంబునం బ్రవర్తింతము. సంజీవకుండు నీ వచనంబులకు
ననుకూలుండయి వచ్చెనేని మేలొందెదము. తక్కినం దత్ఫలం
బనుభవించెదమును.”అని పలికి దమనకుం జూచి నీవుపోయిరమ్ము.
మన యిక్కడి తక్కిన వచనంబు లేవియుం బ్రవ్యకుము. నావుడు
దమనకుండు వల్లెయని యల్లల్లం జని యాననంబున దీనభా
వంబు గదురఁ బదంబులు దొట్రిల డాయం బోవ సంజీవకుండు
గాంచి ప్రత్యుత్థానం బొనరించి యుచితాసనంబునం గూర్చుండం
జేసి తదనుభావంబునకు నిమిత్తంబు మానసంబునం బరికించుచు
“మీ యందఱికుం గుశలంబే?” యునిన దమనకుండు విని
“పరాధీనవర్తనులకుం గుశలంబున కెంత యంతరంబు. రాజ
సేవాపరుండు మృత్యుగ్రస్తసమాల్యుండు. ఱేని మచ్చిక నచ్చిక

ఋజువు = వంకరగాక సరియైనది. తక్కినవి - అనుకూలఁడై రాకమా
నెనేని. తత్ఫలము-అనుకూలఁడై రాకపోవుట వలనఁ గలుగు ప్రయోజనమును.
ప్రవ్యకుము - ప్రస్తావింపకుము - ఇది భాష యొక్క నడక. వల్లె = అట్లే
కానిమ్మనుట. అల్లల్లన = మెల్లమెల్లఁగా. తొట్రిలన్ = తొట్రుపడఁగా -
తడఁబడఁగా. ప్రత్యుత్థానంబు = ఎదురుకొని లేచుట. తదనుభావంబు = వాని
యొక్క యభిప్రాయమును దెలిపెడి ముఖ చిహ్నము. పరికించు = విచారించు
(ప్ర) పరీక్షించు. పరాధీన వర్తనులు = ఇతరుల కధీనమైన నడత గలవారు-
ఇక్కడ దమనకుండు రాజు చెప్పినట్లు నడపక భేదోపాయముచే సంజీవకుని
వంచింపఁ బూనుచున్నాఁడు. అంతరంబు = ఎడము - దూరము. రాజసేవా
పరుండు = రాజు కొలువుసందు నాసక్తిఁ గలవాఁడు. మృత్యుగ్రస్తసమా
ల్యుండు = మృత్యుదేవతచేత క్రమింపఁ బడినవానితో సముఁడు - చచ్చిన
వానివంటివాఁడు-మృత్యువు (వి) మిత్తి. మచ్చిక = అనుగ్రహము, మోహము,
ఆసక్తి. నచ్చిక = నమ్మిక. నచ్చు ధాతుకృదంతము.

యిడి పెద్ద గాలంబు సుళ్ళయింపం గాంక్షించువాఁడు మృగతృష్ణి కాప్రవాహంబుం గాంచి యుదన్యాపనోదనంబుకయి ప్రధావించు వాఁడు గాఁడె? ఏకతంబునసేని తేని సాకతంబునకు మోఱుకుఁ దీసిన ధీరుండు మోసఁబొందఁడు" నావిని గోవల్లభుండు "నీ వచనభంగి విచారింప నేదియో యొక్క విశేషంబు గలుగం బోలు నని తోఁచెడు" ననుచు నేకాంతకాంక్షాసూచకంబుగం దన యిరుపక్క-యలుం బిఱుచక్క-యు నాలోకింపఁ బితీందిదెస నున్న కాటకపాటకు లల్లన లేచి యెడ గలుగంబోవుడు దమున కుండు వారిదెస యపాంగవీక్షణంబున సూచించుచు "పేరలఁ జేరు చుటయె నీ యిడుమకు మూలంబయ్యె." నావుడు సంజీవకుండు భయాధీనమానసుండయి 'యచ్చట జరిగిన వృత్తాంతం బేమి'

మృగతృష్ణిక = దూరముననుండి చూడఁగా జలములవలెఁ దోఁచెడి సూర్య కిరణముల వెలుఁగు - ఎండమావులు. ఉదన్య = నీరుప్రాప నిచ్చ - నీరు వట్టు. అపనోదనము = పోఁగొట్టుట. ప్రధావించు = పాఱు, పఱు గెత్తు. ఏకతంబునసేని = ఏకాంతమందైనను - రాజు తనతో నేకాంత మాడుచున్నాఁడని యబ్బి యతని యనుగ్రహము నమ్మఁబోఁడని భావము; ఏకాంతశబ్దభవము. సాకతము = అనుగ్రహము. మోఱుకు = మూర్ఖుఁడు - మూఢుఁడు. మూర్ఖశబ్దభవము. మోస (రూ) మోసము; మీస, మీసము వంటిది (ప్రమాదము, వొంగతనము) వచనభంగి = మాటతీరు. ఏకాంత కాంక్షాసూచకంబుగన్ = ఏకాంతమును గోరుటను దెలియఁజేయునదిగా. పక్క-యలు = పార్శ్వములు - పక్షశబ్దభవము. పిఱుచక్క - పిఱుఁదు + చక్క = వెనుకపార్శ్వము; వృత్తియందు అంత్య వర్ణము లోపించును. ఇట్లే పిఱుతివియు మున్నగునవి. అపాంగవీక్షణము = కడగంటిచూపు. భయాధీన మానసుండు = భీతికి వశమైన మనస్సు గలవాఁడు - భయముచే నస్వాధీనమైన మనసు గలవాఁడని భావము.

యని యల్లన నడిగిన దవ:నకుం డిట్లనియె. "చేటు
ఱుంగని వాటు వడియెదవు. కాటకపాటకులు రాజద్రోహులని
యెఱింగి యుండియు వారలతోడ సఖ్యంబు చేయుచున్న వాఁడవు.
ప్రభువునకె కా దెవ్వారికయిన నిది యనుచితం బని తోఁప
కుంచునా? ఈ యర్థంబు పార్థివుం డెఱింగి దుర్వారక్రోధభీషణుం
డయి యున్నవాఁడు. తొల్లి నా వచనంబునందు విశ్వాసం బిడి
తేనిపాలం జేరితివి. కావున నున్నరూపు వచియించెద వినుము.
సంజీవకు పక్షం బవలంబించి మత్సమ్ముఖంబున వచియించువారి
నెవ్వరినేనిం దత్క్షణంబ కృతాంతనిశాంతావేశికులం జేసెద నని
హర్యక్షాధ్యక్షుండు కరంబు కూరిరంబుగ సంగరం బొనరించి
యీ క్షణంబ సంజీవకుం దోడ్కొని రమ్మని నన్నుఁ బుచ్చిన

చేటు = చెడుధాతుకృదంతము. పాటు - పడు ధాతుకృదంతము. రాజ
ద్రోహులు=రాజునకుఁ జెఱుపు చేయువారని భావము. ప్రభువునకె కాదు =
ప్రభువునకే యిది యనుచితంబని తోఁచుట కాదని యర్థము. పార్థి
వుఁడు = రాజు - భూమికి నాయకుఁడని వ్యుత్పత్త్యర్థము. దుర్వార
క్రోధ భీషణుండు = నివారింపఁగూడని కోపముచేత భయంకరుఁడు.
విశ్వాసంబు = నమ్మిక. ఉన్నరూపు = యథార్థము. (రూపము (వి) రూపు)
వచియించు - ఇట 'వసియించు' అని అంధపరంపరగ వచ్చు అపపాఠము.
కృతాంతనిశాంతావేశికులన్ = యమునింటి కతిథులను (కృతాంతుఁడు =
చేయఁబడిన నాశము కలవాఁడు=యముఁడు). నిశాంతము =ఇల్లు-అవశ్యము.
రాత్రి పొందఁబడునది యని వ్యుత్పత్తి. ఆవేశికుఁడు = అతిథి - ఇల్లు వెడలి
వచ్చినవాఁడని వ్యుత్పత్తి. హర్యక్షాధ్యక్షుండు = సింహరాజు. హర్యక్షము=
కపిలవర్ణములైన కన్నులు గలది. సంగరము = ప్రతిజ్ఞ, అంగీకారము, ఆపద
విషము, యుద్ధము ననియు నర్థములు.

వాఁడు. మీఁది కార్యంబు నీ యిచ్చ వచ్చినట్లు గావింపుము. ఈ యనర్థం బూరక పుట్టదు. చేరువం జేరి యెవ్వారో చెవి గఱచెదరు. వెండియు నిట్టివి యేమి పుట్టెడునో యెఱుంగము. నేఁడు నీ కయినయది తేపు మా కయ్యెడు. అతీతకార్యంబునకు విచారంపఁ డయ్యెడు ఫలం బేమి? ఎన్నండు తేనికి బానిస తనంబునకుం బూనికొంటిమి నాఁడె మృత్యువునోరం జొచ్చితిమి. ఇందులకయి యిప్పుడు వగచుట గతజలసేతుబంధనంబు." అని నిట్టూర్పు నిగుడించి ఖేదవిషాదంబు లభినయించువాఁడు క్రిందు చూచుచు మిన్నకుండ సంజీవకుం డవ్వచనంబు వజ్రపాతం బహార్యంబునట్లు ధైర్యసారం బగలింపం గొంతవడి వెఱ

అనర్థము = కీడు. చేరువ = చేరు ధాతుకృదంతము. చెవి గఱచెదరు = దుర్లోభనము చేసెదరని యర్థము. ఇది భాషాశైలి. అతీతము = కడచినది. విచారంపడు = (గూ) నిచారపడు, విచారముపడు. బానిసతనము = దాస్యము - కొలువు (బానిసత్వము - అసాధువు). మృత్యువు నోరం జొచ్చితిమి = చచ్చితిమని యర్థము. గతజలసేతుబంధనంబు = పోయిన నీళ్లు గల కట్టను గట్టుట - నీళ్లు పోయినపిమ్మటఁ గట్టను సవరించుట వంటిది యని భావము. మఱియు దీనివంటి కార్యములు - చలికాలము కడచిన పిమ్మట వస్త్రము గొనుటయు; ఆఁకలి యడంగిన నన్నము దినుటయు; యౌవనము కడచిన తర్వాత వివాహము చేసికొనుటయు, ముసలితనము వచ్చిన వెనుకఁ దీర్థయాత్ర చేయఁగడఁగుటయు; చేత నున్న కాసు పోయిన యనంతరము ధర్మము చేయఁ గోరుటయు నని యెఱుంగునది. ఖేదవిషాదంబులు = దైన్యచింతలు. అభినయించు = లేనిది యున్నట్లు చూపు. పాతము = పడుట, పాటు. అహార్యము = హరింప శక్యము కానిది - కొండ. సారము = చేవ. అగలించు = భేదించు - అగలు ధాతువు. వెఱ = వెఱపు - భయము.

పెల్లిదంబున నివ్వెఱపడి యుండి యెట్టకేలకు హృదయంబు పదిలించుకొని దమనకుం గనుంగొని యిట్లనియె.

"అనారతంబు జేనికి లగ్గు దలఁతుంగాని యెగ్గు గలయం దయినం దలంచి యెఱుంగ. లాఁతివారికయిన నొక యెొప్పను గావింప మనంబు చొప్పఁడియుండునే? అకారణంబుగ జేసి కిట్టి బెట్టిదంపుఁగ్రోధంబు పుట్టించి సాధువులం జెఱుప నొడిగట్టిన పుణ్యాత్ము లా బ్రహ్మకల్పాంతంబు మనియెదరు గాఁబోలు! సర్పంబులకు విషంబుఁబోలె ఖలులకు దోషంబు సహజంబు. వారిం జెప్పనేల? జేసి యవినేకంబ సర్వానర్థంబులకు మూలంబు. పార్థివుం డెద్దినె ననినం గొట్టంబునం గట్టింపు మనువాఁ డయ్యా నేని లెంకలు కొంకు మాని యిచ్చకు వచ్చినట్లు జేసి నకార్యంబులకు లోఁచి యశోహానిం బుటించి పరలోకదూషం జేయుదురు. ఇంతకాలంబు పార్థివు ననుగ్రహంబు సంపాదింపం గోరి నాపడినపాటు లెల్లం బొల్లయ్యె. వివేకవిరహితుం డగు దొరం

పెల్లిదము = అతిశయము. నివ్వెఱ - నిండు + వెఱ - నిశ్చేష్టత. అనారతము = సతతము - ఎల్లప్పుడు. లగ్గు = మేలు. ఎగ్గు = కీడు. లాఁతి = అన్యుఁడు. ఒప్పిమి = కీడు - అనర్థము. మనంబు = నా మనసని యర్థము. చొప్పఁడు = సరిపడు. బెట్టిదము = భయంకరము. ఒడిగట్టు = పూను, యత్నించు. ఆ బ్రహ్మకల్పాంతంబు = బ్రహ్మప్రళయ పర్యంతము. సహజము = తోడఁబుట్టినది. ఎద్దు...అయ్యెనేని - యుక్తాయుక్తతలను విచారింపనివాఁడైన నని భావము. లెంక = బంటు - భటుఁడు. కొంకు = సంకోచము. అకార్యము = చేయరానిపని, చెడ్డపని. లోఁచి = అధీనపఱచి - లోఁగు ధాతువు ప్రేరణము. పరలోకదూరున్ = స్వర్గమునకు దవ్వైనవాని. పొల్లు = నిష్ఫలము. పొల్ల = బొత్తిగా గింజపట్టని ధాన్యము - వ్యర్థము. పొల్లు = నిరర్థక శబ్దము, వ్యర్థము. ఇట, పొల్లు + అ = పొల్ల - అన్నను ససియే యగను.

గొలుచుట నిష్ఫలం బగుట మాత్రంబు గాదు, ప్రాణహానియు నాపాదించు. మనోవాక్కర్మంబుల నొకప్పుడయిన నీషత్తయిన దోషంబు చేసి యెఱుంగ. సంతతంబు స్వామికి క్షేమంబ కాంక్షింతును. అట్టి నా కిప్పుడు మృత్యువు వక్త్రబిలంబు చొర వలసివచ్చెఁ గాదె? అన్యులకు నెన్నండును గీడు దోసి యెఱుంగను. నా కొరుఁడు సెరగు వెదకునె యనంజనదు. రాగద్వేష దూషితాత్మల మానసంబులు సాధువులయందును వికృతిం బొరయును. తొల్లి కాక వ్యాఘ్రు జంబుకంబులు పరమసాధు వగు లొట్టియం గపటోపాయంబుఁ బన్ని తమ స్వామి యగు సింగంబుచేఁ ద్రుంగించె"నన విని దమనకుం డా కథ ససాక ల్యంబుగ వినుపింపు మనిన సంజీవకుం డిట్లనియె.

ఆపాదించు = కలిగించు. మనోవాక్కర్మంబులన్ = మనసు - మాట కార్యము ననెడి త్రికరణములచేతను. ఈషత్తు = కొంచెము. (ఈషత్) స్వామి = ప్రభువు - సొమ్మ గలవాఁడని వ్యుత్పత్తి - తద్ధితాంతము. వక్త్ర బిలము = గుహవంటి నోరు - ఉపమానోత్తరపదము. సెరగు = కీడు - అప కారము, ఆపద. రాగ...ఆత్మలు = స్నేహ విరోధములచేత నిందితమైన మనసు గలవారు. రాగద్వేషములు కలిగినచో మనసు నిలకడ తప్పి యుక్తా యుక్త నిచారము లేక యకార్యము లన్ని కార్యములట్లు చేయవలసివచ్చును గనుక గొందఱయందు రాగమును గొందఱయందు ద్వేషమును లేక సర్వ సముఁడై యుండవలెనని భావము. వికృతి = వికారము - అన్యథా భావ మనుట. పొరయు = పొందు. లొట్టియ = ఒంటె. త్రుంగించు = చంపించు- త్రుంగుధాతువు. ససాకల్యంబుగన్ = సాకల్యముతోఁ గూడుకొన్నదిగా - ఆ మూలాగ్రముగ ననుట.

"మలయుంబు నుపత్యకావిపినంబున దర్పసారం బను కంఠీ రవంబు గలదు. దానిం గాక వ్యాఘ్రి జంబుకంబులు మంత్రి లయి కొలుచుచుండును. అవి యొక్కనాఁడు గహనంబున విహరించుచు నొక్క యుష్ట్రంబుం గాంచి నీ నామంబేమి? నీ వెక్కడనుండి వచ్చెదవని యడిగిన నా క్రమేలకం బిట్లనియె. వర్కుం డొకండు నామీఁద ననారతంబు మహాభారం బెక్కించి మోపించుచుండును. ఇట్లు పెద్దకాలంబు భారవహనక్లేశంబు సహింపంజాలక వాని మొఱంగి యీ యరణ్యంబునకు వచ్చి డాఁగి యున్నవాఁడను. ఈ శార్దూలవల్లభుండు లోకభీకరుండు. మీరు మహాప్రాజ్ఞులరు. మీ యనుగ్రహంబు వడసి త్రాసంబు వాసి మనువాఁడ. నాకు మీకుదక్క వేఱు శరణంబు లేదు. శరణాగతరక్షణంబు సర్వాధర్మంబులం దత్తమం బని ధర్మవిదులు వక్కాణింతురు. నావుడు జంబుకం బిట్లనియె. ఈ యరణ్యంబు

ఉపత్యక = పర్వతసమీపభూమి (అధిత్యక = పర్వతము మీఁది భూమి) దర్పసారము = గర్వముచే శ్రేష్ఠమైనదని పేరు. కంఠీరవము = కంఠమునందు భయంకరమైన ధ్వని గలది - సింహము. కాకము - కాయని కూయునది = కాకి. వ్యాఘ్రము = (చంపునపుడు) మూఁగునది - పులి. జంబుకము (మాంసమును) తినునది - నక్క. గహనము = (దుష్టమృగములచేత) కలఁపఁబడునది - అడవి. ఉష్ట్రము = ఎండచేతఁ దపింపఁబడునది - ఒంటె. క్రమేలకము = (తిన్నఁగా) అడుగు లిడుటచేతఁ బోవునది - ఒంటె. మోపించు = మోచుధాతువు. భారవహనక్లేశంబు = బరువుమోచుటవలని శ్రమము. మొఱంగు = మోసపుచ్చు. డాఁగు (యి) దాఁగు. శార్దూలము = (జంతువుల) హింసించునది - పులి. త్రాసము = భయము. శరణము = రక్షకము. ధర్మవిదుఁడు = ధర్మము తెలిసినవాఁడు - ఉపపదసమాసము. వక్కాణింతురు = చెప్పుదురు.

నందు మృగరా జొకరుండు గలఁడు. అతండు ప్రతీపప్రతాపదీ పనిర్వాపణమహాబలుం డగు మహాబలుండు. మే మాతని భృత్యులము. నీవు తద్దర్శనం బవశ్యంబుగం జేయుము. మానలన నయినయంత యుపకారంబు గావించెదము. నీకు సర్వంబు మేల య్యెడు. వెఱవకుము. మావెంట రమ్ము. నా విని మహోంగం బంతరంగంబునం బొంగి వాని పిఱుందం జనుడు నయ్యని మృగ నాథుపాలికిం బోయి యథాశ్రుతంబుగ దాని వృత్తాంతంబు సాంతంబుగం జెప్పి ముందటికిం గ్రోచి మ్రొక్కి-మనుడు సవిన యంబుగ మ్రొక్కి నిలువంబడి యున్న వాసంతంబుం గాంచి పంచాస్యంబు కృపాయత్తచిత్తంబయి యభయం బొసంగి కొంత దడవు సల్లాపంబు గావించి నీ కమాత్యపదం బొసంగితిమి. మా పూర్వమంత్రులతోడం గూడి యైకమత్యంబు వడసి యస్మత్కార్యంబులు నిర్వహించుచు సుఖం బుండుము. నావుడు నుష్ణంబు మహాప్రసాదం బని తదుక్తప్రకారంబునం బ్రవర్తించు

ప్రతీప...బలుండు = శత్రువులయొక్క ప్రతాప మనెడు దీపముల నార్చు టకు వాయువు. అవశ్యంబుగన్ = తప్పనిసరిగ. మహోంగము = గొప్ప యంగములు గలది - ఒంటె. యథాశ్రుతము = విన్నదాని నతిక్రమింపక. సాంతము = అంతముతోఁ గూడినది. నిలువంబడు - నిలుచు - స్వార్థమునఁ బడు. వాసంతము = ఒంటె. పంచాస్యము = విశాలముఖము గలది - సింహము. కృపాయత్తచిత్తంబు = దయకు లోఁకువైన మనస్సు. సల్లాపము = పరస్పరసంభాషణము - ముచ్చట. అమాత్యపదము = మంత్రిస్థానము. అస్మత్కార్యంబులు = మా పనులు. నిర్వహించు = మోచు - అనఁగా నెఱవేర్చు అనుట.

చుండె. పెద్ద గాలం బివ్విధంబునం బ్రవర్తిల్లుడు నొక్కనాఁడు సింహంబు మంత్రులతోఁ నిట్లనియె. నా కిప్పుడు వ్యాధికతంబున దేహంబునం బాటవంబు లేకయున్నయది. అరణ్యంబున సంచరింపంజాలను. ఆకోగ్యంబు గలిగి కొంత సత్తువ వచ్చి నడయాడు నంతదనుక నా కాహారంబు సంపాదించి తెచ్చియుండు. నా వినివాయసాదు లిట్లనియె. స్వామీ ! మేము క్షుద్రులము. మీకు వలసినంత యాహారం బొక పూటకయినం దెచ్చి యిచ్చునంత వారమె? మీ పాదచ్ఛాయ నుండి మీ రారగింప మిగిలినది భుజియించి జీవించుచున్నవారము. మా సత్వంబు కొలంది దేవరకుం దెలియునిది కాదు. అనవుడు మృగేంద్రుండు వానిం జూచి దొరకినంతయె కానిండు. తోడెంబుతోడనె ప్రొద్దు పుచ్చి కొనియెద. నే నేమి చేయుదు ? నా పురాకృతకర్మంబు వ్యాజ రూపంబున నన్ను బాధించుచున్నయది. కొంతపాటి నడయాడు టకు శక్తి యుండిన మిమ్ము శ్రమంపఱుపను. జంపు మాని కానకుం జని యే యెఱచియయిన దొరకినంత కొనిరండు. పొండు. అని శాసింప మాఱు వలుక వెఱచి యా జంతువులు వనంబునకుం జని యెల్ల ప్రదేశమ్ములం గ్రుమ్మరి యుఱవగు నెర

పాటవము = పటుత్వము - దార్ఢ్యము, తద్ధితాంతము. సత్తువ = బలము - సత్త్వశబ్దభవము. నడయాడు = తిరుగు, సంచరించు. ఛాయ = నీడ - మీ పాదచ్ఛాయనుండి యనఁగా మిమ్ముఁ గొలుచుచుండి యనుట. కొలఁది = పరిమితి. తోడెంబు = కొంచెము. పురాకృతము = ముందు చేసినది - పూర్వజన్మమునందుఁ జేసినదనుట. జగపు = ఆలస్యము, నిడివైనదనియు నర్థము - జాపు కురులు. ఎఱచి = మాంసము. శాసించు = ఆజ్ఞాపించు. ఉఱవు = యుక్తము - ఉఱుధాతువువలనఁ గలిగినది.

వొరకమిం గరంబు నిర్వేదించి చెటి యొక్క దిక్కనకుం జెదరి చని వెదకుచుండ నండజపుండరీకజంబుకంబు లొక్క చక్కటిం జేసుడు బలిభుక్క తక్కవానిం గనుంగొని మీ కెంతమాత్రం బేనిఁ బలలంబు సేకరించిన జాడ గానము. మీయంతవారి కసాధ్యంబగు కార్యంబు క్షుద్రంబగు పక్షికి సాధ్యంబగునె? మధ్యాహ్నం బయ్యె. ఇంకం గ్రుమ్మరిన దాన వ్యర్థాయాసంబు గాని ఫలంబు లేదు. జేఁడు మనరాక వేచియుండును. ఆతని పాలికిం జెనఁటి చేతులం జనంజనదు. మన మింతకాలంబు జేఁడు తెచ్చియిచ్చిన మాంసంబు బరుబ్బ భుజియించి కాలుగదలింపక నిశ్చింతంబుగ నుండితిమి. జేని కొక్క యిక్కట్టు వాటిల్లినతఱి వొక్కపూట కయిన గ్రాసంబు దెచ్చి యీనోపమేని మన భృత్యభావంబు గాల్పనే? ఇప్పు డొక్క చొప్పు నా డెందంబు నకుం బొందువడి కానంబడియెడి. దాని విని మీకుం బోలిన తెఱంగు గావింపుఁడు. అని నలువలంకులు కలయ విలోకించి మఱికొంత చెంతకు జరిగి చెవి డాసి యిట్లనియె. మన మీ

నిర్వేదించు = విసువు. చెఁ = ఒక్కొక్కఁడు - ప్రతిజంతువు అనుట. అండజము = గ్రుడ్డువలనఁ బుట్టినది - కాకి. చక్కటి = చోటు, స్థానము. బలిభుక్క = పిండబలిని దినునది - కాకి. సేకరించు = సంగ్రహించు, సంగ్రహశబ్దభవము. చెనఁటి = వట్టి - శూన్యము. బరులు = ప్రక్కలు. కాలు గదలింపక -తిరుగులాడకయని యర్థము. ఇది భాషాశైలి. నిశ్చింతము= నెమ్మది. ఇక్కట్టు = ఆపద. గ్రాసము = ఆహారము - దీనఁబుట్టిన పదము గాసము. పొందువడి = పొందికయై. వలంకలు = దిక్కులు - వలను శబ్దము. చెంత = సమీపము - చెందు ధాతుకృదంతము.

లొట్టియను సరిపెట్టి నేటికి తేని కార్యంబు జరిపితిమేని తేపు పోలినయట్లు చూచుకొందము. తే డుపయోగింప శేసించిన యామిషంబు మనము కొన్ని దినంబు లనన్యాపేక్షంబుగ భక్షింప వచ్చును. అన విని జంబుకం బిట్లనియె. మన యధీశ్వరుం డీ కర్పిమేలకంబు నమాత్యపదం బొసంగి కరంబు గారవించుచున్న వాడు. మనము దాని కొక్క యపాయంబు గావించితిమేని మానసంబునకు నొవ్వు పుట్టించి దవ్వగుము. కావున నీ చెప్పిన చొప్పు చొప్పడదు. అన బలిభుజం బిట్లనియె. ఈధా బాధితుండు కృత్యాకృత్యంబు లారయఁజాలఁడు. స్వజనహాన నంబునకయినం బాలుపడుం గాని యిది యకృత్యంబని తలం పఁడు. వ్యాళియు శార్దూలియు నిజాండశాబకంబుల ఈధాబాధం జేసి కాదె భక్షించెడు? నా విని వ్యాఘ్రం బిట్లనియె. ఈధి తుండయి తద్ధననంబునకు మృగనాథుఁడు పాల్పడినం గానిమ్ము.

సరిపెట్టు=చంపు. పోలినయట్లు = తగినట్లు. ఆమిషము = మాంసము. అనన్యాపేక్షంబుగ = ఇతరాపేక్ష లేనిదిగా - ఆహారమునకై యొకని నాశ్రయింపక యనుట. నొవ్వు = నొప్పి - బాధ, నొచ్చుఛాతు కృదంతము. బలిభుజము = బలిభుక్కునకు రూపాంతరము - కాకి. ఈధాబాధితుండు=ఆకలిచేత బాధ పడినవాఁడు, ఈత్తుశబ్దము, ఈధయనియుఁ గలదు. కృత్యాకృత్యములు = కార్యాకార్యములు. ఆరయు=విచారించు (రూ) అరయు. హాననము=వధ. పాలుపడు = ప్రయత్నపడు. వ్యాళి = ఆఁడుఁబాము. శార్దూలి =ఆఁడుఁబులి. నిజాండశాబకములన్ - పాము గ్రుడ్లను పులి పిల్లలనని క్రమాన్వయము. ఈధితుఁడు = ఆఁకలి గొన్నవాఁడు. తద్ధననము - తత్ + హాననము = ఆ యొకటొకటొక్క వధ - తత్ + హాననము అని ఛేదము; హల్ సంధి.

మన కది కార్యంబు కాదు. మన మాతని సమ్ముఖమ్మునకుం జని మొఱఁగక మనపడిన తెఱఁగు నివేదింతము. తదనంతరకర్తవ్యం బాతండును మనమును గలిసికొని విచారింతము. అనిన వల్లెయని లేచి చని క్రమేలకంబు చనుదేకమున్న తారు మృగరాజుం గాంచి స్వామీ! యేమి చేయుదుము. తిరుగరాని చోట్లెల్లం దిరిగితిమి. పడరాని పాట్లెల్లం బడితిమి. ఇన్ని పాట్లు పడిన దాన ఫలంబేమి? సర్వదా కరుణోదారుండవయి మా భరణరక్షణం బులు స్వకృత్యంబులుగ నిర్వర్తించు దేవరకు మావలన నావంత యయినఁ బ్రయోజనంబు లేదయ్యె. అయినను మా విన్నపం బొక్కండు గాదనక యవధరింపుఁడు. దేవరవా రాఁకలిచే మిక్కిలి వాడంబాఱి యున్నవారు. మాలోపల నొక్కనిం దమ గర్భంబుఁ జొప్పించి ధన్యం గావింపుఁడు. అనవుడు మృగనాథుండు హరి హరి! యని చెవులు మూసికొని 'యెంతమాట వినవలసి వచ్చెను! చిరకాలంబు మిమ్ము రక్షించి యిప్పు డొక్కనాఁటి యాహారంబుకయి మీ కొక్క కీడు దలంచితినేని లోకంబున వారు నన్ను నిందింపరె? పరలోకంబునకుఁ దొలంగనె? ఇట్టి మాటలు తలపెట్టకుఁ'డన జంబుకంబు కాకంబుం గాంచి 'నీవు

సమ్ముఖము = ఎదురు. నివేదించు = తెలుపు. వల్లె = అంగీకారార్థకమైన యవ్యయము - మంచిదనుట. చనుదేక = చనుదేరక - రాక - చనుదెంచు ధాతువు. కరుణోదారుండవు = కృపచే గొప్పవాఁడవు - మిక్కిలి కృప గల వాఁడవనుట. భరణము = అన్నపానాదులిడి ప్రోచుట. రక్షణము=ఆపద రాక కాచుట. నిర్వర్తించు = నడపు. ఆవంత = ఆవగింజంత. వాడంబాఱు = వాడు. గర్భంబుఁ జొప్పించి - తిని యనుట. హరిహరి - ఇది పాపపరిహారార్థము చెప్పఁబడునది. తలపెట్టకుఁడు = ప్రారంభింపకుఁడు.

సైకంబవు. నిన్నుపయోగించుటవలన జేనికిం గడుపుఁ జిచ్చుడు గంబోదు. త్రోలంగుము. నా మేను జేనికి భోజ్యంబు చేసి కృతార్థుండ నయ్యెద నన విని శార్దూలం బిట్లనియె. కాకంబు కంజె నీవు గొంత పెద్దజాతువవైన నాతని యూకలి పోకార్చ నీ నంజుడుం జాలదు. నేను రాజునకు భోజనం బయ్యెద'ననిన వెండియు జంబుకం బిట్లనియె. 'నీవు లావుం గలవాఁడవు. నేఁడు గాకున్న జేసైన జేనిం బోషింప వలంతివి. నీ యనంతరంబు మేముండినం గొండొకయేనిం బ్రయోజనంబు లేదు. కావున నీ వచనంబు గ్రాహ్యంబు గా'దని కుమ్మిసుద్ది లాఁచుండఁ జిత్ర వర్ణుఁడు సనుదెంచి తద్వృత్తాంతంబు సాంతంబుగా వారివలన విని 'యూరక యేల పాలుఁగోక పెనంగెదరు? నే నిక్కార్యంబు నకుఁ జాలి యున్నవాఁడ. నా మనుగడవలన జేసి కొక్క ప్రయోజనంబు 'లే' దనిన జంబుకంబు జేసిం గాంచి 'యీ కార్యంబు నాకుం బోలియున్న యది. ఇందుల దేవరకు దురితంబు లేదు. శరీరరక్షణంబు పరమ ధర్మంబు. శరీరంబు గలిగిన నెల్ల

సైకము = అల్పము (హ్రా) సయికము, నడుమెంతసైక మోహమో - విజయ విలాసము. చిచ్చు + ఉడుగంబోదు, అని ఛేదము. ఉడుగంబోదు = ఉడుగదు. భోజ్యంబు = భుజింపఁదగినది (ఆహారము) పోకార్చు = పోఁగొట్టు. నంజుడు = మాంసము. లావు = బలము. వలఁతి = నేర్పరి. కొండొక = కొంత. గ్రాహ్యము = గ్రహింపఁదగినది. కుమ్మిసుద్ది = సంకేత వృత్తాంతము (తాపనుకొన్న మాటలు) చిత్రవర్ణుఁడు = నానావిధమైన వర్ణము గలవాఁడని పేరు - ఒంటె. చాలి - తగియని యర్థము. మనుగడ=బ్రదుకు - మనుధాతు కృదంతము. పోలి = తగి. దేవర (ప్ర) దేవ.

ధర్మంబులు సాధింపవచ్చు.'శరీర మాద్యం ఖలు ధర్మసాధన'మ్మని ప్రాజ్ఞులు వక్కాణింతురు. భృత్యుండు స్వామికార్యహతప్రాణుండయ్యెనేని నాకలోకసుఖం బనుభవించును. ఇంతకంటె నొండు శ్రేయంబు గలదె? మీ రొల్లకుండిన మే మెల్లరు ప్రాణంబులు దొఱంగెదము. నావుడు మృగనాథుండు చిత్రవర్ణుని యాననం బవలోకింప 'జంబుకరాజు చెప్పినచొప్పు దప్పదు. సంశయింపక నా చెప్పిన చొప్పు గావించి నన్ను ధన్యం జేయుము' నావుడు నెట్టకేలకు క్షుధాబాధ దుస్సహం బగుడు మృగేంద్రంబు లొట్టియం జంపి భక్షించెను.

ఎట్టివానితోడనేని నవీనసేవకునితోడ రాజును దద్భృత్యులును మనంబునం గలిసి యుండరు. క్షుద్రజన పరివృతుండగు పరివృఢుండు దందశూక సందోహ పరివేష్టిత పటీరవిటపి

ఆద్యమ్ = మొదటిదైన, ధర్మసాధనమ్ = పుణ్యము సాధించునది. శరీరం ఖలు = దేహము కదా - ధర్మమును జేయుటకు మొదటి యుపకరణము దేహమని యర్థము. ప్రాజ్ఞులు = బుద్ధిమంతులు. స్వామి...ప్రాణుండు = ఒడయని పనికిఁగాఁ బోఁగొట్టుకోఁబడ్డ ప్రాణములు గలవాఁడు. నాకము = అకమనఁగా దుఃఖము - అది లేనిది నాకము - స్వర్గము. ఎట్టకేలకు = అతి ప్రయాసమున. ఎట్టకేలకు లొట్టియం జంపి భక్షించెనని యన్వయము. దుస్సహము = సహింప శక్యముగానిదని యర్థము. నవీనము = క్రొత్త. పరివృతుఁడు = చుట్టఁబడినవాఁడు. పరివృఢుఁడు = ఱేఁడు - వృద్ధిఁబొందుఁవాఁడని వ్యుత్పత్తి (ఋ) పరీవృఢుఁడు. దందశూక...వడువునన్ = పాముల గుంపుచేతఁ జుట్టఁబడిన గంధపుఁజెట్టు విధమున. విటపము = కొమ్మ (విటపములు కలది విటపి - చెట్టు). సంకోహము = చక్కఁగాఁ బూరింపఁబడునదియని వ్యుత్పత్తి (గుహి).

వడువున సమాసన్న జనంబులకు దెప్పరంపు ముప్పు వుట్టించును. కావున నట్టిని నేవారుం జేర వెఱతురు. దీనికిం దార్కాణంబుగ నొక్క కథ వక్కాణించెద. వినుము.

ఒకానొక పట్టణంబునం దొక వడ్లంగి గలఁడు. వాఁడు వానాఁడు వనంబునకుం జని తన పనికి నుఱవగు తరునికరంబు నటికి స్తంభాదికంబు లొనరించి పురంబునకుం గొనివచ్చి విక్రయించికొని జీవించుచుండు. వాఁడొక్కనాఁడు కాననమ్మునం గ్రుమ్మరువాఁడు సుహృద్విలోచనం బను పంచాస్యంబుం గనుం గొని భీతచేతస్కుఁడయి నిశ్చేతనుండుం బోలె నిలువంబడి యుండ నా హార్యక్షంబు వీక్షించి కృపాతరంగితాంతరంగం

సమాసన్నము = మిక్కిలి సమీపించినది. దెప్పరము = దుర్భరము (ర్‌కు) డెప్పరము. అట్టీఁడు = అట్టివాఁడు - అట్టిని = అట్టివానిని-అట్టి విశేషణముమీఁది తచ్ఛబ్దవకారమునకు లోపము. తార్కాణము = దృష్టాంతము (ర్‌కు) తార్కాణ. వడ్లంగి = వడ్లవాఁడు - వర్ధకి శబ్దభవము (ర్‌కు) వడ్రంగి. నానాఁడు = దినము దినము. వనము = అడవి - జంతువులచేత నాశ్రయింపఁ బడునది (వ్యు) ఉఱవు = యుక్తము - ఉఱుధాతువువలనఁ బుట్టినది. తరువు = చెట్టు-ఎండ దీనిచేతఁ దరింపఁబడునని వ్యుత్పత్తి. నికరము = సమూహము - అంతటఁ జల్లఁబడినట్లు వ్యాప్తమైనదని వ్యుత్పత్తి. దీనికి శ్రేష్ఠమను నర్థమును గలదు. స్తంభము = ఇండ్లను నడ్డగించునది యని వ్యుత్పత్తి (వి) కంబము. పురము = పట్టణము - జనులచేత నిండింపఁబడునది యని వ్యుత్పత్తి, పురియనియుఁ గలదు. కాననము = అడవి. జలము ప్రాణముగాఁ గలదని వ్యుత్పత్తి - (వి) కాన. సుహృద్విలోచనము = మిత్రులే నేత్రములుగాఁ గలది, మిత్రులను నేత్రమువలెఁ జూచునది యని యర్థము. పంచాస్యము = సింహము (వ్యు) వెడఁద మొగము గలది. భీతచేతస్కుఁడు = భయపడిన మనసు గలవాఁడు. నిశ్చేతనుండు = తెలివి లేనివాఁడు. కృపాతరంగితాంతరంగంబు = కరుణచే నతిశయించిన హృదయము గలది యని యర్థము.

బయి యిట్లనియె. 'హస్తిమస్తకవిదళనఖరంబులు మన్నఖరంబులు. ఱుక్కడు లగుట దయనీయులగు భవాదృశులపయిం దెగవు, బెగడు వడకుము'నా వాఁడు సాగిలంబడి ఱెక్కపెక్క భంగుల నా సింగంబుం బ్రస్తుతించి ముదల గొని చని యది మొదలు కృతజ్ఞుండయి నానావిధంబు లగు మధురాహారంబులు దెచ్చి యిచ్చి తనుపుచుండు. ఇట్లు కొన్ని దివసంబులు సన నొక్కనాఁడు మెగంబుల జోడు తన యనుచరంబులగు కాక జంబుకంబులతోడ ముచ్చటలాడుచుండ నవి యిట్లనియె. 'దేవరవారు కొన్ని దినంబులనుండి వేఁటకుఁ బోవం గానము. కారణంబు దెలిసినది కాదు' నా విని మృగనాథుం డిట్లనియె. 'రథకారుం డొక్కరుండు మదీయభక్తుండు గలఁడు. వాఁడు ప్రతిదివసంబు నా కాహారంబు దెచ్చి యిచ్చుచున్నవాఁడు.' నా విని కాకజంబుకంబు లిట్లనియె. 'మీ కిట్టి యుపకారం బొనరించు పుణ్యుండు సజ్జనాగ్రగణ్యుండు గాఁడె? దేవర యనుగ్ర

హస్తి ... ఖరంబులు = ఏనుఁగు కుంభస్థలములఁ జీల్చుటయందుఁ దీక్ష్ణులు
హస్తి = హస్తము గలది (హస్తము తొండము) - ఏనుగు. నఖరము = గోరు (నఖము = గోటియందుఁ గొంతభాగము - స్పర్శము నెఱిఁగెడి యింద్రియము లేనిదని వ్యుత్పత్తి - ఆదిగలది) దయనీయుఁడు = కనికరింపఁ దగినవాఁడు. ఱుక్కడులు = అల్పులు - ఏకవచనము ఱుక్కడి. భవాదృశులు = నీయట్టివారు. తెగవు = తెగింపవు - దీనికి నఖరంబులు కర్త. బెగడు వడకుము నాఁక = భయపడుకు మనఁగా. ముదల = ఆజ్ఞ. కృతజ్ఞుఁడు = చేసిన మేలు దలఁచువాఁడని యర్థము. (వ్య) కృతఘ్నుఁడు. తనుప్రుచుక - తని యుధాతు ప్రేరణము. మెగము-మృగము, మెకమనియుఁ గలదు. అనుచరంబులు = అనుసరించి చరించునవి. రథకారుఁడు = రథము చేయువాఁడు, వడ్రంగి. సజ్జనాగ్రగణ్యుండు = మంచివారలలో మొదట నెన్నఁదగినవాఁడు.

హంబు గలిగిన నాతని సంసర్గంబునంజేసి మా నేత్రంబులు సాఫల్య పాత్రంబులు గావించెదము.' నా విని మృగవల్లభుండట్లు కానిం డాతండు కొండొక తడవునకు రాగలండు. వేచియుండుం' డని పలికి యొక్కయెడ వానితోడం గూర్చుండియుండ నా వడ్లంగి చనుదెంచి కాంచి భీతచేతస్కుండయి సత్వరంబుగ నేదిష్ఠపాదపంబు నారోహించిన సింగంబు డాయంబోయి 'యోయి చెలికాఁడా! యేల యీ సాలంబు నధిరోహించితివి?' నావుడు నన్వర్థాభిధానంబులగు నరిష్ఠవంచకంబులు భవత్సాహచర్యంబు లగుటంజేసి వృక్షంబు నారోహించితి. దుష్టపరివృతుండగు రాజును సర్వదా విశ్వసింపం జనదని వచియించి యచ్చటం గదలక వేచియుండి యొక్క చనుప చనుదేర దానింగూడి యయ్యరణ్యంబు వెడలి చనియె.

"సజ్జనుండయ్యు దుర్జనులతోడి సంసర్గంబునంజేసి దుర్జనుండు నాఁబడు. బకోటకూటంబుతోడ వసియించు హంసంబును

నేత్రము = కన్ను - దీనిచేత (వస్తువు) పొందింపబడునని వ్యుత్పత్తి. సాఫల్యము = సఫలత్వము - తద్ధితాంతము. పాత్రము = యోగ్యము. వేచు = ప్రతీక్షించు. నేదిష్ఠము = మిక్కిలి చేరువ నున్నది. పాదపము = నేల్లచే నీళ్లను బానము చేయునది-చెట్టు. ఆరోహించు=ఎక్కు. సాలము=వృక్షము, మద్ది, ప్రాకారము. అధిరోహించు = ఆరోహించు, ఎక్కు. అన్వర్థము = అర్థమునకుఁ దగినది. అరిష్టము = అశుభరూపమైనది - కాకి. వంచకము = మోసపుచ్చునది - నక్క. చనుప = వర్తకుల సమూహము. సంసర్గము = కూడిక. బకోటకూటంబు = కొంగల గుంపు. హంసము = అంచ (మనోజ్ఞముగ) చరించునది (వ్యు)

బకం బండ్రు గాదె? భూనాథుండు సాధుచరిత్రుండయ్యె నేఁ బ్రకృతివర్గంబు నట్లగు; "యథా రాజా తథా ప్రజా" యని నీతికోవిదులు వక్కాణింతురు. ఱేని పాల నెవ్వండో ఖలుండు కల్లనిజంబులు విపరీతంబులుగం బలికి యాతనికి నాయం దప్రతిరోధంబగు క్రోధంబు వుట్టించినవాఁడు. మించిన కార్యంబునకుం జింతించి ఫలంబేమి? ఊరక మరణంబు నొందనేల? రణంబు గావించి లబ్ధవిజయుండ నయి యశోలక్ష్మలం బడసి యిష్టసుఖంబు లనుభవించెద నొండె. వేఱొండయిన శూరలోకశ్లాఘ్యుండ నయి నాకలోకభోగంబు లనుభవించెద నొండె" నా విని దమనకుండు నీవు చెప్పినయది శూరలోకశ్లాఘనీయంబ. అయిన నుపా

బకము = కొక్కెర - వంకర యైనదని వ్యుత్పత్తి. అయ్యెనేన్ = అయ్యె నేనిన్ - నివర్ణమునకు లోపము. ప్రకృతివర్గము = మంత్రిలోనగు వారి సమూహము. రాజా = రాజు, యథా = ఎట్లో, తథా = అట్లే, ప్రజాః = జనులును అవుదురని శేషము. కోవిదుఁడు = పండితుఁడు - ఏమి యెఱుఁగని వాఁడు? అనఁగా నన్నియు నెఱిఁగినవాఁడని వ్యుత్పత్తి. కల్ల నిజంబులు - ద్వంద్వసమాసము. విపరీతంబులుగన్ = వ్యత్యస్తములుగా - కల్లలను నిజములుగా నిజములను గల్లలుగా నని యర్థము. అప్రతిరోధంబు = అడ్డపాటు లేనిది. లబ్ధవిజయుఁడు = పొందఁబడిన గెలుపు గలవాఁడు. యశోలక్ష్మలన్ = కీర్తిని - సంపదను. యశము (వ్యు) (దిక్కులను) వ్యాపించునది. వేఱొండయినన్ = మఱియొకటి యైనను - చావు గలిగిన నని భావము. శూరలోక శ్లాఘ్యుండు = సూర్యలోకమునందుండు వారిచేత మెచ్చఁదగినవాఁడు - యుద్ధమునందుఁ జచ్చినవాఁడు సూర్యమండల మార్గముగా స్వర్గమును బొందునని శాస్త్రము. శూరలోక శ్లాఘనీయంబ = శూరులైన జనులచేత మెచ్చఁదగినదియె - సూర్యునకు శూరుఁడనియు సూరుఁడనియు నామాంతరములు.

యాంతరంబుచేఁ బగఱ సాధింపనొండెఁ దప్పించికొని తొలంగ
నొండెఁ గొలంది గానియెడం గడ యుపాయంబు సమాదరణీ
యంబు గాని సాహసంపడి రణమరణంబు శ్రేయంబని కడింది
మార్తురతో నొరసి యుసుఱు దొఱంగుట ధర్మంబు గాదు. "జీవ
న్భద్రాణి పశ్యతి" యను వచనంబుం బాటింపవలదె? తన
తరంబుం బగఱ తరంబు నెఱింగి కరంబు జయంబు నిశ్చయించు
కొని మాకొనవలయు. విపరీతంబయినం బరాభవంబు
తప్పదు. తొల్లి సముద్రుండు కరం బారయక యొక్క

ఉపాయాంతరము - అన్యము - ఉపాయము = ఉపాయాంతరము అని విగ్రహము. పగఱ = శత్రుసమూహము. పగఱు - (పగ + వారు) శత్రు వులు. కడయుపాయము = దండోపాయ మనుట, ఉపాయము - (కోరికను) దీనిచేతఁ బొందుదురని వ్యుత్పత్తి - అవి నాలుగు, సామము - దానము - భేదము - దండము. సమాదరణీయము = చక్కఁగ నాదరింపఁ దగినది. రణమరణంబు - సప్తమీతత్పురుషము. రణము = యుద్ధము (భేరి లోనగు నవి) ఇందు ప్రయోగమని వ్యుత్పత్తి. శ్రేయము= శ్రేష్ఠము. కడింది = దుస్స హుఁడు. మార్తుఁడు - మారుతుఁడు, శత్రువు. ఒరయు = తాఁకు. ఉసుఱు = ప్రాణము - తెనుఁగున దీనికి ఏకవచనాంతముగాఁ బ్రయోగము. జీవన్ = బ్రతుకుచున్నవాఁడగుచు, భద్రాణి = శుభములను, పశ్యతి=కను చున్నాఁడు - మనుష్యుఁడు జీవముతో నున్నప్పుడే సమస్తశుభములను బొం దునుగాని మృతిఁబొందిన పిమ్మట నేమియులేదని భావము. 'బ్రదికియుండియు శుభములు పడయవచ్చు' అని తిక్కన సోమయాజి. పాటించు = ఆదరించు. తరము = కొలఁది. విపరీతంబయినన్ = వ్యత్యస్తమయినను - తన తరంబుం బగఱ తరంబు నెఱుంగక కరంబు జయంబు నిశ్చయించుకొనక మాఱొక్క నిన నని యర్థము. పరాభవము = తిరస్కారము. సముద్రుఁడు = ముద్రకోఁ గూడుకొన్నవాఁడు. అనఁగా నీశ్వరాజ్ఞకుఁ గట్టువడినవాఁడని వ్యుత్పత్తి.

టిట్టిభంబుం బరాభవింపం బూని తాన పరాభూతుం డయ్యె నయ్యది సవిస్తరంబుగ వివరించెద నాకర్ణింపుము.

పారావారంబు తీరంబున మహీరుహాంబువిూఁదం దీతు వొక్కఁండు గూఁడు పన్నికొని తన చేడియం గూడి వసించు చుండు. అంతం గొంత కాలంబున కా శకుంతంబు తన కాంత గర్భశ్రాంత కావుటం గాంచి సంతసించి 'నీ యిష్టంబు వేడు మది యెట్టి కడిందియైన నా గట్టి కడిమి మెఱసి తెచ్చి యిచ్చెద' నావుడు నా పులుఁగుఁజెలువ తన చెలువునితో నిట్లనియె. 'నా యభిమతం బొక్కఁండు గలదు. వక్కాణించెద నవధరింపుఁడు. పర్వదివసంబుల సముద్రుండు సముత్తుంగరంగ త్తరంగంబులు

టిట్టిభము = లకుముకి పిట్ట - టిట్టి యని కూయునది యని వ్యుత్పత్తి. పరాభూతుఁడు = తిరస్కరింపఁబడినవాఁడు. పారావారము = గట్టు నావరించునది - సముద్రము. మహీరుహము = భూమియందుఁ బుట్టునది-చెట్టు. తీతువు = ఇది తిత్తిరిశబ్దభవము. దీనిని బక్ష్యంతరముగా నైషుంటికులు వ్రాయుచున్నారు. ఇక్కడ టిట్టిభపర్యాయముగా వ్రాయఁబడియున్నది. శకుంతము = పక్షి. ఎగరఁజాలునది యని వ్యుత్పత్తి. శకుంతీ -శకున, శకుని శబ్దములకును నిట్టే యర్థవ్యుత్పత్తు లెఱుంగునది. గర్భశ్రాంత = వేఁకటిచేత నలసినది. కావుట - అవుట యనుదాని రూపాంతరము. కడిఁది =దుర్లభము. గట్టి = దృఢము. కడిమి = పరాక్రమము - తద్ధితాంతము. మెఱసి - మెఱయు ధాతువు. పులుఁగు = పక్షి. చెలువ=చెలువైన వాక్కు గలది - స్త్రీ (చెలువు = అందము) చెలువుఁడు = ప్రియుఁడు. కాంత - కాంతుఁడు; ప్రియ-ప్రియుఁడు; వల్లభ - వల్లభుఁడు శబ్దములవంటిది. పర్వదివసములు = పున్నమయు నమావాస్యయు. సముత్తుంగ రంగ త్తరంగంబులు = మిక్కిలి పొడవులును నెగురుచున్నవియు నగు నలలు - తరంగము (వ్య) దాఁటునది.

చెలంగ నింగి ముట్టి పొంగి వచ్చును. మన యీవాసంబు కరం బాసన్నం బగుటం జేసి నా యిడిన యండంబులు కొండక్రాం తంబు లగు. వేళంబ పోలిన యిరవు పరికించికొని చనవలయు. మసలం జనదు. ప్రసూతిసమయంబు డాసిన దేశాంతరగమనంబు సుకరంబు గాదు.' నావుడు నా విహంగంబు తన యంగన పలుకు లాలంబు చేసి మందహాససుందరవదనంబుతోఁ 'గువలయని వహంబునకుఁ దుహినకిరణుండును బుండరీకషండంబునకుఁ జండ భానుండును జాతకవ్రాతంబునకు జీమూతంబు నెట్లట్లు శకుంత సంతానంబునకు నాగాంతకుండు ప్రభుండు. అతండు నిజపక్ష

చెలఁగు = ప్రోఁగు; శబ్దించు. నింగి = ఆకాశము. ఆవాసము = ఇల్లు - గూఁడనుట. ఆసన్నము= సమీపము. నా యిడిన = నేను - ఇడిన. కొండా క్రాంతములు = జలముచేత నాక్రమింపఁ బడినవి. కొండము = నీరు, దండము, బాణము, గుఱ్ఱములోనగు నర్థములు. వేళంబ = శీఘ్రమే (ఱా) వైళ్ళము. ఇరవు = స్థానము. మసలు = ఆలసించు. ప్రసూతి = ప్రసవము, కానుపు. విహంగము = పక్షి - ఆకాశమునఁ బోవునది. ఇట్లే విహగ - విహంగములు. అంగన = స్త్రీ (ప్రశస్తములైన) అవయవములు గలది (వ్యు) ఆలంబు = ఉపేక్ష; యుద్ధము. మందహాస సుందర వదనం బుతోఁ = చిఱునవ్వుచేత మనోజ్ఞమైన మొగముతో. కువలయనివ హము = కలువపూల గుంపు. తుహినకిరణుండు=మంచు కిరణముగాఁ గల వాఁడు - చంద్రుఁడు. పుండరీకషండంబు = తామరలగుంపు. చండభా నుఁడు = తీక్ష్ణమైన కిరణములు గలవాఁడు - సూర్యుఁడు. చాతకము = వానకోయిల (వాన నీళ్లను) యాచించునది (వ్యు) జీమూతము = మేఘము. ఉదకము దీనియందు బంధింపబడును (వ్యు) జీవనస్య మూతః - జీమూతః - పృషోదరాదులలోఁ జేరుటఁజేసి వర్ణలోపాదికము లెఱుంగునది. నాగాంత కుఁడు = సర్పములకు నాశకుఁడు - గరుత్మంతుఁడు.

విక్షేపజాతవాతోద్ధూతకాండకాండచండబలుండు. తదాశ్రయుల మనల నీ జడాశయుండు చెనకి మయిమయిం భోవనోపునే? ఏల యీ లీల నా తరం బెఱుంగక కొఱి మాలిన విచారంబులం జిత్తంబు హత్తించెదు. సమాహితచిత్తంబున నుండుము.' నావుడుం డిట్టిభి యిట్లనియె. ఎట్టివాఁడయిన భావ్యనర్థంబునకుం బ్రహాణకంబగు సాధనంబు పరికించి కృతనిశ్చయుండయి యుండవలయుఁగాని బలదర్పంబునం బ్రమత్తుండయి కన్నుగానకుండుట నయవిజ్ఞానసంపన్నులు కరంబు గర్హింతురు నా నస్మాదృశదుర్బలులం జెప్పనేల? హితవచనంబులు వినని బాలిశుండు కోల విడిచి పడిన తామేలుంబోలెఁ గాలధర్మంబు నొందు నా కథ సాకల్యంబు మీఱి వాక్రుచ్చెద వినుండు.

నిజ...బలుండు =తన యొక్కల విసరునఁ బుట్టిన గాలిచే నెగరఁగొట్టఁబడిన యుదకసమూహము గలవాఁడు గనుక నధికబలము గలవాఁడు. జడాశయుఁడు=తెలివి లేని హృదయము గలవాఁడు-మూఢుఁడని యర్థము; జలము లుండు చోటు - సముద్రుఁడని భావము. (డ-లలకు అభేదము) చెనకు = తాఁకు. మయిమయి-తేలిక. ఈ లీల = ఈ విధము. హత్తించు=పొందించు. సమాహిత = సమాధానము పొందిన (స్థిమితపడిన - అనుట) టిట్టిభి = ఆఁడు లకుముకిపిట్ట. భావ్యనర్థము=రాఁగల కీడు; భావి+ అనర్థము - యణాదేశము. ప్రహాణకము = చెఱచునది - నాశకము. ప్రమత్తుఁడు = ప్రమాద పడినవాఁడు (ప్రమాదము = ఏమఱుపాటు) నయవిజ్ఞాన సంపన్నులు = న్యాయశాస్త్రమును దెలిసినవారనుట. గర్హింతురు = నిందింతురు. అస్మాదృశదుర్బలులకి = మనవంటి బలహీనులను. బాలిశుఁడు = మూఢుఁడు. తామేలు = తాఁజేలు. కాలధర్మంబు = చావు.

భువనసారం బను నొక్క కాసారంబు గలదు. అయ్యది చక్రచక్రాంగప్రముఖవివిధజలవిహంగమసంచారరవ్యాం బయి పుండరీకషండసాంద్రమరందధారాసారసంభ్రమద్భ్రమర ఝుంకారసంకులం బయి యెసంగు. అందుఁ దడవులం బట్టి కంబుగ్రీవం బను కూర్మంబు వికటసంకటంబు లను హంసంబు లత్తో బద్ధసఖ్యంబయి యుండు. పిదపం గొన్ని వాసరంబులకు వఱపునంజేసి కాసారంబు వారిపూరం బివురంబొఱుఁడు నా మరా శంబులు దేశాంతరజిగమిషం బూని యా కచ్ఛపంబు కడకు వచ్చి తమ యిచ్చం గల యర్థంబు వాక్రుచ్చి వియోగదుఃఖంబు

భువనసారము=ఉదకముచే శ్రేష్ఠమైనది - మంచి యుదకము గలదని సంజ్ఞ. కాసారంబు=సరస్సు - గుంట. చక్రము = (ప్రియను) తృప్తిఁ బొందించునది. చక్ర...రవ్యంబు = జక్కవలు హంసలు లోనయిన యనేక జలపక్షుల యొక్క విహారముచేత నొప్పునది. చక్రాంగము = చక్రమువలె గుండ్రమైన యంగము గలది (వ్యు) పుండరీక ... సంకులంబు = తామరపూ గుంపుల యందలి దట్టమగు పూఁదేనె చాళ్ళ సోనలచేఁ దొట్రుపడుచున్న తుమ్మెద ల జుమ్మనెడు రొదలతోఁ గూడుకొన్నది. పుండరీకము = మంగళమును జేయునది (వ్యు) మకరందము (పూ) మరందము. భ్రమరము (వ్యు) తిరుగనది. ఎసంగు = అతిశయించు. కంబుగ్రీవము = శంఖమువంటి మెడ కలదియని పేరు. కూర్మము = వేగము లేనిదని వ్యుత్పత్తి, తాఁబేలు. బద్ధసఖ్యము = కట్టువడిన స్నేహము కలది - పాయని స్నేహము కలదనుట. వాసరము = దినము - లోకమును నిలుపునది (వ్యు). వఱపు = క్షౌమము, వానలేమి. వారిపూరంబు = జలసమృద్ధి. ఇవురు (పూ) ఇగురు = ఇంకు. మరా శము = హంసము. జిగమిష = పోవ నిచ్ఛ. కచ్ఛపము = కూర్మము, తాఁబేలు. పుచ్ఛముచేఁ ద్రాగునది (వ్యు) . వియోగము = ఎడఁబాటు.

మీఱుం దీఱమి పరికించి యెఱుంగు కుత్తుకం దగుల 'సఖ్యంబు మఱువకు. పోయి వచ్చెదము' నా విని కమఠంబు కరం బాన నంబు దీనభావంబునఁ గదుర నిట్లనియె. పెద్దగాలం బేకోదరులఁ బోలెఁ జెలిమి సలిపితిమి. దీని కొక్క-దొసంగు పొసంగునని కలనేనిం దలంచి యెఱుంగ. మీతోడంగూడ వచ్చెదనంటినా పక్షంబుల బలిమి కలిమింజేసి వలయు నెలవునకుం బోవ వలంతు లగు మీకు నాకు నెంత యంతరంబు. నా కొలంది విచారించికోలటుండనిఁడు. మిమ్ము నొక్కటి వేఁడెదం జిరకాలకృతంబగు చెలికారంబున కనురూపంబుగ నా ప్రార్థితార్థంబు తుద ముట్టింప వలయు. వెరవు పరికించి యెట్లయిన మీతోడ ననున్నం గొంపొండు. మీ వియోగంబు క్షణంబయిన సయిరింపంజాల' నావుడు నా యంచ లించుక చింతించి 'యది యెట్లయ్యెడు? ముక్కనం గటిచికొనియెండె తెక్కలు నెక్కించుకొని యెండెం గొంపోవవలయు. విప్రకృష్టదేశగాములకు మా కది దుస్సాధంబు. సాహసంబు చనదు. ఎటు నోయి యెటు వచ్చునో

తీఱిమి = అక్కఱ, పోరామి. ఎఱుంగు కుత్తుకం దగుల = డగ్గుత్తిక పడఁగా ననుట. కమఠము = తాఁబేలు, నీట వసించునది (వ్యు) ఏకోదరులు = తోడఁబుట్టువులు. దొసంగు = ఆపద. పక్షములు = తెక్కలు. నెలవు (ప్ర) నిలయము - చోటు. వలఁతి = నేర్పరి. విచారించుకోలు = విచారించుకొనుట. అనురూపము = తగినది. ప్రార్థితార్థంబు = వేఁడుకొన్న విషయము. కొంపొండు = కొనిపొండు, కొంపోవు ధాతువు - కొని + పోవు. సయిరించు (గ్రా) సైరించు - ఓర్చు. అంచలు (ప్ర) హంసలు. విప్రకృష్టదేశగాములు = దూరదేశమును గూర్చి పోవువారు. దుస్సాధము = సాధింపరానిదనుట. నవీనులు పెక్కురు 'దుస్సాధ్యము - సుసాధ్యము' అని వ్రాయుమన్నారు. ఇవి అసాధువులు.

యెఱుంగము. వినుము. హృదయంబు పదిలించుకొని కుదురు గదలక యుండుము. భాగ్యంబు గలిగినం బునర్దర్శనం బయ్యెడు' నని యెంత దూరంబు చెప్పిన వినక కడుం గక్కసించిన నా యండజంబులు కొండొక డెందంబుల విచారించి యెట్టకే లకుం దామేటిం గాంచి 'యొక్క వెరవు పరికించితిమి. అది కొంత మదికిం సరిపడి యున్నయది. ఒక్క యస్టి సేకరించి దాని యగ్రంబులు చెఱి యొక్కపక్క ముక్కునఁ గఱిచికొని పఱచెదము. దాని నడుము ప్రమాదంబుం బొరయక కఱిచి కొని రానోపుదె?' యనవుడు వల్లెయని తదానీతంబయిన కాష్ఠంబు నడుము గఱిచికొని వ్రేల నా యంచలు చంచువులం దదంచలంబులు పొంకించి యంబరతలంబున సత్వరంబుగఁ బాఱు చుండ నొక్క పట్టణంబునందలి జనంబులు వీని విలోకించి విస్మయంపడి కావించు సల్లాపంబుల యలబలంబు క్రందుగ వినంబడుడుం గూర్మం 'బీ కలకలం బెక్కడిది?' యని హంసం బుల నడుగ నోరిపట్టు వదలి నేల వ్రాలి మాంసలుబ్ధులచే హతంబయ్యె. మతిమంతుఁ డనర్థావహంబగు నభిజనంబు మాని

కుదురు = స్థానము. కక్కసించినఁ = బాధించినను - తోడుకొని పొమ్మని మిక్కిలి తొందరపెట్టఁగా ననుట. యస్టి = కొయ్య. తదానీతము = ఆ హంసలచేఁ దేఁబడినది. కాష్ఠము (ని) కట్టె. చంచువు = పక్షిముక్కు. తదంచలంబులు=ఆ కొయ్యచివరలు. పొంకించి = పొందుపఱచి - పట్టుకొని యనుట. అంబరతలంబునఁ = ఆకాశముమీఁద. విస్మయంపడు=ఆశ్చర్యపడు. అలబలంబు = కలకల ధ్వని. క్రందుగఁ=సందడిగా. లుబ్ధులు = లోభము గలవారు. అనర్థావహము = కీడు గనిగించునది. అభిజనము = కాణాచి - జన్మభూమి.

కొనవలయు నొండె ననర్థంబు దలంగు నుపాయసంపన్నుండు గావలయు నొండెం గాని దైవపరుండయి యుండంజనదు. దైవపరున కనర్థంబు తప్పదు. ఈ యర్థంబు తేటనడ నొక్క కథ చెప్పెద నినుము.

"ఒక్క జలాశయంబునం దనాగతవిధాతయుఁ బ్రత్యుత్పన్నమతియు యద్భవిష్యంబు నని మూఁడు మత్స్యంబులు వసించుచుండు. ఒక్కనాఁ డనాగతవిధాత ప్రత్యుత్పన్నమతియద్భవిష్యంబులం గాంచి 'యీ యేఁడింతవఱకు వాన లేబరం బయ్యె. మీఁదనయినను గురియు ననునాస లేదు. నిమిత్తంబులు ప్రతికూలంబు లయి కానంబడియెడు. ఈ కొలని జలంబులు తుద ముట్ట నడుగుఁ బట్టకమున్న మెలంకువ పడవలయు. మసలిన మోస వాటిల్లు. ఇటకుం గొంత దూరంబున ధ్రువోదం బను

దైవపరుఁడు = కర్మమే ముఖ్యముగాఁ గలవాఁడు - కర్మము ప్రకారము జరగుచున్నదని యెంచి ప్రయత్నమేమియు లేక యుండువాఁడనుట. అనాగత విధాత = భవిష్యత్కార్యమును జేయునదని సంజ్ఞ - రాఁబోవు కీడునకు ముందుగాఁ బ్రతికారమును జింతించునది యని యర్థము. ప్రత్యుత్పన్నమతి = అప్పుడు పుట్టిన బుద్ధి గలది యని సంజ్ఞ - ఆపద వచ్చునంతవఱ కూరకుండి వచ్చినప్పుడు దానికిఁ దగిన యుపాయము చేయునది యని యర్థము. యద్భవిష్యము = కర్మప్రకారము జరగుననునది యని సంజ్ఞ - అదృష్టము చొప్పున జరగుచున్నదని యెంచి ప్రయత్నము లేకుండునది యని యర్థము. లేబరము = శూన్యము. ఆస (ప్ర) ఆశ. ప్రతికూలము=విరుద్ధము. అడుగుఁబట్టు = ఇంకు. మెలఁకువ = జాగరూకత. మసలు = ఆలస్యము చేయు. మోసము (రూ) మోస. ధ్రువోదము = శాశ్వతమగు జలము గల దని చేరు.

హ్రదం బన్వర్థాభిధానంబు గలదు. ఇచ్చటికి వరవ యచ్చట నుండి వచ్చుచున్నయది. అదియు వెను మూయం దోయంబు లేక యుండెడు. నడికి రేయిట నల్లల్ల నా వరవం బడి యా మడువుం జేరి యీ బారిం దలంగుదము. ఇంతకుం గొంతముందు కొందఱు మైనికులు వచ్చి యిచ్చట జలంబు కొలంది పరికించి పది దినంబులకు నివురంబాఱెడు నప్పటికి వత్తమని యొండొరులతో నాడికొనుచుం బోయిరి. అది మొదలుగ నాయుల్లంబు పెల్లుగ నుడికిల్లెడు' నా విని హ్రత్యుత్పన్నమతి 'దీని కింత యేల? యంత వచ్చినప్పుడు చూచికొంద'మనియె. యద్భవిష్యంబు మిన్నకుండె. అంతట ననాగతవిధాత యా రాత్రి జలాశయంబు నిర్గమించి యెయెయ్యోయ్యం బోయి హ్రువోదంబుం బ్రవేశించె. ఇట నానాఁటి నెండల మెండున సలిలం బల్పావశేషంబుగ

హ్రదము = లోఁతగు చోటు - మడుఁగు. అన్వర్థాభిధానంబు = తగిన యర్థము గల నామము. వరవ = నీళ్లు వచ్చెడి కాలువ. వెను మూయన్ = వీఁపు గప్పఁగా - వీఁపు తడియఁగా ననుట. తోయము = జలము- కాపాడునది (వ్యు) నడికిరేయిటన్ = అర్ధరాత్రమునందు. మడువు (రూ) మడుఁగు. తలఁగు = పాయు. మైనికుఁడు = చేఁపలఁ బట్టువాఁడు. మూలపదము- మానము. (తద్ధితము) ఇవురఁబాఱు = ఇంకు. ఊడికిల్లు = తపించు, ఊడుకు. నిర్గమించు = బయలువెడలు. ఒయ్యోయ్యన్ = మెల్లమెల్లఁగా. మెండు = అతిశయము. అల్పావశేషంబుగన్ = కొంచెము శేషము గలదిగా.

శోషిల్లుడు రేవుబోయలు, వల, యెత్తెల, కొడమ, గట్టె, మావు లోనగు సాధనంబులు గొనివచ్చి పెచ్చు వేడుకం జొచ్చి మీాలం బట్టిపట్టి గట్టునకుం జేర్చుచుండ నందు యద్భవిష్యంబు మిట్టి మిట్టిపడ బడియం గొట్టి కెడయించిరి. ప్రత్యుత్పన్నమతి మృత కల్పంబుగ జలంబులం దేలగిలంబడి యుండం గని నీరంబు చేరువం దీరంబునకుం బాఱి జిమ్మి మీానసంతానంబు నిరవశేషంబుగం బట్టికొని గట్టు చేరుడు నా మత్స్యం బల్లల్ల జరిగి వారిం బడి భారిఁ దప్పించికొని చనియె."

అని చెప్పిన విని టిట్టిభంబు 'నీ విందులకయి కొంచలం పడకుము. బూటకపు మాటల మూట యని నన్నుఁ దలంపకుము. కార్యంబుతఱి నా నెఱమగంటిమి మెఱయించి నీ మెచ్చు వడ

శోషిల్లుడున్ =ఇంకఁగానే. రేవుబోయ=చేఁపలఁ బట్టువాడు. బోయ (ర్) బోయఁడు = కిరాతుఁడు, మైనికుఁడు. ఎత్తెల, కొడమ, గట్టె, మావు - ఇవి మత్స్యములఁ బట్టెడు సాధన విశేషములు. ఎత్తెల=అడ్డువల. కొడమ = ముఖభాగమునఁ గట్టు లేక నడుమ వలవలె నల్లిక గల యూఁతవంటి సాధనము. గట్టె = తిట్టివంటిదై ఆకారమునఁ బెద్దదిగ నుండు సాధనము. (తిట్టి= బుట్టవలె తాటియీనలతో నల్లిన సాధనము) మావు = క్రిందు సన్నముగా మీఁదు వాటపు విరినిగా అడుగుమీఁది చివరలు చేర లోనఁ జొప్పించి యూఁతవలె చువ్వలతో నేర్పుఱుపఁబడిన సాధనము. బడియ = దండము. కెడయించు = చంపు - కెడయుధాతువు. మృతకల్పంబుగ = కొంచె మించుమించుగఁ జచ్చినదానితో సమానముగా. తేలగిలు = తేలు. నిరవశే షముగ = నిశ్శేషముగ. అల్లల్ల = మెల్లమెల్లఁగా. బారి = వశము, లోపడుట. కొందలంపడు = కలఁతపడు. బూటకము = అసత్యము. మగంటిమి = పౌరుషము. మెచ్చు = మెప్పు.

యువాఁడ. మిన్నకుండు' మనవుడు నా విహంగాంగన తన భర్తకు మాఱు వలుక వెఱచి యూరకుండెను. అంతం గొన్ని దినంబులకు నా విహంగి ప్రసవించుడు సముద్రుండు టిట్టిభంబు పంతంబు పరికింతమని కల్లోలమాలాభీలంబుగం బొంగి తదీయాండంబు లపహరించె. అనంతరంబు పులుఁగువెలంది తన పెనిమిటిం గనుంగొని 'తొల్లి నా వచనంబులు వినరయితిరి. ఇంక నేమి చేయవచ్చు' నని చొటచొటం గన్నీరు దొరుగ నంగలార్చుడు నా ఖగంబు దాని మిగుల నూఱడించి పులుంగుబలగంబులం గూర్చి తనకు సముద్రుండు గావించిన పరిభావంబు తెలియఁబలికి 'యజాండసహితంబుగ నావరణవారిపూరంబు నిశ్శేషంబుగ గండూషింపం జాలిన చండవిక్రముండు వజ్రితుండుఁడు మనకు రక్షకుండని యీ జడాత్ముం డెఱుంగఁడు గాఁబోలు నిప్పు డవశ్యంబుగ నెఱింగింత మెఱింగింపకున్న గర్వంబు మానండు. ఇది యల్పంబు దీని కింత యుద్యమం

విహంగి=ఆఁడుపక్షి-టిట్టిభియనుట. పంతము=ప్రతిజ్ఞ. కల్లోల మాలాభీలంబు=గొప్ప యలల వరుసలచే భయంకరమైనది. పులుఁగు=పక్షి. చొటచొట = కాలుట వడియుట లోనగు వాని యందగు అనుకరణధ్వని. అంగలార్చు = ఏడ్చు. ఖగము = పక్షి - ఆకసమందుఁ బోవునది (వ్యు) మిగులన్ (సా) మివులన్. బలంగము = సజాతీయప్రాణిసమూహము. పరిభావము = తిరస్కారము -(రూ) పరీభావము. అజాండము = బ్రహ్మాండము. ఆవరణ వారిపూరము = బ్రహ్మాండము నావరించి యుండు మహాజలము. గండూషించు = పుక్కిలించు. వజ్రితుండుఁడు = వజ్రాయుధమువంటి ముక్కు గలవాఁడు - గరుడుఁడు. జడాత్ముఁడు = మూఢచిత్తుఁడని యర్థము - జలస్వరూపుఁడని భావము. లడల కభేదమని యెఱుంగనది. ఉద్యమము= పూనిక.

బేలయని యెొప్పరికింపరాదు. నేఁడు గోరంతకు వచ్చినది జేపు
కొండంతకు వచ్చు. మనమందఱు మవహిత చిత్తంబులతో విన
తానందసంధాయకుం డగు వినతానందనుం బాక్షింత మాదయా
ళుం డా మహామహుండు మన యనిష్టంబు దలంగి యిష్టంబు
చేయుంగలం'డని యెుడంబఱిచి యా ఖగంబులుం దానును భ క్తి
తాత్పర్యంబు మీఱ నిరంతరధ్యానం బొనరించుడుం బక్షి
స్వామి సాక్షాత్కరించి 'హృష్టుండ నయితి. మీ యిష్టం బొసం
గెద వేడుం డనవుడు నండజాతంబులు మిగులం బ్రీతంబులయి
తమకు సముద్రుండు గావించిన యవజ్ఞ విజ్ఞాపించిన నాతండు
కుపితచేతస్కుండయి నదీనేతం గాంచి నిజాదేశంబున నయ్యం
డ్రంబులు దెప్పించి యప్పఱుల కిప్పించి "యిప్పటికి క్షమియించితి
నిటమీఁద నస్మజ్జనంబులకు నెగ్గు దలంపకు. నీకది లగ్గుగా'
దని నుడివి యంతర్ధానుండయి చనియె."

అవహితము = అవధానము నొందినది (అవధానము = ఎచ్చరిక)
వినతానంద సంధాయకుండు = వినమ్రులకు సంతోషమును గూర్చువాఁడు.
వినతానందనుండు = వినత యను కశ్యపుని భార్యయొక్క పుత్రుఁడు.
వైనతేయుఁడు = గరుత్మంతుఁడు. నందనుండు = సంతోషింపఁ జేయు
వాఁడు (వ్యు) ఇట పురాణగాథను గమనించునది. మహామహుఁడు = మిక్కిలి
పరాక్రమము గలవాఁడు. తలంగి = తొలఁగించి - అంతర్భావిత ప్రేరణము.
భక్తి తాత్పర్యము = భక్తియందలి తత్పరత్వము. పక్షిస్వామి = పక్షిరాజు.
సాక్షాత్కరించు = ప్రత్యక్షమగు. హృష్టుఁడు = సంతోషము నొందిన
వాఁడు. అండజాతము = గ్రుడ్డువలనఁ బుట్టినది - పక్షి. ప్రీతము=సంతోష
పడినది. అవజ్ఞ = అవమానము, తిరస్కారము. విజ్ఞాపించు = విన్న
వించు. నదీనేత = ఏఱుల దొర - సముద్రుఁడు. (నేత= దొర, నియంత=
నడపువాఁడు). ఆదేశము = ఆజ్ఞ. లగ్గు = మేలు. అంతర్ధానుఁడు = అంత
ర్ధానము నొందినవాఁడు.

నా విని సంజీవకుం డిట్లనియె. "దమనకా! వినుము కల కాలంబు బ్రదుకంబోము. చావు నిక్కంబు. మన కన్నుల ముందరం బుట్టి గిట్టినవారి నెందఱం గానము నిన్న యున్నవాఁడు నేఁడు లేఁడు. నేఁడు పగతు మొగంబునకుం దొలంగిన జేపు మృత్యువు మొగంబునకుం దొలంగవచ్చునె? దానంజేసి యప యశంబు దప్పం బ్రయోజనంబు గలదె? పగతు కడిమి దడవక కడఁగిన వాఁడంగాను. లాఁతి వెరవు లావు గామించేసి ప్రకృ తోద్యమంబుం బూనవలసె. కడమాట యొక్కటి వినుము. ప్రాణ హానికయిన నోర్తుంగాని మానహాని కోర్వంజాల. ఇది నిక్కంబు. నీ వింక నా కడంకకు నడ్డవాట్లు ప్రేయకుము. నేనిదె వచ్చెదఁ గట్టాయితం బయి యుండుమని వ్రేనికిం జెప్పుము. వేగిరింపుము. లెమ్ము. పొమ్ము." నావుడు దమనకుండు సరభసగమనంబునం జనువాఁడు జేసి యిరవు మోసలం గరటకుం గనుంగొని 'లోనికిం బోవచ్చునె? యసమయంబు గాదు గద?" నావుడుం 'బోవ చ్చును. సమయంబ. జేఁడు నీ రాక వేచి యున్నవాఁడు. పోయిన పని యేమయ్యె'నని కరటకుం డడుగ దమనకుండు మొగంబునం జిఱునగవు మొలతేర విలోకించి 'యేమో యేల యయ్యెడుఁ

గిట్టు = చచ్చు. తడవు = విచారించు. లావు = బలిష్ఠము. ప్రకృతోద్య మము = ఇప్పటి ప్రయత్నము. ప్రకృత + ఉద్యమము - గుణసంధి. అడ్డవాట్లు = అడ్డంకులు. కట్టాయితము - కడు+ఆయితము. (ఆయితము = సిద్ధము) ద్విరుక్త టకారము. బా. వ్యా సం. ౧౭. సరభసము = వేగముతోఁ గూడినది. మోసల = ద్వారము - వైకృతము. ముఖశాల (ని) మొగసాల (రూ) మోసాల; మోసల. మొలతేరన్ = మొలవఁగా, పుట్టఁగా ననుట - మొలతెంచు ధాతువు.

గార్యంబు పండించుకొని వచ్చిరిం బీదపఁ దుదమొట్టఁ జెప్పెద. నీవు పోయి సన్నిధానంబున నుండుము. వెంబడిని వచ్చెద'నని కరటకుం బుత్తెంచి కొంతవడికిం దానుం జని యేనిం గనుంగొని 'రమ్మ్ర. కూర్చుండు. వృత్తాంతంబేమి ?'యని యాతం డడుగఁ జేరువకుం జేరి యోరసిలం గూరుచుండి యల్లన నిట్లనియె. 'నేను బోయిన సమయంబున సంజీవకుఁడు లోని యిరవునం గాటకపాటకులతోడ మాటలాడుచుండి ననుం గనుంగొని వారితోడి సల్లాపంబు సాలించి ప్రత్యుత్థానంబు గావించి యుచితాసనాసీనుం జేసి కుశలప్రశ్నంబు గావింపఁ దదవసరోచితంబుగం గొన్ని మాటలాడి యేకాంతం బాకాంక్షించు మా జాడ యెఱింగి కాటకపాటకులు లేచి యెడ గలుగం బోవుడు నయభయంబులు దోఁప వచనీయం బశేషంబు నచియించితిఁ. ఆతండును దనకుం బోలిన వచనంబులు తెంపరితనంబు దోఁపం బెక్కు-లు వచియించె. అవి యెల్ల నాకు వాకొన మీకు నూఁకొనం బోలవు. ప్రయోజనంబును లేదు. ఆతని యుద్యమంబు సమస్తంబు ప్రతికూలం బగుట తద్వచనభంగి నెఱింగితి. చిరకాలంబు సంగాతంబు గావించినవాఁడం గావునఁ గానిచేఁతకు నాతండు చేయు

పండించుకొని=ఫలింపఁజేసికొని. సన్నిధానము=రాజసమీప మనుట. ఓరసిలం గూరుచుండి - ప్రభువు నెదుటఁ జక్కఁగాఁ గూర్చుండుట యుక్తము కాదని భావము. ఓరసిలు=తొలఁగు. మా=మా యిరువురియొక్క. జాడ - వైఖరి. వచనీయము = వచింపఁదగినది. తెంపరితనము = తెగువరితనము, సాహసము. వాకొను = చెప్పు. ఊఁకొను= ఊఁకొట్టు. సంగాతము = స్నేహము-సంగత శబ్దభవము. కానిచేత = అకృత్యము.

నుద్యమంబునకు మనంబునం దాశంజాలక యాతనికి హితంబుగ నాకుం దోఁచినయంత యొత్తి చెప్పితి.

ఎంత చెప్పిన నతండు తాను బట్టిన కుందేటికి మూఁడే కాళ్ళనుచున్నవాఁడు. 'వినాశకాలే విపరీతబుద్ధి' యను వచనం బేల తప్పు? కాలం బాసన్నంబైన నాతని కిట్టి కుబుద్ధి వుట్టుం గాఁబోలు. అతండు పర్యవసానంబునం దన యభ్యుదయంబు తెల్లంబుగం బలికి 'యింక నా కడంకకు నడ్డవాట్లు ద్రవేయకుము. నేనిదె వచ్చెదం గట్టాయితంబై యుండుమని తనకిం జెప్పము. వేగిరింపుము లెమ్ము పో'మ్మని దిట్టతనంబు మీఱం బలికె. ఆతం డింతకుఁ గృతసన్నాహుండై డాయ వచ్చుచుండు. కర్తవ్యాంశంబు దేవరచిత్తంబునకె విదితంబు' నా విని 'యహహా

ఒత్తి = ఊని. తాను బట్టిన కుందేటికి మూఁడే కాళ్ళనుచున్నవాఁడు - తాను నీతో మారొక్కనవలెనని పట్టిన పట్టు వదలక యున్నాఁడని భావము. వినాశకాలే = చెడుతఱిని. విపరీత బుద్ధిః=వ్యత్యస్తమైన బుద్ధి - చెడుకాలము వచ్చినపుడు మంచిబుద్ధి సహితము చెడుచున్నదని భావము. కుబుద్ధి = కుత్సితబుద్ధి. పర్యవసానంబునన్ = కడపట. నా కడంకకు ... పొమ్మ్ర - తక్కిన మాటలను జెప్పక యివి కేవల విరుద్ధవచనములు గనుక వీని మాత్రము సంజీవకుఁడు చెప్పినట్టుగానే చెప్పినాఁడు. దిట్టతనము = ధైర్యము - ధృష్టశబ్దభవము. కృతసన్నాహుఁడు = చేయఁబడిన యుద్ధ ప్రయత్నము గలవాఁడు - సన్నాహశబ్దమునకు కొన్ని నిఘంటువుల యందుఁ గవచ మను నర్థమే యున్నది. అట్లుండినను గవచము యుద్ధా రంభమునందుఁ దొడుగఁబడునది గనుక లక్ష్యములయందు యుద్ధ ప్రయత్నపరముగానే ప్రయోగింపఁబడుచున్నది. కావున ప్రయత్న మనియుఁ జెప్పవచ్చును. విదితము = ఎఱుఁగఁబడినది.

సాహసంబు ! ప్రలయజ్వలనంబుపయి శలభంబు విలంఘింపం దలంచె. ఔర ! కావరం' బని యధిక్షేపించుచుం గ్రోధదుర్నిరీక్షుం డయి హార్యక్షనల్లభుండు విపక్షశిక్షాదీక్షం బూని సముత్థితుండయి నిర్ఘమించి, ఖురప్రహారంబుల దుమారంబు లాకాశంబు నిరవకాశంబుగం దిరోహించి ప్రావృషేణ్యధారాధర వారంబు విడంబింప ధరాతలం బదుర దురవలోకభీకారాకారంబు మీఱిం బాఱు తెంచు నుక్షాధ్యక్షు వీక్షించి ధరాధరంబులు మాఱు చెలంగ క్ష్వేళారావంబు గావించి సటాకూటంబు

ప్రలయజ్వలనము=ప్రలయకాలమందలి యగ్ని. శలభము=మిడుత. విలంఘింపము=దాఁటు. కావరము=క్రొవ్వు. అధిక్షేపించు = ఆక్షేపించు. క్రోధదుర్నిరీక్షుఁడు = కోపముచేతఁ జూడఁగూడనివాఁడు - భయంకరుఁడనుట. ఇయ్యెడ 'దుర్నిరీక్ష్యుఁడు' అని కొందఱు ముద్రింపించిరి. అది అపపాఠము. ముద్రితములగు భారత ప్రతులలో నైతము - ఈ పాఠము కానవచ్చుచున్నది. ఈషత్, సు-దుస్ వీనికిఁ బరముగా 'అ' ప్రత్యయము-దుర్నిరీక్షము-దుర్లక్షము-దుశ్శిక్షము. విపక్షుఁడు = విరుద్ధపక్షమువాఁడు - శత్రువు. దీక్ష = ఒకానొక కార్యము లోపములేకుండఁ దీర్ఘఁగైకొన్న వ్రతము. సముత్థితుఁడు = లేచినవాఁడు. నిర్ఘమించి = బయలువెడలి - దీనికిఁ బాఱుతెంచు నను క్రియాజన్య నిశేషణముతో నన్వయము. ఖురప్రహారము = గొరిసెల దెబ్బ - ప్రహారము (యూ) ప్రహారము. దుమారము = దుమ్ము. నిరవకాశంబు = ఎడములేనిది. తిరోహించు = మఱుఁగు చేయు. ప్రావృషేణ్య...వారంబున్ = వర్షకాలమందలి మేఘములయొక్క సమూహమును. ధారాధరము(వ్యు) జలధారను వహించునది - మేఘము. విడంబించు = అనుకరించు. దురవలోకభీకారాకారంబు = చూడఁగూడనిదియు భయంకరమును నైన యాకృతి. ఉక్షాధ్యక్షుఁడు = వృషభేంద్రుఁడు - సంజీవకుఁడు. ధరాధరము = భూమిని ధరించునది - కొండ. క్ష్వేళారావము = సింహనాదధ్వని. సట = మెడమీఁది వెండ్రుకలు - జూలు.

నిక్కం గర్ణంబులు టొక్కించి పింగళేక్షణంబుల విస్ఫులింగంబు
లెగయ నరాళదంష్ట్రాకరాళంబుగ నాస్యగహ్వారంబు దెఱచి
జిహ్వాపల్లవం బల్లార్చుచుం గుప్పింపం జొప్పాఁదప్పించి వృషభేం
ద్రుండు సముక్షిప్తవాలవిక్షేపంబు మీఱం బెల్లు ద్రుళ్ళి
వెనుకటికాళ్ళం బయల జాడించుచు భూనభోంతరంబు బూర
టిల్ల నుదారారావంబు గావించుచు మస్తకంబు వాంచి యేటవా
లుగం గొమ్మ్ల లొడ్డుకొని మెఱపు మెఱసిన తెఱఁగున నుఱికి
యురమ్ము గ్రుమ్మ నమ్మెకమ్ముల యెకిమీఁడు సొమ్మసిల్లి
తెప్పునం దెప్పిటి ముప్పిరి గొను కోపంబు దీపింప నాటోపించి
లాఘవంబున లంఘించి వజ్రసఖంబులగు నఖంబు లూడుకొన

టొక్కించి = నిక్కించి. పింగళేక్షణంబులు = పచ్చని కన్నులు. పింగళ + ఈక్షణంబులు - గుణసంధి. విస్ఫులింగము = మిడుఁగురులు (రూ) స్ఫులింగము. అరాళదంష్ట్రాకరాళంబు = వంకరలయిన కోఱలచేత భయంకరము. ఆస్యగహ్వారము = గుహవంటి నోరు. జిహ్వాపల్లవము = చిగురుటాకువంటి నాలుక - ఈ రెండును ఉపమానోత్తర పదములు. అల్లార్చుచున్ = అల్లాడుధాతువు. సముక్షిప్త వాల విక్షేపము = మీఁది కెత్తఁబడిన తోఁకయొక్క విసరు. ఇచ్చట 'నిక్షేపము'అని ముద్రిత ప్రతిలోఁ గన్పట్టెడిని. అది అచ్చుతోసమై యుండవచ్చును. నిక్షేపము = ఇల్లడ, నిధి. విక్షేపము = ఎగురనేయుట, విసరివేయుట, కదలిక. బూరటిల్ల = నిండు - పూరణశబ్దభవము. ఉదారారావంబు=గొప్ప కూఁత. ఏటవాలు = వంపు. ఒడ్డుకొను = అడ్డపెట్టు. మెఱపు = తటిత్తు - మెఱచుధాతువు. ఎకిమీఁడు - ఒడయఁడు - రాజు. సొమ్మసిల్లు = మూర్ఛిల్లు. తెప్పునన్ = శీఘ్రముగా. తెప్పిటు = మూర్ఛదేఱు. లాఘవంబు = లఘుత్వము - తేలికగ నగుట. ఊడుకొను = గ్రుచ్చుకొను - కాఁడు.

మూఁపురంబు చఱిచినం దొరుగు కీలాలజాలంబు నగశృంగనిస్స
రజ్ఝరీపూరంబు ననుకరింప గోవల్లభుండు తొలంగక మఱంగి
శాతశిఖరంబు లగు ఖురంబులు కర్రంబు డిగ నురంబు దాఁచిన
నత్తాఁపుకంజెం దత్పరాభవంబు గుండియ లవియింప బెండువడి
కంఠీరవవల్లభుండు దండతాడితభుజంగంబు భంగి కోఁజూచు
నిలువం గరటకుండు దమునకుం జూచి "యవలోకించితే? భవ
దీయదుర్మంత్రశ్రవణఫలంబు మేఁ డనుభవించెదు. ముందు నీవు
మృగరాజుతోడ సంజీవకునకు మైత్రి వుట్టించితివి. పిమ్మటం
జూపోపక యిరువురకు భేదముఁ బుట్టించితివి. మొదల దూరము
విచారింపవయితివి. పండితమాని యగు భృత్యుండు తనకుఁ గాదు

మూఁపురము = వృషభముయొక్క స్కంధప్రదేశము - ककుదము. తొరుగు = స్రవించు. నగ...పూరమున్ = కొండకొమ్మ్మ్మనుండి వెడలి పాఱుచున్న సెలయేటి వెల్లువను. మఱంగి = మరలి. శాతశిఖరంబులు = వాఁడియైన కొనలు గలవి. ఖురంబులు = గిట్టలు. డిగన్ = దిగునట్లుగా - నాటుకొనఁగా ననుట. తాఁచు = తన్ను. తాఁప్ర = తన్ను - పాదతాడనము - తాఁచు ధాతు కృదంతము. తత్పరాభవము = ఆ తన్నువలన నగు నవమానము. అవియించు = భేదించు. బెండువడి - బెండు + పడి = బలహీనతఁ బొంది. కంఠీరవ వల్లభుండు = సింహరాజు. దండ తాడిత భుజంగంబు = కఱ్ఱచేఁ గొట్టఁబడిన పాము. భుజంగము (వ్యు) మొమ్మ్మ్మతోఁ బ్రాఁకునది. కోఁజు = అధికముగా శ్వాసముఁ బుచ్చు. దుర్మంత్రశ్రవణ ఫలము = దురాలోచన వినుటయొక్క ప్రయోజనము. చూపోపక = సయింపక. పండితమాని = తన్నుఁ బండితునిగా నెంచి గర్వించువాఁడు. పండిత - మన్ - ఇన్ = పండితమానిన్ (తన్నుఁ బండితునిగాఁ దలఁచువాఁడు) పండిత - మన్ - య = పండితమ్మన్యుఁడు. ఇట్లే, కవిమాని కవిమ్మన్యుఁడు మున్నగునవి.

స్వామికి సహాత్రము హాని పుట్టించును. ఆహాహా? మన యధీశ్వరుం డిప్పుడు మహాపదం బొంది యున్నవాఁడు. ఇప్పు డీయిడుమకు రాజును దలంగు నెరవు పరికించితిమేని వలంతులమ. పొంకంబుగా బింకంబులు నూఁతాడవచ్చును గాని యొక్కపోరామి వచ్చినప్పుడు కార్యంబు పయి వ్రేసికొని సంబళించుట సుకరంబుగాదు. రాజును గుణవంతునేని దుర్జనసేవితుని హ్రాదంబును గమలసుండమండితంబునే గ్రాహాక్రాంతంబుబోలెం బ్రజలు డాయ వెఱతురు. స్వార్థపరుండ వయి యిట్టి యనర్థంబు వుట్టించి రాజు నేకాకిం జేసితివి. భృత్యుల నేరం జేరనీవు. ఏవారిం జేరనీక యందఱే కార్యంబులు పయి వ్రేసికొని తిరుగువాఁడు తాన రాజునకుఁ బగవాఁడగును. అసాధువులకు హితంబు గానించు వాఁడుంబోలె సాధువుల కహితంబు గానించువాఁ డవశ్యంబుం

ఆహా + ఆహా = ఆహాహా - ఆమ్రేడితము పరమగుటఁజేసి సంధి. ఇడుమకున్ = ఆపదవలన - విభక్తి వ్యత్యయము. తలంగు = తొలఁగించు, అంతర్భావిత ప్రేరణము. వలంతులము + అ - వలంతులమ. పొంకము = పొందిక. బింకములు=బిగువు మాటలు. పోరామి=అక్కటి, ఆపద. కార్యంబు పయిఁ వ్రేసికొని-తానుగా నొక కార్యమునఁ బ్రవేశించి యనుట-ఇది భాషాశైలి. సంబళించు = నిర్వహించు. కమలమండ మండితము = తామరపూగుంపుల చేత నలంకరింపఁబడినది. గ్రాహాక్రాంతము = మొసళ్ళచే నాక్రమింపఁబడినది. రాజును...వెఱతురు - తామరలు వెక్కలు గలిగినను మొసళ్ళు గలనేని యా మడుగును జేర వెఱచునట్లు సుగుణములు వెక్కలు గలిగినను దుర్జనులు చేరువఁ గలరేని యా రాజును జనులు చేర వెఱతురని యర్థము. స్వార్థపరుఁడు = స్వప్రయోజనమునం దాసక్తి గలవాఁడు. ఏకాకి =ఒంటరి. ఏరిన్ = ఎవ్వరిని.

గీడు వొందును. భృత్యుండు స్వామికి హితాపాదియయి తత్ప్ర సాదంబునం బడసిన సంపద యెన్నఁటికి నశింపదు. అహితంబు గావించి గడియించినది కడువడిం జెడిపోవును. కొంద ఱర్థశా స్త్ర నభిజ్ఞులయ్యుం బండితమానులయి తామ కృత్యాకృత్యంబులు నిర్ణయింతురు. ఫలవైపరీత్యంబున దైవప్రాతికూల్యంబు నిమి త్తం బుగ వచియింత్రుగాని తమ యజ్ఞానంబు దలంపరు. అట్టి మూర్ఖు లకు బుద్ధిఁ జెప్పఁ గడంగువాఁడు వానరములకు బుద్ధిఁ జెప్పఁ బోయిన సూచీముఖమువలె హానిఁ జెందును. నీ కొక కథ చెప్పెద వినుము.

హిమవంతంబు ప్రాంతంబునం గుసుమఫలసంతాన కాంతంబగు కాంతారంబు గలదు. అందలి కపిసందోహం బొక్క నాఁడు శీతంబుచే బాధితంబయి జ్యోతిరింగణసంఘంబుం గనుం గొని యనలంబను బుద్ధిం జేసి డాసి చలి గాఁచికొనుచుండ సూచీ ముఖంబను పక్షి వీక్షించి 'యోయి వెఱ్ఱులారా! యివి నిప్పుకలు

హితాపాది = హితవును గలుగఁజేయువాఁడు. ప్రసాదము = అనుగ్రహము. అర్థశాస్త్రానభిజ్ఞులు = రాజనీతిఁ దెలియనివారు, (శాస్త్ర + అనభిజ్ఞులు). ఫలవైపరీత్యము = ఫలముయొక్క మాఱుపాటు - ఫలింపమి. దైవ ప్రాతి కూల్యము = దైవముయొక్క విరోధము - దైవ మనుకూలింపమి యనుట. సూచీముఖము = సూదివంటి ముక్కు గల పక్షివిశేషము. ప్రాంతము = సమీపము. కుసుము ... కాంతము = పువ్వుల యొక్కయుఁ బండ్ల యొక్కయు సమూహముచేత మనోజ్ఞమైనది. కాంతారము = అడవి - ఎవ్వరిని దాఁటనీయనిదని వ్యుత్పత్తి. జ్యోతిరింగణ సంఘంబు = మిడుఁ గుఱుఁ బురువుల గుంపు. ఓయి వెఱ్ఱులారా - (ఓ + యి-ఓయి) నీచప్రయో మంత్రణమున 'యి' వర్ణము (రూ) ఓయీ.

గావు. మిడుంగుఱుంబురువులు. చూడుండా చాయ నల్ల మహీరుహంబు చేరువున నింగలంబు గానంబడియెడు నటకుండని చలివాచికొండన నం దొక్క మర్కటుం బా మాటలకు గాటంబగు కోపంబు దీపింప 'నీవా మాకుం గర్తవ్యోపదేష్ట'వని నిక్కి వెక్కిరించి గ్రక్కున లంఘించి దానిం బట్టి నేలం గొట్టి కాలంబు తుదముట్టించె.

బుద్ధిహీనునికి బుద్ధిమంతుఁడు చెప్పిన వచనము హితంబుగాఁ దోఁపదు. లోకంబునందుఁ బ్రియవాదులు పెక్కండ్రు గలరు. హిత మాడువాఁడు దుర్లభుండు. హితవాదికంటె హిత శ్రోత కడు దుర్లభుండు. తనకు మేలు గోరి పలుకుఁ గీడు రోయువాఁడు తప్పక చెడిపోవును. తొల్లి నందిగుప్తుఁడనువాఁడు సుదర్శనగుప్తుఁడనువాని మోసపుచ్చుం దలంచి తన తండ్రిని ధనంబును గోలుపోయెను. ఆ కథ నీకు సాకల్యముతో వాక్రుచ్చెద నాకర్ణింపుము.

అల్ల = ఆ. చేరువు = సమీపము - చేరుధాతు కృదంతము - ఇంగలము = నిప్పు. పాచికొండు = పాయఁ జేసికొనువాఁడు - పోఁగొట్టుకొనువాఁడనుట. గాటము = అత్యంతము - గాఢశబ్దభవము. కర్తవ్యోపదేష్ట = కార్యమునుపదేశించువాఁడు. కర్తవ్య + ఉపదేష్ట - గుణసంధి; ఉపదేశము - ఉపదేష్ట. ప్రియవాది = ఇచ్చకాలమాఁకి. హితవాది = హితవు చెప్పువాఁడు. ప్రియమనఁగా మనస్సునకుఁ దత్కాలమందు సంతోషము కలిగించి కాలాంతరమందు చెఱుపు సేయునది యైనను గావచ్చును. హిత మనఁగా తత్కాలమున మనస్సునకు సంతోషకరము కాకపోయినను - ఆ వెనుక మేలు సేయునట్టిది. శ్రోత = వినువాఁడు. నందిగుప్తుఁడు = ఈశ్వరుని వాహనమైన నందిచేతఁ బోషింపఁబడినవాఁడని సంజ్ఞ. సుదర్శనగుప్తుఁడు = సుదర్శనమను విష్ణుచక్రముచేతఁ బోషింపఁబడ్డ వాఁడని సంజ్ఞ.

జనావతి యను పట్టణంబునందు సుదర్శనగుప్తుండును నందిగుప్తుండును ననుబేహారు లిద్దఱు తద్దయు సౌహార్దంబు గలిగి వర్తింతురు. వారు ధనంబు సంపాదింపం దలంపుగొని లాఁతి విలాతికిం జని కొంత గాలంబు పాలిబేరంబు గావించి యభిమతం బొడఁగూడుమఁట నభిజనంబునకు మగలి యరుదేర నందిగుప్తుండు సుదర్శనగుప్తున కిట్లనియె. 'మనము ధనం బానయించుట ప్రకటింపం జనదు. న్యాయార్జితం బిది యెవ్వ రెఱింగినం గొఱంత యేమి యనకుము. సరఘూసముత్కరసమార్జితం బగు మధువుం గరుణఁ దొఱంగి లోకులు చేకొండ్రుగాదె? కావున నగరంబు పఱిగడ నెక్కడనే నొక్కయెడ మన కొక్కంబు గుప్తంబు గావించి పోవుదము. వలసినతఱి వచ్చి పుచ్చికొంద'మనిన నొడం బడి యాతండు నాతండును ధనంబు సర్వం బొక బిందియం బొందువఱిచి సాభిజ్ఞానంబుగ నొక్క వటమహీరుహాంబు చేరువ లాఁతు లెఱుంగకుండం బాఁతి తమ యిరవుల కరిగి యెప్పటి

జనావతి = జనులను గాపాడునది యని పేరు. బేహారి = వర్తకుఁడు (రూ) బేహరి. సౌహార్దము = సుహృద్భావము - స్నేహము - తద్భిప్రాంతము. విలాతి = దేశము. అభిమతంబు = కోరిక - కోరిన ధనమని యర్థము. ఒడఁగూడు = సిద్ధించు. అభిజనము = జన్మదేశము. అరుదేర = రాఁగా. అరుగుదేర ననియుఁ గలదు. ఆనయించుట = పెచ్చుట. న్యాయ + ఆర్జితము = న్యాయముగా సంపాదింపఁబడునది. సరఘూసముత్కర సమార్జితము = తేనెటీఁగల గుంపుచే గూర్పఁబడినది. పఱిగడ = వెలుపట. బిందియ = బిందె - లోహభాండము. సాభిజ్ఞానంబుగన్ = గుఱుతుతోఁ గూడినదిగా. పాఁతు = పూడ్చు.

చొప్పు దప్పక చెలిమి గలిగి సుఖంబుండిరి. ఇట్లు కొంత కాలంబు గడచిన నొక్కనాఁడు నందిగుప్తుఁడు గుప్తప్రకారంబునం జని యా బిందియం గ్రొచ్చి పుచ్చికొని వచ్చి డాఁపరికం బొనరించి పిదపం గొంతకాలంబునకు సుదర్శనగుప్తుఁ గనుంగొని 'మనము ధనంబు గొని వత్తము. మన కింక శంకింపం బని లేదు. పెద్ద గాలంబు లోకులం గనుమూసితిమి. ఇప్పుడు మనయొద్ద రొక్కంబు లేదని యుల్లంబులం దెల్లకు విశ్వసించి యున్నవారు. పెఱ లాటిఁగినం గొఱంత లేదు. రాజన్వంతంబగు విషయంబున వసించుచున్నవారము. చనుదెం'మ్మని తోఁకొని చని గుఱుతు పరికించి యచ్చటం గ్రొచ్చి చూడ ధనంబు గనంబడదయ్యె నంతట నందిగుప్తుండు తన ముందట విషణ్ణుండయి నిలుచున్న సుదర్శనగుప్తుం జూచి కరంబున నురం బప్పళించికొని 'యోరి మిత్రద్రోహీ! యూహా యెంతపని చేసితివిరా. ఎప్పుడో యెఁటి వచ్చి ధనం బపహరించి యేదియు నెఱుంగనివాని తెఱంగున నా కెదుర విషాదం బభినయించి దక్కించికొనం జూచెదవే.

గుప్తప్రకారంబునన్ = గూఢభంగిని - ఎవ్వరికిని దెలియకుండ ననుట. క్రొచ్చి = త్రవ్వి. డాఁపరికము = దాఁచుట - డాఁచుధాతు కృదంతము. (సూ) దాఁపరికము. కను మూసితిమి = వంచించితి మనుట - ఇది భాషాశైలి. రొక్కము = ధనము - రోకశబ్దభవము. ఉల్లము = హృదయము. రాజన్వంతము = మంచి రాజుఁగల దేశము - (సామాన్యుఁడైన రాజు గల దేశము రాజవంతము) విషయము = దేశము. తోఁకొను = తోడుకొను. విషణ్ణుఁడు = విషాదము పొందినవాఁడు. అప్పళించి = చఱచి - ఆస్ఫాల శబ్దభవము. విషాదము=నీమి తోఁపని చింత. అభినయించు=నేత్రాద్యవయవములచే భావమును దెలియఁజేయు. దక్కించుకొనన్ - దీనికిఁ గర్మము ధనము.

ఇచ్చటం బొంతిన ధనంబు మనముదప్ప నన్యు లెవ్వారయిన నెఱుం
గుదురే. అది నీ వెఱుంగకుండం గాళ్లు వచ్చి నడచి పోయెం
గాఁబోలు. కానిమ్మురా నిన్నుం బోనిచ్చెదనే. వారిపేరివలె నంది
గుప్తుం డలంతులం బోవునాఁడని తలంపకుము. నా సొమ్ము నీ
చేతం గ్రక్కించకున్న నే నొక్క మగవాఁడనే' యనుచుం గినుక
మెచ్చుగం దెచ్చుకొని గ్రక్కున బయిరవాసంబు పుచ్చి నడు
మునం బిగియం జుట్టుకొని సుదర్శనగుప్తునిం గటివస్త్రంబునం
గరంబుం జొప్పించి 'దివాణంబునకు రమ్ము. నీ వక్కడంగాని
చక్కంబడ'వని యాకర్షింప సుదర్శనగుప్తుండు మనంబునం దేవ
గించి 'యూరక యేల నేల విడిచి సాము చేసెదవు. తాళుము.
నా పలుకులు విని యానల నీకుం బోలినట్లు చేయుము. పట్టు
వదలు'మన నందిగుప్తుండు 'నాలుక మిగుల రానీకుము. నీకుం
దాళిక యుండుంగాని సొమ్మునుం గోలుపోయిన నాకుం దాళికకు
నెంత దూరంబు. బళీ! యింత చాలక నీ పలుకులు సహితము
వినవలయుఁగా? నిన్ను విడిచెదనే'యన సుదర్శనగుప్తుండు 'నీవు
రమ్మన్న చోటికి వచ్చెదం బొదము. చేపట్టు విడువు'మని విడి
పించికొని వెంబడిం బోవ నాతండు నృపునిపాలికిం బోయి తన
వృత్తాంతంబు సమస్తంబు నివేదింప రెండవయాతండును

నీచేతం గ్రక్కించకున్న - భాషాశైలి. మెచ్చు=అధికము. బయిరవాసము = అంగవస్త్రము - బహిర్వాసశబ్దభవము. దివాణము = ఆస్థానము - దేవా యనశబ్దభవము. ఏవగించు = రోఁతపడు. నేల విడిచి సాము చేసెదవు - అనఁగా సాము చేయువానివలె దేహము శ్రమపఱచి పోరుచున్నాఁడవని భావము. తాళిక = ఓర్పు - తాళుధాతుకృదంతము. వినవలయుఁగా = వినవలెఁగదా. పొదము = పదము=పొమ్ము.

'మహాప్రభూ ! యట్లు మే మిద్దఱము ధనంబు గుప్తంబు కావించి యిప్పుడు గ్రొచ్చి చూడం గానంబడదయ్యె నే నింత యెఱుంగుదు. మఱి యొక్కఁ పాపం బెఱుంగ.' నా విని పార్థివుండు ధర్మాధికృతుల రావించి వాదిప్రతివాదుల నప్పగించి 'పేరల తగవు దీర్పుం'డని నియోగింప వారు వీరి వివాదం బవధానంబుతోడ నవధరించి వాదిం జూచి 'ప్రతివాది త్రవ్వి ధనము గొనినందులకు సాక్షు లున్నారా' యని యడిగిరి. 'అయ్యలారా ! దొంగ పెఱి లెఱుంగ దొంగలించునా ? మేము ధనంబుఁ బాతిన చోట వట వృక్షం బొక్కఁండు దక్క నన్యంబు లేదు. కటకటా ! యింక నే నెక్కడినుండి సాక్షిఁ దెత్తు'నని యాననంబు దీనంబు గావించి కొని పలికి కొంత చింతించి వెండియు నిట్లనియె. 'ఇదే నా శపథంబు వినుండు. నేను మాత్రపితలకు భక్తుండనేని స్వప్నావస్థయం దయినం బరద్రవ్యంబు హరియింపం దలంపనేని సత్యశీలుండనేని నవ్వటవృక్షంబ గుణ్యగణ్యులరగు మీ రెల్లరు విన సాక్షిభావం

గుప్తము=దాఁపఁబడినది. మఱియొక్క పాపంబు=ఏ పాపము ననుట. ధర్మాధికృతులు = న్యాయాధికారులు. ధర్మ + అధికృతులు - సవర్ణదీర్ఘసంధి. తగవు = వివాదము-కృదంతము. తగుట, న్యాయము, పెండ్లినాఁడు పెండ్లికూఁతునకు తల్లిదండ్రు లిచ్చెడు బహుమానము ననియు నర్థములు. 'తగువు' అన్నది వాడుకమాట. శపథము = ప్రతిజ్ఞ. మాత్ర పితలు=తల్లి దండ్రులు. మాతృ + పిత - మాత్రపితలు, మాతాపితలు. ద్వంద్వంబునందు బుకారంబు నకు రవర్ణంబు విభాష నగు. బా. వ్యా. సమాస ఏర. స్వప్న + అవస్థయం దయినన్ - కలలోనైనను. గుణ్యగణ్యులు = గుణవంతులలో (మొదట) ఎన్నఁదగినవారు. 'గుణగణ్యులరు' - అని ఇటీవలి పెక్కు ముద్రణములు. మూలము గుణ్యగణ్యులరు.

బవలంబించి సత్యంబు పలుకుం గావుత'మని యెల్లఁగెఁ బ్రి పల్లుక 'నీతం డెట్టి మహానుభావుండొ యిట్టి శపథంబు గావింప మఱి యొక్కనికి శక్యంబే' యనియు 'శపథమాత్రంబున నేమయ్యెఁ జెప్పిన చొప్పు తుదముట్టఁ జూడక యిదమిత్థమ్మని నిశ్చయింపరాదు. కల్లనిజంబులు దైవం బెఱుంగు'ననియుం 'బ్రకింప నీతండె ధనం బపహరించి యాతనిపయి నింద మోపి తాను సత్యశీలుం డనిపించికొనునలయునని యింత గొంతు గావించెడుం గాఁబోలు! అంకుటాలికిం గ్రొత్తడి సుద్దులు పెక్కులు గావె? యనియు నచ్చటం జూపఱు పెక్కు తెఱంగుల నాడికొనుచుండ సభాసదులు కరంబు వెఱంగుపడి యన్యోన్యముఖావలోకనంబు గావించి యిట్టి శపథం బశ్రుత చరం బని ముచ్చటించుచు నవ్వణిజులం జూచి 'నేఁడు మిక్కిలి ప్రొద్దు నోయె. తెప్పు వఱువాత రండు. మీ వివాధంబు పరిశీలించెద' మనవుడు 'వల్లె' యని వారలు తమ నిలయంబుల కరిగిరి. అంత నందిగుప్తుండు నాఁటి రేయి నిజగృహబహిర్ద్వారంబు కవాటపిహితంబు గావించి గర్భాగారంబుఁ జేరి తన జనకుని

సాక్షిభావము = సాక్ష్యము. కావుతమని - కావుతన్ + అని - అని ఛేదము. ఇదమ్ = ఇది. ఇత్థమ్ = ఇట్లు - ఇది యిట్లని. గొంతు = కంఠధ్వని యని యర్థము. ఇంత గొంతు - భాషాశైలి. అంకుటాలు = వ్యభిచారిణి. అంకు + ఆలు, టుగాగమము, (అంకు = జారత్వము) క్రొత్తడి = పతివ్రత, మగనాలు. సుద్ది = మాట - శ్రుతిశబ్దభవము. చూపఱు = చూచువారు. అశ్రుతచరము = మున్ను వినని. ముచ్చటించు = సల్లాపము చేయు పణిజుఁడు = వర్తకుఁడు - వణిక్శబ్దము. పరిశీలించు = విచారించు. బహిర్ద్వారము = తలవాకిలి. కవాట పిహితము = తలుపుచేఁ గప్పబడినది- తలవాకిటి తలుపు మూసి యనుట. గర్భాగారము = లోపలి గది.

రావించి యతనితోడ భూగుప్తధనాపహారణం బాదిగ స్వకృతంబు సర్వంబు నివేదించి యిట్లనియె. 'అర్థంబు సకల పురుషార్థ సాధనంబు. ధనంబునకు దుస్సాధ్యం బొక్కండు లేదు. లోకులు కులవిద్యారూపగుణవిహీనునేని ధనవంతుని సర్వసంపన్నుండని వచియింతురు. సకల దురితంబులకు దారిద్ర్యంబుంబోలె సకల దురితక్షపణంబునకు నర్థంబు నిదానంబు. తదార్జనంబుకయి చేయు దురితంబు పాచితంబునం బాచికొనవచ్చుగాన నెవ్విధంబున నేనిఁ బురుషుండు ధనం బార్జింపవలయు నని నీతికోవిదులు వకాణింతురు. దానంబట్టి యొక్కయి యొక్కంబు సమార్జించితి. హస్తగతం బగు విత్తంబు దక్కించుకొను వైరవు గలిగియు వీటిండితనంబున జాఱవిడువ నేల? ఒక సదుపాయంబు చింతించి యున్నవాఁడ వినుము. జాగు సేయక వేగకమున్న పోయి యీ మట్టిత్రోట్ట నడంగి యదృశ్యుండవయి యుండుము. ఱేపు ధర్మాధికృతులు చనుదెంచి యీ వృక్షంబు నడుగుతఱి జంపు గావింపక యిచ్చటి ధనంబు సుదర్శనగుప్తుండు హరియించె

భూగుప్తధనాపహారణము=భూమియందు దాఁపఁబడ్డ సొమ్ము దొంగిలించుట. స్వకృతము = తనచేఁ జేయఁబడినది. దుస్సాధ్యము = సాధింపరానిదనుట. (వ్య) సుసాధ్యము. విద్యారూపగుణవిహీనున్ = తృతీయా తత్పురుషము. దురితక్షపణము = పాపనాశనము. నిదానము = కారణము. పాచితము = పాపపరిహారార్థమై చేసెడు కర్మము - ప్రాయశ్చిత్త శబ్ద భవము. ఒక్కమయిన్ = ఒకవిధముచేత - మోసముచే నని భావము. వీటిండితనము = మూర్ఖత్వము. వేగు = ఊదయించు (వేఁగు = తపించు) వేగకమున్న - వేగుటకు మున్న అని యుండుటకు మాఱుగా విశేషవిధివలన నీహూపము కలిగెను. అదృశ్యుఁడు = చూడఁదగనివాఁడు. ఱేపు = వేకువ, రాఁబోవు దినము. జంపు = ఆలస్యము.

నని యొత్తిలి పలుకును. ఇంతమాత్రంబు నా చెప్పిన చొప్పు గావించితేని మన పక్షంబు జయించు'నన విని యాతం డిట్లనియె. ఉపాయంబు చింతించుచో రాగల యపాయంబు సహితము చింతింపవలయు. లేనిచో శాబకంబులం గాచికొనంబోయి కోలుపోయిన బకంబు చందంబగు, నా కథ నీకుం జెప్పెద వాకర్ణింపుము.

ఒక నింబవృక్షంబుమీఁద బకమిథునంబు చేరి వాసంబు చేయుచుండు. అంతం గొంత కాలంబునకు బకాంగన గర్భంబు దాల్చి తనభర్తతోడ నేగి యక్కడక్కడం జిదుగులు ముక్కునం గఱచికొని కొనివచ్చి గూఁడు పన్నికొని యండంబు లిడి పొదిగి బోదలం గావించి యేమచు నొక్కనాఁడు తన పెనిమిటి కిట్లనియె. వినుగా? నేఁడొక విహంగమాంగన చెప్ప వింటిం దొల్లి యీ వృక్షంబుమీఁదం బహు లనేకంబులు వసించుచుండ వానిపిల్లల నెల్ల నల్ల యీక్రింది పుట్టలోని కాలభుజంగంబు భక్షించి పోవ

ఒత్తిలి = గట్టిగా. పక్షము = పక్క, హాదము. శాబకము = పిల్ల. నింబము = వేపచెట్టు. మిథునము = స్త్రీ పురుషులు (జంట) చిదుగు = కట్టెపుల్ల. పన్నికొని = ఏర్పఱచుకొని. పొదుగు - పొదిగిట నుంచు (అండజములు పొదుగుటచేఁ బెరుఁగును) పొదుఁగు = ఆవు లోనగు వానికి పాలుండు చోటు, ఊథము. పొదుగు = క్రమ్మ, రత్నములు లోనగువానిని జెక్కు, కప్పు, పక్షులు గ్రుడ్లను ఱెక్కలతో కప్పు. బోద=పక్షి లోనగువాని పిల్ల - (అంచబోద - ఎలుకబోద) ఇది వైకృతము. వీదు (నానా) కాపాడు, నశించు, ముండ్లపంది. 'రఘుకుమారు నేదిరి వాదుల్' అని ప్రయోగము. కాల భుజంగము = కృష్ణసర్పము.

దాని రాయిడిం బడంజాలక యీ పులుంగు లెల్ల వలసపోయె నఁట. ఈ వృత్తాంతంబు విన్నయప్పటంగోలె నా మనం బెరియు చున్నయది. ఎఱుంగక యీ తరువుం జేరితిమి. అక్కటా ! యీ నెత్తురుఁగందుల నొక్క యిడుమ దొడరిన నే నెట్లు సయి రింతునని బొటబొటం గన్నీరు దొరుగ నెలుంగు కుత్తుకం దగుల మాట రామి నూరకున్న దయితం గనుంగొని బకోటంబు దానుం గొంత చింతించి యేల యూరక యుమ్మలించెదు. మన ముమ్మ లికంబడి కొండొక కార్యంబు సాధింపఁబోయెదమె? ఊఁజుడుము. శత్రువుం బరిమార్చు వెరవు మనంబునం దొక్కటి పరికించితి వినుము. ముంగి పొద దొరఁకొని యీ పుట్టదనుక నక్కడక్కడ నొకొక్కక మీనంబును వయిచి యుంచెద. అట్లు చేసిన మన యిష్టంబు సిద్ధించునని పలికి యా క్షణంబ పోయి కొలఁకున మీలం బట్టి యట్లు వయిచి యుంచుడు ముంగిస పొదరు వెడలి

రాయిడి = ఉపద్రవము - రాయుధాతు కృదంతము, ఒరయిక. వలసపోవు = రాజోపద్రవాదులవలన ఊరు విడిచి పాఱిపోవు. విన్నయప్ప టంగోఁకెన్=ఆకర్ణించిన యీ కాలము మొదలు. నెత్తురుఁగందులన్=నిక్కి పసికూనల ననుట. తొడరు=పొందు. సయిరించు=ఓర్చు. బొటబొటన్ = చొటచొట వంటిది-కాఱుటయందగు ధ్వన్యనుకరణము. బొడబొడ యనియు నందురు. ఉదా - బొడబొడ రక్తముం దొరఁగ. దయిత = భార్య. బకో టము = బకము. ఉమ్మలిక = శోకము - ఉమ్మలించు ధాతు కృదంతము. ఉమ్మలికన్ + పడి - అని ఛేదము. ఊఁజుడుము = ఊఁజుడిల్లుము - శోకము నండి తొలఁగుమనుట. ముంగి = ముంగిస. దొరఁకొని = మొదలుకొని. దనుక = దాఁక. వయిచి - వైచి. పొదరు = పొద. పొదరు వెడలి - పొద రును వెడలి యని యర్థము. జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా వగు ననుటచే విభక్తివ్యత్యయము. (ఇల్లు వెడలి వంటిది)

కెల్లం దెల్లంబు గావించెద'నని వేఁడికొని తదనుజ్ఞాతుం డయి యా వృక్షం బారోహించి దాని కొమ్మలయుఁ బడుగొమ్మలయు నంతరంబు లెల్ల నారసి స్కంధశాఖ నొక్కంట మహాగుహాయుం బోలె విశాలాంతరాళం బయి తమోమయం బగు కోటరంబు గాంచి లోనం జొర వెఱచి యొండు గాదంబు సందేఁడు దెప్పించి యందుఁ జొప్పించి యింగలం బిడి దరికొలుపుడు మహా భీలం బగు జ్వాలాజాలంబుచేఁ బొదువంబడి మేను గమర నంతర్వ్యక్తి యగు ముదివగ్గు బెగ్గిలి వెగ్గలంపుఁ దాపంబున కోపక మొఱయిడుచు వెలి కురికి నేలంబడి 'నీ వెవ్వండవు నీ వృత్తాంతం బేమి?'యని ధర్మాధికృతులచేత ననుయుక్తుండయి 'యేను నంది గుప్తుని పితరుండ. వాఁడు నా మాట పెడచెవిం బెట్టి నా కిట్టి యాపదం బుట్టించె'నని చెప్పి కరం బారటంపడుచుం బ్రాణం

తెల్లము = స్పష్టము. తదనుజ్ఞాతుఁడు = వారిచే నాజ్ఞాపింపఁబడినవాఁడు. పడుగొమ్మ = స్కంధాగ్రమునుండి వృక్షమూలమునకు దిగునట్టి కొమ్మ - శిఖ. స్కంధశాఖ = చెట్టు మొదటికొమ్మ. విశాలాంతరాళంబు = వెడలు పైన మధ్యప్రదేశము గలది. తమోమయము=తఱుచు చీఁకటి గలది. గాదము= గడ్డి, ఆకు, (గడ్డి గాదములని వ్యవహారము) సందేఁడు = సందిటి కొలఁది. పరిమాణార్థక మగు ఎఁడు ప్రత్యయము. దరికొలుపు = రగుల్చు. మహాభీలము = మిక్కిలి భయంకరము. జ్వాలాజాలము = మంటల గుంపు. కమరు = కాలు. అంతర్వ్యక్తి = లోపల నున్నవాఁడు. ముదివగ్గు = ముసలి బక్క - బక్క ముసలి వాఁడనుట. బెగ్గిలు = భయపడు. వెగ్గలము = అధికము. అనుయుక్తుండు = అడుగఁబడినవాఁడు. పెడచెవిం బెట్టి = చెవి వెనుక పెట్టి - అనాదరంచి యనుట. ఆరటంపడు=సంతాపించు (లేదా) ఆరాటంపడు.

బులు దొఱంగె. అంత ధర్మాధికృతులు సుదర్శనగుప్తునకుం బాతిన ధనం బెల్లం దెప్పించి యిప్పించి నందిగుప్తుం గొఱుత ద్రవ్వించిరి."

అని చెప్పి కరటకుండు వెండియు నిట్లనియె. మొదల దూరంబు విచారింపక నీ పలుకు లీకొంటి నిది యకార్యం బని ముందు దోఁపదయ్యె. సంజీవకుం డెన్నఁడే నొక్క- యపకారంబు మనకుఁ గావించినవాఁడె? నిర్దోషుం డాతని కెడకు పుట్టించితివి. పాపిష్ఠుండ నేనును సహాయుండ నయితిని. ఇది మనకు శ్రేయంబు గాదు. పరుల వంచింపం బోయినవాఁడు తాన వంచితుఁ డగును. ఇందులకు నిదర్శనంబుగ నొక్క కథ వక్కాణించెద. వినుము.

అజస్తుందం బను పట్టణంబునం దింద్రపాలితుం డను వణి జుండు గలఁడు. అతనికి ధనగుప్తుండను మిత్రుండు గలండు. ఇంద్ర పాలితుండు తన యింట నున్న యఱువది బారువుల లోహంబు కూలివాండ్రచే నెత్తించికొని తన మిత్రుని కడకుం బోయి 'యో యన్న! యున్నట్టుండి దేశాంతరము పోవలసిన పని వచ్చినది మాన నయితి గాదు. ఱేపు పయనము. ఈ లోహము నీయొద్ద నుంచుము. నిరు డీ సరకు నీతోఁ గూడి కొన్నది. వెల యెఱుఁగు

ఎడరు = ఆపద. బారువు = ఇరువది మణువుల కోలఁది - భారశబ్ద భవము. ఉన్నట్టుండి = ఆకస్మికముగ. అయితి = ఆనుకూల్యము, వలను. పయనము = ప్రయాణము (వై) నిరుడు = కడచిన యేఁడు. సరకు = అమ్మఁదగిన వస్తువు, లక్ష్యము. (సరుకు - అని వాడుక)

దువుగదా? వరహాకు లాభము దుగులము వచ్చినం జాలు. కొను మొదలున కప్పటి కయిన వడ్డితో నేఁ జెప్పిన లాభము వచ్చెనా విక్రయింపుము. పరులవలన నీవు పుచ్చుకొను వాడుక చొప్పున నడతి పుచ్చుకొనుము. నేఁ జెప్పిన చొప్పున వెల రానిపక్షము నకు సరకు కదలింపఁబోకు. లోహము చెడిపోవునది గాదు. నేఁడు దప్పిన తేపు నిలుకడ మీఁద మంచి వెలకు విక్రయించుకోవచ్చు. పయనము దాపు గనుక మిక్కిలి పని యున్నది. క్షణమయిన నిలువఁ దీఱదు. సర కొప్పగించికొనుము. నావుఁడు నవ్యర్తకుం డిట్లనియె. 'నేను నీ కన్యుఁడనా? నా కింత చెప్పనలెనా? నీ విచ్చునట్టి యడతికా పని చూడవలె? గువువుసాక్షిగాఁ జెప్పెద వినుము. నీ సొమ్ము నా సొమ్ముగాఁ జూతునుగాని వేఱుగాఁ జూడను. నమ్ము' మని యిను మొప్పగించికొనియె. అంత నింద్ర పాలితుం 'డన్నా! నావలన నీకు మిక్కిలి శ్రమం బయ్యె. పోయి

వరహా - వరాహశబ్దభవము. వరాహముద్రగల ఒక బంగారు నాణెము (హూ) వరా-నాలుగు రూప్యములు. దుగులము = వీసము వరహా (వరహాలో పది యాఱవ భాగము) వడ్డి (వ్ర) వృద్ధి. అడతి = ఒక వర్తకుఁడు మఱియొకఁ డంపెడు సరకుల నమ్మి మరల వానికి సరకులనుగొని పంపుటకై వానివద్ద నూటి కింత యని పుచ్చుకొనెడి తఱుగు. 'అడతి' యని సూరి. అడితి యని శబ్దరత్నాకరాదులు. కదలింపఁబోకు = అమ్మకుమనుట - భాషాశైలి. నీవిచ్చు ... పని చూడవలె = నీ యందలి స్నేహముచేతఁ బని చూచె దనని యర్థము - మొదలే యెగరఁగొట్టెదను గనుక నీ స్వల్పమయిన యడతి నాకేల యని భావము. నీ సొమ్ము నా సొమ్ముగాఁ జూతును - నీ సొమ్మును నా సొమ్మఁ గాపాడునట్లు కాపాడెద ననియర్థము - నీకు మసి పూసి నీ సొమ్మును నేనే యపహరించికొనియెదనని భావము.

వత్తునా? సెల విచ్చెదవే' యని పలికిపోయి 'శీఘ్రము సురక్షిత ముగా నచ్చి చేరు'మని యాతనిచే నాజ్ఞాతుండయి వీడ్కొని చని మఱునాఁడు వేఁబోక లేచి దేశాంతరము నోయి తన కార్యంబు నెఱవేర్చుకొని కొంత కాలమునకు మరలి యుదయించి యవ్వార్తకునిఁ గానంజని తత్కాలోచితంబుగ నాతండభ్యుత్థానం బొనరించి కుశలప్రశ్నంబు గావించి ప్రయాణవృత్తాంతం బడుగం దదనురూపసల్లాపంబు కొంత దడవు గడపి తాను నాతని వాణి జ్యంబునందలి యోగక్షేమంబులు విచారించి 'యిప్పుడు లోహము కొంత వెలహెచ్చియున్నదని విన్నాఁడను.మన లోహ మేమయ్యె' నన వాఁడు మొగంబున విన్నఁదనంబు దెచ్చుకొని యిట్లనియె. 'మునుపు నీత్రోఁ గొన్న లోహము నిలువ కొంచె ముండఁగా దానిత్రో నీ లోహము గదిలోఁ బెట్టి తలుపు మూసి తాళముఁ బెట్టి పదిలము చేసితిని. నిన్న కొందఱు వర్తకులు వచ్చి లోహము కావలెనని యడిగిరి. ఆమోఁదట గది తలుపు దీసి చూతుఁగా లోపల లోహమను పేరు లేదు. నా సొమ్మ్ము పోయినదానికి నాకంత వెనుఁబాటు లేదు. మిత్రుఁడు విశ్వసించి

ఆజ్ఞాతుఁడు = పంపఁబడినవాఁడు. వేఁబోక = వేకువ - ప్రాతఃకాలము (గూ) వేగఁబోక. తత్కాలోచితంబుగన్ - మోసము చేసి యున్నంచున ముందటి క్రమము తప్పించె నని భావము. అభ్యుత్థానము = ఎదురుకొని లేచుట. తదనురూప = దానికిఁ దగిన. వాణిజ్యము =వణిగ్వ్యాపారము. యోగము= లాభప్రాప్తి. క్షేమము = నిరుపద్రవము. నిలువ = శేషము - నిలుచు ధాతువువలనఁ బుట్టినది. తాళము = బీగము. వెనుఁబాటు = విచారము.

యిల్లడవెట్టిన సర కాతఁడు రాఁగానే నాయనా! యిదిగో నీ సొమ్మునక పోయినదని చెప్పవలసి వచ్చెఁగా యని యేది తోఁపక రాపడి నిలిచితిని. నాయందు విశ్వాసము చేత నీవు నష్ట మెప్పు కొంటివి పో. లోకులు మెత్తురా? నా నాఁడెము దక్కు-నా'యని చింతాకులితుండుంబోలెం గొంతసే పూరకుండి సిట్టూర్పు నిగు డించి యిట్లనియె. 'గది తలుపు మూసి పెట్టిన తాళము పెట్టి నట్టుండఁగానే లోనిసరకు మాయమయి పోకకు నిమిత్త మేమని నిపుణముగా నాలోచించి చూచితిని. మా యింట నెలుకల రాయిడి మెండు. ఏ సరకు గాని బ్రదుకనీవు. అవి మన బోహా మును వాతఁ గొట్టుకొని పోయె నని నిశ్చయించితిని' నా విని యింద్రపాలితుండు వాని మోసము తెలిసికొని యిట్లు చింతిం చెను. 'ఏఁడు నా సొమ్ము దక్కించుకోవలెనని యీవఱ కిన్ని మాటలు పన్నినాఁడు. మాఱు మోసము చేసి వీనివలన సొమ్ము రాఁబట్టుకోవలెఁ గాని లాఁతి యుపాయముచేతఁ రాఁబట్టరాదు. అని తలంచి భావవికారం బేమియు మోమునఁ దోఁపనీక యడఁచి

ఇల్లడ – ఇల్లు + అడకము - ఇల్లడ = పదిలపఱచి పెట్టి అడిగినప్పుడు ఇమ్మని యేదేని యొక వస్తువును ఒకరివద్ద దాఁచుట, న్యాసము, ఒప్పగింత. రాపడు = స్తంభించు (రాయి + పడు) నాఁడెము = నాణెము - ఇచ్చి పుచ్చుకొను విషయమునందలి యోగ్యత (రూ) నాణెము. దక్కు-నా = వశ మగునా - నిలుచునా యనుట. చింతాకులితుండు = చింతచేఁ గలఁత నొందినవాఁడు. మాయము = అగోచరము - మాయుధాతు జన్యము. వాతఁ గొట్టుకొని - ఈ వాక్యముచే సొమ్ము పోయెనని యాతనికి మిక్కిలి బాధ యున్నట్టు లేనిది తోఁదుచున్నది. భావవికారము = మనోవికారము.

కొని యిట్లనియె. 'అన్నా! దీనికింత దూరము నీవు చెప్పవలెనా? నేను గ్రొత్తవాఁడనా? నీ స్వభావ మెఱుఁగనా? దైవమువలన వచ్చిన నేగికి మన మేమి చేయుదము? దీనికి నీవు చింతపడకుఁ. పోయి వచ్చెదను' అని చెప్పి సెలవు పుచ్చుకొని తనయింటికిఁ బోయి యా మఱునాఁడు మొదలుకొని యెప్పటివలె మిత్ర భావ మెక్కిఁంచుకొని యా వర్తకుని యింటికి రాకపోకలు చేయు చుండెను. ఒకనాఁ డింద్రపాలితుండు ధనగుప్తునితో ముచ్చట లాడు చుండఁగా వీథియందు గొలుగుఁబండ్లో3 గొలుగుఁబండ్లని పండ్లమ్మ్ల శబ్దము వినఁబడెను. అది విని ధనగుప్తుని బిడ్డఁడు గజ్జెలు గల్లుగల్లన నజ్జలు ద్రొక్కిఁచుఁ గుసిలించుచు నేడ్చుచుఁ దండ్రిని బట్టుకొని పండ్లు గొనియిమ్మని లాగుచు తొచ్చి పెట్టెను. అంతట నింద్రపాలితుం డా బిడ్డనిఁ జంక నెత్తుకొని 'నా తండ్రిగా నా బంగారుగా యేడువ కేడువకు. పండ్లు కొని యిచ్చెద ర'మ్మ్లని పండ్లగంప దూరము నోవుటఁబట్టి వెంబడించు నెపమునఁ గొనిపోయి యొక్కఁ యేకాంతస్థానంబున డాఁచి యూరనంబున దీనభావంబు దెచ్చుకొని మరలి యరుదెంచుడు ధనగుప్తుండు గనుంగొని 'బిడ్డఁ డేఁడీ?' నావుడు నాతం డిట్లనియె. 'చంకబిడ్డని నేల దించి పండ్లు బేర మాడుచుండితిని. ఇంతలో

నీ స్వభావ మెఱుఁగనా = నన్ను మోసపుచ్చవని యెంచితిని గాని యూరి నంతయు మోసము చేయునట్టి నీ గుణము నే నెఱుంగనా యని భావము. నేగి = నష్టి. ఎక్కిఁంచుకొని = లేనిది యూహించుకొని యని యర్థము. గొలుగుఁ బండ్లు = గొనుగుఁ బండ్లు = గుడఫలములు. అజ్జ = అడుగు కుసిలించుట = బిడ్డలు చనవుచేఁ దొందర పెట్టుట. తొచ్చు = బాధ.

నెక్కడినుండియో యొక పాడుగద్ద నచ్చి బిడ్డనిఁ దన్నికొని పోయెను.' అనఁగానే ధనగుప్తుఁడు చేత మొమ్మప్పళించుకొనుచు నిట్లనియె. 'ఓరి పాపీ! ఎంత పాతకమున కొడి గట్టితివిరా. సొమ్మున కాశపడి యింత తెగువకుం బాలువడుదువా? ఆ నిసువు మొగము చూచి మెడవిఱువ నీకు మనసు వచ్చెనా? నీ చేతు లాడెనా? ఓరి ద్రోహీ! ఓరి చండాలుఁడా! బిడ్డని గద్ద తన్ని కొని పోవునా? యీ మాట యెవరయిన నమ్ముదురా?' అని శోకక్రోధపరీతమానసుం డయి కన్నుల నీరు దేఱుం బటపటఁ బండ్లు గొఱుకుచు మెడియ నిట్లనియె. 'కానీరా సొమ్ము దక్కిన దనుకోకు మిదిగోఁ గ్రక్కించెదఁ జూడు'మని లేచి సత్వరముగాఁ బోయి ధర్మాధికృతుల కీ వృత్తాంతము వినుపించెను. అంత వా రాశ్చర్యపడి యింద్రపాలితుని రావించి యాతనివలన నా వృత్తాంతము విని యిట్లనిరి. 'ఓయి యిప్పటి నీ చెప్పిన యర్థం బశ్రుతదృష్టచరంబు మా కాశ్చర్యంబు వొడమించెడు'. నా విని యింద్రపాలితుం డిట్లనియె. 'అఱువది బారువుల లోహ మీతని యింట దాఁపఁబెట్టి పోయితిని. ఆ లోహ మెలుకలు దిని పోయె నటఁ. పసిబిడ్డని గద్ద తన్నుకొని పోవు టాశ్చర్యమా? నా విని యధికారులు జరిగిన యర్థం బెఱిఁగి లోహంబును బాలకునిం దెప్పించి వారి కొప్పించి ధనగుప్తునకుఁ జోరదండంబు గావించిరి.

పాడుగద్ద = పాడుశబ్దము దుఃఖాతిశయమునంఁ బ్రయోగింపఁబడును. విసువు = శిశువు - వైకృతము. చేతు లాడెనా - భూపాశ్రీ. శోక క్రోధ పరీతమానసుఁడు = వగపుచేతను గోపముచేత నావరింపఁబడిన మనస్సు కల వాఁడు. పటపట-అనుకరణధ్వని. అశ్రుత దృష్టచరంబు=ముందు విన్నదియుఁ గన్నదియుఁ గానిది. చోరదండంబు = దొంగకుఁ జేసెడు శిక్షవంటి శిక్ష.

అని చెప్పి కరటకుండు మఱియు నానాప్రకారంబుల దమనకు నుపాలంభించుచుండె.

తదవసరంబున మెగంబులరాయండు వొడ వొందిన కాతాళంబనం గడు నడరి మెడ జుంజుఱులు నిక్క బెడిదంపు టుఱుము నుఱని నెఱబొబ్బ యిడి చంగున నెగిరి కోలగగ్గెరకుం బోలె నేలం గూలంద్రోచి ముంగాళ్ళ నొత్తిపట్టి కుత్తుకం గఱచి నెత్తురు గుటగుటం ద్రాగి యా బసవని నుసుఱునకుం బాచి పశ్చాంతక్రోధుండయి మరలి యిరవున కరిగి యనుతాపపరీత మానసుం డగుచు డాయవచ్చిన కరటకదమనకులం జూచి యిట్లనియె.

"కటకటా! ఎంత దారుణకర్మంబు గావించితిని. భరణ రక్షణంబులం బ్రకృతిరంజనంబు గావించువానికిం జెల్లుగాని నాకు

ఉపాలంభించు = మర్మము దూఁటి పాఱ నాడు. మెగము - మృగ శబ్దభవము (రూ) మెకము. పొడవు = ఆకృతి. కాతాళము = కోపము (కాంతాళము = ఈర్ష్య, తాళిమి లేమి) అడరి = చెలరేఁగి - విజృంభించి యనుట. జుంజుఱులు = మెడమీఁది చింపిరి వెండ్రుకలు - జూలనుట. బెడిదము = భయంకరము. ఉఱని = లక్ష్యపెట్టని. బొబ్బ = సింహ నాదము. చంగు - దాఁటుటయం దనుకరణము. కోలగగ్గెర = లాడము కొట్టుట మొదలైన పనులకుఁగాను ఎద్దులను నాలుగు కాళ్లు గట్టి పడఁ ద్రోయుట. ముంగాలు = జంగు (ముందు + కాలు) ప్రాతాదిసంధి. బసవఁడు - వృషభము (వై) అనుతాపపరీతమానసుఁడు = పశ్చాత్తాపముచే నావరింపఁబడిన మనస్సు గలవాఁడు. దారుణకర్మము = భయంకరకృత్యము. భరణము = పాలనము. రక్షణము = పోషణము. ప్రకృతి రంజనము = మంత్రి లోనగు సమస్తజనులను రంజిల్లఁజేయుట.

రాజనామంబు గాల్పనే! దూరము విచారింపక సంజీవకునిఁ జంపు కొంటిని. విషవృక్షమేని సంవర్ధించి తాన ఛేదింపఁజనదు. ఎట్లిగియే నెఱుఁగకే నేరమి యొక్కఁండు వొనరించిన భృత్యుని నయంబు భయంబుఁ జూపి వాని వేఁడుకోలునం దెలవంబడిన ట్లభినయించి తొలుత మిన్నక విడువవలయు. ఆవల మరి కావించిన వాని నిజాధికారంబునలనఁ దలంగవలయు. ఇంతకు మెచ్చుఁ దీండ్రింబు గానుపింపం బోలదు. కానుపించినం దక్కఁంగల లెంకకూటువు కాయువుం దొఱఁగు. దాన జేనికి వొసంగు పొసంగు. ఇందు సందియంబు లేదు. ఎట్టి కడింది కర్జంబయిన సాధింపనచ్చుఁగాని తగిన భృత్యుని గడియించుట సుకరంబు గాదు. అది యట్లుండ నిమ్ము. లోకంబునందుఁ గలకాలము దుర్వారంబయిన దుర్వ్యసంబు దెచ్చుకొంటి నింక నేమి చేయుదు"నని మిన్నక క్రిందు చూచుచుండె. అంత దమనకుం డిట్లనియె. 'స్వామీ! దాయం

రాజనామంబు = రాజను పేరు (రాజు = రంజించువాఁడని వ్యుత్పత్తి) విష వృక్షము = ముష్టిచెట్టు. సంవర్ధించు = పెంచు. తాను+ అ - తాన = తానే. 'విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతమ్ -' అని కాలిదాసు. "విషపు వృక్షంబు నేనియు వృద్ధిపఱచి తనకుఁ దానంత నఱుకుట తగదటండ్రు" నేరమి = అపరాధము. పొనరించినన్ = చేసినను (రూ) ఒనరించినన్. తెలవంబడినట్లు = తేర్పఁబడినట్లు - తెలుఁచుధాతువు. ఆవలనురి = వెనుకతడవ (మఱొకసారి) తలంగ = తొలఁగింప-అంతర్భావిత ప్రేరణము. తీండ్రము = వేఁడిమి. వెంక = భటుఁడు. కూటువు = గుంపు - కూడు ధాతు కృదంతము. కాయువు = అనురాగము (రూ) కాయ్యు. కర్జము (ప్ర) కార్యము. దుర్వారము = వారింపరానిది (మాన్పరానిది) దాయ = శత్రువు.

బరిమార్చి యివ్వాడువున నుమ్మలంపడంబోలదు. తేడు తను సెరగువఱుపం గడంగువానినేని నేనినొప్పరికింపక దోరింపవలయు నని పాడినెఱి నెఱిగిన గఱువలు వలుకుదురు. నేరమిం బొనరిం చిన వారియం దోరిమి తాపసులకుంగాని భూపాలురకుం జనదు. రాజ్యలోభంబువలనం గాని 'హంకారంబువలనం గాని స్వామి పదంబుం గోరువానికి సధంబుదక్క దండంబు లేదు. ఈ యర్థంబు సర్వసమ్మతంబు.' నా విని పింగళకుండు సంతుష్టుండయి భద్రా సనంబునధిష్ఠించె. దమనకుండు పరిహృష్టుండయి "మహాస్వామి! దేవరకు లోకంబులకు స్వస్తి యగుంగావుత "మని వచియించి తానును సకలపరిజనంబులు సుఖంబుండె.

అని విష్ణుశర్మ సుహృద్భేదంబు సాంతంబుగ వచియించి యిట్టి భేదంబు మీరు మీ శత్రువులందుం బ్రయోగించి విజ యంబుఁ బొందుం డన రాజపుత్రులు కరంబు హర్షంబు నొందిరి.

ఉమ్మలంపడు = శోకించు. తను (రూ) తన్ను (తనను - అసాధువు) సెరగు వఱుచు = చెఱచు. సెరగు = ఆపద. ఏనినేనిన్ - ఎవ్వనినేని. ఓరించు = చంపు - ఓరుధాతువు. నెఱి = క్రమము. పాడినెఱి = న్యాయక్రమము; న్యాయమార్గము. నెఱి = అందము, ఆచారము, క్రమము, న్యాయము, పరాక్రమము, పూర్తి, ఱెక్క మున్నగునవి యర్థములు. గఱువలు = పెద్దలు - గురుశబ్దభవము. ఓరిమి = ఓర్పు - ఓర్చుధాతు కృదంతము. తాపసుఁడు = తపము చేయువాఁడు. హంకారము = అహంకారము, అభిమా నము (వై) భద్రాసనము = రాజసామాన్య పీఠము. ప్రహృష్టుఁడు = మిక్కిలి సంతోషము నొందినవాఁడు. స్వస్తి = శుభము - సు + అస్తి - యణాదే శము. తానును...పరిజనంబులు...ఉండె:- ఇచట నున్నది దమనకుఁడు సకల పరిజనములు నయినను 'తాను' శబ్ద ముండుటచే నేకవచనంబె యగును.

బా. వ్యా. క్రియా. ౧౭౦. సుహృత్ + భేదము - మిత్రభేదము.

పూర్వార్ధము ముగిసినది.

నేషనల్ ప్రింటింగ్ ప్రెస్, తెనాలి.

AOUA10UB130

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావలోక

పుస్తకం సంఖ్య	AOUA104B130
పుస్తకం పేరు	వీక్షణం
తారీఖు	31 December 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	243
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	P. Jayalamma P. జయలమ్మ (AUDIT)
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	గుడ్